శ్రీ వేంకటేశ్వర స్వామి చరిత్ర

కృష్ణకృపామూర్తి శ్రీ శ్రీమద్ ఏ.సి. భక్తి వేదాంత స్వామి శ్రీల ప్రభుపాదుల వారి పుస్తకాలు

* భగవద్గీత యథాతథము
* శ్రీమద్భాగవతము 1–12 స్కంధములు (18 సంపుటములు)
* దేవాదిదేవుడు శ్రీకృష్ణభగవానుడు
* శ్రీ చైతన్య చరితామృతం (9 సంపుటములు)
* భక్తి రసామృత సింధు
* ఆత్మసాక్షాత్కార శాస్త్రం
* శ్రీ చైతన్య మహాప్రభువు బోధామృతము
* భ్రమ మరియు సందేహములకు అతీతముగా
* శ్రీ బ్రహ్మ సంహిత
* జీవం నుండి జీవం
* జ్ఞాన పరిశోధన
* గ్రహాంతర సులభయానము
* జ్ఞానఖడ్గము
* ద్వితీయ అవకాశము
* కపిల భగవానుని ఉపదేశములు
* జనన మరణాలకు అతీతము
* కుంతీ మహారాణి ఉపదేశములు
* ఉపదేశామృతము
* భక్తి యోగ
* శ్రీ ఈశోపనిషత్తు
* ప్రహ్లాద మహారాజు యొక్క దివ్య బోధనలు
* యోగ పరిపూర్ణత
* శ్రీకృష్ణుడు – ఆనందనిధి
* ప్రేమభక్తి కళ
* రాజవిద్య
* కృష్ణ చైతన్యం అద్వితీయ వరప్రసాదం
* శ్రీకృష్ణుని చేరే మార్గం
* ముకుంద మాల స్తోత్రము
* భాగవత జ్యోతి
* ఉత్తమ ప్రశ్నలు ఉత్తమ సమాధానాలు
* కర్మయోగం
* గీతా సారం
* ప్రకృతి నియమాలు
* భగవద్దర్శన్ (మాసపత్రిక)

సమర్పణ (అంకితం)

అంశాంశస్తు మరీచ్యాధిరంశా బ్రహ్మాదయస్తథా।
కళాః కపిలకూర్మాద్యావేశాభార్గవాదయః॥
పూర్ణో నృసింహో రామశ్చ శ్వేతద్వీపాధిపో హరిః।
వైకుంఠోఽపి తథా యజ్ఞో నరనారాయణః స్మృతః ॥
పరిపూర్ణతమః సాక్షాత్ శ్రీకృష్ణో భగవాన్ స్వయం ।
అసంఖ్యాక బ్రహ్మాండ పతిర్గోగోలోకే ధామ్ని రాజతె ॥

మరీచి ఆదిగా గల మునులు అంశాంశ అవతారాలు. బ్రహ్మ ఆదిగా గలవి అంశావతారాలు. కపిల మరియు కూర్మ వంటివి కళావతారాలు. పరశురామ ఆవేశావతారం. నరసింహ, రాముడు, శ్వేతద్వీపాధిపతి(నారాయణుడు), వైకుంఠపతి(విష్ణువు), యజ్ఞ, నరనారాయణులు వంటివి పూర్ణ అవతారాలు. శ్రీకృష్ణ భగవానుడు స్వయంగా ఆది భగవానుడు. అసంఖ్యాక బ్రహ్మాండాలకు అధిపతి అయిన ప్రభువు(శ్రీకృష్ణుడు) గోలోకంలో ఉండును. *(గర్గ సంహిత గోలోకకాండ 1వ అధ్యాయం)*

అటువంటి శ్రీకృష్ణ భగవానుని గురించి ప్రపంచమంతటా ప్రచారం చేసిన అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘ (ఇస్కాన్) సంస్థాపకాచార్య కృష్ణకృపామూర్తి శ్రీ శ్రీమద్ అభయచరణారవింద భక్తి వేదాంత స్వామి ప్రభుపాదులకు మరియు నా గురుదేవులైన పరమ పూజ్య శ్రీ భక్తి వికాస స్వామి మహారాజుకు ఈ గ్రంథమును సమర్పిస్తున్నాను.

పరమపూజ్య శ్రీ భక్తి వికాస స్వామి వారి పుస్తకములు

ప్రారంభకులకు కృష్ణచైతన్య మార్గదర్శిని
భారతీయ యువతకు ఒక సందేశం
కృష్ణ చైతన్యంలో బ్రహ్మచర్యం
వాల్మీకి రామాయణం
శ్రీ చైతన్య మహాప్రభువు
భారతీయ సాంప్రదాయక జీవనం
Jaya Śrīla Prabhupāda!
Lekha-mālā
Mothers and Masters
My Memories of Śrīla Prabhupāda
On Pilgrimage in Holy India
On Speaking Strongly in Śrīla Prabhupāda's Service
Patropadeśa (two volumes)
Śrī Bhaktisiddhānta Vaibhava (three volumes)
Śrī Vaṁśīdāsa Bābājī
The Story of Rasikānanda
Gauḍīya Vaiṣṇava Padyāvalī (Bengali)
Vaiṣṇava Śikhā o Sādhana (Bengali)

ఇతర రచయితల పుస్తకములు

Rāmāyaṇa (The Story of Lord Rāma)
Śrī Cāṇakya-nīti (by Patita Pāvana Dāsa Adhikārī)
Rethinking Darwin (by Lalitānātha Dāsa)
Who is Supreme? (by Gokula Candra Dāsa)
Viveka-śatakam (by Prabodhānanda Sarasvatī)
How I Achieved Real Success (by Indira Meshram)

విషయ సూచిక

ముందుమాట x
ఉపోద్ఘాతము xi
1. శ్రీ వేంకటేశ్వర స్వామి చరిత్ర – ఒకటి.................... 1
భవిష్యోత్తరపురాణం నుండి 1
2. శ్రీ వేంకటేశ్వర స్వామి చరిత్ర – రెండు 27
స్కందపురాణం నుండి 27
3. శ్రీ వేంకటేశ్వర స్వామి మందిరంలోని సేవలు – దర్శనీయ స్థలాలు 39
4. శ్రీ వేంకటేశ్వర స్వామి ఉత్సవాలు 62
5. వేంకటాచల పర్వతం (తిరుమల కొండ)................ 71
6. తిరుమలలో దర్శనీయ స్థలాలు............................ 81
స్వామి పుష్కరిణి మహాత్మ్యం 81
వరాహ స్వామి మందిరం 86
వేంకటేశ్వర స్వామి మందిరం 88
గొల్లమండపం 89
తిరుమలనంబి మందిరం (ఇల్లు) 90
అనంతాచార్య బృందావనం (సమాధి).. 91
తరిగొండ వెంగమాంబ బృందావనం (సమాధి) 91
హాథీరాం బాబాజీ బృందావనం (సమాధి) 92
ఆకాశగంగ తీర్థ మహాత్మ్యం 92
జాబాలి తీర్థ మహాత్మ్యం 93
పాపనాశన తీర్థ మహాత్మ్యం 94
చక్ర తీర్థ మహాత్మ్యం 96
తిరుమలలోని శ్రీవారి పాదాలు.. 97
రామకృష్ణ తీర్థ మహాత్మ్యం 97

కుమారధార తీర్థ మహాత్మ్యం 98
తుంబురు (గోన) తీర్థ మహాత్మ్యం 100
పాండవ తీర్థ మహాత్మ్యం 101

7. తిరుపతిలో దర్శనీయ స్థలాలు........................... 102

గోవిందరాజ స్వామి మందిరం 102
కోదండరామ స్వామి మందిరం 105
కపిల తీర్థం.. 107
ఇస్కాన్ రాధాగోవింద మందిరం............................ 108
అలిపిరిలోని శ్రీవారి పాదాలు................................. 117
పద్మావతి దేవి మందిరం – పద్మ సరోవరం 118
శ్రీనివాస మంగాపురం 121
సువర్ణ ముఖారీ (స్వర్ణ ముఖి) నది
మరియు అగస్త్యేశ్వరాలయం 122

8. ఆళ్వారులు రచించిన వేంకటేశ్వర స్వామి స్తోత్రాలు...... 125

శ్రీ పోయిగై ఆళ్వారు.. 125
శ్రీ పూదత్త ఆళ్వారు.. 126
శ్రీ పేయ ఆళ్వారు.. 128
శ్రీ తిరుమళిశై ఆళ్వారు 129
శ్రీ నమ్మ ఆళ్వారు 132
శ్రీ కుల శేఖర ఆళ్వారు 134
శ్రీ పెరియ ఆళ్వారు.. 136
శ్రీ తిరుప్పాణ ఆళ్వారు.. 137
శ్రీ తిరుమంగై ఆళ్వారు 137
శ్రీ గోదా దేవి (ఆండాళ్) 139

9. తిరుమలలో శుద్ధ భక్తుల లీలలు 142

శ్రీ యామునాచార్య.. 142
శ్రీ తిరుమలనంబి.. 143
శ్రీ కాంచీపూర్ణ (తిరుక్కచ్చి నంబి)........................... 145

శ్రీ రామానుజాచార్య 148
శ్రీ అనంతాచార్య 155
శ్రీ వేదాంత దేశికులు 163
శ్రీ ప్రతివాది భయంకర అణ్ణన్ 166
శ్రీ అన్నమాచార్య... 169
శ్రీపాదరాజ తీర్థులు (శ్రీపాదరాయులు)........................ 180
శ్రీ వ్యాసతీర్థులు 182
శ్రీకృష్ణ చైతన్య మహాప్రభు 183
శ్రీ నిత్యానంద ప్రభు 187
శ్రీ వల్లభాచార్య 188
శ్రీ వాదిరాజ తీర్థులు 189
శ్రీ పురందర దాసు 190
శ్రీ హాథీరాం బాబాజీ 191
శ్రీ కనక దాసు 193
శ్రీ రాఘవేంద్ర స్వామి 194
శ్రీకృష్ణ దేవరాయలు 195
భక్త శిరోమణి తరిగొండ వెంగమాంబ 195
శ్రీ త్యాగరాజు 200
కృష్ణకృపామూర్తి శ్రీ శ్రీమద్ ఏ.సి. భక్తి వేదాంత స్వామి శ్రీల ప్రభుపాద 201
రచయిత పరిచయము.. 207
తిరుపతిలోని దర్శనీయస్థలాల మార్గదర్శిని చిత్రం........ 208
తిరుమలలోని దర్శనీయస్థలాల మార్గదర్శిని చిత్రం....... 209
శ్రీ వేంకటేశ్వర స్వామి మందిరంలోని దర్శనీయ స్థలాల మార్గదర్శిని చిత్రం.. 210
శ్రీ వేంకటేశ్వర స్వామి మందిరంలోని దర్శనీయ స్థలాల మార్గదర్శిని సూచిక 211
కృతజ్ఞతలు.. 212

ముందుమాట

ఈ గ్రంథమును ప్రారంభించే ముందు నా గురుదేవులైన పరమ పూజ్య శ్రీ భక్తి వికాస స్వామి వారికి, భగవద్భక్తులకు, శ్రీకృష్ణునికి మరియు శ్రీకృష్ణుని అవతారములకు నా ప్రణామాలు అర్పిస్తున్నాను.

ప్రభుత్వము ద్వారా నియమించబడిన ఉత్తరాల వితరణ ఉద్యోగి (పోస్టుమాన్) పరిపూర్ణుడు కాకపోవచ్చుగానీ అతడు ఇచ్చిన ఉత్తరం ద్వారా మనం లాభాన్ని పొందగలము. అదేవిధంగా నేను పరిపూర్ణుడను కాకపోవచ్చుగానీ నేను అందించే సందేశం మాత్రం పవిత్రమైనది, గురు పరంపర ద్వారా అందించబడుచున్నది, శాస్త్ర ప్రమాణమైనది మరియు పరిపూర్ణమైనది. అందువలన ఈ సందేశాన్ని మీరు స్వీకరించి మహోన్నత లాభాన్ని పొందగలరని ఆశిస్తున్నాను.

ఈ గ్రంథము వ్రాయడానికి భవిష్యోత్తర, స్కంద, భాగవత, వరాహ పురాణాల నుండి, శ్రీ వైష్ణవుల గ్రంథాల నుండి మరియు తిరుమల తిరుపతి దేవస్థానం వారి గ్రంథాల నుండి ఆధారాలు సేకరించబడ్డాయి. ఇక్కడ అందించిన అంశాలను మేము సంక్షిప్తరూపంలో సమర్పించాము. వాటిని చదవడం సులభంగా ఉండేందుకు, మేము వాటిని వేర్వేరు విభాగాలుగా వ్రాయడం జరిగింది. ఈ ప్రయత్నంలో ఏవైనా లోపాలు ఉన్నట్లయితే, అవి మాకు తెలియని పొరపాట్లుగా భావించి, దయతో మాకు సూచించి, భవిష్యత్ ముద్రణల్లో వాటిని సరిదిద్దుకోవడానికి అవకాశం ఇవ్వాలని కోరుతున్నాను.

ఉపోద్ఘాతము

నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమమ్।
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయముదీరయేత్॥

మొట్టమొదట నేను భగవంతుడైన నారాయణునికి, నర–నారాయణ ఋషికి, విద్యాదేవీ అయిన సరస్వతి దేవికి మరియు వేదవ్యాస మహర్షికి ప్రణామం చెప్తున్నాను. (మహాభారతం, ఆదిపర్వ, అధ్యాయం 1, శ్లోకం 1)

వేంకటేశ్వర స్వామి దేవాలయం ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి జిల్లాలోని తిరుమల కొండపై ఉన్న ఒక ముఖ్యమైన వైష్ణవ దేవాలయం. ఈ ఆలయం వేంకటాచలం యొక్క ఏడు కొండలలోని ఒక కొండపై భూమి నుండి 853 మీటర్ల ఎత్తులో ఉన్నది. ఈ మందిరం దక్షిణ భారత దేశ మందిర నిర్మాణ పద్ధతిలో (ఆగమ శాస్త్రానుసారంగా) నిర్మించబడింది.

శుకదేవ గోస్వామి పరీక్షిన్మహారాజుతో "ఇలావృతవర్షము వలె భారతవర్షము నందు అనేక పర్వతములు మరియు నదులు కలవు. మలయము, మంగళప్రస్థము, మైనాకము, త్రికూటము, ఋషభము, కూటకము, కొల్లకము, సహ్యము, దేవగిరి, శ్రీశైలము, వేంకటము, మహేంద్రము, వారిధారము, వింధ్య, శుక్తిమంతము, ఋక్షగిరి, పారియాత్రము, ద్రోణము, చిత్రకూటము, గోవర్ధనము, రైవతకము, కకుభము, నీలము, గోకాముఖము, ఇంద్రకీలము, ఋష్యమూకము, కామగిరి అనునవి వానిలో కొన్ని పర్వతములు. అచ్చట వేలకొలది ఇతర పర్వతములు కూడా కలవు; పెక్కు నదీనదములు వాని నుండి ఉద్భవించి ప్రవహించుచున్నవి" అని వివరించారు. (శ్రీమద్భాగవతము 5.19.16)

పైన తెలుపబడిన పుణ్య పర్వతాలలోని వేంకట పర్వతం పైననే నారాయణుడు వేంకటేశ్వర స్వామిగా వెలిశాడు. తిరుమలలో వేంకటేశ్వర స్వామి వెలసినందున తిరుమల క్షేత్రమును కలియుగ వైకుంఠం అని అంటారు. తిరుమలపై నారాయణుడు స్వయంగా వెలశాడు. ఆ నారాయణుడినే వేంకటేశ్వరుడని, శ్రీనివాసుడని, సప్తగిరీశుడని, ఏడుకొండలవాడని, బాలాజీ అని, తిరుమలప్ప అని, తిరుమలేశుడని ఇలా ఎన్నెన్నో పేర్లతో పిలుస్తారు.

తిరుమలలో వెలసిన వేంకటేశ్వర స్వామిని మరియు తిరుపతిలోని గోవిందరాజ స్వామిని చోళ రాజులు, విజయనగర రాజులు, గద్వాల్ రాజులు, మైసూర్ రాజులు, పల్లవ రాజుల వంటి ఎందరో రాజులు మరియు రాణులు దర్శించి, సేవించి గోపురాలను మరియు మందిర నిర్మాణ–పునర్నిర్మాణ కార్యాలను చేయించారు. వారు భూములను దానం చేసి బంగారు ఆభరణాలను సమర్పించి ఎంతో సుకృతిని కూడా పొందిరి.

బ్రహ్మ, కుమార, రుద్ర మరియు శ్రీ సాంప్రదాయాలలోని ఎందరో ఆచార్యులు మరియు భక్తులు వేంకటేశ్వర స్వామిని దర్శించి, సేవించి తమ జీవితాలను సార్ధకం చేసుకున్నారు.

తిరుమల తిరుపతిలోని అన్ని మందిరాలు ఉదయం 5 గంటల నుండి రాత్రి 8:30 వరకు తెరువబడి ఉండును.

వేంకటేశ్వర స్వామి గురించి మరియు తిరుమల–తిరుపతిలోని వివిధ పవిత్ర స్థలాల గురించి వివిధ పురాణాలలో వేర్వేరు వివరణలు ఉన్నాయి. అందువలన ఈ పుస్తకంలో ప్రచురించిన వివరాలు, ఇతర భక్తులు ప్రచురించిన పుస్తకాలలోని వివరణలకు భిన్నంగా ఉండవచ్చును.

1

శ్రీ వేంకటేశ్వర స్వామి చరిత్ర – ఒకటి

భవిష్యోత్తరపురాణం నుండి

(భవిష్యోత్తరపురాణంలోని శ్రీవేంకటాచల మహాత్మ్యములోని 2వ అధ్యాయం నుండి 13వ అధ్యాయంవరకు ఆధారంగా తీసుకొని ఈ కథ సంక్షిప్తంగా అందించబడింది.)

నైమిశారణ్యంలోని మునులు సూత గోస్వామితో “ఓ సూత గోస్వామీ! మీ నుండి ఇప్పటివరకు వరదరాజ స్వామి గురించి మరియు జగన్నాథ స్వామి గురించి విన్నాము. ఇప్పుడు వేంకటాచల మహాత్మ్యమును తెలుపుము” అని ప్రార్థించిరి. అందుకు సూత గోస్వామి ఈ క్రింది విధముగా తెలిపెను:

పూర్వం గంగా నది తీరంలో మునులు ఒక యజ్ఞం చేస్తున్న సమయంలో నారద ముని అక్కడకు వెళ్లి మునులందరితో “ఈ యజ్ఞ ఫలితాన్ని భగవంతునికి సమర్పించండి” అని తెలిపి వెళ్లిపోయెను. ఆ మునులందరూ త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులలో భగవంతుడు ఎవరో తెలుసుకోవడానికి భృగు మహర్షిని పంపిరి. భృగు మహర్షి ముందుగా బ్రహ్మదేవుని వద్దకు వెళ్లి సాష్టాంగ నమస్కారాలు చేసినాడు, కానీ బ్రహ్మదేవుడు భృగు మహర్షికి ఏలాంటి ఆశీర్వాదాలు ఇవ్వలేదు. అందువలన భృగు మహర్షి అక్కడి నుండి కైలాసానికి వెళ్లెను.

కైలాసంలో శివుడు పార్వతి దేవితో ఏకాంతముగా ఉన్నాడు. పార్వతి దేవి భృగు మహర్షి రాకను గుర్తించి సిగ్గుతో శివుని నుండి దూరముగా వెళ్ళినది. అప్పుడు శివుడు భృగుమహర్షితో “భార్యాభర్తలు ఏకాంతంగా ఉండగా అనుమతి లేకుండా వస్తావా?” అని పలికి

కోపంతో సంహరించడానికి సిద్ధమవ్వగా భృగు మహర్షి "నేను వచ్చిన విషయాన్ని నీవు తెలుసుకొనలేక నన్ను సంహరించడానికి వచ్చావు గనుక ఈనాటి నుండి నీకు భూలోకంలో లింగ పూజలే జరుగుతాయి" అని శపించి కైలాసము నుండి వైకుంఠానికి వెళ్లెను.

వైకుంఠంలో ఆ సమయానికి విష్ణువు ఆదిశేషుని మీద శయనించెను. విష్ణువును పరీక్షించుటకు ఇదే తగిన సమయం అనుకొన్న భృగు మహర్షి విష్ణువును వక్షస్థలంలో తన్నెను. విష్ణువు లేచి "ఓ మహర్షీ! మీ రాకను గమనించనందుకు నన్ను క్షమించండి" అని క్షమాపణలు వేడుకొన్నాడు. తరువాత మహర్షిని సింహాసనం మీద కూర్చుండబెట్టి "నా వక్షస్థలం వజ్రం కంటే ఎనిమిది రెట్లు గట్టిగా ఉంటుంది. అందువలన మీ పాదానికి నొప్పి కలిగి ఉంటుంది" అని పలికి గోరువెచ్చని నీటితో పాదప్రక్షాళన చేసి ఆ నీటిని భక్తితో తన శిరమున చల్లుకొనెను. తరువాత భృగు మహర్షి వైకుంఠం నుండి గంగా నది తీరానికి వచ్చి మునులందరితో బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను తాను పరీక్షించిన విధానాన్ని తెలిపెను. మునులందరూ విష్ణువే భగవంతుడు అని నిర్ధారణ చేసి యజ్ఞ ఫలితాన్ని విష్ణువుకు సమర్పించిరి.

(భృగు మహర్షి బ్రహ్మ, విష్ణు మరియు మహేశ్వరులను పరీక్షించిన ఘట్టం పద్మపురాణంలో మరియు భాగవతంలో ఉన్నది. పద్మపురాణంలో భృగు మహర్షి త్రిమూర్తులను పరీక్షించిన తరువాత మునులందరూ "విష్ణువే పరమాత్ముడు" అని నిర్ధారణ చేసి యజ్ఞ ఫలితాన్ని విష్ణువుకు సమర్పించిరి. భాగవతంలో శుకదేవ గోస్వామి పరీక్షిన్మహారాజుతో "కొందరు ఈ సృష్టిని సృష్టించినది బ్రహ్మ అని, కొందరు శివుడని, కొందరు విష్ణువు అని అనుకుంటున్నారు. సరస్వతీ నది తీరంలోని మునులు సమస్త జనుల ఈ సందేహం తీర్చడానికే బ్రహ్మ, విష్ణు మరియు మహేశ్వరులను పరీక్షించడానికి భృగు మహర్షిని పంపిరి. భృగు మహర్షి వారిని పరీక్షించిన తరువాత

బ్రహ్మ, విష్ణు మరియు మహేశ్వరులలో విష్ణువే పరమాత్ముడు అని నిర్ధారించిరి” అని తెలిపెను.)

నారాయణుడు వేంకటాచలం రావడం

భృగు మహర్షి వెళ్లిన తరువాత నారాయణునితో (విష్ణువుతో) లక్ష్మీ దేవి “నేను నివసించే వక్షస్థలాన్ని భృగువు తన కాలితో తన్నగా శపించవలసింది పోయి మీరు అతనికి సేవ చేశారు. నేను ఇక ఈ వైకుంఠంలో నివసించలేను” అని పలికి దుఃఖంతో కరవీరపురంలో (కొల్హాపురం) తపస్సు చేయసాగెను. లక్ష్మీ దేవి లేని వైకుంఠంలో నివసించడం ఇష్టంలేక నారాయణుడు వైకుంఠాన్ని వదిలి మానవ రూపాన్ని ధరించి వేంకటాచలమునకు వచ్చెను. అక్కడ స్వామిపుష్కరిణి వద్ద గల చింతచెట్టు క్రింద ఉన్న పుట్టలో నారాయణుడు నివసించసాగెను. ఈ విధంగా నారాయణునికి ఆ పుట్టలో పదివేల సంవత్సరములు గడిచిపోయెను. ద్వాపరయుగం గడిచి కలియుగము 28వ సంవత్సరము వచ్చెను.

బ్రహ్మ దేవుడు శివునితోపాటు లక్ష్మీ దేవి వద్దకు వచ్చి “నారాయణుడు మిమ్మల్ని వెతుకుతూ వేంకటాచలమున అలసి పుట్టలో నివసిస్తున్నాడు. నేను మరియు శివుడు ఆవు–దూడలుగా మారిపోతాము. మీరు మామూలు స్త్రీగా మారి మమ్ములను చంద్రగిరిని పరిపాలించే చోళరాజుకు అమ్మి వేయుము. నేను ప్రతిరోజు నారాయణునికి పాలను ఇస్తాను” అన్నాడు. లక్ష్మీ దేవి అందుకు ఒప్పుకుంది.

శివుడు మరియు బ్రహ్మ ఆవు–దూడలుగా మారగా, వాటిని తీసుకొని లక్ష్మీ దేవి చోళరాజు వద్దకు వెళ్ళింది. లక్ష్మీ దేవి రాజుతో “ఓ రాజా! మేలుజాతికి చెందిన ఈ ఆవు యొక్క పాలు ఎంతో రుచికరమైనవి మాత్రమే గాక ఆరోగ్యకరమైనవి కూడా” అని తెలిపి వాటిని అమ్మివేసింది. రాజు ఆవు గురించి తన భార్యకు తెలిపి ఆవు యొక్క పోషణను ఆమెకు అప్పగించాడు. రాణి గోవులను

మేపే గొల్లవాడిని పిలిచి ఈ ఆవు పాలు వేరుగా తీసుకురమ్మంది. గొల్లవాడు అన్ని ఆవులతోపాటు ఈ ఆవును కూడా కొండకు తీసుకువెళ్ళి మేపుతున్నాడు. కానీ పాలుపితికే సమయానికి ఆవు వద్ద పాలు ఉండడం లేదు. రాణి గొల్లవాడిని పిలిచి పాలను ఎందుకు తీసుకురావడం లేదని అడిగింది. గొల్లవాడు "ఆవు వద్ద పాలు ఉండడం లేదు" అని తెలిపెను. రాణి గొల్లవాడితో "దూడతో మరియు పొదుగుతోను ఉన్న ఆవు దగ్గర పాలు ఎందుకు ఉండవు? నీవే పాలను త్రాగి ఉంటావు రేపటినుండి పాలను తీసుకురాకుంటే శిక్షిస్తాను" అని అతనిని మందలించింది.

గొల్లవాడు ఆవులను మేపడానికి వెళ్ళినప్పుడు ఈ ఆవును జాగ్రత్తగా గమనిస్తూ ఉండగా శ్రీనివాసుడు (నారాయణుడు) ఉన్న పుట్ట వద్దకు ఆవు వెళ్ళి పుట్టలో పాలను వదలడం చూశాడు. గొల్లవాడు క్రోధంతో తన చేతిలో ఉన్న గొడ్డలితో ఆవును కొట్టడానికి వెళ్లెను. తనకు పాలు ఇచ్చే ఆవును ఈ గొల్లవాడు కొట్టబోతున్నాడని గ్రహించిన శ్రీనివాసుడు గొల్లవాడిని అడ్డుకున్నాడు. ఆవుకు తగలవలసిన దెబ్బ శ్రీనివాసుని తలకు తగిలి రక్తం కారసాగింది. గొల్లవాడు శ్రీనివాసుని చూడగానే భయంతో మరణించెను. తరువాత ఆవు రాజు వద్దకు వచ్చి నేల మీద పడి అరవసాగెను. అంతట రాజు ఆవు వెంట వచ్చి "గొల్లవాడు మరణించడానికి, పుట్ట రక్తంతో తడిసిపోవడానికి కారణమేమిటి? ఈ ఘోర కృత్యాన్ని చేసినది ఎవరు?" అని ప్రశ్నించెను. అప్పుడు శ్రీనివాసుడు నారాయణ రూపంలో పుట్ట నుండి బయటకు వచ్చి రాజుతో జరిగినది తెలిపెను. రాజు తన సేవకుడు చేసిన తప్పును క్షమించమని ప్రార్థించెను. "సేవకుడు చేసిన తప్పు యజమానిదే అవుతుందిగనుక నీవు చేసిన తప్పుకు రాక్షసుడవు కమ్మని" శ్రీనివాసుడు రాజును శపించాడు.

రాజు శ్రీనివాసునితో "స్వామీ! నేను చేయని నేరానికి నన్ను శపించారు. శాపాన్ని తొలగించి రక్షించండి" అని ప్రార్థించెను. శ్రీనివాసుడు రాజుతో "ఓ రాజా! కొంతకాలం తరువాత

ఈప్రాంతంలో జన్మించబోయే ఆకాశరాజు తన పుత్రిక పద్మావతిని నాకు ఇచ్చి వివాహం చేయును. ఆ వివాహ సమయంలో నాకు సమర్పించే బంగారు కిరీటాన్ని నేను ప్రతి శుక్రవారం సాయంత్రం ధరించి ఆనందించెదను. అప్పుడు నీకు శాప విమోచనం కలుగును" అని తన అవతార లీలల గురించి తెలుపగా రాజు శ్రీనివాసునికి ప్రణామాలు చేసి వెళ్లిపోయెను. శ్రీనివాసుడు తన గాయానికి ఔషధం కోసం బృహస్పతిని స్మరించెను. వెంటనే వచ్చిన బృహస్పతితో శ్రీనివాసుడు "ఈ గాయానికి ఔషధం తెలుపమనగా" బృహస్పతి "మేడి చెట్టు పాలతో జిల్లేడు పత్తిని కలిపి మందు చేసి గాయం వద్ద పెట్టమని" తెలిపెను.

శ్రీనివాసుడు వరాహ స్వామిని కలుసుకోవడం

శ్రీనివాసుడు గాయానికి ఔషధం కోసం వెతుకుతూ ఉన్నప్పుడు వరాహ స్వామిని దర్శించెను. వరాహ స్వామి శ్రీనివాసుని నారాయణుడని గుర్తించి ఇక్కడికి వచ్చిన కారణమేమని ప్రశ్నించెను. జరిగిన విషయాలు తెలిపిన శ్రీనివాసుడు, ఈ కొండమీద కలియుగం చివరి వరకు నివసించడానికి వరాహ స్వామిని అనుమతి కోరెను. వరాహ స్వామి "తగిన మూల్యమును (ధనమును) ఇచ్చినచో స్థలమును ఇచ్చెదను" అనెను. శ్రీనివాసుడు వరాహ స్వామితో "నా వద్ద ప్రస్తుతానికి లక్ష్మి దేవి (ధనం) లేదు. అందువలన కలియుగంలో నా దర్శనానికి వచ్చిన భక్తులు నాకంటే ముందుగా నిన్ను దర్శిస్తారు. నాకంటే ముందుగా నీకు అభిషేకాలు, పూజలు, నైవేద్యాలు సమర్పిస్తారు. ఇదే నేను మీకు ఇచ్చే ధనము" అని అన్నాడు. వరాహ స్వామి అంగీకరించి శ్రీనివాసుడు ఉండడానికి నూరు అడుగుల స్థలాన్ని ఇచ్చెను. తరువాత వరాహ స్వామి తనకోసం వంట చేసే వకుళమాతతో శ్రీనివాసునికి ప్రతిరోజు భోజనవసతి ఏర్పాటు చేయమని తెలిపెను.

సూత గోస్వామి మునులతో "నారాయణుడు కలియుగంలోని పాపాత్ములను ఉద్ధరించుటకు సామాన్య మానవునివలె నటించెను.

శ్రీనివాసుడు మరియు వరాహ స్వామి ఇద్దరూ ఒకటే అయినను, భక్తి లేనివారిని మోహింపచేయడానికి మరియు తమ లీలలను విన్న భక్తులను ఆనందింపజేయడానికి ఇలా చేశారు” అని తెలిపెను.

వకుళమాత పూర్వజన్మ

ద్వాపరయుగంలో శ్రీకృష్ణుడు రాక్షసులను సంహరిస్తూ, గోపబాలురలతో సామాన్య బాలుని వలె క్రీడిస్తూ యశోదమాతను ఆనందింపజేసెను. తరువాత కొంత కాలానికి కృష్ణుడు వృందావనం వదిలి మథుర వెళ్లెను. మథుర నుండి ద్వారక వెళ్లి ఎంతోమంది రాణులను వివాహం చేసుకున్నాడు. ఒకసారి యశోదమాత కృష్ణునితో “ఓ కృష్ణా! నీ యొక్క బాల్యలీలలను చూసి ఆనందించానుగాని నీ యొక్క వివాహాలు ఒక్కటి కూడా చూడలేకపోయాను” అని దుఃఖించెను. అప్పుడు కృష్ణుడు యశోద మాతతో “అమ్మా! నీవు ఈ శరీరం వదిలిన తరువాత వకుళమాతగా జన్మించి, వేంకటాచలంలో ఉన్న వరాహ స్వామిని సేవిస్తూ ఉండుము. నేను వైకుంఠం నుండి శ్రీనివాసునిగా వస్తాను. అప్పుడు నీవు నాకు వివాహం చేస్తావు” అని వరం ఇచ్చాడు. ఆ యశోదమాతయే వకుళమాతగా జన్మించి వరాహ స్వామికి సేవ చేస్తూ ఉండెను.

శ్రీనివాసుడు పద్మావతి దేవిని కలుసుకోవడం

ఈ విధంగా శ్రీనివాసుడు వేంకటాచలంలో వకుళమాత సేవలను స్వీకరిస్తూ ఆనందంగా కాలాన్ని గడపసాగెను. ఒక రోజు శ్రీనివాసుడు వేటకు వెళ్లాలనుకొని మనసులో తలచిన వెంటనే వాయుదేవుడు గుర్రంగా మారి స్వామి చెంతకు వచ్చెను. శ్రీనివాసుడు వస్త్రాభరణాలతో అలంకరించుకొని ధనుర్బాణాలను ధరించి వేటకు బయలుదేరెను. ఆ వేటలో అనేక మృగాలను, సింహాలను, పులులను, నక్కలను, ఏనుగులను, శరభృంగాలను మరియు అడవిపందులను సంహరించిన తరువాత ఒక ఏనుగును వెంబడించెను. ఆ ఏనుగు శ్రీనివాసునికి సాష్టాంగ నమస్కారాలు చేసి తనను రక్షించమని

ప్రార్థించగా శ్రీనివాసుడు ఆ ఏనుగును వదిలివేసెను. అక్కడే ఉన్న పూల తోటలో తన సఖులతో పూలనుకోయుచున్న పద్మావతి దేవిని శ్రీనివాసుడు చూసెను. శ్రీనివాసుడు వారి వద్దకు వెళ్లగానే, పద్మావతి దేవి సఖులు శ్రీనివాసునితో "నీవు ఎవరవు? ఇక్కడికి ఎందుకు వచ్చావు?" అని అడిగిరి.

అప్పుడు శ్రీనివాసుడు వారితో "నన్ను కృష్ణ అని అంటారు. మా అన్న బలరాముడు, నా సోదరి సుభద్ర, నా తండ్రి వసుదేవుడు, నా తల్లి దేవకి. నేను నల్లగా ఉన్నందువలన మరియు కృష్ణపక్షంలో జన్మించినందువలన నాకు కృష్ణ అనే పేరు పెట్టారు" అని తెలిపెను. తరువాత పద్మావతి దేవిని "నీ పేరు, నీ కులగోత్రాలు ఏమిటి?" అని అడగగా పద్మావతి దేవి "నా పేరు పద్మావతి, నా తండ్రి ఆకాశరాజు. మాది చంద్రవంశం, అత్రిముని గోత్రం. ఓ కోయ రాజా! ఇక నీవు ఇక్కడి నుండి వెళ్ళవచ్చు" అన్నది. శ్రీనివాసుడు "ఓ రాజపుత్రీ! అంత కోపమెందుకు? బాటసారులకు దాహమును తీర్చి అన్నదానం చేసినవారు స్వర్గానికి వెళతారు. భోజనం పెట్టకపోయినా వారితో మర్యాదగా మాట్లాడినందువలన పుణ్యం కలుగును. నేను ఇప్పుడు నీ పట్ల కామాసక్తుడను అయ్యాను. నా కోరికను తీర్చి నీవు స్వర్గానికి వెళ్లుము" అన్నాడు. పద్మావతి దేవి శ్రీనివాసునితో "ఓరీ దుర్మార్గుడా! నీకు ప్రాణాలతో జీవించాలని లేదా? నా తండ్రి రాకముందే నీవు ఇక్కడి నుండి వెళ్ళిపోయి ప్రాణాలను కాపాడుకో!" అన్నది.

శ్రీనివాసుడు "ఓ రాజపుత్రీ! రాజు నన్ను అధర్మంగా ఎందుకు సంహరించును? నీవు పెళ్లికాని బాలికవు. నీకు నేను తగిన పెండ్లికుమారుడను. నేను నిన్ను కోరుకొనుటలో ఎట్టి అన్యాయమూ లేదు" అని అనెను. ఈ మాటలను విన్న పద్మావతి దేవి కోపంతో "మూర్ఖుడా! నిన్ను ఆకాశరాజు తప్పక శిక్షించి తీరును" అని మందలించింది. శ్రీనివాసుడు పద్మావతి దేవితో "పుట్టిన వారికి మరణం తప్పదు, పూర్వజన్మ కర్మానుసారం శుభాశుభాలు కలిగి తీరును. ఏ తప్పు చేయని నన్ను ఆకాశరాజు ఎందుకు

సంహరించును?" అని అన్నాడు. అప్పుడు పద్మావతి దేవి "ఓ కిరాతరాజా! తల్లిదండ్రులను, సోదరులను, బంధువులను వదిలి కాకివలె ఎందుకు మరణిస్తావు?" అని మరల మందలించింది. శ్రీనివాసుడు పద్మావతి దేవి మాటలను పట్టించుకోకుండా గుర్రంతో సహా పద్మావతి దేవి వద్దకు వెళ్లెను. ఈ హఠాత్పరిణామంతో పద్మావతి దేవి భయపడి శ్రీనివాసునిపై రాళ్లతో దాడి చేయగానే చెలికత్తెలు కూడా రాళ్లతో దాడి చేశారు. ఆ దెబ్బలకు గుర్రం చనిపోయింది. శ్రీనివాసునికి కూడ చాలా గాయాలు అయ్యాయి. లోకులు తనను సామాన్య మానవుడిగా భావించాలని శ్రీనివాసుడు అక్కడి నుండి వేంకటాచలం వచ్చి నిద్రించెను.

సూత గోస్వామితో మునులు "ఆ పద్మావతి దేవి ఎవరు? ఆమె జన్మ వృత్తాంతాన్ని తెలుపమని" అడుగగా సూత గోస్వామి పద్మావతి దేవి గురించి ఇలా తెలుపసాగెను:

పద్మావతి దేవి జన్మ

కురు పాండవుల యుద్ధం జరిగిన వెయ్యి సంవత్సరాలకు సుధర్ముడు అనే రాజు సమస్త భూమిని పరిపాలిస్తుండెను. సుధర్మునికి ఆకాశరాజు మరియు తొండమానుడు అనే ఇద్దరు కుమారులు జన్మించిరి, ఇద్దరూ నారాయణుని భక్తులే. ఆకాశరాజుకు ధరణి దేవి అనే రాజకన్యతో వివాహం జరిగింది. వీరికి పుత్రులు లేనందువలన పుత్రకామేష్ఠి యజ్ఞం కోసం భూమిని దున్నుచుండగా ఒక బాలిక లభించింది. అప్పుడు ఆకాశవాణి ఆకాశరాజుతో "ఓ రాజా! ఈ బాలికను నీవు కుమార్తెగా స్వీకరించు. ఈ బాలిక వలన నీ కీర్తి జగమంతా విస్తరిస్తుంది" అని తెలిపింది. రాజు ఎంతో సంతోషించి ఆ బాలిక పద్మంలో లభించినందువలన పద్మావతి అని పేరు పెట్టి పెంచుకున్నాడు. ఆ బాలిక కృప వలన ఆకాశరాజుకు ఒక పుత్రుడు కూడా జన్మించాడు. రాజు ఆ బాలునికి వసుదాసుడు అని పేరు పెట్టెను.

పద్మావతి దేవి పూర్వజన్మ

వకుళమాత రుచికరమైన పదార్థాలను భోజనానికి సిద్ధం చేసి శ్రీనివాసుని వద్దకు వచ్చి "గోవిందా! ఎందుకు పగటి సమయంలో నిద్రిస్తున్నావు? మేల్కొనుము. నీవు ఎందుకు దుఃఖిస్తున్నావు? నీ దుఃఖానికి కారణం ఏమిటి? అడవిలో భూతప్రేతాలను చూసి భయపడ్డావా? లేక జంతువులకు భయపడ్డావా? నీ శరీరం అంతటా ఎందుకు గాయాలయ్యాయి? అడవిలో నీవు ఎవరైనా కన్యను చూశావా? ఆ అదృష్టవంతురాలు ఎవరు? నీ మనసును దోచిన ఆ కన్య గురించి తెలుపుము" అని అడిగెను.

అప్పుడు శ్రీనివాసుడు లక్ష్మీదేవి వలె ఉన్న ఆ పద్మావతి దేవి గురించి ఈ విధముగా వివరించెను: "నేను త్రేతాయుగమున శ్రీరామునిగా అవతరించినప్పుడు నా తండ్రి ఆజ్ఞ మేరకు సీత మరియు లక్ష్మణునితో పదునాలుగు సంవత్సరాలు వనవాసం చేశాను. నేను మరియు లక్ష్మణుడు లేని సమయంలో రావణాసురుడు సీతాదేవిని అపహరించి తీసుకువెళుతుండగా గొర్రె వాహనం కల అగ్ని దేవుడు ఎదురు వచ్చి 'ఓ రావణా! నీవు తీసుకువెళ్ళుతున్నది సీతాదేవిని కాదు. ఆమె ఒక బ్రాహ్మణ స్త్రీ. రాముడు మీకు భయపడి సీతాదేవిని నా వద్ద దాచాడు. నా వద్ద ఉన్న సీతాదేవిని తీసుకొని బ్రాహ్మణ స్త్రీని వదిలివేయుము' అని తెలిపెను. రావణాసురుడు అగ్ని దేవుని మాటలను నమ్మి నిజమైన సీతాదేవిని వదిలి అగ్ని దేవుని వద్ద ఉన్న వేదవతిని తీసుకువెళ్లాడు.

"నేను రావణాసురుని సంహరించిన తరువాత వేదవతి అగ్నిప్రవేశం చేసిన సమయంలో అగ్ని నుండి నిజమైన సీత వచ్చి పూర్వం జరిగిన విషయం తెలిపి వేదవతిని వివాహం చేసుకోమన్నది. అప్పుడు 'నేను రామావతారంలో ఒకే భార్యను వివాహమాడతానని ప్రతిజ్ఞ చేశాను గనుక ఇప్పుడు నేను ఈమెను వివాహమాడను. కలియుగంలో వేదవతి ఆకాశరాజుకు జన్మించినప్పుడు ఆమెను

వివాహం చేసుకుంటాను. అప్పటివరకు వేదవతి బ్రహ్మలోకంలో బ్రహ్మదేవుని పూజలను స్వీకరిస్తూ ఉండగలదు' అని పలికెను. తరువాత వేదవతి బ్రహ్మ లోకానికి వెళ్లినది. ఆ వేదవతియే ఇప్పుడు ఆకాశరాజు పుత్రకామేష్ఠి యజ్ఞం కోసం భూమిని దున్నుతుండగా పద్మంలో లభించింది. పద్మంలో లభించినందువలన ఆకాశరాజు ఆ బాలికకు పద్మావతి దేవి అని పేరు పెట్టాడు" అని తెలిపెను.

(వరాహపురాణంలో వేదవతి గురించి ఈ విధముగా ఉన్నది: వేదవతి నారాయణుని వివాహం చేసుకోవాలని తపస్సు చేయుచుండెను. ఆ సమయంలో లంకా రాజ్యమును పరిపాలించే రావణాసురుడు లోకపాలురను, దిక్పాలకులను, భూమి మీద ఉన్న రాజులను జయించి తిరుగుచుండగా అక్కడ తపస్సు చేస్తున్న వేదవతిని చూసెను. రావణాసురుడు వేదవతి దగ్గరకు వెళ్లి "ఓ కల్యాణీ! నీ తపస్సుకు సౌందర్యమునకు పొంతన కుదరడం లేదు, నేను పదునాలుగు లోకాలను జయించాను. ఇంద్రాది దేవతలు నా యొక్క దాసులు. త్రిమూర్తులు నన్ను చూసి భయపడెదరు. ఇప్పుడు మూడు లోకాలు నా హస్తగతమయ్యాయి. నేను ఇన్ని లోకాలు తిరిగితిని గాని నీవంటి సుందరాంగిని చూడలేదు. నిన్ను చూడగానే నా మనసు కామానికి లోనైనది. నీవు ఈ తపస్సును మాని నీ యవ్వనమును వృధా చేసుకోకుండా నన్ను వివాహం చేసుకొని నా లంకా రాజ్యానికి పట్టపురాణివై పదునాలుగు లోకవాసుల సేవలను స్వీకరింపుము" అని అన్నాడు.

ఈ మాటలను విన్న వేదవతికి కోపము, భయము కలిగినవి. అయినా ధైర్యం చేసుకొని రావణాసురునితో "ఓ రాక్షస రాజా! నేను నారాయణుని తప్ప వేరొకరిని వివాహం చేసుకోనని శపథం చేశాను. అందువలన ఆ నారాయణుని గురించి తపస్సు చేస్తున్నాను. నారాయణుడు నన్ను వివాహం చేసుకోకపోతే ప్రాణాలైనా వదులుతాను గాని ఇతరులను వివాహం చేసుకోను. కనుక నీవు నీ దారిన వెళ్ళుము" అన్నది.

రావణాసురుడు పెద్దగా నవ్వి "పిచ్చిదానా! నారాయణుడు నా పేరు విన్నచో భయపడతాడు. ఇంతటి వాడనైన నేను స్వయంగా కోరగా నిరాకరించెదవా! అట్లయిన నిన్ను బలవంతముగా వివాహం చేసుకొందును, నాకు ఎవరు అడ్డు వస్తారో చూసెదను" అని వేదవతిని సమీపించి జుట్టును పట్టుకొనెను. వేదవతి తన తపోబలంతో చేతినే ఖడ్గంగా ఉపయోగించుకొని రావణాసురుడు పట్టుకున్న జుట్టును కత్తిరించి రావణాసురునితో "ఓరీ పాపాత్ముడా! నిన్ను వరించుటకు ఆసక్తి చూపని పర స్త్రీలను బలవంతముగా పీడించెదవా! నా కారణంగా నీవు మరియు నీ వంశం వారందరూ నశించెదరు" అని శపించి అగ్నిలో ప్రవేశించెను. ఆ వేదవతినే అగ్నిదేవుడు రావణాసురునికి ఇచ్చెను.)

వకుళమాత పద్మావతి దేవి సఖులను కలుసుకోవడం

శ్రీనివాసుడు వకుళమాతతో "నేను ఆ పద్మావతిని వివాహం చేసుకోవాలనుకుంటున్నాను. అందువలన నీవు పద్మావతి తల్లిదండ్రుల వద్దకు వెళ్లి వివాహానికి ఏర్పాటు చేయుము" అని తెలిపెను. వకుళమాత శ్రీనివాసునితో "స్వామీ! మీరు తెలిపినట్లే నేను మీ వివాహానికి ఏర్పాటు చేస్తాను" అని పలికి ఆడ గుర్రమును ఎక్కి శ్రీనివాసుడు తెలిపిన మార్గంలో బయలుదేరి కపిలతీర్థంలో స్నానం చేసి కపిలేశ్వరుని దర్శించి తన కుమారునికి వివాహం జరిగేలా దీవించమని కపిలేశ్వరుని ప్రార్థించింది. అక్కడ నుండి వకుళమాత పద్మసరోవరంలో స్నానం చేసి అక్కడే ఉన్న కృష్ణబలరాములను దర్శించి ఆ మూర్తులను తామర పువ్వులతో సేవించింది (వకుళమాత దర్శించిన కృష్ణబలరాముల మందిరం పద్మావతి దేవి మందిరంలో ఉన్నది). వకుళమాత అక్కడ నుండి సువర్ణముఖారీ నదికి వెళ్లి స్నానం చేసింది.

సువర్ణముఖారీ నది నుండి బయలుదేరి అగస్త్య ఆశ్రమానికి వెళ్లి అగస్త్యేశ్వరుని దర్శించినది. అదే సమయానికి అక్కడికి

పద్మావతి దేవి సఖులు వచ్చిరి. వకుళమాత ఆ కన్యల వద్దకు వెళ్లి "మీరు ఎవరు? ఇక్కడకు వచ్చిన కారణమేమిటి?" అని అడిగెను. ఆ కన్యలు "మేము పద్మావతి దేవి సఖులము" అని పలికి పూల తోటలో జరిగిన విషయాలు వివరించి తరువాత జరిగినది ఈ విధంగా తెలిపిరి: "ఆ కిరాతకుడు వెళ్ళిపోగానే పద్మావతి దేవి మూర్ఛితురాలై నేలమీద పడిపోయింది. మేము పద్మావతి దేవిని పల్లకిలో ఆకాశరాజు వద్దకు తీసుకువచ్చి జరిగిన విషయాలు తెలిపితిమి. అప్పుడు ఆకాశరాజు తన కుమారునితో 'బృహస్పతిని తీసుకురమ్మని' చెప్పగా వసుదాసుడు స్వర్గానికి వెళ్లి బృహస్పతిని తీసుకువచ్చాడు. ఆకాశరాజు బృహస్పతికి అతిథి సేవలు చేసి జరిగిన విషయాలు తెలిపి పద్మావతి కోలుకునే ఉపాయాన్ని తెలుపమని అడిగెను. అప్పుడు బృహస్పతి అగస్త్యేశ్వరునికి అభిషేకం చేయమని తెలిపెను. ఆకాశరాజు బ్రాహ్మణులతో 'అగస్త్యేశ్వరునికి అభిషేకం చేయమని' తెలిపి అభిషేకానికి కావలసిన ఏర్పాట్లు చేయమని మాతో తెలిపెను. అందువలన మేము అభిషేకానికి కావలసిన ద్రవ్యాలను తీసుకొని ఇక్కడకు వచ్చాము" అని తెలిపిరి.

అంతట పద్మావతి దేవి సఖులు వకుళమాతతో "మీరు ఎవరు? ఎక్కడినుండి వస్తున్నారు? ఇక్కడకు వచ్చిన కారణమేమిటి?" అని అడిగిరి. వకుళమాత వారితో "పురాణ పురుషుడు, పుట్టుక లేనివాడు అయిన నారాయణుని ప్రభావము మీకు తెలియదు. ఆ నారాయణుడే ఇప్పుడు వేంకటాచలం మీద సామాన్య మానవుని వలె నివసిస్తున్నాడు. ఆ నారాయణునికి నేను సేవలు చేస్తున్నాను. నా పేరు వకుళ. నేను ధరణి దేవిని కలుసుకొనేందుకు వచ్చాను. ఆమెను కలుసుకొనే మార్గం తెలపండి" అని అడిగింది. పద్మావతి దేవి సఖులు "మీరు మా వెంట వచ్చి ధరణి దేవిని కలుసుకోవచ్చు" అని తెలిపిరి. అందుకు వకుళమాత అంగీకరించి వారితో బయలుదేరినది.

శ్రీనివాసుడు సోదికత్తె స్త్రీ వేషాన్ని ధరించడం

వకుళమాత వెళ్లిన తరువాత, శ్రీనివాసుడు "కేవలం ఒకే పుత్రుడు ఉన్నవాడు సంతానం లేనివానితో సమానం, కేవలం ఒకే కన్ను ఉన్నవాడు గుడ్డి వానితో సమానం, అలాగే కేవలం ఒకే స్త్రీ చేసే పనులు విజయవంతం కావు. వకుళమాత తెలిపిన విషయాలు ఆకాశరాజు నమ్మకపోవచ్చు" అని భావించి బ్రహ్మ దేవుని బాలునిగా మార్చి శివుడిని మంత్రదండంగా చేసుకొని తను ఒక సోదికత్తె స్త్రీ వేషాన్ని ధరించెను. నారాయణపురంలోని వారందరూ వినేటట్లు ఆ స్త్రీ "నేను ఎవరికైనా జరిగింది జరుగుతున్నది మరియు జరగబోయేది తెలపగలను" అని పలుకుచుండెను. పట్టణంలోని ఒక స్త్రీ ధరణి దేవి వద్దకు వెళ్లి సోదికత్తె స్త్రీ గురించి తెలిపింది. ధరణి దేవి ఆ స్త్రీని పిలిపించి, ఆమెతో పద్మావతి దేవి గురించి తెలుపమన్నది. పద్మావతి దేవి చేతిని చూసిన సోదికత్తె స్త్రీ ధరణి దేవితో "నీ కుమార్తె కొద్దిరోజుల క్రితం పూలతోటలో ఒక యువకుడిని చూసి ప్రేమలో పడింది. అతనిని పెళ్లి చేసుకోవాలనుకుంటుంది. కానీ మీరు ఒప్పుకోరని భావించి మీతో ఆ విషయం చెప్పలేక ఇలా నిద్రాహారాలు మాని బాధపడుతూ ఉన్నది. మీరు వెంటనే ఆ యువకుడితో పద్మావతి దేవికి వివాహం జరిపించనట్లయితే నీ కుమార్తె బ్రతకదు. వైకుంఠంలో ఉండే నారాయణుడే ఆ పురుషుడు. నారాయణునికి నీ కుమార్తెను ఇచ్చి వివాహం జరిపిస్తే ఆమె మానసిక వేదన తగ్గుతుంది" అని తెలిపి వెళ్ళిపోయింది. సోదికత్తె స్త్రీ వెళ్లిన తరువాత ధరణి దేవి పద్మావతి దేవి వద్దకు వెళ్లి "నీ కోరికను నేను నెరవేరుస్తాను. నీవు దుఃఖించకు" అని ఓదార్చినది.

వకుళమాత ధరణి దేవిని కలుసుకోవడం

పద్మావతి దేవి సఖులు ధరణి దేవి వద్దకు వెళ్లి వకుళమాత గురించి తెలిపిరి. ధరణి దేవి వకుళమాతకు అతిథిసేవలు చేసి "మీరు ఎవరు? ఎక్కడి నుండి వచ్చారు?" అని అడుగగా వకుళమాత "నేను

వేంకటాచల పర్వతంపై వరాహ స్వామికి మరియు నారాయణునికి సేవ చేస్తూ ఉంటాను" అని తెలిపెను. పూలతోటలో జరిగిన సంఘటన గురించి కూడా తెలిపి "నారాయణుడు మీ కుమార్తెను వివాహం చేసుకోవాలనుకుంటున్నాడు. అందువలన మీ అభిప్రాయాన్ని తెలుసుకొని రమ్మని నన్ను పంపాడు" అని వివరించింది. ధరణి దేవి వకుళమాతతో "నేను నా భర్తను అడిగి మీకు సమాధానము తెలిపెదను" అని తెలిపింది.

ధరణి దేవి ఆకాశరాజును కలుసుకొని సోదికత్తె మరియు వకుళమాత తెలిపిన విషయాల గురించి తెలిపింది. తరువాత ఆకాశరాజు బృహస్పతిని పిలిపించి వకుళమాత మరియు సోదికత్తె తెలిపిన విషయాలను చెప్పి శ్రీనివాసుని గురించి తెలుపమన్నాడు. బృహస్పతి "శ్రీనివాసుని గురించి నాకంటే ఎక్కువగా శుకదేవునికి తెలియును. కావున మీరు శుకదేవుని అడగండి" అన్నాడు. ఆకాశరాజు తొండమానుని పిలిచి శుకదేవుని ఆహ్వానించి తీసుకురమ్మని పంపెను. తొండమానుడు వెళ్లి శుకదేవునితో ఆకాశరాజు యొక్క ఆహ్వానాన్ని విన్నవించెను. శుకదేవుడు తొండమానునితో వస్తుండగా ఆకాశరాజు ఎదురువెళ్లి దండప్రణామాలు చేసి అంతఃపురానికి తీసుకువచ్చి అతిథి సేవలు చేసి ఆసనంపై కూర్చుండబెట్టి జరిగిన విషయాలు వివరించి శ్రీనివాసుని గురించి తెలుపమన్నాడు. నారాయణుడు వైకుంఠం నుండి వేంకటాచలం వచ్చిన విషయాల గురించి శుకదేవుడు వివరించిన తరువాత ఆకాశరాజుతో "నీవు చాలా అదృష్టవంతుడవు. పూర్వ జన్మలో నీవు చేసిన పుణ్యం వలన నారాయణుడు మీకు అల్లుడు కాబోతున్నాడు. ఓ రాజా! నీ స్నేహం వలన మేము కూడా అదృష్టవంతులము అయినాము" అని పలికెను.

ఆకాశరాజు శ్రీనివాసునికి శుభలేఖ వ్రాయడం

ఆకాశరాజు బృహస్పతితో శుభలేఖ ఎలా వ్రాయాలో తెలుపమని అడిగెను. అప్పుడు బృహస్పతి ఈ విధముగా తెలిపెను: "దివ్య

మంగళ స్వరూపుడు (అన్ని మంచి గుణాలు కలవాడు), సనాతనుడు (జన్మ లేని వాడు), స్వతంత్రుడు (ఎవరి ఆధీనంలో లేనివాడు), అనేక అవతారాలను ధరించిన వాడు అయిన ఆ నారాయణుని పాదాలను దర్శించాలనే ఉత్సాహంతో ఉన్న నన్ను ఆకాశరాజు అని అంటారు. నేను మీ దయవలన నారాయణపట్టణమును పరిపాలిస్తున్నాను. నా కుమార్తె పద్మావతిని మీకు ఇచ్చి వివాహం చేయాలని నిశ్చయించాను. కావున వైశాఖ శుక్లదశమి శుక్రవారం నాడు మీ బంధు మిత్రులతో వచ్చి పద్మావతిని వివాహం చేసుకొనగలరు" అని బృహస్పతి తెలుపగా అదేవిధంగా ఆకాశరాజు శుభలేఖను వ్రాశాడు.

శుభలేఖను శుకదేవునికి ఇచ్చి "మీరు వకుళమాతతో మరియు మీ శిష్యులతో వేంకటాచలం వెళ్లి శ్రీనివాసునికి ఈ శుభలేఖను అందజేయండి" అని ప్రార్థించెను. శుకదేవుడు అంగీకరించి వేంకటాచలం వెళ్లి జరిగిన విషయాలు శ్రీనివాసునికి తెలిపి, ఆకాశరాజు వ్రాసిన శుభలేఖను శ్రీనివాసునికి ఇచ్చెను. శ్రీనివాసుడు ఆ శుభలేఖను చదివి ఆనందంతో శుకదేవుని కౌగిలించుకొని "హనుమంతుడు నాకు సీత జాడను తెలిపినప్పుడు నేను హనుమంతుని ఈ విధంగానే ఆలింగనం చేసుకొని హనుమంతునికి బ్రహ్మ పదవిని ఇచ్చాను" అని అనెను.

శ్రీనివాసుడు ఆకాశరాజుకు ఉత్తరం వ్రాయడం

తరువాత శ్రీనివాసుడు శుకదేవునితో "నేను రుక్మిణికి ఉత్తరం వ్రాసిన విధంగా ఇంద్రుని మిత్రుడగు ఆకాశరాజుకు ఉత్తరం వ్రాసెదను" అని తెలిపి ఈ విధంగా వ్రాసెను: "రాజులందరిచే పూజింపబడుతున్న సుధర్ముని కుమారుడగు ఆకాశరాజుకు శ్రీనివాసుడను నేను భక్తితో నమస్కరించి ఈ ఉత్తరం వ్రాయుచున్నాను. తమరు పంపిన శుభలేఖను చూసి నాకు చాలా సంతోషము కలిగినది. వైశాఖ శుక్లదశమి శుక్రవారం నాడు మీరు నిర్ణయించిన ముహూర్తానికి వచ్చి పద్మావతిని వివాహం

చేసుకుంటాను. పూర్వం సముద్రుడు తన పుత్రికను (లక్ష్మీదేవిని) నాకు సమర్పించి కీర్తిని పొందినట్లు, మీరు కూడా పద్మావతిని నాకు సమర్పించి ఈ లోకంలో కీర్తిని పొందెదరు. భగీరథుడు గంగను తీసుకువచ్చి కపిల మహర్షిచే శపింపబడిన సగరుని పుత్రులగు తన పితరులను (ముత్తాతలను) తరింపజేసినట్లే మీరు కూడ మీ అందమైన కుమార్తెను నాకు సమర్పించి మీ పితరులను ఉద్ధరించి, ఎవ్వరూ పొందలేని కీర్తిని పొందండి" అని ఉత్తరాన్ని వ్రాసి శుకదేవునికి ఇచ్చి పంపించెను.

శ్రీనివాసుడు తన వివాహానికి దేవతలను ఆహ్వానించడం

శ్రీనివాసుడు వకుళమాతతో "ఆకాశరాజు బంధుమిత్రులతో కూడి ఉన్నాడు. జనులు తమకు సమానమైన వారితోనే వివాహాలకు లేదా కలహాలకు సిద్ధమవుతారు. నేను ఇక్కడ బంధుమిత్రులకు దూరంగా ఉన్నాను. మనం కూడా బంధుమిత్రులతో వివాహానికి వెళ్లాలి" అని తెలిపాడు. అప్పుడు శ్రీనివాసుడు గరుత్మంతుని, ఆదిశేషుని స్మరించగానే వారు వచ్చారు. శ్రీనివాసుడు గరుత్మంతునితో "నీవు వెంటనే బ్రహ్మ దేవుని వద్దకు వెళ్లి నా వివాహ శుభలేఖను ఇచ్చి తన బంధుమిత్రులతో నా వివాహానికి రావలసినదిగా ఆహ్వానించమని" తెలిపెను. ఆదిశేషునితో "నీవు కైలాసానికి వెళ్లి శివునికి నా వివాహ శుభలేఖను ఇచ్చి తన బంధుమిత్రులతో నా వివాహనికి రావలసినదిగా ఆహ్వానించుము" అని తెలుపగా వారిరువురూ అలాగే ఆహ్వానించిరి.

"నారాయణుని వివాహానికి అందరూ రావాలి" అని బ్రహ్మ దేవుడు తన లోకంలో చాటింపు వేయించాడు. ఇంద్ర, కుబేర, వరుణ, యమ వంటి దిక్పాలకులను పిలిపించి "నారాయణుని వివాహానికి మీ బంధుమిత్రులతో రమ్మని" తెలిపెను. బ్రహ్మ దేవుడు తన భార్యలతో (సరస్వతి, సావిత్రి, గాయత్రి), దిక్పాలకులతో పాటు శేషాచలం వచ్చి శ్రీనివాసునికి దండప్రణామాలు చేసెను. కైలాసం నుండి శివుడు

కూడా తన బంధుమిత్రులతో వచ్చి శ్రీనివాసునికి దండప్రణామాలు చేసెను. బ్రహ్మదేవుని కోరిక మేరకు వచ్చిన వారందరికీ విశ్వకర్మ విడిది భవనాలను ఏర్పాటు చేసెను. తరువాత శ్రీనివాసుని వివాహానికి వచ్చిన దేవతలకు వివిధ సేవలను అప్పగించి విశ్వకర్మతో "నీవు నారాయణపురానికి వెళ్లి వివాహ వేదికను నిర్మించమని" తెలుపగా విశ్వకర్మ నారాయణపురానికి వెళ్లాడు.

శ్రీనివాసుని వివాహానికి లక్ష్మీ దేవి రావడం

నా వివాహమును లక్ష్మీ దేవి కూడా చూడాలని శ్రీనివాసుడు మనసులో భావించి సూర్యుని పిలిచి "కరవీరపురంలో (కొల్హాపురం) నా కోసం తపస్సు చేస్తున్న లక్ష్మీ దేవి వద్దకు వెళ్లి నేను శేషాచలంపై ఆహారం లేక కృశించి నేలమీద పడి ఉన్నానని తెలుపగానే ఆమె ఇక్కడకు వస్తుంది" అని తెలిపెను. సూర్యుడు శ్రీనివాసునితో "స్వామీ! అందరి మనసులలో ఏముందో లక్ష్మీ దేవికి తెలియును. నీవు ఆహారం లేక కృశించి నేల మీద పడి ఉన్నావని నేను తెలిపితే లక్ష్మీ దేవి నా మాటలను ఎలా నమ్మగలదు?" అని అన్నాడు.

శ్రీనివాసుడు సూర్యునితో "లక్ష్మి నా మాయ వలన నీ మాటలను నమ్మి ఇక్కడకు రాగలదు" అని తెలిపెను. సూర్యుడు శ్రీనివాసునితో "స్వామీ! మీరు తెలిపినట్లే చేస్తాను" అని పలికి లక్ష్మీ దేవి వద్దకు వెళ్లి "నారాయణుడు ఆహారం లేక కృశించి నేలమీద పడిఉన్నాడు" అని తెలుపగా, ఆ మాటలను నమ్మిన లక్ష్మీ దేవి వేంకటాచలం వచ్చింది. లక్ష్మీ దేవిని చూడగానే మునులు మరియు శివ బ్రహ్మాది దేవతలు ప్రణామాలు చేశారు. లక్ష్మీ దేవి శ్రీనివాసునికి ప్రణామాలు చేసి ఆలింగనం చేసుకుంది. శ్రీనివాసుడు లక్ష్మీ దేవితో "రామావతారంలో వేదవతిని వివాహం చేసుకోమని నీవు నాతో అన్నావు. ఆమే ఇప్పుడు పద్మావతిగా జన్మించింది. పద్మావతిని నీ సన్నిధిలో వివాహం చేసుకోవాలనుకుంటున్నాను" అని తెలిపెను. లక్ష్మీ దేవి సంతోషంతో ఒప్పుకుంది.

శ్రీనివాసుడు కుబేరుని వద్ద అప్పు తీసుకోవడం

వచ్చిన వారందరికీ భోజన వసతులను ఏర్పాటు చేయమని శ్రీనివాసుడు బ్రహ్మ దేవునితో చెప్పగా, బ్రహ్మ దేవుడు "స్వామీ! వంటకు కావలసిన సరుకులు గాని పాత్రలు గాని లేవు" అని అన్నాడు. శ్రీనివాసుడు బ్రహ్మ దేవునితో "నేను ఇప్పుడు సామాన్య మానవునిగా ఉన్నందువలన వైకుంఠంలోని నా ధనాన్ని భూలోకంలో వాడను" అన్నాడు. బ్రహ్మ దేవుడు శ్రీనివాసునితో "స్వామీ! వివాహ సమయంలో, గృహ నిర్మాణ సమయంలో ధనం లేకుంటే సామాన్య జనులు అప్పు తీసుకుంటారు. అందువలన మీరు కుబేరుని వద్ద అప్పు తీసుకోండి" అని తెలిపెను. శ్రీనివాసుడు దానికి అంగీకరించి కుబేరుని పిలిచి వివాహ ఖర్చుల కొరకు అప్పు అడిగెను. కుబేరుడు "స్వామీ! ఇది భూలోకం కనుక మీరు నాకు పత్రం వ్రాసి ఇస్తేనే ధనం ఇస్తాను" అన్నాడు.

శ్రీనివాసుడు ఒప్పుకొని "అప్పు తీసుకొనువాడు శ్రీనివాసుడు, అప్పు ఇచ్చువాడు కుబేరుడు. కలియుగమున విలంబ నామ సంవత్సరము వైశాఖమాస శుక్లపక్ష సప్తమి తిథియందు నా కల్యాణమునకై శ్రీరామ ముద్రలుగల పదునాలుగు లక్షల మాడల రూపమున ధనమును తీసుకొనుచున్నాను. ఈ ధనమును అసలు మరియు వడ్డీతో పాటు వెయ్యి సంవత్సరముల లోపల ఇచ్చెదను. దీనికి సాక్షులు బ్రహ్మ, రుద్రుడు మరియు రావిచెట్టు" అని శ్రీనివాసుడు అప్పు పత్రమును వ్రాసి కుబేరునికి ఇచ్చిన తరువాత కుబేరుడు శ్రీనివాసునికి ధనమును ఇచ్చెను. బ్రహ్మ దేవుడు ఆ ధనముతో వంట సరుకులను తెచ్చి వంట చేసి శ్రీనివాసునితో "ఓ శ్రీనివాసా! ఈ వంటలను ఎవరికి నైవేద్యం సమర్పించాలి?" అని అడుగగా శ్రీనివాసుడు అహోబిల నరసింహ స్వామికి సమర్పించమన్నాడు. బ్రహ్మ దేవుడు నరసింహ స్వామిని పూజించి నైవేద్యాన్ని సమర్పించి వచ్చిన వారందరికీ ఆ ప్రసాదాన్ని వితరణ చేసెను.

శ్రీనివాసుడు నారాయణపురానికి వెళ్లడం

శ్రీనివాసునికి వివిధ సుగంధ ద్రవ్యాలతో మంగళ స్నానాలు చేయించి వస్త్రాభరణాలతో పెండ్లికుమారునిగా అలంకరించిరి. ఆ సమయంలో అప్సరసలు నాట్యం చేసిరి, గంధర్వులు కీర్తించిరి, దేవతలు పుష్పాలను కురిపించిరి, మునులు వేదాలను పఠించిరి. శ్రీనివాసుడు వరాహ స్వామి వద్దకు వెళ్లి "స్వామీ! మీ అనుగ్రహంతో నేను వివాహం చేసుకోబోతున్నాను. అందువలన నా వివాహానికి మీరు భూదేవితో రావలెను" అని ఆహ్వానించెను. అప్పుడు వరాహ స్వామి "నా సేవకురాలు వకుళ నీ వివాహానికి వస్తుంది" అని పలికెను. శ్రీనివాసుడు "మీ అభీష్టాన్ని నేను కాదనలేను" అని పలికి అక్కడి నుండి బయలుదేరి లక్ష్మీ దేవితో పాటు గరుడునిపై నారాయణపురానికి వెళ్లే దారిలో ఉన్న పద్మసరోవర తీరానికి చేరుకొనెను

అక్కడ శుకదేవుని ఆశ్రమం ఉన్నది. శుకదేవుడు శ్రీనివాసుని వద్దకు వచ్చి ప్రణామాలు చేసి "ఓ వైకుంఠపతీ! నా ఆశ్రమానికి వచ్చి నా ఆతిథ్యాన్ని స్వీకరించి నా జీవితాన్ని సార్థకం చేయండి" అని ప్రార్థించెను. శ్రీనివాసుడు శుకదేవునితో "నేను ఒక్కడినే లేను. నా పరివారాన్ని చూడుము" అన్నాడు. అప్పుడు శుకదేవుడు "స్వామీ! మీరు సంతృప్తి చెందితే పదునాలుగు లోకాల వాసులు సంతృప్తి చెందుతారు. అందువలన మీరు వచ్చి నా ఆతిథ్యాన్ని స్వీకరించండి" అని ప్రార్థించెను. శుకదేవుని ప్రార్థనను ఆలకించిన శ్రీనివాసుడు ఆయన ఆశ్రమానికి వెళ్లెను. శుకదేవుడు పద్మసరోవరంలో స్నానం చేసి రుచికరమైన ఆహారపదార్థాలను వండి లక్ష్మీ శ్రీనివాసులకు సమర్పించెను.

పద్మావతి దేవి శ్రీనివాసుల వివాహం

శ్రీనివాసుడు తన పరివారంతో వచ్చిన విషయం తెలుసుకున్న తొండమానుడు తన భార్య మరియు బ్రాహ్మణులతో ఎదురు వెళ్లి

దండప్రణామాలు చేసి వారికి స్వాగతం పలికెను. తొండమానుని భార్య శ్రీనివాసునికి దృష్టి తగలకుండా హారతిని ఇచ్చింది. తొండమానుడు శ్రీనివాసుని ఆకాశరాజు భవనానికి తీసుకువచ్చి బంగారు సింహాసనం మీద కూర్చుండబెట్టెను. ఆకాశరాజు శ్రీనివాసునికి ప్రణామాలు చేశాడు. ధరణి దేవి స్వామి పుష్కరిణి జలాన్ని శ్రీనివాసుని పాదాల మీద పోస్తుండగా ఆకాశరాజు శ్రీనివాసుని పాదాలను అభిషేకం చేసెను. తరువాత ఆ నీటిని తన తల మీద చల్లుకొని భార్యాపుత్రుల, బంధువుల, సేవకుల తలల మీద, ధనాగారం, గోశాల, గజశాల, అశ్వశాల మరియు వస్త్రశాలల మీద చల్లి "శ్రీనివాసుని పాదోదకంచే ఈనాడు నా రాజ్యం, బంధువులు, పితృదేవతలు పవిత్రులు అయ్యారు" అనెను.

బృహస్పతి శ్రీనివాసునితో "అత్రి మహర్షి గోత్రమున జన్మించిన సుధీరుని మునిమనుమరాలు, సుధర్ముని మనుమరాలు, ఆకాశరాజు పుత్రికను నీవు స్వీకరింపుము" అని అనెను. అప్పుడు వశిష్ఠ ముని శ్రీనివాసుని తరపున "వశిష్ఠ గోత్రమున జన్మించి యయాతికి మునిమనుమడునూ తేజోవంతుడైన సూరసేనునికి మనుమడునూ వసుదేవుని కుమారుడునూ అయినట్టి శ్రీనివాసుడు మీ పద్మావతి దేవిని స్వీకరించును" అనెను. ఆకాశరాజు శ్రీనివాసునితో "ఓ పురుషోత్తమా! నా కుమార్తెను మీకు సమర్పిస్తున్నాను. దయచేసి మీరు స్వీకరింపుము." అని పలికి పద్మావతి దేవిని శ్రీనివాసుని కుడి చేతికి అందించి ఆమెను సమర్పించెను. వశిష్ఠ ముని పెండ్లి మంత్రములను చదువుచుండగా పురోహితుల మంత్రములచే శుద్ధి చేయబడిన మంగళసూత్రమును శ్రీనివాసుడు పద్మావతి దేవి మెడలో కట్టెను. ఆ సమయంలో బ్రాహ్మణ స్త్రీలు పద్మావతి దేవిని "సావిత్రి వలె ఎందరో పుత్రులను పొంది లోకానికి తల్లివై అందరికీ శుభాలను ప్రసాదించుము" అని దీవించిరి.

ఆకాశరాజు వివాహ సందర్భంలో బ్రాహ్మణులకు కోట్ల సంఖ్యలో గోవులను, గుర్రాలను, వస్త్రాలను, ఆభరణాలను దానం

చేసెను. శ్రీనివాసునికి వరకట్నంగా నూరు బారువుల బంగారు కిరీటాన్ని, కంఠాభరణాలను, ముత్యాల హారాలను, రెండు భుజాలకు నాగాభరణాలను, ఉంగరాలను, మొలత్రాడు, రత్నాల హారాల వంటి అనేకమైన కానుకలను సమర్పించెను. వివాహం తరువాత శ్రీనివాసునితో కలిసి అందరూ విందు భోజనాలు చేశారు. వివాహ వేడుకలు నాలుగు రోజులు గడిచిన తరువాత ఐదవ రోజు శ్రీనివాసుడు పద్మావతి దేవితో గరుడుని మీద సువర్ణముఖారీ నది తీరంలోని అగస్త్య ముని ఆశ్రమానికి వెళ్లాడు. (పద్మావతి దేవి శ్రీనివాసుల వివాహం జరిగిన నారాయణపురంలో ఇప్పుడు పద్మావతి దేవి వేంకటేశ్వర స్వామి మందిరం ఉన్నది. నారాయణపురం తిరుపతికి 40 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.)

ఆ సమయంలో ఆకాశరాజుతో పాటు బంధువులందరూ పద్మావతి దేవి వియోగం వలన దుఃఖించిరి. ఆకాశరాజు అగస్త్య ముని ఆశ్రమానికి వంట పాత్రలతో పాటు వంట సరుకులను పంపించాడు. పద్మావతి దేవికి సేవ చేయడానికి అనేక వందల దాసీలను తీసుకొని వెళ్లి పద్మావతి దేవి శ్రీనివాసులను కలుసుకున్నాడు. శ్రీనివాసుడు ఆకాశరాజుతో "మీరు నాకు గురువుతో సమానం కావున మీ కోరిక తెలుపుము, నేను తీర్చెదను" అనెను. ఆకాశరాజు "ఓ కృష్ణా! నాకు మరియు నా కుటుంబం వారికి భక్తిని ప్రసాదించుము" అని కోరాడు. మీ కోరిక తీరునని శ్రీనివాసుడు దీవించెను. తరువాత తాను ధరించిన పట్టు వస్త్రమును తన బావమరిది వసుదాసునికి బహుమతిగా కప్పెను.

ఆకాశరాజు పద్మావతి దేవితో "అమ్మా! నేను వెళుతున్నాను. శ్రీనివాసునికి సేవ చేసి నీ జీవితాన్ని సార్థకం చేసుకో!" అని తెలిపి నారాయణపురానికి వెళ్లెను. శ్రీనివాసుడు తన వివాహానికి వచ్చిన దేవతలతో మరియు మునులతో "నేను అగస్త్య ముని ఆశ్రమంలో ఆరు నెలలు ఉంటాను. అందువలన మీరందరూ మీ

లోకాలకు వెళ్ళండి" అనగానే వారందరూ శ్రీనివాసుని మాటను కాదనలేక, శ్రీనివాసునికి పద్మావతి దేవికి మరియు లక్ష్మీ దేవికి ప్రదక్షిణ నమస్కారాలు చేసి వెళ్లిపోయారు. లక్ష్మీ దేవి శ్రీనివాసుని అనుమతితో కరవీరపురానికి వెళ్లింది.

ఆకాశరాజు శరీరాన్ని వదలడం

పద్మావతిదేవి మరియు శ్రీనివాసుడు అగస్త్య ముని ఆశ్రమంలో ఉన్నప్పుడే ఆకాశరాజుకు ఆరోగ్యం క్షీణించింది. తాను శరీరం వదిలే సమయంలో పద్మావతి దేవిని మరియు శ్రీనివాసుని చూడాలని ఒక దూతను పంపి వారిని తీసుకురమ్మన్నాడు. దూత వెళ్లి పద్మావతి దేవికి ప్రణామాలు చేసి "ఆకాశరాజు ఆరోగ్యం క్షీణించడంతో మిమ్మల్ని చూడగోరుతున్నారు" అని తెలుపగానే పద్మావతి దేవి మూర్ఛితురాలై నేల మీద పడిపోయింది. పద్మావతి దేవికి ఆగస్త్య ముని భార్య చేసిన సేవతో మూర్ఛ నుండి స్పృహలోకి వచ్చెను. ఈ విషయం తెలిసిన శ్రీనివాసుడు కూడా చాలా దుఃఖించెను.

పద్మావతిదేవి శ్రీనివాసునితోపటు అందరూ నారాయణపురానికి వచ్చి ఆకాశరాజును కలుసుకున్నారు. శ్రీనివాసుడు ఆకాశరాజుతో "ఓ రాజా! నీ పుత్రుడగు వసుదాసుని, పుత్రిక పద్మావతిని, గొప్ప ధైర్యవంతుడైన నీ సోదరుడు తొండమానుని మరియు సామంత రాజులను, రాజ్యాన్ని, శరీరాన్ని కూడా వదిలి వెళ్ళుచున్నావా? తల్లిదండ్రులు లేని మాకు నీవే తండ్రివి, నీవే తల్లివి. ఇక నిన్ను చూసే అదృష్టం మాకు లేదు. మేము నేటితో అనాథలం అయినట్లే" అని సామాన్య మానవుని వలె దుఃఖించెను. ఆకాశరాజు శ్రీనివాసునితో "నీవు సమస్త లోకాలకు బంధువువైనప్పటికీ అదృష్టవశాత్తూ మాతో నేరుగా సంబంధాన్ని కలుపుకున్నావు. నీవు మా బంధువు కావడంతో మా అందరి జన్మలు సార్థకమైనవి. నేను బ్రహ్మలోకం వెళ్ళిన తరువాత నా కుమారుడు వసుదాసుని మరియు తమ్ముడు తొండమానుని నీవే రక్షింపుము" అని తెలిపి తన ప్రాణాలను వదిలి

తనకోసం వచ్చిన విమానంలో బ్రహ్మలోకానికి వెళ్లెను. వశిష్ఠ, అగస్త్య, అత్రి, భరద్వాజ వంటి మునుల ఆధ్వర్యంలో వసుదాసుడు ఆకాశరాజుకు అంతిమ సంస్కారాలు చేశాడు. తరువాత శ్రీనివాసుడు పద్మావతి దేవితో అగస్త్య ముని ఆశ్రమానికి వెళ్లెను.

రాజ్యం కోసం తొండమానుడు వసుదాసుడు యుద్ధం చేసుకోవడం

ఆకాశరాజు శరీరం వదిలిన తరువాత తొండమానుడు వసుదాసునితో "పెద్దవారు మరణిస్తే చిన్నవారికే రాజ్యం వస్తుంది, అందువలన ఈ రాజ్యానికి రాజు అయ్యే అర్హత నాకే ఉంది" అన్నాడు. వసుదాసుడు "తండ్రి రాజ్యం కుమారునికే సంక్రమిస్తుంది కనుక ఈ రాజ్యం మీద నాకే అధికారం ఉంటుంది" అన్నాడు. ఈ విధంగా ఇద్దరూ రాజ్యం కోసం తగవులాడి యుద్ధానికి సిద్ధమయ్యారు. యుద్ధంలో తనకు సహాయం చేయమని వసుదాసుడు మరియు తొండమానుడు ఇద్దరూ శ్రీనివాసుని అడిగారు. శ్రీనివాసుడు ఏకాంత సమయంలో "నేను ఎవరికి సహాయం చేయాలి?" అని పద్మావతి దేవిని అడిగెను. పద్మావతి దేవి "తొండమానుడు ధైర్యవంతుడు మరియు యుద్ధంలో అనుభవం కలవాడు. వసుదాసుడు యుద్ధంలో అనుభవం లేనివాడు మరియు తండ్రి లేనివాడు కావున వసుదాసునికి సహాయం చేయమని" తెలిపెను. శ్రీనివాసుడు తొండమానునికి తన శంఖచక్రాలను ఇచ్చి, వసుదాసునికి యుద్ధంలో సహాయం చేస్తానని మాట ఇచ్చెను.

యుద్ధం ప్రారంభమైంది, వసుదాసుడు పది బాణాలతో తొండమానుని గాయపరిచాడు. తొండమానుడు వసుదాసుని వదిలి శ్రీనివాసునితో యుద్ధానికి సిద్ధమయ్యెను. శ్రీనివాసుడు తొండమానుని గాయపరిచి సారథిని సంహరించి రథాన్ని నాశనం చేశాడు. ఇది చూసిన తొండమానుని కుమారుడు శ్రీనివాసుని మీదకి యుద్ధానికి వచ్చి ఐదు వేల బాణాలతో వక్షస్థలాన్ని గాయపరచాడు. తొండమానుడు క్రోధంతో గుర్రాన్ని ఎక్కి శ్రీనివాసుడు ఇచ్చిన

సుదర్శనచక్రంతోనే శ్రీనివాసుని వక్షస్థలంపై దాడి చేయగానే శ్రీనివాసుడు సామాన్య మానవుని వలె మూర్ఛిల్లి నేలమీద పడెను.

శ్రీనివాసుడు యుద్ధభూమిలో నేలపై పడిపోగానే అంతఃపురం పైనుండి ఈ యుద్ధాన్ని చూస్తున్న పద్మావతి దేవి దుఃఖంతో అగస్త్య ముని వద్దకు వెళ్లి "అందరూ చూస్తుండగానే నా భర్త యుద్ధరంగంలో మూర్ఛపోయారా! లేక నాకు భ్రమను కలిగించడానికీ నేలమీద పడిపోయాడా! ఇప్పుడు నేను ఏమి చేయాలో మీరే తెలుపండి" అని ప్రార్థించింది. అగస్త్య ముని "దేశ కాలములను బట్టి పని చేసినప్పుడే మానవుడు ఫలితాన్ని పొందును. కాబట్టి, నీ భర్తకు మేలును కోరుతూ, ఆయనను యుద్ధభూమి నుండి తీసుకురావడానికి ప్రయత్నించు. స్త్రీల ధర్మం భర్తపట్ల అపారమైన భక్తిని కలిగి ఉండటమే. కల్యాణీ! నా మనసుకు సంధి ప్రయత్నమే సరైనదిగా అనిపిస్తోంది. మీ పినతండ్రి మరియు సోదరుడు ఇద్దరూ రాజ్యాన్ని పరిపాలించడానికి అర్హులే. ఈ విషయంలో ఎటువంటి సందేహం లేదు" అని తెలిపెను. పద్మావతి దేవి అగస్త్య మహర్షి మాటలను అంగీకరిస్తూ, "మీరు తెలిపినట్లే చేసెదనని" తెలిపి అగస్త్య మునితో పాటు యుద్ధక్షేత్రానికి వచ్చింది.

యుద్ధభూమిలో పద్మావతి దేవి శ్రీనివాసునికి సేవలు చేసి బాహ్య స్పృహ లోనికి తీసుకువచ్చింది. శ్రీనివాసుడు పద్మావతి దేవిని చూసి "స్త్రీలు యుద్ధభూమికి రాకూడదు. నీవు ఎందుకు వచ్చావు?" అనెను. ఆగస్త్య ముని శ్రీనివాసునితో "శ్రీనివాసా! నీవు యుద్ధమును ఆపి ఇద్దరికీ రాజ్యాన్ని పంచి ఇవ్వమని" తెలిపెను. శ్రీనివాసుడు అంగీకరించక కోపంతో "తొండమానుని మరియు తొండమానుని కుమారుని యుద్ధంలో సంహరించి రాజ్యాన్ని వసుదాసునికి ఇస్తాను. మీరు ఇక్కడి నుండి వెళ్ళండి" అని అనెను. పద్మావతి దేవి శ్రీనివాసునికి ప్రణామాలు చేసి చేతులు జోడించి "స్వామీ! పుండరీకాక్షా! లోకనాశనం కలిగించే ఈ యుద్ధం వలన ఏమి ప్రయోజనం? వసుదాసుడు, తొండమానుడు ఇద్దరూ

మనకు బంధువులే కావున ఇద్దరికీ రాజ్యాన్ని పంచి ఇవ్వండి” అని ప్రార్థించింది. అయినా శ్రీనివాసుడు పద్మావతి దేవితో “నీకు క్షత్రియ ధర్మాలు తెలియవు. నీవు ఇక్కడి నుండి వెళ్లిపో!” అని మందలించెను. శ్రీనివాసుడు తన మాటను వినకపోవడంతో పద్మావతి దేవి అగస్త్య మునితో “మీరైనా యుద్ధాన్ని ఆపండి” అని ప్రార్థించెను.

అగస్త్య ముని శ్రీనివాసునితో “ఆకాశరాజు శరీరం వదిలే సమయంలో వసుదాసుని, తొండమానుని నీవే రక్షించమని తెలిపెను కనుక నీవు ఇద్దరినీ రక్షించవలసినదే! ఒకరిని సంహరించి మరొకరికి రాజ్యాన్ని ఇవ్వడం ద్వారా నీవు ఆకాశరాజుకు ఇచ్చిన మాటను తప్పినవాడవవుతావు. కావున ఇద్దరికీ రాజ్యాన్ని పంచి ఇవ్వమని” తెలిపెను. అగస్త్య ముని ఉపదేశాన్ని విన్న శ్రీనివాసుడు శాంతించి వసుదాసుని మరియు తొండమానుని పిలిచి “ఆకాశరాజు తన శరీరం వదిలే సమయంలో మీ ఇద్దరినీ రక్షించమని నా నుండి మాట తీసుకున్నాడు. కావున మీరిద్దరు రాజ్యాన్ని సమానంగా తీసుకోండి” అని ఉపదేశం చేసెను. వసుదాసుడు మరియు తొండమానుడు శ్రీనివాసుని మాటను కాదనలేక రాజ్యాన్ని సమానంగా తీసుకున్నారు.

శ్రీనివాసుడు అర్చామూర్తిగా మారిపోవడం

శ్రీనివాసుడు వసుదాసునికి, తొండమానునికి రాజ్యాన్ని పంచి ఇచ్చిన తరువాత అగస్త్య ముని ఆశ్రమంలో నివసించసాగెను. ఒకరోజు తొండమానుడు శ్రీనివాసుని వద్దకు వచ్చి ప్రణామాలు చేశాడు. శ్రీనివాసుడు తొండమానుని ఆలింగనం చేసుకొని “ఓరాజ నీవు ఇకడికి రావడానికి కారణము ఏమిటి” అని ప్రశ్నించెను. తొండమానుడు “స్వామీ! మీ దర్శనం కంటే నాకు ఏదీ ముఖ్యం కాదు. ఓ శ్రీనివాసా! నీవు యోగులకు అధిపతివి, నీవే సృష్టికర్తవు, బ్రహ్మదేవుని నియమించేవాడివి, లక్ష్మీదేవితో విహరించేవాడవు” అని పరిపరివిధాల స్తుతించి “మీ సేవ చేసి నా జీవితాన్ని సార్థకం

చేసుకుంటాను" అని ప్రార్థించెను. శ్రీనివాసుడు "ఓ రాజా! నీ సోదరుని వలన నేను గృహస్థుడిని అయ్యాను. అయినా నాకు నివసించడానికి ఇల్లు లేదు. ఆకాశరాజు అల్లుడు నివసించడానికి ఇల్లు లేక ఇతరుల ఇండ్లలో ఉంటున్నాడు అనే అపకీర్తి ఆకాశరాజుకు రాకూడదు. అందువలన నేను నివసించడానికి ఈ వేంకటాచలం మీద మూడు ప్రాకారాలతో, రెండు గోపురాలతో, ఏడు ద్వారాలతో, పూలమాలలు అల్లేగది, వంట గది, యాగశాల, వస్త్రాల గది, నూనెల గది, భోజనాల గది మరియు ఆభరణాల గదివంటి గదులతో ఒక అద్భుతమైన మందిరాన్ని నిర్మింపుము" అని అన్నాడు.

తొండమానుడు శ్రీనివాసుడు తెలిపినట్లే మందిరాన్ని నిర్మించాడు. ఆ మందిరానికి (శ్రీనివాస మంగాపురం నుండి) మెట్లను కూడా నిర్మించి శ్రీనివాసునికి తెలిపెను. శ్రీనివాసుడు ఆ మందిరంలోనికి శుభ ముహూర్తంలో దేవతలతో పాటు ప్రవేశించి పద్మావతి దేవిని వక్షస్థలంలో ఉంచుకొని, ఎడమ చేతిని నడుము మీద పెట్టుకొని కుడి చేతితో తన పాదాలను ఆశ్రయించమని సూచిస్తూ అర్చామూర్తిగా మారిపోయెను.



కృష్ణకృపామూర్తి

శ్రీ శ్రీమద్ ఏ.సి. భక్తి వేదాంత స్వామి ప్రభుపాదులు

అంతర్జాతీయ కృష్ణచైతన్య సంఘ సంస్థాపకాచార్యులు

(పేజి 201)



12 మంది ఆళ్వారులు (పేజి 125)

అనంతాచార్య
(పేజి 155)

రామానుజాచార్య
(పేజి 148)

అన్నమాచార్య
(పేజి 169)

అనంతాచార్య ఈ గునపముతోనే వేంకటేశ్వర స్వామిని కొట్టిరి. ఇప్పుడు ఈ గునపమును వేంకటేశ్వర స్వామి మందిరంలోని మొదటి గోపురంలో మనం దర్శించవచ్చు. (పేజి 40, 157)

శ్రీ నిత్యానంద ప్రభు
(పేజి 187)

శ్రీకృష్ణ చైతన్య మహాప్రభు
(పేజి 183)

సువర్ణముఖారి నది (పేజి 122)

వ్యాసతీర్థులు (పేజి 182)

కనక దాసు (పేజి 193)

గోవిందరాజ స్వామి (పేజి 102)

స్వామి పుష్కరిణి (పేజి 81)



ఇస్కాన్ తిరుపతిలోని శ్రీ శ్రీ రాధా గోవింద (పేజి 108)



తిరుమలలోని శ్రీ వేంకటేశ్వర స్వామి (మూల విగ్రహం)
(పేజి 88)

తిరుచానూరులోని పద్మావతి దేవి

(పేజి 117)



వరాహ స్వామి (పేజి 86)



వరాహ స్వామి మందిరం (పేజి 86)

శ్రీవారి పాదాలు, అలిపిరి
(పేజి 117)

సీతారామలక్ష్మణ ఉత్సవ విగ్రహాలు
(పేజి 46–47)

తుంబురు(గోన) తీర్థం (పేజి 100)



పాపనాశన తీర్థం (పేజి 94)

(ఎడమ వైపున) తిరుమలనంబి మందిరం (ఇల్లు) (పేజి 90, 145)
(కుడి వైపున) వేదాంత దేశిక్ అనే శ్రీ వైష్ణవ ఆచార్యుడు ఈ గంట అవతారం
(పేజి 163)

కపిల తీర్థంలోని కపిలేశ్వరుడు (పేజి 107)

తిరుపతిలోని కోదండరామ
స్వామి మందిరం మరియు
సీతారామలక్ష్మణ
(పేజి 105)



శ్రీనివాస
మంగాపురంలోని
కల్యాణ వేంకటేశ్వర
స్వామి మందిరం
(పేజి 122)

శ్రీదేవీ–భూదేవి సమేత శ్రీమలయప్పస్వామి (పేజి 40, 62–65)

అనంతాచార్య బృందావనం(సమాధి) (పేజి 91)



(ఎగువ ఎడమ వైపున)
హాథీరం బాబాజీ
బృందావనం(సమాధి)
(పేజి 92)
(ఎగువ కుడి వైపున)
వేంగమాంబ బృందావనం
(సమాధి) (పేజి 91)

పాండవ తీర్థం (పేజి 101)



ఆకాశగంగ
తీర్థం (పేజి 92)

2

శ్రీ వేంకటేశ్వర స్వామి చరిత్ర – రెండు

స్కందపురాణం నుండి

(ఈ కథ స్కందపురాణంలోని 2వ వైష్ణవఖండలోని శ్రీవేంకటాచల మహాత్మ్యమున 1వ అధ్యాయం నుండి 10వ అధ్యాయం వరకు ఆధారంగా తీసుకొని సంక్షిప్తంగా అందించబడింది.)

శివుడు స్కంధునికి తెలిపినదే స్కందపురాణం. దానినే నైమిశారణ్యంలో సూత గోస్వామి ఋషులకు తెలిపెను.

ఇప్పుడు మనము స్కందపురాణం నుండి వేంకటేశ్వర స్వామి లీలలు తెలుసుకోబోతున్నాము. ఈ స్కందపురాణంలోని వేంకటేశ్వర స్వామి లీలలు మరియు భవిష్యోత్తరపురాణంలోని లీలలకు కొన్ని భిన్నంగా ఉన్నాయి. దీనికి ఆచార్యులు ఇలా తెలిపిరి. భగవంతుడు ప్రతి కల్పంలో (బ్రహ్మ దేవునికి ఒక రోజులో వెయ్యి సత్య, త్రేతా, ద్వాపర మరియు కలియుగాలు వచ్చును. దీనిని కల్పం అంటారు) వైకుంఠం నుండి దిగివచ్చి వేంకటాచలం పర్వతంపై వేంకటేశ్వర స్వామిగా లీలలు చేయును. కనుక ఈ లీలలలో భేదాలు సంభవిస్తాయి.

నారాయణుడు వేంకటాచలం రావడం

సూత గోస్వామి మునులకు ఇలా తెలుపుచున్నాడు: హైహయ వంశంలో శంఖ అనే రాజు ఉండెను. నారాయణుని కొరకు శంఖ అనేకమైన యజ్ఞాలు చేసెను. బ్రాహ్మణులకు బంగారాన్ని, గోవులను, భూమిని కూడా దానం చేసెను. అయినా నారాయణుని దర్శనం లభించనందుకు దుఃఖిస్తుండెను. అప్పుడు నారాయణుడు ఆకాశవాణి రూపంలో ఇలా తెలిపెను. “ఓ రాజా! వృషభాచలం (వేంకటాచలం) వెళ్ళుము. వృషభాచలం వైకుంఠంతో సమానం. వృషభాచలంలోని

స్వామిపుష్కరిణి వద్ద నీవు నా కొరకు తపస్సు చేయుము. నేను నీకు అక్కడ దర్శనమిస్తాను" అని తెలిపి ఇలా పలికెను: "అగస్త్య ముని ఒకసారి బ్రహ్మ దేవుని వద్దకు వెళ్లి నారాయణుని దర్శనం ఎక్కడ లభించునని అడిగెను. బ్రహ్మ దేవుడు వేంకటాచలంలో తపస్సు చేయమనగా అగస్త్య ముని వేంకటాచలంలో తపస్సు చేస్తున్నాడు. నేను వేంకటాచలంలో నీకు మరియు అగస్త్య మునికి దర్శనం ఇచ్చెదను" అని తెలిపెను. శంఖ రాజు ఎంతో ఆనందించి వజ్ర అనే తన కుమారునికి రాజ్యాన్ని అప్పగించి వేంకటాచలం వచ్చి స్వామి పుష్కరిణిలో స్నానం చేసి నారాయణుని కొరకు తపస్సు చేస్తుండెను.

ఒకసారి ఇంద్రాది దేవతలతో కలసి బృహస్పతి బ్రహ్మ దేవుని వద్దకు వెళ్లి నారాయణుని దర్శనం ఎక్కడ కలుగునని అడిగెను. బ్రహ్మ దేవుడు "వేంకటాచలం మీద అగస్త్య ముని మరియు శంఖ అనే రాజు నారాయణుని కొరకు తపస్సు చేస్తున్నారు. మీరు అగస్త్య ముని వద్దకు వెళ్ళండి. అక్కడ మీకు నారాయణుని దర్శనం కలుగును" అని తెలిపెను. అప్పుడు దేవతలు వేంకటాచలం వచ్చి అగస్త్య మునిని దర్శించి బ్రహ్మ దేవుడు తెలిపినది వివరించిరి. అగస్త్య ముని దేవతలతో పాటు శంఖ రాజును కలుసుకున్నాడు. శంఖ రాజు మునులకు, దేవతలకు ప్రణామాలు చేసి అతిథి సేవలు చేశాడు.

శంఖ, అగస్త్య ముని మరియు దేవతలందరు కలిసి నారాయణుని కొరకు ప్రార్థనలు చేశారు. వారి ప్రార్థనలకు సంతోషించిన నారాయణుడు గరుడుని మీద వచ్చి దర్శనమిచ్చాడు. అందరూ నారాయణునికి ప్రణామాలు చేసి స్తుతించారు. నారాయణుడు అగస్త్య మునిని వరం కోరుకోమనగా అగస్త్య ముని "నేను ఎల్లప్పుడూ నీ భక్తి కలిగి ఉండేలా మరియు నీవు ఈ పర్వతం మీదనే ఉండి సమస్త జీవులకు దర్శనం ఇస్తూ ఉండేలా" వరం కోరాడు. నారాయణుడు "నీ కోరిక ప్రకారం నేను ఇక్కడే ఉంటాను" అని వరం ఇచ్చాడు. నారాయణుడు శంఖతో "నీ భక్తికి, తపస్సుకు మెచ్చాను. నీవు కూడా

ఏదైనా వరం కోరుకో" అన్నాడు. శంఖ "ఎల్లప్పుడూ మీ భక్తిని కలిగి ఉండేటట్లు వరం ఇవ్వమని" కోరాడు. నారాయణుడు శంఖ రాజుతో "నీ కోరిక తీరును" అని వరం ఇచ్చెను. అగస్త్య ముని కోరిక మేరకు నారాయణుడు వేంకటాచలంలో నివసించెను.

పద్మావతి దేవి జన్మ

నారాయణపురమును శాఖ వంశంలోని మిత్రవర్మ అనే రాజు పరిపాలిస్తుండెను. మిత్రవర్మ భార్య పేరు మనోరమ. వీరికి ఆకాశ రాజు అనే ఒక కుమారుడు జన్మించెను. ఆకాశ రాజు భార్య ధరణి దేవి. వీరికి పుత్రులు లేనందువలన పుత్రకామేష్ఠి యజ్ఞం కోసం భూమిని దున్నుచుండగా ఒక బాలిక లభించింది. ఆకాశ రాజు ఆ బాలికను పద్మావతి దేవి అనే పేరుతో పెంచుకున్నాడు. ఆ బాలిక కృప వలన ఆకాశ రాజుకు ఒక పుత్రుడు కూడా జన్మించాడు. అతని పేరు వసుదాసుడు.

ఒకరోజు పద్మావతి దేవి తన సఖులతో పూల తోటలో విహరిస్తున్నప్పుడు నారద ముని అక్కడకు వచ్చెను. పద్మావతి దేవి మరియు ఆమె యొక్క సఖులు నారద మునికి ప్రణామాలు చేశారు. నారద ముని పద్మావతి దేవిని "నీవు ఎవరని" అడుగగా పద్మావతి దేవి తన గురించి తెలిపి తన భవిష్య జాతకాన్ని తెలుపమని కోరింది. నారద ముని "నీవు లక్ష్మీ దేవి వలె ఉన్నావు. నీలో లక్ష్మీ దేవిలో ఉన్న గుణాలు ఉన్నాయి. నిన్ను నారాయణుడు వివాహం చేసుకుంటాడు" అని పద్మావతి దేవికి తెలిపి వెళ్లిపోయెను.

వేంకటేశ్వర స్వామి పద్మావతి దేవిని కలుసుకోవడం

ఒకసారి వేంకటేశ్వర స్వామి (నారాయణుడు) తెల్లని గుర్రం మీద జంతువులను వేటాడుతూ పద్మావతి దేవి ఉన్న పూల వనంలోనికి వెళ్లెను. వేంకటేశ్వర స్వామిని చూడగానే వనంలోని స్త్రీలందరూ ఆశ్చర్యపోయారు. వేంకటేశ్వర స్వామి పద్మావతి దేవి సఖుల వద్దకు

వచ్చి "ఇక్కడికి తోడేలు వచ్చిందా?" అని అడిగెను. అందుకు వారు "నీవు ధనుస్సును ధరించి ఈ వనానికి ఎందుకు వచ్చావు? ఇక్కడ ఎలాంటి హింసకు తావు లేదు. ఆకాశరాజు రక్షణలో ఉన్న ఈ వనం నుండి నీవు వెంటనే వెళ్ళిపో!" అన్నారు. వేంకటేశ్వర స్వామి గుర్రం నుండి దిగి ఆ స్త్రీలతో "మీరందరూ ఎవరు? ప్రత్యేకించి కమలం వంటి కన్నులు గల ఈ సుందరి ఎవరు?" అని అడిగెను. అప్పుడు వారు "ఓ సుందర పురుషుడా! ఈ అమ్మాయి పేరు పద్మావతి దేవి. ఈమె ఆకాశరాజుకు కుమార్తె మరియు భూదేవికి పుత్రిక. మేమందరం ఈ పద్మావతి దేవి దాసీలము" అని తెలిపి "ఇంతకు నీవు ఎవరు? ఎక్కడ ఉంటావు?" అని అడిగిరి.

అప్పుడు వేంకటేశ్వర స్వామి "నా పేరు అనంత. తపస్సు చేసే యోగులు నన్ను కృష్ణ అని అంటారు. నా వద్ద ఉన్న ధనుస్సు దేవతల వద్ద కూడా లేదు. వేంకటాచలం మీద ఉండే వారు నన్ను వేంకటాచల స్వామి అని అంటారు. నేను జంతువులను వేటాడుతూ ఈ వనంలోకి వచ్చి ఈ సుందరాంగిని చూశాను. ఈ సుందరి నన్ను వివాహం చేసుకొనగలదా!" అని అడిగెను. ఈ మాటలు విన్న సఖులందరూ కోపంతో చూడగానే వేంకటేశ్వర స్వామి గుర్రాన్ని ఎక్కి వేంకటాచలంపైకి వెళ్లెను.

పద్మావతి దేవి పూర్వజన్మ

వరాహ స్వామికి మరియు వేంకటేశ్వర స్వామికి సేవలు చేసే వకుళమాత స్వామి వద్దకు వచ్చి "దేవాదిదేవా! భోజనం తయారు అయ్యింది, స్వీకరించండి" అని అనెను. వేంకటేశ్వర స్వామి వకుళమాతతో "నేను రామావతారంలో సీతతో పాటు వనవాసంలో ఉన్నప్పుడు రావణాసురుడు సీతను ఎత్తుకుపోవడానికి వచ్చెను. అప్పుడు అగ్ని దేవుడు సీతను తన భార్య స్వాహా దేవి వద్ద ఉంచి తన వద్ద ఉన్న వేదవతిని పర్ణశాలలో ఉంచెను. వేదవతిని సీత అనుకొని రావణాసురుడు అపహరించాడు.

"నేను రావణాసురుని సంహరించిన తరువాత సీత స్థానంలో ఉన్న వేదవతి అగ్నిప్రవేశం చేసినప్పుడు అగ్నిదేవుడు తన ఇంటిలో ఉన్న సీతతో పాటు వచ్చి సీతను నాకు అప్పగించి 'ఓ శ్రీరామా! ఈ వేదవతి మీకోసం తపస్సు చేసింది. ఈమె మిమ్మల్ని వివాహం చేసుకోవాలనుకుంటుంది కనుక ఈమెను వివాహమాడండి' అని ప్రార్థించెను. సీత కూడా అదే కోరికను తెలియజేయగా నేను వారితో 'ఈ అవతారంలో ఒకే భార్యను స్వీకరిస్తానని ప్రతిజ్ఞ చేసినందువలన వేదవతిని ఇప్పుడు వివాహం చేసుకోలేనన్నాను.' తరువాత నేను వేదవతితో 'నిన్ను కలియుగంలో నేను వివాహం చేసుకుంటాను. నీవు అప్పటివరకు బ్రహ్మ లోకంలో ఉండమని' అన్నాను. పుత్రకామేష్ఠి యజ్ఞం చేసేటప్పుడు ఆకాశరాజుకు భూమి నుండి లభించిన ఈ పద్మావతియే ఆ వేదవతి. కావున నీవు వెళ్లి పద్మావతిని చూసి వివాహం గురించి అడిగిరమ్మని" తెలిపెను. దానికి అంగీకరించిన వకుళ మాత వేంకటేశ్వర స్వామికి ప్రణామాలు చేసి ఎర్రని గుర్రాన్ని ఎక్కి స్వామి తెలిపిన మార్గంలో బయలుదేరింది.

వకుళమాత పద్మావతి దేవి సఖులను కలుసుకోవడం

దారిలో ఉన్న అగస్త్యేశ్వరుని (శివుడిని) దర్శించి వకుళమాత విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు పద్మావతి దేవి సఖులు అక్కడకు వచ్చిరి. వకుళమాత వారి వద్దకు వెళ్లి "ఓ సుందరమైన స్త్రీలారా! మీరు ఎవరు? ఎక్కడి నుండి వచ్చారు? ఈ మందిరంలో మీకు ఏమి పని?" అని ప్రశ్నించెను. ఆ స్త్రీలు "మేము ఆకాశరాజు పుత్రిక పద్మావతి దేవికి దాసీలము. మేము పద్మావతి దేవితో కలసి పూల తోటలో పూలు కోయుచుండగా అక్కడికి ఒక సుందర పురుషుడు తెల్లని గుర్రం మీద జంతువులను వేటాడుతూ వచ్చెను. అతను పద్మావతి దేవిని చూసి వివాహం చేసుకుంటానని అన్నాడు. మేమందరం ఆ పురుషుని కోపంతో చూడగానే అతను వెళ్ళిపోయాడు. ఆ సుందరుడు వెళ్ళగానే పద్మావతి దేవి స్పృహ తప్పి పడిపోయింది.

"మేము పద్మావతి దేవిని వెంటనే ఆకాశరాజు వద్దకు తీసుకు వెళ్ళాము. ఆకాశరాజు బ్రాహ్మణులను రప్పించి 'పద్మావతి ఎందుకు మూర్ఛ పోయింది?' అని అడిగెను. అందులో ఒక బ్రాహ్మణుడు తన దివ్యదృష్టితో పూల తోటలో జరిగింది తెలిపి 'ఓ రాజా! పద్మావతి దేవి వివాహం ఆ పురుషునితోనే జరుగుతుంది' అని తెలిపెను. రాజు బ్రాహ్మణులతో 'శంకరుని మందిరంలో అభిషేకం చేయండి' అని తెలిపి, మాతో అభిషేకానికి కావలసిన సామాగ్రిని సిద్ధం చేయమని' ఆదేశించెను. మేము రాజాజ్ఞ మేరకు అభిషేకానికి కావలసిన వస్తువులను మందిరానికి తీసుకువచ్చాము. ఇంతకు మీరు ఎవరు? ఎక్కడ ఉంటారు?" అని వకుళమాతను అడిగిరి. వకుళమాత "నేను వేంకటాచలంపై ఉంటాను. అక్కడ నారాయణుని సేవ చేస్తూ ఉంటాను. ధరణి దేవిని దర్శించుటకు వచ్చాను. నాకు ధరణి దేవి దర్శనం కలుగుతుందా?" అని అడిగెను. సఖులు "నీవు మాతోపాటు వచ్చి ధరణి దేవిని కలుసుకోవచ్చు" అన్నారు. వకుళమాత వారితోపాటు బయలుదేరింది.

వకుళమాత పద్మావతి దేవి సఖులతో పాటు వస్తున్నప్పుడు రాజభవనం వద్ద ఒక అడవి జాతి స్త్రీ ధరణి దేవి వినేటట్లు "నాకు భూత భవిష్యత్తులు తెలుసు" అని అందరికీ చెబుతుంది. ధరణి దేవి, ఆ అడవి జాతి స్త్రీని పిలిచి ఆమె చూడనప్పుడు రంగు నీటిలో ఒక ముత్యమును వేసి ఇందులో ఏముందో తెలుపమన్నది. అడవి జాతి స్త్రీ ఇందులో ముత్యం ఉన్నదని తెలిపింది. ధరణి దేవి "నిజమే! ఈమెకు భూత భవిష్యత్తులు తెలుస్తాయి" అని అనుకుని పద్మావతి దేవి వద్దకు తీసుకువెళ్లి తన పుత్రిక గురించి తెలుపమన్నది. అడవి జాతి స్త్రీ వనంలో జరిగిన విషయాలు తెలిపి "ఆ పురుషుడు నారాయణుడు. ఆ నారాయణునికి నీ పుత్రిక పద్మావతి దేవిని ఇచ్చి వివాహం చేయుము. అప్పుడు నీ పుత్రిక మనోవ్యాధి నయమవుతుంది" అని తెలిపి వెళ్ళిపోయింది.

వకుళమాత ధరణి దేవిని కలుసుకోవడం

వకుళమాత పద్మావతి దేవి సఖులతోపాటు వచ్చి ధరణి దేవిని కలుసుకొన్నది. ధరణి దేవి అతిథి సేవలు చేసి “మీరు ఎవరు? ఎక్కడ ఉంటారు? ఇక్కడకు వచ్చిన కారణమేమిటి?” అని వకుళమాతను అడిగెను. వకుళమాత ధరణి దేవితో “నేను వేంకటాచలంపై నారాయణుని సేవ చేస్తూ ఉంటాను” అని తెలిపి, నారాయణుడు పద్మావతి దేవిని చూసిన విధానాన్ని కూడా తెలిపి “నీ పుత్రికను నారాయణుడు వివాహం చేసుకోవాలని అనుకుంటున్నాడు. మీ అభిప్రాయాన్ని తెలుసుకొని రమ్మని నన్ను పంపాడు” అని తెలిపినది.

ధరణి దేవి నా భర్తను అడిగి తెలుపుతానని వకుళమాతకు తెలిపి ఆకాశ రాజు వద్దకు వెళ్లి జరిగినదంతా వివరించింది. ఆకాశ రాజు వకుళమాత వద్దకు వెళ్లి “నారాయణుడు నా పుత్రికను వివాహం చేసుకోవడం నా పుత్రిక యొక్క అదృష్టం” అని అన్నాడు. తరువాత మంత్రులతో, బ్రాహ్మణులతో “పద్మావతి దేవి వివాహం గురించి మీ అభిప్రాయం ఏమిటి?” అని ఆకాశ రాజు అడిగెను.

వారందరూ ఒప్పుకొని బృహస్పతిని పిలిచి వివాహ ముహూర్తాన్ని ఏర్పాటు చేయమన్నారు. వారి కోరిక మేరకు ఆకాశ రాజు బృహస్పతిని పిలిచి వివాహ ముహూర్తం చూడమని అర్థించెను. బృహస్పతి వైశాఖ మాసంలో (ఏప్రిల్, మే నెలలలో) వచ్చే ఉత్తర ఫల్గుణి నక్షత్రంలో వివాహ ముహూర్తమును నిశ్చయించాడు. ఆకాశరాజు వకుళమాతతో “బృహస్పతి నిర్ణయించిన ముహూర్తానికి నారాయణుని వచ్చి నా పుత్రికను వివాహం చేసుకొమ్మని” తెలిపి వకుళమాతను పంపించెను.

పద్మావతి దేవి వేంకటేశ్వర స్వామి వివాహం

ఆకాశరాజు తన పుత్రుడు వసుదాసుని బ్రహ్మ, శివ, ఇంద్ర, చంద్ర మరియు సూర్య మొదలైన పదునాలుగులోక వాసులందరిని

వివాహానికి ఆహ్వానించమని పంపాడు. విశ్వకర్మను పిలిపించి నగరాన్ని అలంకరించమని తెలిపెను. వివాహానికి దేవతలందరూ వచ్చారు. ఆకాశరాజు చంద్రునితో నారాయణునికి ఇష్టమైన వంటలను చేయమని తెలిపి, ఇతర దేవతలను ఇతర పనులలో నియమించెను. వివాహ సమయానికి వేంకటేశ్వర స్వామి గరుడునిపై లక్ష్మీ దేవితో పాటు వచ్చెను. పద్మావతి దేవి ఏనుగు మీద అంతఃపురం నుండి బయటకు వచ్చి వేంకటేశ్వర స్వామిని దర్శించి ప్రణామాలు చేసింది. వేంకటేశ్వర స్వామి తన మెడలోని మాలను పద్మావతి దేవి మెడలో వేసెను. పద్మావతి దేవి తన చేతిలో ఉన్న పూల మాలను వేంకటేశ్వర స్వామి మెడలో వేసింది. తరువాత ఇద్దరు వాహనాలను దిగి పెండ్లి మండపంలోనికి వెళ్లారు. బ్రహ్మ దేవుడు పెండ్లి మంత్రాలను చదివి పద్మావతి దేవి వేంకటేశ్వర స్వామి వివాహం చేసెను.

ఆకాశ రాజు తన పుత్రిక పద్మావతి దేవికి అనేకమైన కానుకలను ఇచ్చెను. తరువాత దేవతలతో "మీరందరూ మీ మీ లోకాలకు వెళ్ళమని" తెలిపెను. దేవతలు వేంకటేశ్వర స్వామిని మరియు పద్మావతి దేవిని స్తుతించి ప్రదక్షిణ నమస్కారాలు చేసి తమ తమ లోకాలకు వెళ్లిపోయారు. వేంకటేశ్వర స్వామి వేంకటాచలంలో పద్మావతి దేవి మరియు లక్ష్మీ దేవితో నివసించసాగెను.

వసు మరియు తొండమానుల చరిత్ర

వసు అనే నిషాద జాతికి చెందిన నారాయణుని యొక్క భక్తుడు వేంకటాచలంపై ఉండేవాడు. వేంకటాచల పర్వతాన్ని మరియు చెట్లను వసు రక్షిస్తూ ఉంటాడు. ఇతను ప్రతిరోజూ అన్నాన్ని వండి అందులో తేనెను కలిపి వేంకటేశ్వర స్వామికి నైవేద్యం సమర్పించేవాడు. ఒకరోజు అన్నమును వండి తేనె కోసం తన భార్యతో అడవికి వెళుతూ తన కుమారునితో 'అన్నమును రక్షిస్తూ ఉండమని' తెలిపెను. వసు వెళ్లిన కొద్దిసేపటికి వసు కుమారుడైన

వీరు అన్నాన్ని కొంత అగ్నిలో సమర్పించి కొంత చెట్టు క్రింద వేంకటేశ్వర స్వామికి నివేదించి మిగిలింది తాను తినెను. వసు తేనెను తీసుకువచ్చేసరికి అక్కడ అన్నం లేకపోవడం చూసి వీరును అడగగా, తానే ఆ అన్నమును తిన్నానని వీరు తెలిపెను. వేంకటేశ్వర స్వామికి నివేదించకుండా వీరు అన్నమును తిన్నాడని భావించిన వసు కత్తితో వీరును సంహరించడానికి వెళ్ళెను. వేంకటేశ్వర స్వామి వెనుక నుండి వసు చేతిని పట్టుకొని “నీకంటే నీ కుమారుడు ఉన్నతమైన భక్తుడు. నాకోసం అన్నాన్ని చెట్టు దగ్గర నివేదన చేసిన తరువాతే మిగిలినది తినెను” అని శాంతింపజేసెను.

చంద్రవంశంలో తొండమానుడు అనే ఒక రాజు ఉండెను. తొండమానుని తండ్రి సుధీరుడు, తల్లి నందిని. తొండమానుడు ఐదు సంవత్సరాల వయసు నుండే నారాయణుని పట్ల భక్తి కలిగి ఉన్నాడు. ఇతడు పాండ్య దేశపు రాజకుమార్తె పద్మను వివాహం చేసుకున్నాడు ఇంకా వందలాది రాజకుమార్తెలను స్వయంవరంలో వివాహం చేసుకొని నారాయణపురంలో నివసిస్తుండెను. ఒక రోజు తొండమానుడు వేట కోసం వేంకటాచల పర్వతంపై ఒక ఏనుగును తరుముతుండగా ఐదు రంగులలో ఉన్న ఒక రామచిలుక కనబడింది. ఆ రామచిలుకను పట్టుకోవాలని వెంబడించగా అది “శ్రీనివాస శ్రీనివాస” అంటూ తప్పించుకుంది. తొండమానుడు ఆ రామచిలుకను వెతుకుతూ వేంకటాచల పర్వతాన్ని రక్షించే వసును చూసెను. తొండమానుడు రామచిలుక గురించి తెలిపి “నీవు ఆ రామచిలుకను చూశావా!” అని వసును అడిగెను.

వసు “ఆ రామచిలుకను లక్ష్మీ దేవి పోషించి పెద్ద చేసింది. ఆ లక్ష్మీవేంకటేశ్వరులకు ఎంతో ప్రియమైన ఆ రామచిలుక ఎల్లప్పుడూ స్వామి పుష్కరిణి వద్దనే ఉంటుంది” అని తెలిపి “నాకు వేంకటేశ్వర స్వామిని పూజించే వేళ అయినది. నేను స్వామిని పూజించి వచ్చేదాకా ఇక్కడే ఉండండి” అని తెలిపి వెళ్ళసాగెను. అప్పుడు తొండమానుడు “నేను కూడా నీ వెంట వచ్చి వేంకటేశ్వర స్వామిని దర్శిస్తాను” అని

అన్నాడు. వసు అంగీకరించి అతనిని వేంకటేశ్వర స్వామి వద్దకు తీసుకువెళ్లాడు. ఇద్దరూ వేంకటేశ్వర స్వామికి నమస్కారాలు చేశారు. వసు సమర్పించిన అన్నాన్ని వేంకటేశ్వర స్వామి స్వీకరించాడు. తొండమానుడు వేంకటేశ్వర స్వామిని స్తుతించి తన రాజ్యానికి వెళ్లెను. అప్పటి నుండి తొండమానుడు వేంకటేశ్వర స్వామిని దర్శిస్తూ సేవిస్తూ ఉండెను.

వీరశర్మ అనే బ్రాహ్మణుడు తన భార్య లక్ష్మితో గంగా స్నానం చేయడానికి ప్రయాణమయ్యెను. గర్భవతిగా ఉన్న తన భార్య నడవలేకపోతున్నందువలన వీరశర్మ తొండమానుని వద్దకు వెళ్లి తన పరిస్థితిని వివరించి “నేను గంగానదిలో స్నానం చేసి ఆరు నెలలలోగా తిరిగి వస్తాను. అప్పటివరకు నా భార్య లక్ష్మికి ఆశ్రయం కల్పించమని” అడిగెను. తొండమానుడు అందుకు అంగీకరించి ఆ బ్రాహ్మణుని భార్యకు ఒక గదిలో విడిది ఏర్పాటు చేసి ఆరు నెలలకు సరిపడే ఆహార ధాన్యాలను అమర్చాడు. వీరశర్మ గంగా నది వద్దకు వెళ్లి స్నానం చేసి అక్కడి నుండి కాశీ, అయోధ్య, బదరికాశ్రమం వంటి తీర్థయాత్రలు కొనసాగిస్తూ రెండు సంవత్సరాల తరువాత తొండమానుని వద్దకు తిరిగి వచ్చెను. వీరశర్మ తన తీర్థయాత్రల విశేషాలు తెలిపి తన భార్య ఎలా ఉన్నదని తొండమానుని అడిగెను. తొండమానుడు బ్రాహ్మణునితో “మీరు ఇక్కడే ఉండండి” అని తెలిపి బ్రాహ్మణ స్త్రీ ఉన్న గది వద్దకు వెళ్లి చూడగా ఆమె పుత్రునితో పాటు మరణించి ఉన్నది. తొండమానుడు సొరంగం మార్గం ద్వారా వేంకటేశ్వర స్వామి వద్దకు వెళ్లి జరిగినది తెలిపి తనను రక్షించమని ప్రార్థించెను. వేంకటేశ్వర స్వామి “వీరశర్మ భార్య లక్ష్మిని, నీ భార్యలతో పల్లకిలో తీసుకువచ్చి వేంకటాచలంలో గల అస్తి సరోవరంలో స్నానం చేయిస్తే ఆమె బ్రతుకుతుంది” అని తెలిపెను. తొండమానుడు అలా చేయగా లక్ష్మి మరియు ఆమె కుమారుడు తిరిగి జీవించారు. తొండమానుడు వారిని తీసుకువెళ్లి వీరశర్మకు అప్పగించాడు.

భక్త భీముడు

తొండమానుడు వేంకటేశ్వర స్వామి ఆజ్ఞ ప్రకారం బంగారు పద్మాలను తయారు చేసి స్వామిని పూజిస్తుండెను. ఇదే సమయంలో కురుమ అనే గ్రామంలో నివసించే కుమ్మరి భీముడు వేంకటేశ్వర స్వామిని దర్శించి తనకు మోక్షాన్ని ప్రసాదించమని ప్రార్థించాడు. వేంకటేశ్వర స్వామి భీమునితో “ప్రతిరోజు నన్ను భక్తితో పూజింపుము తొండమానుడు నిన్ను కలుసుకున్నప్పుడు నీకు మోక్షం ప్రాప్తిస్తుంది” అని తెలిపాడు. కుమ్మరి భీముడు తన ఇంట్లోనే మట్టితో వేంకటేశ్వర స్వామి విగ్రహాన్ని తయారు చేసి, మట్టితో పద్మాలను, తులసి దళాలను చేసి పూజిస్తుండెను. ఒకరోజు మట్టితో చేసిన పువ్వులు, తులసి దళాలు వేంకటేశ్వర స్వామి పాదాలపై ఉండడం తొండమానుడు చూశాడు. వేంకటేశ్వర స్వామితో “స్వామీ! ఎవరు మిమ్మల్ని ఈ మట్టి పువ్వులతో, తులసి దళాలతో పూజించారు?” అని అడిగెను. వేంకటేశ్వర స్వామి భక్త భీముని గురించి తెలిపెను. తొండమానుడు భీముని ఇంటికి వెళ్లి భీమునికి ప్రణామాలు చేసి జరిగినదంతా వివరించెను. ఆ సమయంలో వేంకటేశ్వర స్వామి లక్ష్మీ దేవితో గరుడుని మీద వచ్చి భీమునికి దర్శనం ఇచ్చి అతనితోపాటు అతని భార్యను కూడా వైకుంఠానికి విమానంలో తీసుకువెళ్లాడు. తొండమానుడు తన కుమారుడైన శ్రీనివాసునికి తన రాజ్యాన్ని అప్పగించి వేంకటాచలం వెళ్లి జీవితాంతం అక్కడే వేంకటేశ్వర స్వామికి సేవ చేసి వైకుంఠానికి వెళ్లెను.

తొండమానుని పూర్వజన్మ

రంగదాసు అనే ఒక భక్తుడు తీర్థయాత్రలు చేస్తూ వేంకటాచలం వెళుతుండగా దారిలో వైఖానస అనే బ్రాహ్మణునితో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ వేంకటాచలం వచ్చి వేంకటేశ్వర స్వామిని దర్శించి అక్కడే ఉండి సేవ చేస్తూ ఉండిరి. రంగదాసు పూల మొక్కల కోసం ఒక బావిని త్రవ్వెను. పూల మొక్కల కోసం త్రవ్వినందుకు ఆ బావికి పూల బావి అని పేరు వచ్చింది. ఆ నీటితో మల్లిక, కన్నేరా,

ఆజా, కుందా, మందార, మాలతి, కమలం, గులాబీ మరియు మల్లె వంటి సుగంధభరిత పూల తోటలను, తులసి తోటను పెంచెను. పూల మాలలను, తులసి మాలలను తయారు చేసి ప్రతిరోజూ రంగదాసు వైఖానస బ్రాహ్మణునికి ఇచ్చేవాడు. వైఖానసుడు ఆ మాలలను వేంకటేశ్వర స్వామికి, లక్ష్మీ దేవికి మరియు పద్మావతి దేవికి సమర్పించేవాడు.

ఒక రోజు ఒక గంధర్వుడు తన భార్యలతో కలిసి వేంకటాచలం వచ్చి వేంకటేశ్వర స్వామిని దర్శించి పూజించెను. తరువాత అక్కడి కోనేరులో తన భార్యలతో అతడు స్నానం చేస్తుండగా రంగదాసు వారిని కామంతో చూశాడు. తరువాత తన మనసును స్థిరపరుచుకొని పూలమాలలను తయారుచేసుకొని వైఖానసునికి ఇచ్చెను. వైఖానసుడు "ఎందుకు ఇంత ఆలస్యం అయ్యిందని" అడగగా రంగదాసు సమాధానం ఇవ్వలేదు. కోనేరు వద్ద జరిగిన విషయం వేంకటేశ్వర స్వామి వైఖానసునికి వివరించిన తరువాత రంగదాసుతో "నీవు నా మాయకు లోనైన కారణంగా ఈ జన్మలో నాసేవను చేసి వచ్చే జన్మలో రాజుగా జన్మించి ఇంద్రియ భోగాలను అనుభవించిన తరువాత నా యొక్క భక్తి సాధన చేసి వైకుంఠానికి వెళతావు" అని తెలిపెను. ఆ రంగదాసే వేంకటేశ్వర స్వామికి వంద సంవత్సరాలు సేవ చేసి తన శరీరాన్ని వదిలాక చంద్ర వంశంలో సుధీరుడు మరియు నందిని అనే దంపతులకు తొండమానుడిగా జన్మించెను.

3

శ్రీ వేంకటేశ్వర స్వామి మందిరంలోని సేవలు – దర్శనీయ స్థలాలు

ప్రధాన గోపురం

ఆలయ ప్రధాన గోపురం 50 అడుగుల ఎత్తు ఉంటుంది. ఈ గోపురాన్ని పడికావలి, సింహద్వారం మరియు ముఖద్వారం అని కూడా అంటారు. ఈ గోపురం బయట నుండి వేంకటేశ్వర స్వామికి ప్రదక్షిణ చేస్తారు. ఈ ప్రదక్షిణను మహా ప్రదక్షిణ అని అంటారు. ఈ ప్రదక్షిణ మార్గంలో తిరుమలనంబి మందిరం (ఇల్లు), అనంతాచార్య సమాధి, ఇల్లు, పూలతోట బావి, వరాహ స్వామి మందిరం మరియు స్వామిపుష్కరిణి వస్తాయి. ఈ ప్రదక్షిణ మార్గంలోనే వేంకటేశ్వర స్వామికి ఉత్సవాలు మరియు ఊరేగింపులు చేస్తారు. ఈ ప్రదక్షిణ మార్గంలోని స్థలం 16 ఎకరాలు ఉంటుంది.

ఈ గోపురం నుండే వేంకటేశ్వర స్వామి దర్శనానికి మరియు బయటకు దారి ఉంటుంది. ఇక్కడ ఉండే విగ్రహాలను 'శంఖనిధి' మరియు 'పద్మనిధి' అని అంటారు. ఒకరు శంఖాలను ఒకరు పద్మాలను పట్టుకున్నందువలన వారికి ఆ పేర్లు వచ్చాయి. అనంతాచార్య వేంకటేశ్వర స్వామిపై విసిరిన గునపమును గోపురం గోడకు వ్రేలాడదీశారు. భక్తులు వేంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు వెళ్లేటప్పుడు కుడి ప్రక్కన 'అనంతాచార్య గునపము' అని రాసి ఉంటుంది. ఆ గునపమును ఇప్పటికీ మనం దర్శించవచ్చు.

ప్రధాన గోపురం లోపలి నుండి వేంకటేశ్వర స్వామికి ప్రదక్షిణ చేస్తారు. ఈ ప్రదక్షిణ మార్గంలో సంపంగి చెట్టు ఉండేది. అందువలన 'సంపంగి ప్రదక్షిణ' అని పేరు వచ్చింది. సంపంగి

ప్రదక్షిణ మార్గంలోనే లడ్డూల తయారీ కోసం చక్కెర, శనగపప్పు, శనగపిండి, బెల్లం, కర్పూరం, చందనం, జీడిపప్పు మరియు ద్రాక్ష మొదలగు వస్తువులను నిలువ చేస్తారు. ఇక్కడే లడ్డూలు తయారు చేసే వంటగది కూడా ఉన్నది. వంటశాల దగ్గర బావి ఉన్నది. ఈ బావి నీటిని వంటకు ఉపయోగిస్తారు. అద్దాల మండపం, శ్రీరంగ మండపం, తిరుమలరాయ మండపం, కల్యాణ మండపం, ధ్వజ స్తంభం మరియు పూలబావి ఈ సంపంగి ప్రదక్షిణ మార్గంలో కనిపిస్తాయి.

అద్దాల మండపం

అద్దాల మండపంలో మధ్యాహ్నం 12 గంటలకు శ్రీదేవి–భూదేవి సమేత శ్రీమలయప్పస్వామిని ఉయ్యాలలో ఉంచి ఉయ్యాలను ఊపుతారు. దీనినే 'డోలోత్సవం' అని అంటారు. ఉయ్యాలను ఊపే సమయంలో వేదాలను చదువుతారు. ఆ తరువాత పంచదార, కొబ్బరి, నెయ్యి మరియు నువ్వులు లేదా జీడిపప్పులతో చేసిన 'పంచకజ్జాయం' అనే మధుర పదార్థాన్ని నివేదన చేసి హారతిని ఇస్తారు.

శ్రీరంగ మండపం

మహమ్మదీయుల దాడికి భయపడి 1320 నుండి 1360 వరకు శ్రీరంగంలోని శ్రీరంగనాథుని ఉత్సవ విగ్రహాన్ని వేంకటేశ్వర స్వామి మందిరంలోనే ఉంచి పూజించారు. శ్రీరంగనాథ స్వామిని ఉంచి పూజించినందువలన ఈ మండపానికి 'శ్రీరంగ మండపం' అని పేరు వచ్చింది. దీపావళి సమయంలో నెల రోజుల పాటు శ్రీవేంకటేశ్వర స్వామి యొక్క ఉత్సవ విగ్రహమైన శ్రీ మలయప్ప స్వామి శ్రీదేవి–భూదేవి సమేతంగా శ్రీరంగ మండపంలో ఉండి పూజలను స్వీకరిస్తారు.

తిరుమలరాయ మండపం

తిరుమలరాయ మండపం శ్రీరంగ మండపం ప్రక్కనే ఈ మండపాన్ని తిరుమలరాయ అనే రాజు కట్టించినందువల్ల ఈ

మండపానికి తిరుమలరాయ మండపం అని పేరు వచ్చింది. బ్రహ్మోత్సవాలలో శ్రీమలయప్ప స్వామి శ్రీదేవి–భూదేవి సమేతంగా వచ్చి ఇక్కడ సేవలను స్వీకరిస్తాడు. ప్రతిరోజూ వేంకటేశ్వర స్వామి కోసం ఉదయం 6 గంటల నుండి 6:30 వరకు మరియు సాయంత్రం 5:30 నుండి 6 గంటల వరకు ఇక్కడ మంగళ వాయిద్యాలు వాయిస్తారు.

కల్యాణ మండపం

ప్రతిరోజు మధ్యాహ్నం 12 గంటల నుండి దాదాపుగా ఒక గంట సమయం వేంకటేశ్వర స్వామికి కల్యాణోత్సవము ఈ మండపంలోనే జరుగుతుంది. ఈ ఉత్సవాన్ని 'నిత్యకల్యాణం' అని అంటారు. ఈ మండపంలోనే సంవత్సరానికి ఒకసారి పవిత్రోత్సవం, పుష్పయాగం మరియు జ్యేష్ఠాభిషేకం వంటి ఉత్సవాలు కూడా జరుగుతాయి.

పువ్వుల గది

వేంకటేశ్వర స్వామికి ప్రతిరోజూ సమర్పించే పూల మాలలను ఈ గదిలోనే తయారు చేస్తారు. స్వామికి ప్రతిరోజు 14 పూల మాలలు సమర్పిస్తారు. ఉదయం సమర్పించిన పూలమాలలను సాయంత్రం తొలగించి క్రొత్తవి సమర్పిస్తారు. స్వామికి నిత్యమూ అలంకరించబడే 14 పూల మాలలు:

1. కిరీటం మీదుగా రెండు భుజాలకు అలంకరింపబడే ఎనిమిది మూరల మాల.
2. స్వామివారి భుజాల నుండి ఇరువైపులా పాదాల వరకు వ్రేలాడుతూ ఉండే సాలిగ్రామాల మాలల వరకు అలంకరింపబడే నాలుగు మూరలు ఉండే రెండు మాలలు.
3. మెడలో నుండి రెండు భుజాల మీదకు అలంకరింపబడే మూడున్నర మూరల మాల.
4. స్వామివారి వక్ష స్థలంలో ఉన్న శ్రీదేవి–భూదేవిలకు ఒకటిన్నర మూరలు ఉన్న రెండు మాలలు.

5. స్వామి వారి చేతిలో ఉన్న శంఖచక్రాలకు ఒక మూర ఉన్న రెండుమాలలు.
6. స్వామివారి నడుముకు ఉన్న నందక ఖడ్గానికి రెండు మూరల మాల.
7. నడుము నుండి పాదాల వరకు వ్రేలాడదీసే మూడు దండల కొలతలు: మూడు మూరలు, మూడున్నర మూరలు మరియు నాలుగు మూరలు.
8. స్వామివారి పాదాల చుట్టూ అలంకరించే రెండు మూరలు ఉన్న రెండు మాలలు.
9. స్వామివారి మెడ నుండి మోకాళ్ల వరకు ఒక మాల మరియు తులసి మాల.

ప్రతి గురువారం సాయంత్రం జరిగే 'పూలంగి' (పుష్ప) సేవలో మాత్రమే స్వామివారి ఆభరణాలన్నీ తొలగించి పైన తెలిపిన మాలలతో పాటు నిలువెల్ల వేంకటేశ్వర స్వామిని విశేషంగా పూలమాలలతో అలంకరిస్తారు.

వీటితోపాటుగా వేంకటేశ్వర స్వామి ఉత్సవమూర్తులకు మరియు మందిరంలోని వివిధ అర్చామూర్తులకు ఈ గదిలోనే పూలమాలలు తయారు చేస్తారు.

సంపంగి చెట్టు మరియు చింత చెట్టు

రామానుజాచార్య ఈ చెట్లను పూజించారు. అనంతాచార్య వ్రాసిన 'శ్రీ వేంకటేశ్వర ఇతిహాస మాల' అనే గ్రంథంలో సంపంగి చెట్టు పువ్వులను వేంకటేశ్వర స్వామి పూజకు వాడినట్లు వ్రాశారు. తొండమానుడు ఆలయ ప్రాకారాలను నిర్మించే సమయంలో సంపంగి చెట్టును మరియు చింత చెట్టును తీసివేయవద్దని వేంకటేశ్వర స్వామి తెలిపాడు. అయినా యాత్రికుల రద్దీ వలన ఇప్పుడు ఆ చెట్లను దేవస్థానం వారు తీసివేశారు. వేంకటేశ్వర స్వామి వైకుంఠం నుండి

లక్ష్మీ దేవిని వెతుకుతూ భూమి మీదకు వచ్చి ఈ చింత చెట్టు క్రింద ఉన్న పుట్టలో చాలా కాలం ఉన్నారు.

పూలబావి

పూల బావి అద్దాల మండపానికి దగ్గరలో ఉంటుంది. ఈ బావిని రంగదాసు త్రవ్వాడు. ఈ రంగదాసుడే తొండమానుడిగా జన్మించి పూలబావిని పునరుద్ధరించెను.

ధ్వజ స్తంభం మరియు బలి పీఠం

ధ్వజ స్తంభం చెక్కతో చేయబడింది. ధ్వజ స్తంభానికి మరియు బలి పీఠానికి బంగారు పూత పూశారు. ధ్వజ స్తంభంపై గరుత్మంతుడు, హనుమంతుడు, కాళీయమర్ధన విగ్రహాలు మరియు శంఖచక్రాల గుర్తులు ఉన్నాయి. బ్రహ్మోత్సవాలు ధ్వజారోహణం నుండి ప్రారంభమవుతాయి. ధ్వజారోహణం రోజున గరుత్మంతుడు ఉండే జెండాను ధ్వజస్తంభంపై ఎగురవేస్తారు. వేంకటేశ్వర స్వామికి సమర్పించిన నైవేద్యాలను మందిరం చుట్టూ ఉన్న ఎనిమిది బలిపీఠాల మీద పెట్టగా మిగిలినది ధ్వజ స్తంభం వద్ద ఉన్న బలి పీఠంపై పెడతారు.

ఈ బలి పీఠాలమీద దేవతల కోసం ప్రసాదాలు సమర్పిస్తారు. ప్రస్తుతం ఉన్న ధ్వజ స్తంభాన్ని 1982లో మార్చారు. 1417వ సంవత్సరానికి ముందు ధ్వజ స్తంభం వేంకటేశ్వర స్వామికి ఎదురుగా ఉన్న గరుత్మంతుని వెనుక ఉండేది. యాత్రికుల రద్దీ వలన అక్కడినుండి మార్చి, రెండవ గోపురానికి వెలుపల ఇప్పుడు ఉన్న స్థలంలో స్థాపించారు.

రెండవ గోపురం

రెండవ గోపురం లోపలి నుండి వేంకటేశ్వర స్వామికి ప్రదక్షిణ చేస్తారు. ఈ ప్రదక్షిణను 'విమాన ప్రదక్షిణం' లేదా 'అంగ ప్రదక్షిణం'

అని అంటారు. సుప్రభాత సమయంలో భక్తులు స్వామి పుష్కరిణిలో స్నానం చేసి తడిబట్టలతోనే పొర్లుతూ ఈ మార్గంలో ప్రదక్షిణ చేస్తారుగనుక ఈ మార్గాన్ని అంగ ప్రదక్షిణ మార్గం అని అంటారు. ఈ ప్రదక్షిణ మార్గంలో వరదరాజ స్వామి మందిరం, గరుడ మందిరం, యాగశాల, వకుళమాలిక (వకుళమాత) మందిరం, చరణామృతం (తీర్థం) ఇచ్చే స్థలం, డబ్బులు లెక్కించే గది (పరకామణి), చందనపు గది, విమాన వేంకటేశ్వర స్వామి దర్శనం (గర్భగుడి పైన ఉన్న వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం), తాళ్లపాక అన్నమాచార్య రచించిన సంకీర్తనలు భద్రపరచిన గది, రామానుజాచార్య విగ్రహం, యోగ నరసింహ స్వామి విగ్రహం, శ్రీవారి హుండి, విష్వక్సేన మందిరం మరియు బంగారు బావి వస్తాయి. బంగారు బావి వద్ద అంకురార్పణ మండపం ఉన్నది. ఈ మండపంలో హనుమంత, సుగ్రీవ, విష్వక్సేన, గరుడ, ఆదిశేష మరియు అంగద మొదలగు ఉత్సవ విగ్రహాలు ఉన్నాయి.

వరదరాజస్వామి మందిరం

రెండవ గోపురం దాటగానే ఎడమవైపు 'వరదరాజ స్వామి మందిరం ఉంటుంది'. వరదరాజస్వామి విగ్రహం ఐదు అడుగుల ఎత్తు ఉంటుంది. వరదరాజస్వామికి ప్రతిరోజూ మూడుసార్లు నైవేద్యాలు, హారతులు సమర్పిస్తారు. కాంచీపురంలోని వరదరాజ స్వామి ఆవిర్భావం రోజు ఈ వరదరాజస్వామికి ప్రత్యేకంగా అభిషేకం మరియు హారతులు జరుగుతాయి.

విష్వక్సేన మందిరం

'విష్వక్సేన మందిరం' హుండి దగ్గర ఉన్నది. వైఖానస ఆగమంలో విష్వక్సేనునికి ముఖ్యమైన స్థానం ఉన్నది. వైష్ణవ కార్యక్రమాలలో మరియు ఆలయ ఆచారాలలో, విష్వక్సేనుని మొదట పూజిస్తారు, ఉత్సవాలలో ముందుగా విష్వక్సేనుని ఊరేగింపు ఉంటుంది. విష్వక్సేనుడు వైకుంఠంలో నారాయణుని సైన్యానికి అధిపతి.

వంటశాల

వరదరాజస్వామి మందిరనికి దగ్గర ఉన్నది వంటశాల. ఈ వంటశాలలోనే వేంకటేశ్వర స్వామికి వంటలు చేస్తారు. ఈ వంటశాలలోనే వేంకటేశ్వర స్వామికి వరాహ స్వామికి వంటలు చేసి సమర్పించే వకుళమాత మందిరం కూడా ఉంటుంది.

గరుడ మందిరం

రెండవ గోపురం దాటగానే 'గరుడ మందిరం' ఉంటుంది. గరుడుడు వేంకటేశ్వర స్వామికి ఎదురుగా ఉన్నాడు. గరుత్మంతుడు ఆరు అడుగుల ఎత్తుతో రెక్కలను విప్పుకొని రెండు చేతులతో ప్రణామాలు చేస్తూ నిలబడి ఉన్నాడు.

ఘంటా మండపం

గరుడునికి మరియు జయ విజయులకు మధ్యలో ఉన్న మండపంలో రెండు పెద్ద గంటలు ఉండును. అందువలన ఈ మండపాన్ని 'ఘంటా మండపం' అని అంటారు. వేంకటేశ్వర స్వామికి నైవేద్యం సమర్పించినప్పుడు ఈ గంటలను మ్రోగిస్తారు. ఈ ఘంటా మండపంలోనే ప్రతిరోజూ వేంకటేశ్వర స్వామికి ఉదయం మూడు గంటలకు సుప్రభాతం పఠనం జరుగుతుంది. సుప్రభాతం తరువాత ఆనాటి వారం, తిథి, నక్షత్రం, సంవత్సరం మరియు హుండీలో వచ్చిన ఆదాయం కూడా తెలుపుతారు. ప్రతి బుధవారం నాడు ఉదయం భోగ శ్రీనివాసునికి, శ్రీ మలయప్ప స్వామికి, విష్వక్సేనులకు 'సహస్రకలశాభిషేకం' చేస్తారు. శ్రీరామనవమి రోజు సీతారామ హనుమంతులను మరియు శ్రీకృష్ణ జన్మాష్టమి నాడు శ్రీరుక్మిణీకృష్ణులను పూజిస్తారు.

జయ విజయులు మరియు స్నపన మండపం

గరుడుని ఎదురుగా జయ విజయులు ఉన్నారు. ఈ జయ విజయుల పంచలోహ విగ్రహాలను రామానుజాచార్య స్థాపించారు.

జయ విజయులను దాటిన తరువాత 'స్నపన మండపం' ఉంటుంది. ఈ మండపంలోనే వేంకటేశ్వర స్వామి ఆభరణాలను, హుండీలో వచ్చిన డబ్బును భాండాగారంలో భద్రపరుస్తారు.

రాముల వారి మేడ

స్నపన మండపం దాటిన తరువాత వచ్చే మండపాన్ని 'రాముల వారి మేడ' అని అంటారు. ఒకప్పుడు ఈ మండపంలో సీతారామలక్ష్మణ విగ్రహాలు ఉన్నందువలన 'రాముల వారి మేడ' అని పేరు వచ్చింది. ఇప్పుడు ఆ సీతారాములను వేంకటేశ్వర స్వామి గర్భగుడిలోనికి మార్చారు.

రామానుజాచార్య తిరుపతిలో రామాయణమును తిరుమలనంబి నుండి వినే సమయంలో ఒక బ్రాహ్మణుడు రామానుజాచార్యకు ఈ సీతారామలక్ష్మణుల విగ్రహాలను బహూకరించెను. ఆ విగ్రహాలను రామానుజాచార్య తిరుమలనంబికి బహూకరించగా తిరుమలనంబి ఆ విగ్రహాలను రాములవారి మేడలో ఉంచి పూజించేవారు.

ఈ సీతారామలక్ష్మణ విగ్రహాలే కాకుండా హనుమంత, సుగ్రీవ, అంగద, ఆదిశేష, గరుడ మరియు విష్వక్సేన విగ్రహాలు కూడా ఉండేవి. ఈ విగ్రహాలను అంకురార్పణ మండపంలోనికి మార్చారు.

శయన మండపం

రాముల వారి మేడ దాటగానే 'శయన మండపం' ఉంటుంది. శయన మండపంలో వేదమంత్రాలను మరియు పురుషసూక్తమును చదువుతారు. రాత్రి వేళలో వేంకటేశ్వర స్వామి యొక్క ఉత్సవ విగ్రహమైన భోగ శ్రీనివాసమూర్తిని ఇక్కడ బంగారు ఉయ్యాలలో పరుండబెట్టి ఏకాంత సేవ చేస్తారు.

వేంకటేశ్వర స్వామికి నైవేద్యాలను ఈ శయనమండపంలోనే సమర్పిస్తారు. ప్రత్యేకమైన నైవేద్యాలను గర్భగుడిలో సమర్పిస్తారు.

ప్రతిరోజు జరిగే సుప్రభాత సేవ, పుష్పసేవ, సహస్ర నామార్చన సేవ, బుధవారం సహస్రకలశాభిషేకం సేవ, గురువారం తిరుప్పావడ సేవ, శుక్రవారం జరిగే అభిషేక సేవలలో పాల్గొనే భక్తులకు మాత్రమే శయనమండపంలో నిలబడి స్వామిని దర్శించే అవకాశం ఉంటుంది.

కుల శేఖర పడి (గడప)

శయన మండపం దాటితే వేంకటేశ్వర స్వామి గర్భ గుడి వస్తుంది. అయితే గర్భ గుడిలోనికి వెళ్లాలంటే గడపను దాటాలి. ఈ గడపను కుల శేఖర పడి (గడప) అని అంటారు. ఎందుకంటే కుల శేఖర మహారాజు వేంకటేశ్వర స్వామిని "స్వామీ! నీ ముందర గడపగా ఉంటే మిమ్మల్ని నేను ఎల్లప్పుడూ దర్శించగలను" అని ప్రార్థించాడు. అందువలన ఈ గడపకు 'కులశేఖర పడి' అని పేరు వచ్చింది.

గర్భ గుడి

పదమూడు అడుగులతో ఉన్న గర్భ గుడిలో వేంకటేశ్వర

స్వామి సాలగ్రామమూర్తిగా ఎనిమిది అడుగులతో వెలిశాడు. ఈ గర్భ గుడిలో సుదర్శన, సీతారామలక్ష్మణుల, రుక్మిణికృష్ణుల ఉత్సవ విగ్రహాలు ఉన్నాయి. వీటితోపాటు వేంకటేశ్వర స్వామి యొక్క 4 ఉత్సవ విగ్రహాలు కూడా అక్కడ ఉన్నాయి. అవి: 1. భోగ శ్రీనివాసమూర్తి 2. కొలువు శ్రీనివాస మూర్తి 3. ఉగ్ర శ్రీనివాస మూర్తి 4. మలయప్ప స్వామి. ఈ ఉత్సవ విగ్రహాలకు ప్రతిరోజు పూలమాలలతో అలంకరించి నైవేద్యాలను సమర్పించి పూజిస్తారు. అక్కడే సాలగ్రామాలు, అఖండ దీపం కూడా ఉన్నాయి.

ఉదయం వేంకటేశ్వర స్వామికి పూలమాలలను సమర్పించే సమయంలో దివ్య ప్రబంధం అంటే ఆళ్వారుల కీర్తనలను పాడతారు. మధ్యాహ్నం పద్మపురాణంలోని వేంకటేశ్వర స్వామి సహస్రనామాలను చదువుతూ తులసిదళాలను స్వామి పాదాల

మీద వేస్తూ పూజిస్తారు. ధనుర్మాసంలో తులసికి బదులు మారేడు దళాలను వాడతారు. వేంకటేశ్వర స్వామికి శ్రీవైష్ణవులు వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం పూజలు చేస్తారు. గర్భగుడి పైన ఉన్న శిఖరాన్ని గరుత్మంతుడు వైకుంఠం నుండి తీసుకువచ్చెను. ఈ శిఖరాన్ని 'ఆనంద నిలయం' అని అంటారు.

దర్శనం

శ్రీ వేంకటేశ్వర స్వామిని ఈ భూమి మీద తొలిసారిగా దర్శించిన గొల్లవారి వంశస్థులు ప్రతిరోజు స్వామిని ముందుగా దర్శిస్తారు. ఉదయం మూడు గంటల సమయంలో వేంకటేశ్వర స్వామిని పూజించే శ్రీవైష్ణవులు, అన్నమాచార్య వంశస్థులు, ఆలయ అధికారులు మరియు సేవకులు ఘంట మండపంలో నిలబడతారు. గొల్లవాడు బంగారు వాకిలి అనే తలుపుల తాళం తీసి దివిటీలతో లోపలికి వెళ్ళి మందిరంలోని దీపాలను వెలిగించి వేంకటేశ్వర స్వామిని దర్శిస్తాడు. తరువాత పూజారులు శ్రీసాంప్రదాయంలోని ప్రతివాది భయంకర అణ్ణన్ రచించిన...

కౌసల్యా సుప్రజా రామ పూర్వా సంధ్యా ప్రవర్తతే ।
ఉత్తిష్ఠ నరశార్దూల కర్తవ్యం దైవమాహ్నికమ్॥

"కౌసల్యాదేవికి సుపుత్రుడవగు ఓ రామా! పురుషోత్తమా! తూర్పున తెల్లవారుచున్నది. సంధ్యావందనాలు (ఉదయం పూజ) నిర్వర్తించవలెను మేల్కొనుము." (1)

ఈ శ్లోకం 'వాల్మీకి రామాయణంలోనిది'. విశ్వామిత్రముని రామలక్ష్మణులను తీసుకొని వెళ్లినప్పుడు, మొదటి రోజు నిద్రించిన తరువాత ఆయన ఉదయాన్నే ఈ శ్లోకంతో రామలక్ష్మణులను నిద్ర లేపెను. ప్రతివాది భయంకర అణ్ణన్ ఈ శ్లోకాన్ని తాను రచించే సుప్రభాతానికి (వేంకటేశ్వర స్వామిని నిద్ర నుండి మేల్కొలపడానికి) మొదటి శ్లోకముగా ఉపయోగించుకున్నారు.

ఉత్తిష్ఠోత్తిష్ఠ గోవింద ఉత్తిష్ఠ గరుడధ్వజ ।
ఉత్తిష్ఠ కమలాకాన్త త్రైలోక్యం మంగళం కురు॥

"ఓ గోవిందా! మేల్కొనుము. గరుడ ధ్వజముకల ఓ దేవా! మేల్కొనుము. ఓ లక్ష్మీవల్లభా! మేల్కొనుము. ముల్లోకములకు శుభమును కలిగింపుము." (2)

ఈ రెండవ శ్లోకంతోనే నారాయణుని మందిరంలోని విష్ణువు లేదా శ్రీకృష్ణ, శ్రీరామ మొదలగు అర్చావిగ్రహాలను నిద్ర మేల్కొలుపుతారు.

మాతః సమస్త జగతాం మధుకైటభారే
వక్షో విహారిణి మనోహర దివ్యమూర్తే।
శ్రీస్వామిని శ్రితజనప్రియ దానశీలే
శ్రీ వేంకటేశ దయితే తవ సుప్రభాతమ్॥

"సమస్త లోకములకు తల్లివి, వేంకటేశ్వర స్వామి వక్షస్థల మందు విహరించుదానవు, మనస్సును ఆకర్షించు దివ్య సుందర స్వరూపము కలదానవు, జగదీశ్వరివి, ఆశ్రయించిన వారి కోరికలను నెరవేర్చుదానవు, శ్రీ వేంకటేశ్వరుని సతీమణివి అగు ఓ లక్ష్మీదేవీ! నీకు సుప్రభాతమగుగాక" (తూర్పున తెల్లవారుచున్నది మేల్కొనుము). (3)

తవ సుప్రభాత మరవిందలోచనే
భవతు ప్రసన్న ముఖచంద్రమండలే।
విధిశంకరేన్ద్ర వనితాభిరర్చితే
వృషశైలనాథ దయితే దయానిధే॥

కమలముల వంటి కనులు కల దానివి, చంద్రబింబము వలె ముఖము గల ఓ లక్ష్మీదేవీ! నిన్ను సరస్వతి, పార్వతి మరియు

శచీదేవి పూజించుచుందురు. శ్రీవేంకటేశ్వరుని సతీమణివి, దయానిధివి అగు ఓ దేవీ! తూర్పున తెల్లవారుచున్నది, మేల్కొనుము. (4)

ప్రతివాది భయంకర అణ్ణన్ ఇక్కడ వేంకటేశ్వర స్వామి హృదయంలో ఉన్న లక్ష్మీదేవిని నిద్ర లేపుతున్నాడు. ఆ తరువాత వేంకటేశ్వర స్వామిని ఈ విధముగా నిద్ర లేపుచున్నాడు. ఆయన రచించిన శ్లోకాల భావం

“సప్తమహర్షులు తమ సంధ్యావందనమును ముగించుకొని, ఆకాశగంగ నుండి కమలములను తీసుకువచ్చి నీ పాద పద్మములను పూజించుటకు వచ్చి వేచి యున్నారు. ఓ శేషాచలపతీ! తూర్పున తెల్లవారుచున్నది, మేల్కొనుము. (5)

“శివుడు, బ్రహ్మ, కుమారస్వామి, ఇంద్రుడు మొదలగు దేవతలు వామన (నరసింహ, రామ, కృష్ణ) మొదలగు నీ అవతారాలను కీర్తిస్తున్నారు. బృహస్పతి నేటి తిథివారాదుల ఫలములను చదువుచున్నాడు. ఓ శేషాచలపతీ! తూర్పున తెల్లవారుచున్నది, మేల్కొనుము. (6)

“కొంచెం వికసించిన తామర, పోక మొదలగు పువ్వుల యొక్క సువాసనలతో గాలి మెల్లగా వీస్తున్నది. ఓ వేంకటేశ్వరా! శేషాచలపతీ! తూర్పున తెల్లవారుచున్నది, మేల్కొనుము. (7)

“ఓ శేషశైలపతీ! చక్కని పంజరములలో వున్న పెంపుడు చిలుకలు తామిదివరకు కొంత తినగా పాత్రలలో మిగిలి ఉన్న అరటిపండ్లను, పాయసమును తిని మధురముగా పాడుచున్నవి. ఓ శేషాచలపతీ! తూర్పున తెల్లవారుచున్నది, మేల్కొనుము. (8)

“ఓ అనంతా! నారదుడు కూడ మధురంగా ధ్వనిచేయు తన వీణ తీగలను వాయిస్తూ, నృత్యం చేస్తూ, చక్కని భాషతో నీ

దివ్య చరితమును గానము చేయుచున్నాడు. ఓ శేషాచలపతీ! తూర్పున తెల్లవారుచున్నది, మేల్కొనుము. (9)

“తేనెటీగలు సరస్సులలో ఉన్న కమలములలోని తేనెను త్రాగి నిన్ను కీర్తించుటకు వచ్చుచున్నవి. ఓ శేషాచలపతీ! తూర్పున తెల్లవారుచున్నది, మేల్కొనుము. (10)

“ఓ శేషాద్రినాధుడవగు వేంకటేశ్వరా! గొల్ల పల్లెలలోని గొల్లపడుచులు పెరుగు చిలుకుచుండగా ఆ చిలికిన ధ్వనికి దిక్కులు ప్రతిధ్వనించుచున్నవి. ఆ ధ్వని, ప్రతిధ్వనులను బట్టి పెరుగుకుండలు మరియు దిక్కులు కలహించుచున్నవా! అన్నట్లు కనిపించుచున్నది. ఓ దేవా! ఓ శేషాచలపతీ! తూర్పున తెల్లవారుచున్నది, మేల్కొనుము. (11)

“సూర్యుని మిత్రులగు కమలం పువ్వుల మీద ఉన్న తుమ్మెదలు, తమ దేహకాంతిచే కలువల నల్లని కాంతిని అపహరించుటకు బయలుదేరి భేరిని వాయించునట్లు ధ్వని చేయుచున్నవి. ఓ శేషాచలపతీ! తూర్పున తెల్లవారుచున్నది, మేల్కొనుము. (12)

“శ్రీమంతుడవైన ఓ దేవా! నీవు సమస్త కోరిన వరములను ఇచ్చేవాడవు. సమస్త లోకాలకు బంధువువు. ఓ శ్రీనివాసా! లక్ష్మీదేవికి నివాసమగు వక్షస్థలము కలవాడవు. దివ్యస్వరూపుడవు, ఓ వేంకటాచలపతీ! సమస్త లోకాలలో సముద్రమంత దయగలవాడవు. ఓ వేంకటేశ్వరా! తూర్పున తెల్లవారుచున్నది, మేల్కొనుము. (13)

“బ్రహ్మ, శివుడు, సనందనుడు మున్నగువారు స్వామి పుష్కరిణిలో స్నానము చేసి పరిశుద్ధులై తమ మేలుకై ద్వారపాలకులు బెత్తములతో తలలపై కొట్టుచున్నను లెక్కచేయక నీకోసం వేచి ఉన్నారు. ఓ వేంకటాచలపతీ! తూర్పున తెల్లవారుచున్నది, మేల్కొనుము. (14)

"ఓ వేంకటేశ్వర స్వామి ! నీ నివాసమగు ఈ పర్వతమును అందరు శేషశైలము, గరుడాచలము, వృషాద్రి, వేంకటాద్రి, నారాయణాద్రి, వృషభాద్రి, మున్నగు పేర్లతో నిత్యము పిలుచుచుందురు. ఓ స్వామి వేంకటాచలపతీ! తూర్పున తెల్లవారుచున్నది, మేల్కొనుము. (15)

"ఈశానుడు, ఇంద్రుడు, అగ్ని, యముడు, నిరృతి, వరుణుడు, వాయువు, కుబేరుడు అను అష్టదిక్పతులు తమ శిరస్సులపై చేతులను పెట్టుకొని నీకు దండం పెడుతూ నీ సేవకై ఎదురుచూస్తున్నారు. ఓ వేంకటాచలపతీ! తూర్పున తెల్లవారుచున్నది, మేల్కొనుము. (16)

"దేవా! గరుడుడు, మృగరాజు, ఆదిశేషుడు, గజేంద్రుడు మరియు అశ్వరాజు దండయాత్రలయందు తమ తమ శక్తిని చూపుటకు నీ అనుమతిని వేడుచున్నారు. ఓ వేంకటాచలపతీ! తూర్పున తెల్లవారుచున్నది, మేల్కొనుము. (17)

"సూర్యుడు, చంద్రుడు, అంగారకుడు, బుధుడు, బృహస్పతి, శుక్రుడు, శని, రాహువు మరియు కేతువు అను నవగ్రహాలు నీ దాస, దాసులకు దాసులయి ఉన్నారు. ఓ వేంకటాచలపతీ! తూర్పున తెల్లవారుచున్నది, మేల్కొనుము. (18)

"ఓ స్వామీ! మీయొక్క సన్నిధిలో మీ పాద ధూళితో శిరస్సులను పవిత్రం చేసుకున్న వారు స్వర్గమోక్షములను ఏనాటికి మనస్సులో కూడా కోరరు. ఈ కల్పము అంతమైపోతే వచ్చే కల్పములో మీ సేవ చేసే భాగ్యం ఉండకపోవచ్చునని కలతపడుదురు. ఓ వేంకటాచలపతీ! తూర్పున తెల్లవారుచున్నది, మేల్కొనుము. (19)

"స్వర్గమోక్షములకు పోవుచున్నవారు మార్గములో నీ గుడిని, గోపురాలను, శిఖరాలను చూసి ఆనందపరవశులై

స్వర్గమోక్షములను మరచి ఇక్కడే మిమ్మల్ని దర్శించవలెనని కోరుకుంటారు. ఓ వేంకటాచలపతీ! తూర్పున తెల్లవారుచున్నది, మేల్కొనుము. (20)

"ఓ దేవాదిదేవా! నీవు శ్రీదేవికి, భూదేవికి భర్తవు. దయ మున్నగు గుణములకు పాలసముద్రము వంటివాడవు. లోకములకన్నింటికి నీవొక్కడవే శరణమిచ్చువాడవు. అనంతుడు, గరుడుడు నీ పాదములను సేవించుచుందురు. ఓ స్వామి వేంకటాచలపతీ! తూర్పున తెల్లవారుచున్నది, మేల్కొనుము. (21)

"ఓ వేంకటేశ్వరా! నీవు పద్మము వంటి నాభి కలవాడవు. పురుషోత్తముడవు,వాసుదేవుడవు,వైకుంఠుడవు,మాధవుడవు. జనులను రక్షించువాడవు. చేతిలో చక్రమును ధరించిన వాడవు. శ్రీవత్స చిహ్నము కలవాడవు. శరణుజొచ్చినవారిని కల్పవృక్షము వలే కాపాడే వాడివి. ఓ వేంకటాచలపతీ! తూర్పున తెల్లవారుచున్నది, మేల్కొనుము. (22)

"మన్మథుని గర్వము నణచు దివ్యసుందర శరీరము కల ఓ దేవా! నీ దృష్టి తామర మొగ్గలవంటి యువతి కుచములపై తిరుగుచుండును. నీవు కీర్తి కలవాడవు. ఓ వేంకటాచలపతీ! తూర్పున తెల్లవారుచున్నది, మేల్కొనుము. (23)

"ఓ వేంకటేశ్వరా! నీవు మత్స్య, కూర్మ, వరాహ, నరసింహ, వామన, పరశురామ, శ్రీరామ, బలరామ, శ్రీకృష్ణ, మరియు కల్కి రూపములను ధరించితివి. ఓ వేంకటాచలపతీ! తూర్పున తెల్లవారుచున్నది, మేల్కొనుము. (24)

"ఓ వేంకటేశ్వరా! వైదికులగు భక్తులు పచ్చకర్పూరముతోను ఏలకులతోను, పరిమళించు పవిత్ర గంగా జలమును బంగారు కలశముల నిండుగా నింపి తెచ్చి సంతోషముతో

నీ సేవకై ఎదురు చూచుచున్నారు. ఓ వేంకటాచలపతీ! తూర్పున తెల్లవారుచున్నది, మేల్కొనుము. (25)

"ఓ దేవా! సూర్యుడు ఉదయించుచున్నాడు. కమలములు వికసించుచున్నవి. పక్షులు తమ కిలకిలారావములతో దిక్కులను నింపుచున్నవి. శ్రీవైష్ణవులు శుభములను కోరుచు నీ సన్నిధిలో వేచియున్నారు. ఓ వేంకటాచలపతీ! తూర్పున తెల్లవారుచున్నది, మేల్కొనుము. (26)

"ఓ దేవా! బ్రహ్మాది దేవతలు, మహర్షులు, సనందనుడు మున్నగు సత్పురుషులు, యోగులు నీ పూజకు తగిన మంగళకర వస్తువులను చేతుల యందు ధరించి నీ సన్నిధికి వచ్చియున్నారు. ఓ వేంకటాచలపతీ! తూర్పున తెల్లవారుచున్నది, మేల్కొనుము. (27)

"ఓ దేవా! నీవు లక్ష్మీదేవికి నివాసమైనవాడవు. సద్గుణ సముద్రుడవు. సంసార సాగరమును తరించుటకు అనువైన వారధివి. వేదాంతములచే తెలిసికొనదగిన వైభవమును కలవాడవు. భక్తులకు స్వాధీనుడవు. ఓ వేంకటాచలపతీ! తూర్పున తెల్లవారుచున్నది, మేల్కొనుము. (28)

"సూర్యోదయ వేళ ఈ సుప్రభాత స్తోత్రమును ఏ మానవులు ప్రతిదినము భక్తితో చదువుదురో వారికి వేంకటేశ్వర స్మరణము వలన సులభముగా మోక్షము కలుగును." (29)

అని సుప్రభాతాన్ని చదువుతూ తమ శిరస్సులను వేంకటేశ్వర స్వామి పాదాలపై ఉంచి నమస్కరిస్తారు. తరువాత శయన మండపంలో బంగారు ఉయ్యాలలో ఉన్న భోగ శ్రీనివాసుని వద్దకు వెళ్లి చప్పట్లు కొట్టి నిద్రలేపి చేతులతో స్వామి వారి పాదాలను తాకి నమస్కరించి గర్భ గుడిలోనికి తీసుకువెళతారు.

తరువాత వేంకటేశ్వర స్వామికి దంతధావనం, ఆచమనం చేయించి ఆవుపాలను సమర్పించి హారతిని ఇస్తారు. తరువాత బంగారు వాకిలి అనే తలుపులను పూర్తిగా తెరుస్తారు. అప్పుడు బయట నుండి సుప్రభాతం చదువుతున్న పూజారులు, సుప్రభాతం టికెట్ తీసుకున్న వారు, అన్నమాచార్య వంశస్థులు వేంకటేశ్వర స్వామిని దర్శిస్తారు. బ్రహ్మ దేవుడు రాత్రి వేళలో వేంకటేశ్వర స్వామికి సమర్పించడానికి ఉంచిన తీర్థాన్ని, శఠగోపాన్ని పూజారి ముందుగా స్వీకరించి మిగతా పూజారులకు, అక్కడి భక్తులకు ఇస్తాడు.

ప్రతి గురువారం నాడు వేంకటేశ్వర స్వామికి ఎలాంటి పూల మాలలుకాని, ఆభరణాలుకాని, పెద్ద తిలకంకాని లేకుండా కేవలం ధోవతి మరియు ఉత్తరీయంతో అలంకరిస్తారు. ఈ అలంకారాన్ని 'గోపాల వేషం' అని అంటారు.

నేత్రోత్సవ దర్శనాన్ని అన్నమాచార్య శుక్రవారం నాడు దర్శించి, వేంకటేశ్వర స్వామిని ఈ విధంగా స్తుతించెను: "శుక్రవారం నాడు తెల్లవారుఝామున అలమేలు మంగమ్మను వక్షస్థలంలో ధరించిన వేంకటేశ్వర స్వామిని దర్శించితిని. ఆభరణాలు లేకుండా ధోవతి మరియు ఉత్తరీయంతో ఎంతో అందంగా ప్రకాశిస్తున్న వేంకటేశ్వర స్వామిని దర్శించితిని" అని కీర్తించెను.

అభిషేకం

తిరుమలనంబి వంశస్థులు ఆకాశగంగ తీర్థం నుండి తీసుకువచ్చిన పవిత్ర జలంతో వేంకటేశ్వర స్వామి మందిరంలోని ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు చేసి వస్త్రాభరణాలతో అలంకరిస్తారు. ప్రతి శుక్రవారం వేంకటేశ్వర స్వామికి పచ్చ కర్పూరం, పునుగు, చందనం, జవ్వాది వంటి సుగంధ ద్రవ్యాలను కలిపిన నీటితో అభిషేకం చేస్తారు. వక్షస్థలంలో ఉన్న లక్ష్మీ దేవికి పసుపును కూడా వాడతారు. తరువాత పదహారు తులాల పచ్చ కర్పూరం, ఒకటిన్నర

తులాల కస్తూరితో తిలకం పెట్టి, ఇరవైనాలుగు మూరల పొడవు మరియు నాలుగు మూరల వెడల్పు గల పట్టు ధోవతిని, పన్నెండు మూరల పొడవు మరియు రెండు మూరల వెడల్పు గల పట్టు ఉత్తరీయాన్ని అలంకరిస్తారు. పదునాలుగు పూల మాలలతో, తులసి మాలతో, ముప్పదితొమ్మిది ఆభరణాలతో అలంకరించి, వేంకటేశ్వర స్వామి సహస్రనామాలను కీర్తిస్తూ తులసిదళాలను పాదాల మీద వేస్తూ పూజిస్తారు.

శయన హారతి

తరిగొండ వెంగమాంబ వేంకటేశ్వర స్వామికి రాత్రి మందిరం మూసే సమయంలో హారతిని ఇచ్చేది. ఈనాటికీ అదేవిధంగా వేంకటేశ్వర స్వామికి హారతిని ఇచ్చి, భోగ శ్రీనివాసుని బంగారు ఉయ్యాలలో నిద్రింపచేస్తారు. అన్నమాచార్య ఏకాంత సేవ సమయంలో ఎన్నో కీర్తనలను పాడిరి, అందులోని రెండు కీర్తనల భావం:

"ఎన్నడూ తరిగిపోని ఆనందాన్ని కలిగించే ఓ ముకుందా! గోవిందా! ఇటురా! మదనుని కన్న మాయన్న, బంగారు గిన్నెలో పాలు పోసి తెచ్చాను ఇటురా! నీవు దొంగవని గోపికలు తెలుపుతున్నారు. ఇక్కడ నా ఎదురుగానే ఆడు! దేవకి కుమారుడవై నీవు గొడుగుగా గోవర్ధనాన్ని ఎత్తావు. తొడగొట్టి కంసుని కావరాన్ని అణచి, మధురాపురాన్ని జయించి, ఠీవిగా తిరిగే ఓముకుందా! ఇలా రా! సమస్త సంపదలను అందించే ఓ మదనగోపాలా! నీకు మంగళము."

"ఓ వేంకటరమణా! పదహారువేల గోపికలు తమ క్రీగంటి చూపులతో నిన్ను చూస్తూ ఉయ్యాల ఊపుతున్నారు. భువన విఖ్యాత గోప రక్షకా! అచ్యుతా! అనంతా! నీవు బంగారు భవనంలో నిద్రించవయ్యా! నిన్ను భక్తులు స్తుతిస్తున్నారు. శ్రీదేవి మరియు భూదేవి నీ పాదాలొత్తుతున్నారు. ఇక సుఖంగా నిద్రపోవయ్యా!"

నైవేద్యాలు (భోగాలు)

సుప్రభాత సమయంలో స్వామికి వెన్న, పాలు మరియు చక్కెర సమర్పిస్తారు. సుప్రభాతం అయ్యాక బెల్లం కలిపిన నువ్వుల పిండిని సమర్పిస్తారు. తరువాత జరిగే సహస్రనామార్చన తరువాత పులిహోర, పొంగలి, చక్కెర పొంగలి, లడ్డూలు, వడలు మరియు అప్పాలు సమర్పిస్తారు. ఇదే సమయంలో పెరుగన్నాన్ని పగిలిన మట్టి కుండలో వేంకటేశ్వర స్వామి పాదాల వద్ద సమర్పిస్తారు. మధ్యాహ్నం అష్టోత్తర శతనామార్చన అనంతరం పులిహోర, పొంగలి, పెరుగన్నం, చక్కెర పొంగలి, లడ్డూలు, వడలు, అప్పాలు, శుద్ధన్నం, అన్నాలు, సిరా, పాయసం, కేసరిబాత్, క్షీరాన్నం మరియు కదంబం అనే పదార్థాలను సమర్పిస్తారు. సాయంత్రం అష్టోత్తర శతనామార్చన తరువాత చక్కెర పొంగలి, పొంగలి, పులిహోర మరియు కదంబాన్ని సమర్పిస్తారు. ఏకాంత సేవ అనంతరం పాలు, పండ్లు, ఖర్జూరం మరియు చక్కెరతో చేసిన మేవ అనబడే నైవేద్యాన్ని సమర్పిస్తారు. ఊరేగింపు మరియు ఉత్సవాలలో ఎన్నో నైవేద్యాలు సమర్పిస్తారు. విశేష పూజలు జరిగినప్పుడు విశేషమైన మరెన్నో నైవేద్యాలను సమర్పిస్తారు.

శ్రీకృష్ణుని నామాలు

వేంకటేశ్వర స్వామికి ఉదయం జరిగే సహస్రనామార్చనలోనూ, మధ్యాహ్నం మరియు సాయంత్రం వేలలో జరిగే అష్టోత్తర శతనామార్చనలోనూ ఈ క్రింది శ్రీకృష్ణుని నామాలు ఉండును. ఓం దేవకీ గర్భ సంభూతాయ నమః, ఓం యశోదేక్షణ లలితాయ నమః, ఓం వసుదేవ కృత స్తోత్రాయ నమః, ఓం నంద గోపమనోహరాయ నమః, ఓం నీలకుంతలాయ నమః, ఓం తృణావర్త వినాశాయ నమః, ఓం గర్గ రోహిత నామాంకితాయ నమః, ఓం వాసుదేవాయ నమః, ఓం గోపికాస్తన్యపాయినే నమః, ఓం బలభద్రానుజాయ నమః, ఓం వత్సజిత్ నమః, ఓం నవనీతాపహర్త్రే నమః, ఓం వత్సాంతకాయనమః,

ఓం బకద్వేషిణే నమః, ఓం మహాజగర చండాగ్నయే నమః, ఓం కృష్ణాయ నమః, ఓం కృష్ణ సఖాయ నమః.

గొల్లవారు

వేంకటేశ్వర స్వామిని తొలిసారిగా దర్శించిన గొల్లవాని వంశస్తులే ఇప్పటికీ ప్రతిరోజు ఉదయం ముందుగా వేంకటేశ్వర స్వామిని దర్శిస్తారు. వారు పూజారులను తీసుకువచ్చే సేవను కూడ చేస్తారు. ఉత్సవమూర్తులను బయటకు తీసుకువెళ్లినప్పుడు, బయట నుండి లోపలికి తీసుకువచ్చే వేళలలో దివిటీని పట్టుకొని "శ్రీవారికి దారిని ఇవ్వండి" అంటూ ముందుగా నడుస్తారు.

రామానుజాచార్య విగ్రహం

రామానుజాచార్య శ్రీరంగంలో 'జీవసమాధి' చెందారు. ఈ విషయం తెలిసిన అనంతాచార్య ఎంతో దుఃఖించారు. ఆ దుఃఖం వలన వేంకటేశ్వర స్వామికి పూలసేవ చేయలేదు, స్వామి దర్శనానికి కూడా వెళ్లలేదు. వేంకటేశ్వర స్వామి అనంతాచార్య వద్దకు వచ్చి "నాకు ఎందుకు పూలమాలలను, తులసిమాలలను తయారు చేయడం లేదు, నా దర్శనానికి కూడా ఎందుకు రావడం లేదు?" అని అడిగాడు. అనంతాచార్య వేంకటేశ్వర స్వామితో "మా గురుదేవులు రామానుజాచార్య వైకుంఠానికి వెళ్లారు. ఆ బాధ వల్ల మీసేవ చేయలేకపోయాను" అని తెలిపెను.

వేంకటేశ్వర స్వామి "నాభక్తులు, వారి ఇచ్ఛానుసారం వారి శరీరాలను వదులుతారు. అలాగే రామానుజాచార్య తన ఇచ్ఛానుసారం శరీరాన్ని వదిలారు. రామానుజాచార్య నీకే గురువు కాదు. నాకు కూడా గురువే! నాకు శంఖచక్రాలు ధరింపచేసెను. రామానుజాచార్య వైకుంఠం వెళ్లినందుకు నీవు ఎంత బాధపడుతున్నావో నేను కూడా అంతే బాధపడుతున్నాను. నీవు రామానుజాచార్య విగ్రహాన్ని స్వయంగా చేయించుకున్నావు. ఆ

విగ్రహాన్ని నాకు ఇస్తే నేను నా మందిరంలో ప్రతిష్ఠించుకుంటాను" అన్నాడు.

ఆ విగ్రహాన్ని తీసుకువెళ్ళమని అనంతాచార్య స్వామితో అన్నారు. వేంకటేశ్వర స్వామి ఆ ప్రాంతమును పాలించే రాజుకు కలలో కనిపించి, అనంతాచార్య వద్ద ఉన్న రామానుజాచార్య విగ్రహాన్ని నా హుండి ఎదురుగా స్థాపించమని తెలుపగా రాజు అలానే చేశాడు. ఇప్పటికీ రామానుజాచార్య విగ్రహం స్వామి హుండీ ఎదురుగా మనం దర్శించవచ్చు.

ఈ విగ్రహం భాష్యం వ్రాస్తున్నట్లు ఉంటుంది, అందువలన ఈ రామానుజాచార్యను 'భాష్యకారులు' అని అంటారు. అన్నమాచార్య ఈ రామానుజాచార్యను ఈ విధంగా కీర్తించెను:

"ఈ భాష్యకారులు ఏమీ తెలియని అజ్ఞానులమైన మమ్ము ఆచార్య పదవితో గొప్పవానిని చేశారు. కోల్పోయిన వేదాలను బ్రహ్మదేవునికి తిరిగి ఇచ్చిన శ్రీహరి దయవలన సమస్త శాస్త్రాల జ్ఞానాన్ని తెలుసుకొని, కలియుగంలో అవతరించి ఆ శాస్త్రాల జ్ఞానాన్ని ఈ భాష్యకారులు అందరికీ ప్రచారం చేశారు.

"భూలోకమంతా జలప్రవాహంలో మునిగిపోగా తనలోనే దేవతలకు ఆశ్రయం కల్పించి, చిన్నారి శిశువు రూపంలో ఒక మర్రి ఆకుపై తేలియాడిన ఆదినారాయణుని దయను పొంది, శాస్త్ర విరుద్ధమైన మతాలను గాలిలో ఎగిరిపోయేటట్లు చేసి ఈ భాష్యకారులు మోక్ష మార్గమును చూపించెను.

"కమలములవలె కోమలమైన తన చేతిని చాచి తన పాదములను చూపించి మోక్ష మార్గం చూపిన శ్రీవేంకటేశ్వరుని కరుణతో ఈ భాష్యకారులు అవతరించారు. నారాయణ మంత్ర ప్రభావముతో ఈ భాష్యకారులు మా పాపములను తొలగించారు."

శ్రీ యోగ నరసింహస్వామి

యోగ నరసింహస్వామి విగ్రహం రామానుజాచార్య విగ్రహం ప్రక్కనే ఉంటుంది. తిరుమల కొండలలో ఉండే ఈ యోగ నరసింహ స్వామిని రామానుజాచార్య తెచ్చి మందిరంలో స్థాపించారు. ఒకానొక నరసింహ చతుర్దశినాడు యోగ నరసింహస్వామి అర్చా విగ్రహాన్ని అన్నమాచార్య ఇలా కీర్తించెను:

"ఆ నరహరి సకల సంపదలకు మూలమైన ఇందిరను (లక్ష్మీదేవిని) తొడమీద కూర్చుండబెట్టుకుని దర్శనమిస్తూఅందంగా నవ్వుచున్నాడు. పడగల మీద మాణిక్యాలను దాల్చిన శేషుని మీద కూర్చొని తనను శరణు జొచ్చిన వారికి వరాలు ఇస్తున్నాడు లక్ష్మీనరసింహుడు.

"శేష పాన్పుపై బంగారు మేడలలో కొలువై ఉన్న నరహరి అప్సరసలు ఆడుతుంటే అలా కూర్చొని చూస్తూ విలాసం ఒలకబోస్తున్నాడు. చూడ ముచ్చటైన సొమ్ములను అలంకరించుకొని, రాజసపు వైభవాన్ని ప్రదర్శిస్తూ లక్ష్మీనరసింహుడు మనకు సమీపంలోనే ఉన్నాడు.

"నరసింహ స్వామి ఇందిరను ఎడమ తొడమీద కూర్చోబెట్టుకున్న భంగిమ కూడా విశేషమైనదే. ఆయన బంగారు కడియం అలంకరించుకున్న కుడికాలు పాదాన్ని కిందికి చాచి పెట్టి, మరో కాలును పెనచి మెలిదిప్పి పూజలు అందుకుంటున్నాడు. ఆ లక్ష్మీనరసింహుడు ఏడుకొండల కొలువు కూటమైన శ్రీవేంకటాద్రిలో మరియు అహోబిల క్షేత్రంలో గొప్పగా శోభిల్లుతూ ఉన్నాడు."

కటహ తీర్థ మహాత్మ్యం

ఈ కటహాతీర్థం హుండికి ఎదురుగా ఉంటుంది. వేంకటేశ్వర స్వామికి అభిషేకం చేసిన నీళ్ళు ఒక గుంతలోనికి వస్తాయి, ఆ గుంతనే 'కటహ తీర్థం' అని అంటారు. "కటహ తీర్థ గొప్పతనం

శివునికి తప్ప వేరెవరికి తెలియదు. గంగ, యమున వంటి సమస్త తీర్థాలు వచ్చి కటహ తీర్థాన్ని సేవిస్తాయి. ఈ తీర్థంలో స్నానం చేసిన వారి సర్వపాపాలు నశించి మోక్షాన్ని పొందుతారు" అని సూత గోస్వామి మునులకు తెలిపి కేశవుని కథను ఈ విధముగా తెలిపెను.

తుంగభద్ర నది తీరంలో నివసించే పద్మనాభునికి కేశవుడు అనే కుమారుడు ఉండెను. కేశవుడు మద్యం, మాంసం, వ్యభిచారం, జూదం వంటి చెడు గుణాలతో కాలాన్ని గడుపుచుండెను. ఇతడు ఒకరోజు ధనం కోసం ఒక బ్రాహ్మణుని సంహరించాడు. అందువలన కేశవునికి బ్రహ్మహత్య పాపం సంక్రమించింది. కేశవుడు తన తండ్రియైన పద్మనాభుని వద్దకు వెళ్లి తన పరిస్థితిని తెలిపి రక్షించమని ప్రార్థించెను. పద్మనాభుడు, భరద్వాజ ముని వద్దకు వెళ్లి తన కుమారుని ఉద్ధరించమని ప్రార్థించగా ఆ ముని "సువర్ణముఖారీ నది తీరంలో వేంకటాచల పర్వతంపై కటహతీర్థం ఉన్నది. ఆ తీర్థంలో నీ కుమారునికి స్నానం చేయించమని" తెలిపాడు. పద్మనాభుడు అలా చేసి తన కుమారుడు చేసిన పాపాల నుండి ముక్తిని కలిగించెను.

పైన తెలుపబడిన ఉప దేవాలయాలతో పాటు అనేక ఇతర ఉపదేవాలయాలు కూడా శ్రీ వేంకటేశ్వర స్వామి మందిరంలో ఉన్నాయి.

4

శ్రీ వేంకటేశ్వర స్వామి ఉత్సవాలు

వేంకటేశ్వర స్వామి మందిరంలో సంవత్సరంలో 433 ఉత్సవాలు జరుగుతాయి. అందులో నిత్య కల్యాణం, విశేషపూజ, అష్టదళ పాద పద్మారాధన, సహస్ర కలశాభిషేకం, తిరుప్పావడ సేవ, పూలంగి సేవ, శుక్రవారాభిషేకం, ఆకాశ గంగ తీర్థంతో అభిషేకం, నిజ పాద దర్శనం, శ్రీకృష్ణ జన్మాష్టమి, శ్రీరామ నవమి, వరాహ ద్వాదశి, వరదరాజ స్వామి ఆవిర్భావం, బ్రహ్మోత్సవాలు, డోలోత్సవం, సహస్ర దీపాలంకరణ, రథ సప్తమి, వైకుంఠ ఏకాదశి, పుష్ప యాగం, పద్మావతి పరిణయం, పవిత్రోత్సవం, ఊంజల సేవ, జ్యేష్ఠాభిషేకం, వసంతోత్సవం, అభిదయ అభిషేకం, పుప్పి పల్లడి, కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, పూరాభిషేకం మరియు తెప్పోత్సవం వంటివి ప్రధానమైనవి. వాటిలోని కొన్ని ఉత్సవాల గురించి క్రింద ఇవ్వబడ్డాయి.

జ్యేష్ఠాభిషేకం: ఎండాకాలపు వేడిమి తగ్గి, రాబోయే కాలంలో వర్షాలు బాగా కురవాలని వైష్ణవ ఆలయాలలో జ్యేష్ఠా నక్షత్రం ముగిసే సమయానికి విశేష అభిషేకం చేస్తారు. ఈ అభిషేకమును, 108 కలశాలలో (బిందెలలో) ఉన్న నీటితో రోజుకు మూడు గంటల పాటు మూడు రోజులు చేస్తారు. జ్యేష్ఠమాసంలో జరిగే ఉత్సవం కనుక దీనికి 'జ్యేష్ఠాభిషేకం' అని పేరు వచ్చింది. అభిషేకం పూర్తయ్యాక భగవంతుని అలంకరించి ఊరేగింపు కూడా చేస్తారు.

వసంతోత్సవము: వసంత ఋతువులో శ్రీదేవి-భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామి వారికి జరిగే ఈ ఉత్సవాన్ని 'వసంతోత్సవం' అని పిలుస్తారు. వేసవి వేడి నుండి స్వామివారు ఉపశమనం పొందేందుకు జరిపే ఉత్సవం కావడంతో దీనిని 'ఉపశమనోత్సవం' అని కూడా అంటారు. ఈ ఉత్సవంలో సుగంధమును వెదజల్లే

పుష్పాలతోపాటు పలురకాల మధుర ఫలాలను స్వామివారికి నివేదిస్తారు.

ఈ వసంతోత్సవాన్ని అన్నమాచార్య ఈ విధంగా కీర్తించెను: "ఆ తిరువీధులు వెన్నెల కాంతితో మెరిసిపోతున్నాయి. ఎవ్వరూ చల్లకుండానే పూలవాన జల్లువలె కురుస్తున్నది. కొంతమంది అక్కడ నృత్యం చేస్తున్నారు, కొంతమంది మధురంగా పాడుతున్నారు. అప్పుడు స్వామి తేలికపాటి ఆహారం తీసికొని తాంబూలమును స్వీకరించి గంధపు వాసనను గ్రహించెను. స్వామివారి మరియు అమ్మవారి శిరస్సుల మీద స్త్రీలందరూ సుగంధపు నీటిని పోసిరి. ఈ విధంగా శ్రీవేంకటేశ్వరుడు ఇంతమంది సుందరాంగులతో వసంతాలాడుతుంటే స్వామిపై కోరిక కలుగనిదెవరికి చెప్పండి! స్వామి ఈ విధంగా అసంఖ్యాకమైన భోగాలను అనుభస్తున్నాడు. శ్రీవేంకటేశ్వరుడు అలమేలు మంగతో ఆరితేరిన నేర్పరివలె వసంతోత్సవమును జరుపుకొంటూ విహరించుచున్నాడు."

విశేషపూజ: ప్రతి సోమవారం ఉదయం ఆరు గంటలకు జరిగే ప్రధాన సేవే విశేషపూజ. ఈ సేవ సంపంగి ప్రదక్షిణంలోని కల్యాణ మండపంలో శ్రీదేవి-భూదేవి సమేతంగా శ్రీ మలయప్ప స్వామివారికి జరుగుతుంది.

సహస్ర కలశాభిషేకం: ప్రతి బుధవారం ఉదయం ఆరు గంటలకు తిరుమలలో బంగారు వాకిలి ముందు జరిగే ప్రధాన సేవయే సహస్ర కలశాభిషేకం. భోగ శ్రీనివాసమూర్తితో పాటుగా శ్రీదేవి-భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామికి పంచామృతంతో పాటు వెయ్యి బిందెలలోని నీటితో అభిషేకం చేస్తారు. దీనినే సహస్ర కలశాభిషేకం అని అంటారు.

తిరుప్పావడ లేదా అన్నకూటోత్సవ సేవ: గురువారం ఉదయం ఆరు గంటలకు వేంకటేశ్వర స్వామికి (మూలవిరాట్టుకు) ఉన్న

ఆభరణాలను అన్నింటినీ తొలగించి ఊర్ధ్వపుండ్రాన్ని (తిలకమును) కూడా బాగా సన్నగా తగ్గించి నేత్రాలు స్పష్టంగా కనపడేవిధంగా చేస్తారు. తరువాత శ్రీస్వామివారికి ఎదురుగా గడప ముందు పెద్ద శిఖరము వలె పులిహోర రాశిని ఏర్పాటు చేస్తారు. పులిహోరతో పాటు జిలేబిలు, జంతికలు, కొబ్బరికాయలు, చందన లేపనం, కుంకుమ మరియు దీపాలను చక్కగా అమర్చి పూలతో అలంకరిస్తారు. పులిహోర రాశిని నేరుగా గర్భాలయంలోని వేంకటేశ్వర స్వామికి నివేదిస్తారు. తరువాత వేదపండితులు వేదపారాయణంతో పాటు శ్రీనివాస గద్యం పఠిస్తారు.

పూలంగి సేవ: ప్రతి గురువారం రాత్రి 8 గంటలకు వేంకటేశ్వర స్వామికి జరిగే పుష్ప సేవను 'పూలంగి' సేవ అని అంటారు. ఈ సేవ పూర్తిగా ఏకాంతంగా జరుగుతుంది. పూలమాలలతో అర్చకులు వేంకటేశ్వర స్వామి విగ్రహాన్ని పూర్తిగా అలంకరిస్తారు. పూలంగి సేవ పూర్తయిన తరువాత భక్తులు పూల అలంకరణలో ఉన్న వేంకటేశ్వర స్వామిని దర్శించవచ్చు.

అష్టదళ పాద పద్మారాధన సేవ: ఈ సేవ 1984 నుండి కొనసాగుతుంది. ప్రతి మంగళవారం ఉదయం 9:30లకు 108 అష్టదళ (ఎనిమిది రేకులు గల) బంగారు కమల పుష్పాలతో స్వామిని సేవిస్తారు. ప్రతి పుష్పం బంగారంతో తయారు చేయబడి విలువైన రాళ్లతో పొదగబడి ఉంటుంది.

తెప్పోత్సవాలు: ప్రతి సంవత్సరం ఐదు రోజుల పాటు స్వామిపుష్కరిణిలో పడవ మీద ఉత్సవాలు జరుగుతాయి. వీటినే 'తెప్పోత్సవాలు' అని అంటారు. మొదటిరోజు ఏకాదశినాడు సీతారామలక్ష్మణులు, రెండవరోజు ద్వాదశినాడు రుక్మిణీ-శ్రీకృష్ణులు, చివరి మూడురోజులు శ్రీదేవి-భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామి తెప్పోత్సవంలో విహరిస్తారు. అన్నమాచార్య ఈ తెప్పోత్సవం గురించి ఎన్నో కీర్తనలను పాడారు. అందులో ఒక కీర్తన భావం:

"నీకు అనేక రకాల తెప్పోత్సవాలు జరుగుతాయి. నీకు ఏది ప్రియమో చెప్పవయ్యా! పాలసముద్రంలో పామునే తెప్పగా చేసుకొని తెప్పతిరునాళ్లు చేసుకున్నావు. ప్రళయ కాలమున సముద్రంలో మర్రి ఆకుపై తేలియాడావు. క్షీరసాగర మథన సమయంలో మందర పర్వతాన్ని తేలియాడింపజేశావు. యమునా నదిలో కాళీయ నాగు పడగలపై నర్తిస్తూ తేలావు. పదహారువేల భామల చెమటల తెప్పలలో తేలియాడావు. నేడు పుష్కరిణిలో తెప్పతిరునాళ్లు చేసుకుంటున్నావు. వీటిలో నీకు ఏది ఇష్టమో తెలుపుము స్వామీ!"

బ్రహ్మోత్సవాలు: బ్రహ్మదేవుడు దేవతలతో పాటు వేంకటాచలంలో వేంకటేశ్వర స్వామిని దర్శించి ఉత్సవాలు చేశాడు. ఆ ఉత్సవాలనే బ్రహ్మోత్సవాలు అని అంటారు. బ్రహ్మ దేవుడు వేంకటేశ్వర స్వామి మందిరంలో దీపాన్ని వెలిగించాడు. అప్పటినుండి ఇప్పటివరకు ఆ దీపం ఆరిపోకుండా వెలుగుతూనే ఉన్నందువలన ఆ దీపాన్ని 'అఖండదీపం' అని అంటారు. వేంకటేశ్వర స్వామి యొక్క ఉత్సవవిగ్రహమైన శ్రీ మలయప్ప స్వామికి శ్రీదేవి – భూదేవి సమేతంగా శేష వాహనం, హంస వాహనం, సింహ వాహనం, ముత్యాల పందిరి వాహనం, సర్వభూపాల వాహనం, గరుడ వాహనం, హనుమంత వాహనం, గజ వాహనం, సూర్యప్రభ వాహనం, చంద్రప్రభ వాహనం మరియు అశ్వ వాహనాలపై ఊరేగింపులు చేస్తారు. చివరి రోజు సుదర్శనచక్రాన్ని స్వామిపుష్కరిణిలో స్నానం చేయిస్తారు. దీనినే చక్రస్నానం అని అంటారు. బ్రహ్మోత్సవాలలో ప్రతిరోజు శ్రీ మలయప్ప స్వామి మరియు శ్రీదేవి–భూదేవిల కంటే ముందుగానే సుదర్శనుని ఊరేగింపు ఉంటుంది. ఈ బ్రహ్మోత్సవాలను అన్నమాచార్య ఈ విధముగా కీర్తించిరి:

"వీధులలో ఉత్సాహంగా విహరిస్తున్న ఆ వేంకటవిభునికి ఆనందంతో మ్రొక్కండి. గరుడధ్వజముగల బంగారు రథములో ఇరువైపుల శ్రీదేవి–భూదేవిలతో శ్రీహరి ఉన్నాడు. జనులారా!

పగ్గములు పట్టండి. అప్సరసలు ఆడగా, గంధర్వులు పాడగా సర్వ సైన్యాధ్యక్షుడైన విష్వక్సేనులవారు వచ్చుచున్నారు. జనులారా! తిలకించండి. శ్రీవేంకటపతి శిఖరమదే! ఆ వైభములను తిలకించండి. ఓ జనులారా! గోవింద నామాలతో స్వామిని తలచండి."

"బ్రహ్మోత్సవాలు వానాకాలంలోనే వస్తాయి. అన్ని దిక్కుల నుండి జనులు వానలలోనే వస్తారు. భార్యాబిడ్డలు, పరివారం, బంధువులు, స్నేహితులు అందరితో కలిసి దూరదూరాల నుండి ఈ యాత్రను ఒక వ్రతముగా భావించి వస్తారు. ముడుపులు, జోలెలు, నెత్తిమూటలు, మంచి మణులు, ఏనుగులు, గుర్రములు మరియు భార్యలతో కదలివస్తారు. రాజులు, మండలాధిపతులు, జగదేకపతులు మరియు చతురులు మొదలైన వారంతా సంపదలతో వేంకటేశుని దర్శించుటకు వర్షాలను లెక్కచేయక వస్తారు."

"అప్సరసలు ఆనందంతో నర్తిస్తూ పాడుతున్నారు. గరుడవాహనుడు బంగారు రథముపై వీధులలో విహరిస్తుండగా దేవతలు, మునులు అందముగా శిరస్సులను కదుపుతున్నారు. భూమిని మోసిన ఆ హరి ఇంద్రరథంపై దిక్కులను గెలవగా శేషాదులు, బ్రహ్మశివాదులు స్వామికి సేవలు చేస్తున్నారు. అలమేలుమంగతో వేంకటేశుడు రథముపై రాగా నారదాది మునులు స్వామిని కీర్తిస్తున్నారు."

"ఇన్నిరకాల వాహనాలను ఎక్కడం ఎలానేర్చుకున్నావయ్యా! అందుకే నిన్ను ఇంతగా కీర్తిస్తున్నాము. పారిజాత అపహరణకు గరుడుని ఎక్కి వెళ్ళావు. బ్రాహ్మణ పడచులను ఉద్ధరించుటకు రథమెక్కి వెళ్ళావు. చక్కగా సీతాదేవితో అయోధ్యకు మరలివచ్చే సమయంలో కుబేరుని పుష్పక విమానమును ఎక్కి వచ్చావు. వానర సేనాపతులు చూస్తుండగా ఆంజనేయునిపై ఎక్కి రావణునిపై దాడి చేశావు. కల్కి అవతారమున అధర్మమును అణచుటకు గుర్రమును ఎక్కావు. ఇప్పుడు వేంకటాద్రిపై పల్లకిని ఎక్కావు."

“మా వంటివారి కోరిక తీరగా దేవదేవుడు దివ్యరథమును ఎక్కాడు. బ్రాహ్మణ పుత్రులను బ్రతికించుటకై ఆనాడు వెండి రథముపై సముద్రములు దాటాడు. రాముడై మిగుల కోపముతో దేవేంద్రుని రథముపై రావణుని మీదకు వెళ్లెను. దిక్కులన్నీ గాలించి సీతాదేవితో పుష్పక రథముపై అయోధ్యకు మరలాడు. విష్ణువు రథమును ఎక్కి ఆకాశము అదిరేలా నరకాసురునిపై దాడికి వెళ్లెను. శత్రువులను గెలిచి రుక్మిణీదేవితో కల్యాణ రథమును ఎక్కెను. వేంకటగిరి మీద వేంకటేశుడు అలమేలుమంగతో కలిసి రథముపై తిరిగెను.”

“బ్రహ్మోత్సవాలలో స్వామి మొదటగా పెద్దశేష వాహనముపై శ్రీదేవి-భూదేవిలతో వస్తారు. మరునాడు ఉదయము చిన్న శేష వాహనముపై వస్తారు. వేయి పడగలతో ఉన్న ఆదిశేషుని శిరస్సులు వజ్రాలవలె మెరుస్తుంటాయి. వేయి శిరస్సులపై మాణిక్యాలతో ఆదిశేషుడు హరికి తోడు-నీడగా వుంటాడు. ఆదిశేషుడు వేయి శిరస్సులతో రెండు వేల నాలుకలతో హరిని స్తుతించడంలో బహునేర్పరి. దేవతలు ఎప్పుడు మొర పెట్టుకోవాలన్నా ఆదిశేషునిపై పవళించిన నారాయణుని వద్దకే వెళతారు. దేవతలు ముందుగా ఆదిశేషునికే ప్రణామాలు చేస్తారు. ఆదిశేషుడే వేంకటపతికి, అలమేలుమంగకు కూడ పరుపుగా ఉన్నాడు.”

“ధర్మాన్ని తప్పిన రాక్షసులను సంహరించే ఓ చక్రమా! హరి చక్రమా! పాతాళమున దాగి ఉన్న హిరణ్యాక్షుని చీరిన చక్రమా! స్వామి వారి చెయ్యిని విడువక ఈ జగములను రక్షింపుము ఓచక్రమా! వేంకటాచల వీధుల్లో మెరుస్తూ తిరిగే ఓ చక్రమా! నీకు ఇవే మా ప్రణామములు.”

“హరిరథమునకు ముందు నొగలు కనపడుతున్నాయి. గరుడ ధ్వజపు గంటలవిగో, తిరుగుతున్న బంగారు చక్రములవిగో, తెల్ల గొడుగులవిగో, రథమునకు కట్టిన తోరణములవిగో, అదిగో రథసారధి,

దివ్యమైన గుఱ్ఱాలను కట్టిన ఆ రథము మేరు పర్వతమువలె మెరుస్తూ ఉన్నది. హరి రథమునకు ఇరువైపులా బ్రహ్మాదులు వేదములు చదువుతుండగా శ్రీరమణుడు ప్రకాశించుచున్నాడు. అప్సరసలు నృత్యం చేస్తూ కీర్తిస్తుండగా, తిరు వీధులలో అలమేలుమంగతో కూడి శ్రీవేంకటేశుడు కోటానుకోట్ల దాసుల కోరికలను తీర్చుటకు వస్తున్నాడు. ఆ శ్రీవేంకటేశునికి మ్రొక్కండి."

"బ్రహ్మోత్సవాలకు వచ్చిన శివుడు, బ్రహ్మాది దేవతలు మరియు మునులు చాలా అలసిపోయారు. వేంకటేశుడు వారికి వీడ్కోలు చెబుతూ 'ఓ యముడా! పోయిరా! దిక్పాలకులారా! మీమీ దిక్కులకు చేరండి. ఓ నారద సనకసనందనాదులారా! వెళ్లి రండి. ఆనందోత్సాహములతో ఇన్నాళ్ళు మీరు సేవ చేసి అలసిపోయారు. మరలా వచ్చే బ్రహ్మోత్సవాలకు తిరిగి రండి' అని తెలిపెను."

కల్యాణోత్సవము: ప్రతిరోజు మధ్యాహ్నం 12 గంటల నుండి దాదాపుగా ఒక గంట సమయం పాటు వేంకటేశ్వర స్వామికి కల్యాణోత్సవము జరుగును. ఈ ఉత్సవాన్ని 'నిత్య కల్యాణం' అని అంటారు.

అన్నమాచార్య నిత్య కల్యాణోత్సవమును దర్శించేటప్పుడు పద్మావతి వేంకటేశ్వరుల వివాహ వేడుకలను ఎన్నో కీర్తనలలో పాడారు. అందులోని కొన్ని కీర్తనల భావం:

"ఓ ముత్తైదువలారా! నానాదిక్కుల నుండి దేవుని వివాహానికి రండి. వేంకటేశ్వర స్వామికి మరియు శ్రీమహాలక్ష్మికి వివాహ ముహూర్తము ఈనాడే. దేవతలారా! భేరీలు మ్రోగాయి, గరుడధ్వజం ఎగురుతున్నది. దేవుని వివాహానికి అందరూ రండి. నేడు మన్మథ జనకునికి మరియు కమలాదేవికి వివాహం. మునులారా! వచ్చి గంధము తీసుకోండి. వేదములు పఠించే వారంతా రండి. ఈ దంపతులు మీకు వరాలనిస్తారు."

"అలమేలుమంగ–వేంకటేశులు వివాహం చేసుకోవడానికి తహతహలాడుతున్నారు. దంపతులకు బాసికములు కట్టండి. చేతులకు తలంబ్రాలు అందించండి. ముత్తైదువలారా! శుభమును కలిగించే పాటలను పాడండి. ముహూర్తము ఎప్పుడో ముందుగా అడిగి తెలుసుకోండి. త్వరగా మంగళాష్టకములను చదవండి. పెండ్లికుమారుడు మరియు పెండ్లికుమార్తె మధ్య తెరపట్టగా దొంగచూపులతో చూసుకుంటున్నారట. ఇక తెర తీయండి. ఇద్దరికీ కొంగుముళ్ళు వేయండి. ఇద్దరికీ కంకణ దారములను కట్టి పెండ్లి పీటల మీద కూర్చుండబెట్టండి. శ్రీవేంకటేశుని మరియు అలమేలుమంగను దీవించండి."

"పెండ్లి అంటేనే సందడి, సరదాలతో నిండి వుంటుంది. అందులో తలంబ్రాల ఘట్టం మరీను! సిగ్గులమొగ్గ అయిన పెండ్లికూతురు పిడికిట తలంబ్రాలతో కొంత ప్రక్కకు మరలి నవ్వుకుంటుంది. పేరుప్రఖ్యాతులు గల ఆ యువతి మెడలో పెద్ద ముత్యాల హారాన్ని ధరించి ఉన్నది. ఆ పెండ్లికూతురు తనకు కాబోయే భర్త పేరును చెప్పడానికి సిగ్గు పడిందట. మంగళసూత్ర ధారణ సమయంలో పెండ్లి కూతురు ఉత్సాహంగా వుంది. తలనిండా పూలదండలు ధరించింది. శ్రీవేంకటపతి కౌగిటిలో ఇమిడిపోయిన ఆ పెండ్లికూతురు నేరుగా స్వామి హృదయాన్ని చేరింది."

"ఓ అప్సరసలారా! వైభవంగా ఈనాడు ఆడండి పాడండి. ఇవిగో తాంబూలములు అందుకోండి. శ్రీరమణుని కల్యాణమునకు రెపరెపలాడుతున్న గరుడధ్వజము అదిగో! దివ్య దుంధుభులు మ్రోగుతున్నాయి. దివిలోని దేవతలారా! గమనించండి. లక్ష్మీవిభుని వివాహానికి అంకురార్పణము జరుగుతున్నది. శ్రీవైష్ణవులారా! గంధాక్షతలను అందుకోండి. శ్రీసతీ–వేంకటనాథుడు తలంబ్రాలు పోసుకొన్నారు. తీర్థప్రజలారా! ముడుపులు అందించండి."

"వైభవముల పావనమూర్తికి శుభ మంగళములు. నరకాసురుడు చెరబట్టిన పదహారువేల యువతులను వివాహమాడిన శ్రీకృష్ణునికి

శుభ మంగళములు. శిశుపాలుడు వివాహం చేసుకోవాలనుకున్న రుక్మిణిని తానే వచ్చి సందడిగా వివాహమాడిన సరసుడైన కృష్ణునికి శుభ మంగళములు. దేవతలు, దానవులు సముద్రమును మథించినపుడు శ్రీమహాలక్ష్మిని వివాహమాడిన శ్రీవేంకటగిరి శ్రీనిధికి జయ మంగళం, నిత్య శుభ మంగళం."

"మంచి ముహూర్తమున శ్రీపతి మరియు శ్రీదేవి పూల మాలలు మార్చుకున్నారు. ముత్తైదువులు పెండ్లిపాటలు పాడుతుండగా హరి–సిరి వివాహం చేసుకున్నారు. అంతటా దేవ దుందుభులు మ్రోగుతుండగా బాసికములు కట్టుకున్నారు. మునులు మంగళాష్టకములు చదువుతుండగా పోటీపడుతూ ఇద్దరూ తలంబ్రాలు పోసుకున్నారు. దేవతా కన్యలు హారతులను ఇస్తుండగా శ్రీవేంకటేశుడు అలమేలుమంగను కూడి అందరికీ వరములను అనుగ్రహిస్తున్నాడు."

శ్రీకృష్ణ జన్మాష్టమి: శ్రీకృష్ణుడు అవతరించినరోజు రాత్రి వేంకటేశ్వర స్వామి మందిరంలోని రుక్మిణి, కృష్ణుల ఉత్సవ విగ్రహాలను ఘంటా మండపములోనికి తీసుకువచ్చి చుట్టూ తెరను కట్టి అభిషేకం చేసి వస్త్రాభరణాలతో అలంకరిస్తారు. అలంకరణ చేసే సమయంలో దివ్య ప్రబంధాన్ని చదువుతారు. అలంకరణ పూర్తికాగానే భక్తులు రుక్మిణి కృష్ణులను దర్శిస్తారు. ఈ సమయంలోనే భాగవతంలోని శ్రీకృష్ణుని అవతార లీలలను చదువుతూ నైవేద్యమును కూడా సమర్పిస్తారు. నైవేద్యం పూర్తికాగానే రుక్మిణీ కృష్ణులను వేంకటేశ్వర స్వామి మందిరంలోనికి తీసుకువెళతారు.

తెల్లవారిన తరువాత రుక్మిణి కృష్ణులను వేంకటేశ్వర స్వామి మందిరం చుట్టూ ఊరేగింపు చేసి మందిరంలోనికి తీసుకువెళ్ళి నైవేద్యమును సమర్పిస్తారు. మధ్యాహ్నం ఒక పల్లకిలో శ్రీదేవి – భూదేవి సమేత మలయప్ప స్వామిని, మరియొక పల్లకిలో రుక్మిణి శ్రీకృష్ణులను ఊరేగింపు చేస్తారు.

5

వేంకటాచల పర్వతం (తిరుమల కొండ)

స్కందపురాణం నుండి

వేంకటాచల పర్వతం మీద అనేక తీర్థాలు ఉన్నాయి. వశిష్ఠ, కపిల, భరద్వాజ, గౌతమ వంటి ఎందరో మునుల ఆశ్రమాలు ఉన్నాయి. బ్రహ్మ, శివ, గణేశ, కార్తికేయ, ఇంద్ర మరియు కుబేర వంటి దేవతలు తమ కుటుంబ పరివారంతో వేంకటాచలంలో నివసిస్తూ వేంకటేశ్వర స్వామిని పూజిస్తూ సేవిస్తుంటారు. గోవులలో కామధేనువు, నాగులలో శేషుడు, పక్షులలో గరుత్మంతుడు, దేవతలలో విష్ణువు, వర్ణములలో బ్రాహ్మణ వర్ణం, చెట్లలో కల్పవృక్షం (కోరికలను తీర్చే చెట్టు), తీర్థాలలో గంగ, వెలుతురునిచ్చేవానిలో సూర్యుడు, ఆయుధాలలో వజ్రాయుధం, లోహాలలో బంగారం, వైష్ణవులలో రుద్రుడు మరియు రత్నాలలో కౌస్తుభం శ్రేష్ఠమైనట్లు పర్వతాలలో వేంకటాచల పర్వతం శ్రేష్ఠమైనది.

వేంకటాచల పర్వతం ఏడు యోజనాల (91 కిలోమీటర్లు) పొడవు, ఒక యోజనం (13 కిలోమీటర్లు) ఎత్తు ఉంటుంది. వేంకటాచల పర్వతానికి ఎక్కడనుండి ప్రణామాలు చేసినా వారి పాపాలు నశిస్తాయి మరియు వారు వైకుంఠానికి వెళతారు. ఈ పర్వతంపై 66 కోట్ల తీర్థాలు ఉన్నాయి. వేంకటాచలం అంటే పాపాలను తొలగించే పర్వతం అని అర్థం. వేంకటాచల పర్వతం వైకుంఠంతో, సమస్త తీర్థాలతో మరియు నారాయణునితో సమానం. పూర్వం నారాయణుడు వరాహ రూపాన్ని ధరించి ఈ వేంకటాచలంలో నివాసాన్ని ఏర్పాటు చేసుకున్నాడు.

దశవర్షైస్తు యత్పుణ్యం క్రియతే తు కృతేయుగే।
త్రేతాయామేకవర్షేణ తత్పుణ్యం సాధ్యతే నృభిః॥

ద్వాపరే పంచమాసేన తద్దినేన కలౌయుగే।
తత్ ఫలం కోటిగుణితం నిమిషేనిమిషే నృణామ్॥

సత్యయుగంలో పది సంవత్సరాలు పుణ్యకార్యాలు చేసిన ఫలం, త్రేతాయుగంలో ఒక సంవత్సరంలోనే లభిస్తుంది, ద్వాపరయుగంలో ఐదు నెలలలోనే లభిస్తుంది, కలియుగంలో ఐదు రోజులలోనే లభిస్తుంది. కలియుగంలో వేంకటాచలంలోని వేంకటేశ్వర స్వామిని దర్శించినవారి పుణ్యం కోట్ల రెట్లుగా వృద్ధి చెందుతుంది.

వేంకటాచలంలోని వేంకటేశ్వర స్వామిని దర్శిస్తే కాశి, ప్రయాగ వంటి తీర్థ స్థలాలను దర్శించవలసిన అవసరం లేదు. ఇంద్ర, బ్రహ్మ, శివాది దేవతల దర్శనం కూడా అవసరం లేదు. వేంకటాచల పర్వతంపై ఇంద్ర, బ్రహ్మ, శివాది దేవతలు తమ కుటుంబ పరివారంతో వేంకటేశ్వర స్వామిని సేవిస్తూ ఉంటారు.

వేంకటాచల పర్వతంపైకి ఎక్కేటప్పుడు ఈ విధంగా ప్రార్థించాలి: “ఓ బంగారు పర్వతమా! పర్వతాలలో శ్రేష్ఠమైన పర్వతమా! దేవతలతో పూజలు అందుకునే పర్వతమా! నీ శిఖరంపై ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుటకు నేను నీపై నా పాదాలు మోపుతున్నందుకు నన్ను క్షమించుము.”

అంజనాద్రి

తుంగభద్ర నది తీరంలో కేసరి, అంజనా దేవి అనే దంపతులు ఉండిరి. వీరికి సంతానం లేనందువలన అంజనా దేవి పుత్రుని కొరకు తపస్సు చేస్తుండెను. ఒకనాడు మతంగ ముని అంజనా దేవితో నీ తపస్సుకు కారణమేమని అడగగా అంజనా దేవి ఇలా తెలిపినది. “రాక్షసుడయిన నా తండ్రి కేసరికి సంతానం లేనందున శివుని కొరకు తపస్సు చేసెను. శివుడు దర్శనమిచ్చి ‘పూర్వజన్మ పాప ఫలితంగా నీకు సంతానం కలగలేదు. అయినా నా కొరకు చేసిన

తపస్సుకు ఫలంగా నీకు ఒక పుత్రిక జన్మిస్తుంది. ఆ పుత్రికకు ఒక పుత్రుడు జన్మిస్తాడు. అతని కీర్తి పదునాలుగు లోకాలలో విస్తరిస్తుంది' అని వరం ఇచ్చాడు. శివుని వరప్రభావంతో నేను జన్మించాను.

"కేసరి అనే వానరుడు నా తండ్రి కేసరి వద్దకు వచ్చి నన్ను వివాహమాడతానని అడగగా నా తండ్రి అందుకు అంగీకరించి వివాహం జరిపించెను. నా తండ్రి నా వివాహ కానుకగా కోటి ఆవులను, లక్ష ఏనుగులను, కోటానుకోట్ల రథాలను, గుర్రాలను, అనేకమైన ఆభరణాలను, రత్నాలను మరియు దాసీలను కానుకగా ఇచ్చెను. ఓ మునివర్యా! నేను నా పతితో కలసి ఈ కిష్కింధకు వచ్చాను. నాకు వివాహమయ్యి ఎన్నో సంవత్సరాలు గడచినా సంతానం కలుగలేదు. సంతానం కొరకు నేను అనేక వ్రతాలను, యజ్ఞాలను మరియు దానాలను చేసినా నాకు ఫలితం లేనందున సంతానం కొరకు తపస్సు చేస్తున్నాను" అని తెలిపింది.

మతంగ ముని అంజనా దేవితో "నీవు వేంకటాచల పర్వతానికి వెళ్లి అక్కడ స్వామి పుష్కరిణిలో స్నానం చేసి ఆ నీటిని త్రాగి అక్కడ వాయు దేవుని కోసం తపస్సు చేసినట్లయితే నీ కోరిక తీరుతుంది" అని తెలిపాడు. అంజనా దేవి మతంగ ముని తెలిపినట్లు చేసి ఆకాశగంగ తీర్థం వద్ద తపస్సు చేయగా వాయు దేవుడు దర్శనమిచ్చెను. వరం కోరుకొనమనగా అంజనా దేవి "పుత్రుని ప్రసాదించమని" కోరింది. వాయు దేవుడు "నా వలన నీకు కుమారుడు జన్మించును. ఆ కుమారుని వలన నీ కీర్తి పదునాలుగు లోకాలలో విస్తరిస్తుంది" అని వరం ఇచ్చెను.

అంజనా దేవి అక్కడే కేసరితో జీవిస్తునప్పుడు వాయు దేవుని వలన హనుమంతుడు జన్మించెను. అంజనా దేవి వేంకటాచల పర్వతంపై తపస్సు చేసిందిగనుక వేంకటాచల పర్వతానికి అంజనాద్రి అని పేరు వచ్చింది.

వరాహపురాణం నుండి

దశరథ మహారాజు

దశరథ మహారాజుకు సంతానం లేనందువలన వశిష్ఠ మునిని సంతానం పొందే మార్గాన్ని తెలుపమని ప్రార్థించెను. అప్పుడు వశిష్ఠ ముని "వేంకటాచల పర్వతంపై నారాయణుని కొరకు తపస్సు చేయమని" తెలిపెను. మహారాజు వశిష్ఠముని తెలిపినట్లు స్వామి పుష్కరిణిలో స్నానం చేసి నారాయణుని కొరకు తపస్సు చేశాడు. నారాయణుడు దర్శనమిచ్చి వరం కోరుకోమనగా మహారాజు నారాయణునికి ప్రదక్షిణ నమస్కారాలు చేసి స్తుతించి, పుత్ర సంతానాన్ని ప్రసాదించమని కోరాడు. నారాయణుడు "నీ పూర్వజన్మ పాపకర్మ ఫలితంగా నీకు సంతానం లేదు" అన్నాడు. అప్పుడు మహారాజు నారాయణునితో "సూర్యుడు ఉన్నచోట అంధకారం ఎలా ఉంటుంది? అదేవిధంగా నిన్ను దర్శించిన తరువాత కూడా నా పాపాలు నా దగ్గర ఎలా ఉండును?" అని అన్నాడు. నారాయణుడు మహారాజు మాటలకు సంతోషించి "నీవు నన్ను దర్శించినప్పుడు నాలుగు శ్లోకాలతో స్తుతించావు. అందువలన నేనే నీకు నలుగురు కుమారులుగా జన్మించి రావణాసురునితో పాటు ఇతర రాక్షసులను సంహరిస్తాను" అని వరం ఇచ్చెను.

శ్రీరాముడు

సీతా దేవి మరియు లక్ష్మణునితో శ్రీరాముడు వనవాసం చేసే సమయంలో రావణాసురుడు సీతను అపహరించి లంకకు తీసుకువెళ్లాడు. శ్రీరాముడు వానరులతోపాటు సీతను వెతుకుతూ వేంకటాచల పర్వతంపైకి వెళ్ళి వివిధ తీర్థాలలో స్నానం చేసెను. అప్పుడు అంజనా దేవి వచ్చి శ్రీరామునికి అతిథి సేవలు చేసినది. వేంకటాచల పర్వతంపై నివసించే ఋషులందరూ శ్రీరామునికి అతిథి సేవలు చేశారు.

వృషభాచలం

కృతయుగంలో వృషభాసురుడు అనే అసురుడు దేవతలను ఓడించి, బ్రాహ్మణులను మునులను ఇబ్బంది పెట్టసాగెను. బ్రాహ్మణులు, మునులు మరియు దేవతలు వృషభాసురుని బారినుండి తమను రక్షించమని నారాయణుని ప్రార్థించిరి. దేవతల కోరిక మేరకు నారాయణుడు వృషభాసురుని సంహరించాలని వైకుంఠ పర్వతంపై (వేంకటాచల పర్వతం) వృషభాసురునితో యుద్ధం చేస్తూ సుదర్శన చక్రాన్ని పట్టుకోగానే ఆ అసురుడు నారాయణునితో "ఓ నారాయణా! నీవు సంహరించిన రాక్షసులు ముక్తిని పొందారని విన్నాను. నాకు కూడా ముక్తిని ప్రసాదించి నన్ను సంహరించిన ఈ పర్వతానికి వృషభాచలం అని నా పేరు వచ్చేలా వరాన్ని ప్రసాదించమని" కోరాడు. నారాయణుడు అతని కోరికను తీర్చి వృషభాసురుని సంహరించి ముక్తిని ప్రసాదించెను.

శేషాద్రి

ఒకసారి నారాయణుడు ఆది శేషునితో "నీవు భూమి మీద కొండగా మారితే నీ మీద నివసిస్తాను" అని అన్నాడు. ఆది శేషుడు ఒప్పుకొని సువర్ణముఖారీ నది తీరంలో కొండగా మారాడు. ఆ కొండ మీదనే నారాయణుడు వేంకటేశ్వర స్వామిగా వెలసెను. అందువలన ఈ కొండకు శేషాద్రి అని పేరు వచ్చింది.

భవిష్యోత్తరపురాణం నుండి

శేషాద్రి

ద్వాపరయుగంలో ఒకసారి నారాయణుడు ఆది శేషుడిని ద్వారపాలకునిగా ఉంచి లక్ష్మీ దేవితో విహరిస్తుండెను. అదే సమయంలో వాయు దేవుడు నారాయణుని దర్శించడానికి వచ్చెను. ఆది శేషుడు బంగారు కట్టెను పట్టుకొని వాయు దేవుని లోనికి వెళ్ళనీయలేదు. వాయు దేవుడు "మూర్ఖుడా! నన్ను ఎందుకు

ఆపుచున్నావు? నాకు నారాయణునితో ముఖ్యమైన పని ఉన్నది. నన్ను త్వరగా లోపలికి వెళ్ళనివ్వు!" అని అన్నాడు. ఆది శేషుడు "నేను నారాయణుని ఆజ్ఞలను మాత్రమే పాటించేవాడిని. ఇంకెవరి ఆజ్ఞలను పాటించను. కావున నిన్ను నేను లోపలికి వెళ్లనివ్వను" అన్నాడు. వాయు దేవుడు ఆది శేషునితో "బుద్ధిహీనుడా! ద్వారపాలకునిగా నియమించబడిన జయ విజయులు అహంకారం వలననే మునులచే శపింపబడి రావణ కుంభకర్ణాది రాక్షసులుగా జన్మించిరి. ఆ విషయం మరచిపోయావా?" అని మందలించాడు.

ఆది శేషుడు కొంచెం కోపంతో "పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నావు! నీకు బ్రతకాలని లేదా? సకల ప్రాణులు తమ వెంట ఉన్న మృత్యువును తెలుసుకోలేకపోతున్నాయి. నీవు కూడా సమస్త ప్రాణులలో ఒకడివిలా ఉన్నావు. నాతో బలంలో, జ్ఞానంలో, వైరాగ్యంలో ఎవరూ సాటిరారు. నేను ఎల్లప్పుడూ నారాయణుని అంతఃపురంలో నివసిస్తున్నందువలన నేను నారాయణునికి అందరికంటే ప్రియమైన వాడను" అని గర్వంతో పలికెను.

ఈ మాటలు విన్న వాయు దేవుడు "పిల్లి ఇంట్లో తిరిగినంత మాత్రాన బయట తిరిగే ఏనుగుతో సమానం అవుతుందా! రత్నాభరణాలు అలంకరింపబడిన మంచం మీద సేవకుడు కూర్చొని రాజు కాళ్ళను నొక్కినంత మాత్రాన, ఆ సేవకుడు రాజుకు తన పుత్రునితో సమానం కాజాలనట్లు, నీవు నారాయణుని వద్ద ఉన్నంత మాత్రాన నారాయణునికి నీవు నా అంత ప్రియమైన వాడవు కావు" అన్నాడు.

ఈ విధంగా వాయు దేవునికి ఆది శేషునికి వాగ్వివాదం జరుగుతుండగా నారాయణుడు అచ్చటకు వచ్చెను. నారాయణుని చూడగానే ఆది శేషుడు మరియు వాయు దేవుడు నారాయణునికి దండప్రణామాలు చేసిరి. తరువాత ఆది శేషుడు జరిగినదంతా నారాయణునికి తెలిపెను. నారాయణుడు "మీరిద్దరూ మీయొక్క

బలాలను పరీక్షించుకోండి” అని తెలిపి “ఆది శేషా! ఆనందాద్రి (మేరు పుత్రుడు) అనే పర్వతాన్ని నీవు పట్టుకొనుము. వాయు దేవుడు నిన్ను కదిలిస్తే వాయువు బలవంతుడు, కదిలించకలేకపోతే నీవు బలవంతుడవు” అని తెలిపెను.

ఇద్దరు ఈ ఒప్పందానికి అంగీకరించారు. దేవతలందరూ దీనిని చూడడానికి వచ్చారు. ఆది శేషుడు ఆనందాద్రి పర్వతాన్ని చుట్టుకున్నాడు. వాయువు బలగర్వంతో గాలిని ఊదినా ఆ పర్వతాన్నిగాని ఆది శేషునిగాని కదిలించలేకపోయాడు. సమస్త జీవులు ఆ తీవ్రమైన గాలి వలన ఇబ్బందిపడసాగిరి. దేవతలు వాయు దేవునితో నీ క్రోధాన్ని వదిలి సమస్త జీవులను రక్షించమని ప్రార్థించినా వాయు దేవుడు వినలేదు. అప్పుడు దేవతలు ఆది శేషునితో నీవైనా క్రోధాన్ని విడచి జీవులను రక్షించమని ప్రార్థించిరి. ఆది శేషుడు దేవతల ప్రార్థనలను విని తన పట్టును వదలగానే ఆ గాలి వేగానికి ఆనందాద్రి పర్వతం ఆది శేషునితోపాటు సువర్ణముఖారీ నదీతీరంలో పడిపోయింది. వాయువు తన తప్పును తెలుసుకొని ఆది శేషునితో క్షమాపణలు వేడుకున్నాడు. ఈ ఆనందాద్రి పర్వతం ఆదిశేషుని వలన వచ్చిందిగనుక మరియు ఆనందాద్రి పర్వతం శేషుని అంశతో జన్మించినందువలన ఈ పర్వతానికి శేషాద్రి అని పేరు వచ్చింది.

వేంకటాచలం

కలియుగంలో కాళహస్తి నగరంలో మాధవుడు అనే బ్రాహ్మణుడు నివసిస్తుండెను. ఒకరోజు మాధవుడు పగటి సమయంలో తన భార్య చంద్రలేఖతో సంగమించడానికి సిద్ధపడెను. అప్పుడు చంద్రలేఖ మాధవునితో “పగటివేళ కేవలం పశుపక్ష్యాదులు మాత్రమే సంగమిస్తాయి. మానవులకు అది ధర్మవిరుద్ధమైన పాపకార్యము” అని ఉపదేశం చేసి మాధవుని కోరికను నివారించింది. తరువాత మాధవుడు పండ్లు మరియు దుంపల కోసం అడవికి వెళ్లాడు. అతను

అడవిలో ఒక వేశ్యను చూసి ఆమె వివరాలను తెలుసుకొని తన కామ కోరికను తీర్చమని అడిగెను. ఆ వేశ్య మాధవునితో "నీవు బ్రాహ్మణుడవు. ఇటువంటి చర్యల వలన నీవు కులభ్రష్టుడవవుతావు మరియు నీకు పాపం సంక్రమిస్తుంది" అని ఉపదేశం చేసింది. అయినా మాధవుడు కామానికి వశుడై ఆమెను బలవంతంగా అనుభవించాడు. వేశ్య మాధవునితో "నీవు బ్రాహ్మణ కులము నుండి పతనం చెందావుగనుక నీవు నాతోనే ఉండి మద్యాన్ని త్రాగుతూ మాంసాన్ని తింటూ జీవించమని" అన్నది. మాధవుడు కూడా దానికి ఒప్పుకొని ఆ వేశ్యతోనే మద్యాన్ని త్రాగుతూ మాంసాన్ని తింటూ జీవితాన్ని గడపసాగెను.

మాధవుడు ఇలా జీవితాన్ని గడుపుచుండగా పన్నెండు సంవత్సరాల తరువాత వేశ్య మరణించింది. మాధవుడు వేశ్య మరణాన్ని తట్టుకోలేక పిచ్చివాని వలె తిరుగసాగెను. కొంతకాలం తరువాత ఒకసారి కొందరు రాజులు వరాహ క్షేత్రానికి (వేంకటాచలానికి) వెళ్ళుచుండిరి. వారితో పాటు మాధవుడు కూడా వరాహ క్షేత్రానికి వెళుతుండగా, 'వైకుంఠాచలం' మీదికి వెళ్ళగానే మాధవుని పాపాలు తొలగిపోయాయి. అందువలన ఈ వైకుంఠ పర్వతానికి 'వేంకటాచలం' అని పేరు వచ్చింది. 'వేంకట' అనగా పాపాలు తొలగించేది అని అర్థం.

భాగవతం నుండి

బలరాముడు

పాండవులకు కౌరవులకు మధ్య కురుక్షేత్రంలో యుద్ధం నిశ్చయించబడింది. కౌరవులు మరియు పాండవులు బలరాముని సహాయమును అడిగిరి. బలరాముడు "మీరిద్దరూ నాకు సమానులే కావున మీకు నేను సహాయం చేయలేను" అని తెలిపెను. కృష్ణుడు పాండవులకు సహాయంగా వెళుతున్నాడని విన్న బలరాముడు ద్వారకలో ఉండకూడదనుకొని తీర్థయాత్రలకు బయలుదేరెను.

కౌశికి, సరయు, త్రివేణి, గౌతమి, గండకి, విపష, శోనా, గోదావరి, పంపా, భీమా, సువర్ణముఖారీ మరియు వేంకటాచలంలోని తీర్థాలను దర్శించి ఆ తీర్థాలలో స్నానాలు చేసి అక్కడి దేవతామూర్తులను దర్శించి బ్రాహ్మణులకు గోవులను బంగారాన్ని దానం చేసెను.

కంబ రామాయణం నుండి

సుగ్రీవుడు సీతాదేవిని అన్వేషణ కోసం వానరసేనను నాలుగు దిక్కులకు పంపిస్తున్నప్పుడు వివిధ పర్వతాల గురించి తెలిపెను. అందులో "వేంకటాచలం" గురించి వానరసేనకు ఈ విధముగా తెలిపెను. "సువర్ణ ముఖారీ నది తీరంలో వెంకటాచలం ఉన్నది. ఆ వేంకటాచలని దర్శించిన వారికి సమస్త పాపాలు నశించి మోక్షం లభించును. ఆ పర్వతం మీద నారాయణుడు నివసిస్తున్నాడు. ఆ వేంకటాచలం మీద నివసించే భక్తులు పాపపుణ్యాలకు అతీతంగా ఉండి కర్మబంధనాలను తెంపుకొని సంపూర్ణమైన ఆత్మజ్ఞానంతో నారాయణుని సేవిస్తుంటారు. వారు ఎవరి ప్రణామాలైనా ఎక్కడి నుండైనా స్వీకరించడానికి యోగ్యులు."

హనుమంతుని దళం సీతాదేవిని వెదకుతూ వేంకటాచలం మీదికి వెళ్లిరి. అక్కడి మునులకు ప్రణామాలు చేసి సీతాదేవిని వెదకిరి. వేంకటాచలంలో సీతాదేవిని కనుగొనలేక దక్షిణ దిక్కుకు వెళ్లిరి.

అన్నమాచార్య

అన్నమాచార్య తిరుమల కొండను కీర్తిస్తూ అనేకమైన కీర్తనలను పాడిరి. అందులోని ఒక కీర్తన భావం :

"తిరుమల కొండ పదివేల పడగలతో ఉన్న శేషుడు. బ్రహ్మాది దేవతలకు అద్భుతమైనదిగా కనిపిస్తుంది. మునులు మరియు దేవతలు నివసించడానికి మంచి ప్రదేశం. బంగారు శిఖరాలతో ఉన్న వేంకటగిరికి నమస్కరించండి. తిరుమల క్షేత్రంలో ఎక్కడ

చూసినా పుణ్యతీర్థాలు ఉన్నాయి. వేంకటగిరి మోక్షాన్ని ఇచ్చును. వేంకటేశ్వరుడు నివసించిన తిరుమల కొండ వైకుంఠంతో సమానం. వేంకటాద్రిపై ఏ దారి ప్రక్కన చూసినా మునుల ఆశ్రమాలు ఉన్నాయి. ఎక్కడ చూసినా ఆరాధనలు కనబడుతున్నాయి. కోరుకున్న పండ్లను ఇచ్చే చెట్లు ఉన్నాయి. వేంకటేశుని దర్శనానికి వెళుతున్న భక్తులు ఎక్కడ చూసినా కనబడుతున్నారు."

వేంకటాచల పర్వతమును అన్నమాచార్యతో పాటు అనేక ఆచార్యులు కూడా స్తుతించారు. ఆళ్వారులు వేంకటాచల పర్వతమును స్తుతించడమును ఆళ్వారుల స్తుతి అనే ఎనిమిదవ అధ్యాయంలో మీరు చూడవచ్చు.

(శ్రీనివాస మంగాపురం నుండి తిరుమల చేరుకోవడానికి 2400 మెట్లు ఉన్నాయి, అలిపిరి నుండి 3550 మెట్లు ఉన్నాయి).

6

తిరుమలలో దర్శనీయ స్థలాలు

స్వామి పుష్కరిణి మహాత్మ్యం

వేంకటేశ్వర స్వామి మందిరం ప్రక్కన వరాహ స్వామి మందిరానికి ఎదురుగా ఉన్న కోనేరును స్వామి పుష్కరిణి అని అంటారు. స్వామి పుష్కరిణి యొక్క విస్తీర్ణం ఒకటిన్నర ఎకరం ఉంటుంది. వైకుంఠ ఏకాదశి రోజు సమస్త తీర్థాలు వచ్చి ఈ పుష్కరిణిలో కలుస్తాయిగనుక ఈ 'పుష్కరిణికి ముక్కోటి తీర్థం' అని పేరు వచ్చింది. పుష్కరిణులన్నింటికీ ఈ పుష్కరిణి స్వామి వంటిది కనుక 'స్వామి పుష్కరిణి' అని కూడా పేరు వచ్చింది.

సరస్వతి దేవి (బ్రహ్మాండ పురాణం నుండి)

బ్రహ్మ దేవుని యొక్క భార్య అయిన సరస్వతి దేవి నదులన్నింటిలో గొప్ప నదిగా ఉండాలని సరస్వతి నదిగా అవతరించింది. సరస్వతి నది తీరానికి ఒకసారి పులస్త్య ముని వచ్చి తపస్సు చేయుచుండెను. పులస్త్య ముని తనకు కుమారుడుగనుక సరస్వతి దేవి ఆయన వద్దకు వచ్చి పూజించలేదు. సరస్వతి దేవి తనను పూజించకపోవడం అవమానంగా భావించిన పులస్త్య ముని సరస్వతి దేవిని "నీవు ఏ కోరికతో నదిగా అవతరించావో ఆ కోరిక నెరవేరదు. విష్ణు పాదాల నుండి ఉద్భవించిన గంగా నదికి ఆ కీర్తి వచ్చును" అని శపించెను. సరస్వతి దేవి అందుకు ప్రతిగా పులస్త్య మునితో "నీవు నన్ను నిష్కారణంగా శపించావుగనుక నేటి నుండి నీ వంశంలో అందరూ రాక్షసులు జన్మిస్తారు" అని ప్రతిశాపమిచ్చెను. అంతట పులస్త్య ముని తన తప్పును తెలుసుకొని క్షమించమని ప్రార్థించి, శాపవిమోచనం తెలుపమని అడుగగా సరస్వతి దేవి "నీ వంశంలో

విభీషణుడు అనే విష్ణు భక్తుడు జన్మించి నీ కీర్తిని పెంచును" అని దీవించింది.

తరువాత సరస్వతి దేవి నదులన్నింటిలో గొప్ప నదిగా ప్రసిద్ధిని పొందాలని నారాయణుని కొరకు తపస్సు చేసినది. నారాయణుడు దర్శనమిచ్చి సరస్వతి దేవితో "పులస్త్య ముని శాపాన్ని నేను తీసివేయలేను అదే సమయంలో నీవు కోరిన వరాన్ని కూడా తిరస్కరించలేను" అని తెలిపి "పులస్త్య ముని శాపం నదులకు వర్తిస్తుంది, తీర్థాలకు కాదు. అందువలన నీవు వేంకటాచలంలో పుష్కరిణిగా అవతరించుము. నేను కలియుగంలో ఆ పుష్కరిణి తీరంలో వేంకటేశ్వర స్వామిగా వెలుస్తాను. 33 కోట్ల 50 లక్షల తీర్థాలు నా దర్శనానికి వచ్చి నీలో స్నానం చేసి నిన్ను స్తుతిస్తాయి. ఆ విధంగా నీవు సమస్త తీర్థాలలో ఉన్నతమైన తీర్థంగా ప్రసిద్ధి చెందుతావు" అని వరాన్ని ఇచ్చెను. సరస్వతీ దేవి నారాయణుడు తెలిపిన విధంగా తీర్థంగా మారిపోయింది. ఆ తీర్థానికే స్వామి పుష్కరిణి అని పేరు వచ్చింది.

స్కందపురాణం నుండి

కశ్యపుడు

పాండవుల వారసుడైన పరీక్షిన్మహారాజు ధర్మబద్ధంగా రాజ్యాన్ని పరిపాలిస్తున్నాడు. ఒక రోజు జంతువులను వేటాడే క్రమంలో ఒక జింకను వెంబడిస్తూ ఆయన శమీక ముని ఆశ్రమానికి వెళ్లెను. పరీక్షిన్మహారాజు శమీక మునికి ప్రణామాలు చేసి "ఇటుగా జింక వచ్చినదా స్వామీ!" అని అడిగెను. శమీక ముని ధ్యానంలో ఉన్నందువలన సమాధానం ఇవ్వలేదు. పరీక్షిన్మహారాజు ఆకలిదప్పులతో ఉన్న కారణంగా అడిగిన ప్రశ్నకు బదులు ఇవ్వలేదనే విసుగుతో ప్రక్కనే చనిపోయి ఉన్న పామును తన బాణంతో తీసి శమీక ముని మెడలో వేసి వెళ్లాడు. జరిగిన విషయం తెలిసిన శమీక ముని యొక్క కుమారుడైన శృంగి పరీక్షిన్మహారాజు

"ఏడు రోజులలో తక్షకుడు అనే పాము కాటుతో మరణించుగాక" అని శపించెను.

ఈ విషయం తెలిసిన ధన్వంతరి యొక్క శిష్యుడైన కశ్యపుడు పరీక్షిన్మహారాజును బ్రతికించడానికి వెళ్ళుచుండెను. ఈ సంగతి తెలుసుకున్న తక్షకుడు అతనికి ఎదురు వెళ్లి "పరీక్షిన్మహారాజు ఇచ్చే ధనాన్ని నేనే నీకు ఇస్తాను" అని ఆశ చూపి ధనాన్ని ఇచ్చి అతని దారి మళ్లించెను. తరువాత తక్షకుడు పరీక్షిన్మహారాజును కాటు వేసి సంహరించాడు. పరీక్షిన్మహారాజును కాపాడనందుకు బంధువులు, బ్రాహ్మణులు, మిత్రులు, అందరూ కశ్యపుని నిందించారు. కశ్యపుడు ఆ నిందలను భరించలేక శాకల్య ముని వద్దకు వెళ్లి జరిగినది తెలిపెను. శాకల్య ముని కశ్యపునితో "గొప్ప కృష్ణ భక్తుడు మరియు ధర్మాత్ముడైన పరీక్షిన్మహారాజును కాపాడే శక్తి నీకు ఉన్నా నీవు రక్షించలేదు. వైద్యుడు రోగికి మరణించే సమయం వరకు వైద్యాన్ని అందించి రోగిని రక్షించడానికి ప్రయత్నించాలి. ధనాశతో క్రోధంతో అసూయతో రోగికి వైద్యం అందించనట్లయితే ఆ వైద్యునికి బ్రహ్మహత్య పాతకం వంటి పాపాలు సంక్రమిస్తాయి. నీవు పరీక్షిన్మహారాజును రక్షించే శక్తి ఉన్నా ధనంపై ఆశతో అతనిని రక్షించని కారణంగా నీకు పాపం సంక్రమించింది" అని తెలిపెను. కశ్యపుడు తన పాపానికి నివృత్తి మార్గం తెలుపమని అర్థించగా, శాకల్య ముని "సువర్ణముఖారీ నదీతీరంలో వేంకటాచల పర్వతం మీద ఉన్న స్వామి పుష్కరిణిలో స్నానం చేస్తే నీ పాపం నశిస్తుంది" అని తెలిపాడు. కశ్యపుడు అలాగే చేసి తన పాపం నుండి విముక్తుడయ్యాడు.

ధర్మగుప్తుడు

చంద్రవంశంలోని నంద అనే రాజు తన కుమారుడైన ధర్మగుప్తునికి రాజ్యాన్ని అప్పగించి తపస్సుకై అడవులకు వెళ్లెను. ధర్మగుప్తుడు ఒకరోజు వేటకై అడవికి వెళ్లగా చీకటి పడడంతో ఒక

చెట్టుపైకి ఎక్కాడు. అప్పటికే చెట్టుపై ఒక ఎలుగుబంటి ఉండడంతో తన ప్రాణాలను కాపాడుకోవడానికి అతడు చెట్టు క్రిందకి దిగుతూ ఉండగా, అదే సమయంలో చెట్టు క్రిందకి ఒక సింహం వచ్చింది. భయపడుతున్న ధర్మగుప్తునితో ఎలుగుబంటి "భయపడకు, నేను నిన్ను తినను, కాపాడతాను. భయపడవద్దు" అని ధైర్యం తెలిపి "నీవు నా తొడ మీద అర్ధరాత్రి వరకు నిద్రించు, నీవు లేచాక నీ తొడ మీద నేను నిద్రిస్తాను" అని పలికింది. ధర్మగుప్తుడు అందుకు అంగీకరించి అలాగే నిద్రించాడు. ఆ సమయంలో సింహం ఎలుగుబంటితో "ఈ రాజు మన ఇద్దరికీ శత్రువేగనుక రాజును కిందికి త్రోసివేస్తే నేను తిని వెళ్ళిపోతాను" అన్నది. ఎలుగుబంటి సింహంతో "నమ్మిన మిత్రుడిని మోసంచేసిన పాపం పదివేల యజ్ఞాలు చేసినా నశించదని శాస్త్ర వచనం. కనుక నేను రాజును మోసం చేయలేను" అని తెలిపింది. కొంతసేపటికి రాజు నిద్ర లేచాక రాజు తొడ మీద ఎలుగుబంటి నిద్రించింది. అప్పుడు సింహం రాజుతో "నీవు ఎలుగుబంటిని త్రోసివేసినట్లయితే నేను ఎలుగుబంటిని తిని నిన్ను వదిలేస్తాను" అన్నది. రాజు సింహం తెలిపినట్లే ఎలుగుబంటిని త్రోసివేయగా చెట్ల కొమ్మలను పట్టుకొని తన ప్రాణాలను రక్షించుకొన్న ఎలుగుబంటి రాజుతో "ఓ రాజా! భృగు వంశంలో జన్మించిన ధ్యాననిష్ఠ అనే బ్రాహ్మణుడనైన నేను ఇచ్చానుసారం ఇతర జీవుల రూపాలను ధరిస్తూ ఉంటాను. నన్ను మోసగించిన కారణంగా నీవు పిచ్చివాడివి కాగలవు" అని శపించింది.

తరువాత సింహంతో "యక్షుడవైన నీవు ఒకసారి భార్యతో వనంలో నగ్నంగా విహరిస్తూ గౌతమ ముని ఆశ్రమంలోనికి వెళ్లావు. గౌతమ ముని 'నీవు యక్షుడవై ఉండి కూడా జంతువువలె నగ్నంగా తిరుగుతున్నావుగనుక సింహం వలె మారిపో!' అని శపించాడని" తెలిపింది. ఈ వృత్తాంతం వినగానే సింహానికి శాపవిమోచనం కలిగి యక్షునిగా మారిపోయింది. యక్షుడు ఎలుగుబంటితో "నీవు నిజం తెలిపావు. గౌతమ ముని నన్ను శపించినప్పుడు శాప విమోచనం

గురించి నేను ప్రార్థించగా గౌతమ ముని 'ఒక ఎలుగుబంటి నీ పూర్వజన్మ వృత్తాంతం తెలిపినప్పుడు నీకు శాప విమోచనం కలుగుతుంది' అని తెలిపాడు. ఈనాటికి మీ దయవలన నాకు శాపం విమోచనం కలిగింది" అని యక్షుడు పలికి ఎలుగుబంటికి ప్రణామాలు చేసి తన లోకానికి వెళ్లిపోయాడు.

ధర్మగుప్తుడు పిచ్చివాడై రాజ్యంలో తిరుగుచుండగా మంత్రులు ధర్మగుప్తుని అడవికి తీసుకువెళ్లి నందునితో "నీ కుమారుడైన ధర్మగుప్తుడు పిచ్చివాడయ్యాడు" అని తెలిపారు. నందుడు తన కుమారుడిని జైమిని ముని వద్దకు తీసుకువెళ్లి, అతను పిచ్చివాడైన కారణమును తెలుపమని అర్థించెను. జైమిని ముని జరిగినదంతా వివరించాడు. నందుడు జైమిని మునితో తన కుమారుడు చేసిన పాపం మరియు ఎలుగుబంటి శాపం తొలగే మార్గాన్ని తెలుపమని ప్రార్థించాడు. జైమిని ముని "వేంకటాచలం అనే పర్వతంపై గల స్వామి పుష్కరిణిలో నీ కుమారుడిని స్నానం చేయిస్తే అతడు చేసిన పాపం నుండి మరియు ఎలుగుబంటి శాపం నుండి విముక్తుడు అవుతాడు" అని తెలిపాడు. నందుడు జైమిని ముని తెలిపినట్లే తన కుమారున్ని స్వామి పుష్కరిణిలో స్నానం చేయించి పాపం మరియు శాపం నుండి విముక్తిని కలిగించాడు.

సుమతి

మహారాష్ట్ర దేశంలో సుమతి అనే ఒక బ్రాహ్మణుడు దుర్మార్గుల సాంగత్యం వలన వేశ్యతో జీవిస్తూ సురాపానం మరియు దొంగతనాలు చేస్తూ కాలాన్ని గడుపుతూ ఉండెను. ఒకరోజు సుమతి ధనం కోసం దొంగతనానికి వెళ్లి ఒక బ్రాహ్మణుని సంహరించిన కారణంగా అతనికి బ్రహ్మహత్య పాతకం సంక్రమించింది. తన దీనస్థితిని సుమతి తన తండ్రి అయిన యజ్ఞదేవునికి తెలుపగా ఆయన తన కుమారుడిని దుర్వాస ముని వద్దకు తీసుకువెళ్లి సుమతి చేసిన పాపాల నుండి ముక్తిని కలిగించమని ప్రార్థించెను. దుర్వాస

ముని "వేంకటాచల పర్వతం మీద ఉన్న స్వామి పుష్కరిణిలో స్నానం చేయించండి" అన్నాడు. యజ్ఞదేవుడు ఆ విధంగా చేసి తన కుమారుడిని బ్రహ్మహత్య పాపం నుండి విముక్తుని చేసెను.

వరాహ స్వామి మందిరం

భవిష్యోత్తరపురాణం నుండి

వరాహ స్వామి హిరణ్యాక్షుని సంహరించిన తరువాత మునులు "స్వామీ! మీరు భూమిపై నివసిస్తూ, మమ్మల్ని రక్షిస్తూ మరియు ఇతరులకు దర్శనం ఇవ్వమని" ప్రార్థించిరి. వరాహ స్వామి "మీ కోరికను నేను నెరవేరుస్తాను" అని తెలిపి వేంకటాచలంలో నివసించెను.

భృగు మహర్షి నారాయణుని పరీక్షించిన తరువాత లక్ష్మీ దేవి వైకుంఠమును వదలి వెళ్లింది. లక్ష్మీ దేవి లేని వైకుంఠంలో నారాయణుడు ఉండలేక వేంకటాచలం వచ్చి వరాహ స్వామిని దర్శించెను. వెంకటాచలం వచ్చిన కారణమేమని వరాహ స్వామి నారాయణుని ప్రశ్నించగా జరిగినదంతా వివరించిన నారాయణుడు వెంకటాచలంపై కలియుగాంతం వరకు నివసించడానికి వరాహ స్వామిని అనుమతి కోరెను. అందుకు వరాహ స్వామి "తగినంత మూల్యమును (ధనమును) ఇచ్చినచో నీకు స్థలమును ఇచ్చెదను" అనెను. నారాయణుడు వరాహ స్వామితో "ప్రస్తుతం నావద్ద లక్ష్మీ దేవి (ధనం) లేనందువలన ధనరూపేణ నేను ఏమీ ఇవ్వలేను. రాబోయే కలియుగంలో నా దర్శనానికి వచ్చే భక్తులు నాకంటే ముందుగా నిన్ను దర్శిస్తారు. నాకంటే ముందుగా నీకు అభిషేకాలు, పూజలు, నైవేద్యాలు సమర్పిస్తారు. ఇదే నేను మీకు ఇచ్చే ధనము" అని అన్నాడు. అందుకు వరాహ స్వామి సమ్మతించి నారాయణునికి నూరు అడుగుల స్థలాన్ని ఇచ్చెను. (అందువలన ఇప్పటికీ భక్తులు ముందుగా వరాహ స్వామినే దర్శిస్తారు. వరాహ స్వామికి వేంకటేశ్వర స్వామి కంటే ముందుగానే నైవేద్యాలు, హారతులు జరుగుతాయి)

స్కందపురాణం నుండి

వేంకటాచలంపై నివసించే వేంకటేశ్వర స్వామి యొక్క భక్తుడైన వసు ఒకరోజు నారాయణపురాన్ని పరిపాలించే తొండమానుడి వద్దకు వెళ్లి: "ఓ రాజా! ఒకరోజు ఒక తెల్లని వరాహం (పంది) వరి పంటను నాశనం చేస్తున్నదని నేను సంహరించడానికి వెళ్లగా ఆ వరాహం స్వామి పుష్కరిణి వద్ద ఉన్న పుట్టలోనికి పారిపోయింది. నేను ఆ పుట్టను త్రవ్వుచుండగా స్పృహ తప్పి పడిపోయాను. నా కుమారుడు నా పరిస్థితిని చూసి వేంకటేశ్వర స్వామిని ప్రార్థించగా, ఆ వరాహం నాలోనికి ఆవహించి నా కుమారునితో ఇలా పలికెను: 'నిషాద రాజా! నీవు తొండమానుని వద్దకు వెళ్లి ఈ విధంగా తెలుపుము. ఓ రాజా! ఈ పుట్టను నల్లని ఆవుల పాలతో అభిషేకం చేస్తే పుట్టలో నుండి ఒక సుందరమైన రాయి వస్తుంది. ఆ రాయితో నా విగ్రహాన్ని చేయించుము. ఆ విగ్రహానికి వరాహ ముఖం ఉండాలి, నా ఎడమతొడపై భూదేవి కూర్చొని ఉండి, నేను నిలబడి ఉండాలి' అని తెలిపింది. నాకు బాహ్య స్పృహ వచ్చిన తరువాత నా కుమారుడు వరాహ స్వామి నాతో పలికించిన మాటలను నాకు తెలిపెను" అని తొండమానునికి తెలిపెను.

తొండమానుడు వసుతో నీవు తెలిపినట్లే చేస్తానని తెలిపి, మంత్రితో "మన నల్లని ఆవులను వేంకటాచలంపైకి తీసుకురమ్మని" ఆదేశించెను. తరువాత తొండమానుడు జరిగిన విషయం అంతఃపురంలోని తన రాణులకు తెలిపి నిద్రించాడు. ఆ రోజు రాత్రి కలలో తొండమానుడికి తన అంతఃపురం నుండి స్వామి పుష్కరిణి వరకు ఒక సొరంగ మార్గం కనబడింది. ఉదయం లేచి చూడగా నిజంగానే సొరంగం ఉన్నది. తొండమానుడు ఆ సొరంగ మార్గం ద్వారా స్వామి పుష్కరిణికి వెళ్లి వరాహ స్వామి తెలిపినట్లే నల్లని ఆవుల యొక్క పాలతో పుట్టకు అభిషేకం చేయగా బయటకు వచ్చిన సుందరమైన నల్లని శిలతో భూదేవి సమేత వరాహ స్వామిని చేయించి మందిరాన్ని నిర్మించి ప్రతిష్ఠించెను. వేంకటేశ్వర స్వామి

మందిరానికి అధికారిగా ఉన్న మహంతు ప్రయాగదాసు 1900ల సంవత్సరంలో శిథిలమైన వరాహ స్వామి మందిరాన్ని పునరుద్ధరణ చేశారు. ఇప్పుడు ఈ వరాహ స్వామి మందిరంలో మూల భూదేవి సమేత వరాహ స్వామితోపాటు, భూదేవి సమేత వరాహ స్వామి యొక్క అర్చా విగ్రహాలు, వేంకటేశ్వర స్వామి యొక్క అర్చా విగ్రహం, సాలిగ్రామాలు ఉన్నాయి). బ్రహ్మోత్సవం చివరి రోజున వేంకటేశ్వర స్వామి తన భార్యలైన శ్రీదేవి–భూదేవిలతో కలిసి వరాహస్వామిని దర్శించుకుంటారు.

వేంకటేశ్వర స్వామి మందిరం

భవిష్యోత్తరపురాణం నుండి

వేంకటేశ్వర స్వామి పద్మావతి దేవిని వివాహం చేసుకొని కొద్ది రోజులు అగస్త్య ముని ఆశ్రమంలో నివసించెను. ఒకరోజు తొండమానుడు వేంకటేశ్వర స్వామి వద్దకు వచ్చి ప్రణామాలు చేసెను. వేంకటేశ్వర స్వామి తొండమానుని ఆలింగనం చేసుకొని తన రాకకు కారణమేమని ప్రశ్నించెను. తొండమానుడు "స్వామీ! మీ దర్శనం కంటే నాకు ఏదీ ముఖ్యం కాదు. ఓ వేంకటేశ్వర స్వామీ! నీవు యోగులకు అధిపతివి. నీవే సృష్టికర్తవు. బ్రహ్మదేవుని నియమించేవాడివి, లక్ష్మీదేవితో విహరించేవాడివి" అని పరిపరివిధాల స్తుతించి "మీ సేవ చేసి నా జీవితాన్ని సార్థకం చేసుకుంటాను" అని ప్రార్థించెను. వేంకటేశ్వర స్వామి "ఓ రాజా! నేను వేంకటాచలం మీద నివసించడానికి మూడు ప్రాకారాలతో, రెండు గోపురాలతో, ఏడు ద్వారాలతో, పూలమాలలు అల్లేగది, వంట గది, యాగశాల, వస్త్రాల గది, నూనెల గది, భోజనాల గది, ఆభరణాల గది వంటి గదులతో ఒక అద్భుతమైన మందిరాన్ని నిర్మింపుము" అని అన్నాడు.

మందిరం నిర్మించే సమయంలో వేంకటేశ్వర స్వామి తొండమానునితో "మందిరం కట్టే స్థలం వద్ద ఉన్న చింత వృక్షం నా

నివాస స్థలం. చంపక వృక్షం లక్ష్మీదేవి నివాస స్థలం. అందువలన ఆ వృక్షాలను తీసివేయవద్దు. మునులతో పాటు నీవు కూడా ఆ చెట్లను పూజింపుము" అని తెలుపగా తొండమానుడు వేంకటేశ్వర స్వామి తెలిపిన విధంగానే మందిరాన్ని నిర్మించెను.

ఆ మందిరానికి (శ్రీనివాసమంగాపురం నుండి) మెట్లను కూడా నిర్మించి స్వామికి విన్నవించెను. వేంకటేశ్వర స్వామి ఆ మందిరంలోనికి ఒక శుభ ముహూర్తంలో దేవతలతో పాటు వెళ్లి పద్మావతిని వక్షస్థలంలో నిలిపి, ఎడమ చేతిని నడుము మీద ఉంచి కుడి చేతితో తన పాదాలను ఆశ్రయించమని దర్శనమిస్తూ అర్చామూర్తిగా మారిపోయెను.

గొల్లమండపం

రామానుజాచార్య ఒకసారి సంవత్సరం పాటు కపిల తీర్థం వద్ద గల నమ్మాళ్వారుల మందిరంలో ఉన్నప్పుడు తిరుమలనంబి నుండి 18 సార్లు రామాయణాన్ని విన్నారు. అదే సమయంలో తొండూరుకొండి అనే భక్తురాలు రామానుజాచార్యకు ప్రతిరోజు ఆవుపాలను ఇస్తుండేది. రామానుజాచార్య తిరిగి శ్రీరంగం వెళుతూ ఆమె సేవకు ప్రతిఫలంగా కొంత ధనాన్ని ఇవ్వగా తొండూరుకొండి రామానుజాచార్యతో "స్వామీ! నాకు ధనం కాదు, మోక్షాన్ని ప్రసాదించండి" అని కోరింది. రామానుజాచార్య "మోక్షాన్ని ఇవ్వగలిగేది వేంకటేశ్వర స్వామి మాత్రమేగనుక నీవు ఆ స్వామిని ప్రార్థించు" అని తెలిపిరి.

అందుకు తొండూరుకొండి రామానుజాచార్యతో "నేను వేంకటేశ్వర స్వామిని ప్రార్థిస్తే మోక్షాన్ని ఇస్తాడో ఇవ్వడో నాకు తెలియదుగనుక, నాకు మోక్షాన్ని ఇవ్వమని మీరు స్వామికి ఒక లేఖను వ్రాసి ఇవ్వండి" అని అడిగింది. రామానుజాచార్య ఆమె భక్తికి మెచ్చుకొని లేఖలో "ఓ వేంకటేశ్వర స్వామీ! ఈమె నాకు ప్రతి

రోజూ పాలను ఇచ్చినందుకు ప్రతిఫలంగా మోక్షాన్ని అర్థిస్తుంది. ఈమెకు మోక్షాన్ని ప్రసాదించండి" అని ప్రార్థిస్తూ లేఖను వ్రాసి తొండూరుకొండికి ఇచ్చాడు.

తొండూరుకొండి తిరుమలకు వెళ్లి స్వామి పుష్కరిణిలో స్నానం చేసి వేంకటేశ్వర స్వామిని దర్శించి రామానుజాచార్య ఇచ్చిన లేఖను వేంకటేశ్వర స్వామి పాదాల వద్ద ఉంచి బయటకు వచ్చి కట్టెలతో పేర్చిన చితిలో అగ్నిప్రవేశం చేసి తన శరీరాన్ని వదిలింది. తొండూరుకొండి భక్తికి మెచ్చిన వేంకటేశ్వర స్వామి పుష్పక విమానంలో ఆమెను వైకుంఠం తీసుకువెళ్లాడు. ఈమె శరీరం వదిలిన స్థలంలో నిర్మించిన మండపాన్నే గొల్లమండపం అని అంటారు. ఈ మండపం మొదటి గోపురం ఎదురుగా ఉంటుంది.

తిరుమలనంబి మందిరం (ఇల్లు)

శ్రీ వైష్ణ ఆచార్యులలో ఒకరైన యామునాచార్య వేంకటేశ్వర స్వామి సేవ కొరకై తన శిష్యుడైన తిరుమలనంబిని తిరుమలకు పంపెను. తిరుమలనంబి యామునాచార్య ఆదేశానుసారం తిరుమల వచ్చి వేంకటేశ్వర స్వామికి జీవితాంతం సేవ చేసెను. తన శరీరాన్ని వదిలే సమయంలో వేంకటేశ్వర స్వామితో "ఓ స్వామీ! నేను మా గురుదేవులు యామునాచార్య ఆదేశానుసారం మీకు సేవ చేశాను. ఇక నేను ఈ శరీరాన్ని వదులుతున్నాను. నేను మీ సేవలో ఏమైనా తప్పులు చేసి ఉంటే నన్ను క్షమించండి" అని ప్రార్థించారు.

అక్కడి భక్తులందరితో "నేను మీ పట్ల ఏవైనా అపరాధాలు చేసి ఉంటే నన్ను క్షమించండి" అని ప్రార్థించి తన శరీరాన్ని వదిలారు. భక్తులు తిరుమలనంబి జ్ఞాపకార్థం వేంకటేశ్వర స్వామి మందిరమునకు కుడివైపున ఆయన నివసించిన ఇంటిలోనే తిరుమల నంబి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. దానినే తిరుమల నంబి మందిరం అని అంటారు.

అనంతాచార్య బృందావనం (సమాధి)

ఒకసారి రామానుజాచార్య వేంకటేశ్వర స్వామి గురించి వివరిస్తూ తన శిష్యులతో "వేంకటేశ్వర స్వామికి పువ్వులు అంటే చాలా ఇష్టమని ఒక కీర్తనలో నమ్మ ఆళ్వారు వ్రాశారు. అందువలన మీలో ఎవరు తిరుమల వెళ్లి వేంకటేశ్వర స్వామికి పువ్వుల సేవ చేయగలరు?" అని అడిగారు.

అప్పుడు అనంతాచార్య లేచి రామానుజాచార్యతో "గురుదేవా! నేను వెళ్లి వేంకటేశ్వర స్వామికి పువ్వుల సేవ చేస్తాను" అని అన్నాడు. అందుకు రామానుజాచార్య ఎంతో ఆనందించి అతనిని వెళ్ళమన్నారు. అనంతాచార్య రామానుజాచార్య అనుమతితో తిరుమలకు వచ్చి తాను నివసించడానికి వేంకటేశ్వర స్వామి మందిరం వెనుక కుటీరాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. అక్కడే బావిని త్రవ్వి పూల తోటను మరియు తులసి తోటను పెంచి పూలు మరియు తులసి దళాలతో వేంకటేశ్వర స్వామిని జీవితాంతం సేవించాడు. ఇక్కడే ఆయన సమాధి కూడా ఉన్నది.

తరిగొండ వెంగమాంబ బృందావనం (సమాధి)

తరిగొండ కృష్ణయ్యకు ఐదుగురు కుమారులు జన్మించిన తరువాత తిరుమలకు వచ్చి వేంకటేశ్వర స్వామిని దర్శించి తనకు ఒక కుమార్తెను ప్రసాదించమని ప్రార్థించాడు. వేంకటేశ్వర స్వామి యొక్క కృప వలన కృష్ణయ్యకు పుత్రిక జన్మించింది. వేంకటేశ్వర స్వామి దయవలన జన్మించినది కనుక ఆ కుమార్తెకు వెంకమ్మ అని పేరు పెట్టుకొన్నాడు. ఆ వెంకమ్మకే 'వెంగమాంబ' అని పేరు వచ్చింది.

వెంగమాంబకు వివాహం అయిన కొద్ది రోజులకు తన భర్త మరణించడంతో తిరుమల వచ్చి వేంకటేశ్వర స్వామి సేవ కొరకై పూలమాలలు మరియు తులసిమాలలు తయారు చేయదలచి ఒక

తోటను పెంచడానికి తిరుమలలో ఒక బావిని త్రవ్వించసాగెను. కానీ ఒక పెద్దరాయి అడ్డుపడడం వలన బావి త్రవ్వకం ఆగిపోయింది. వెంగమాంబ బావిలోనికి వెళ్లి అడ్డుగా ఉన్న రాయిని పూజించి, గంగా దేవిని ప్రార్థించింది. అప్పుడు ఆ రాయి రెండు ముక్కలుగా పగిలి, నీరు పైకి వచ్చెను. ఆ బావిలోని నీటితో తోటను పెంచి ప్రతిరోజూ పూలమాలలు మరియు తులసిమాలలు తయారు చేసి వేంకటేశ్వర స్వామికి సమర్పించేది. తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఉచిత సేవా భవనానికి ముందు భాగంలో వెంగమాంబ త్రవ్వించిన బావిని చూడవచ్చు. వెంగమాంబ జీవిత చవరి దశలో వరాహ స్వామి మందిరం ప్రక్కన ఉన్న అన్నమాచార్య వంశస్తుల ఇంటి వెనుక తులసి తోటలో సమాధిని కట్టించుకుని ఆ సమాధిలోనికి వెళ్ళిపోయింది. ఇప్పటికీ అక్కడ వెంగమాంబ సమాధిని మనం దర్శించవచ్చు

హాథీరాం బాబాజీ బృందావనం (సమాధి)

హాథీరాం బాబాజీ, తన గురువు అనుమతితో తీర్థయాత్రలు చేస్తూ తిరుమల వచ్చిరి. హాథీరాం బాబాజీని దర్శించడానికి వేలమంది రాసాగిరి. జనులు రావడం వలన తన భక్తి సాధనకు ఇబ్బంది కలుగుతుందని భావించిన హాథీరాం బాబాజీ పాపనాశనానికి వెళ్లే దారిలో గోగర్భ తీర్థం మరియు ఆకాశగంగ మధ్యలో వేణుగోపాల స్వామి మందిరాన్ని నిర్మించి అక్కడే నివసించసాగెను. వేణుగోపాలస్వామి సేవ చేస్తూ దీపావళి ముందు రోజున ఆయన జీవ సమాధి లోనికి ప్రవేశించారు. హాథీరాం బాబాజీ అక్కడ ఉండే రాయ అనే చెట్టు ఆకులను మాత్రమే తినేవారు. ఇప్పటికీ అక్కడ ఆ చెట్టు ఉన్నది.

ఆకాశగంగ తీర్థ మహాత్మ్యం

తిరుమలనంబి ప్రతిరోజు పాపనాశనం నుండి నీళ్లను తీసుకువచ్చి వేంకటేశ్వర స్వామికి అభిషేకం చేసేవారు. ఒకరోజు

వేంకటేశ్వర స్వామి బాలుని రూపంలో తిరుమలనంబికి ఎదురై "తాతా! తాతా! దాహంగా ఉన్నది. నీళ్లు కావాలి" అని అడిగాడు. తిరుమలనంబి "ఈ నీళ్లు పాపనాశనం నుండి వేంకటేశ్వర స్వామి కోసం తీసుకు వెళుతున్నాను. నీకు ఈ నీళ్లను ఇస్తే అపవిత్రం అవుతాయి. నేను రెండవసారి పాపనాశననికి వెళ్లి నీళ్లను తీసుకువచ్చేసరికి స్వామి అభిషేకానికి ఆలస్యం అవుతుంది. కావున నీవు పాపనాశనానికి వెళ్లి నీళ్లను త్రాగు" అని తెలిపి వెళ్లిపోయాడు. బాలుని రూపంలో ఉన్న స్వామి వెనక నుండి బాణంతో కుండకు రంధ్రం చేసి నీళ్లను త్రాగాడు. జరిగిన సంఘటనకు తిరుమలనంబి దుఃఖిస్తుండగా ఆ బాలుడు కొండకు బాణం వేసి కొండ నుండి నీటి ధారను రప్పించాడు. బాలుడు తిరుమలనంబితో "తాతా! ఇకపై పాపనాశనం నుండి నీటిని తీసుకురావలసిన అవసరం లేదు. ఈ కొండ నుండి వచ్చే నీటిని వేంకటేశ్వర స్వామి కొరకు తీసుకువెళ్లు" అని తెలిపి తిరుమలనంబి చూస్తుండగానే అదృశ్యమయ్యాడు.

తిరుమలనంబి బాలుని రూపంలో వచ్చింది వేంకటేశ్వర స్వామి అని నిర్ధారణ చేసుకొని ఆనాటి నుండి ఆ నీళ్లనే తీసుకువెళ్లాడు. కొండ నుండి నీరు వచ్చినందువలన ఆ నీటికి ఆకాశగంగ అని పేరు వచ్చింది. ఇప్పటికీ తిరుమలనంబి వంశస్థులే ఆకాశగంగ నుండి ఆ నీళ్లను వెండి బిందెలతో ఏనుగు మీద తీసుకువస్తారు. ఆకాశగంగ ఉద్భవించిన రోజున, వేంకటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఆకాశగంగకు తీసుకువెళ్లి అక్కడ స్వామికి ఉత్సవాన్ని జరుపుతారు.

జాబాలి తీర్థ మహాత్మ్యం

కావేరి నది తీరంలో దురాచారి అనే ఒక బ్రాహ్మణుడు మద్యాన్ని త్రాగుతూ, దొంగతనాలు చేస్తూ, వేశ్యలతో జీవిస్తూ కాలం గడుపుతున్నాడు, ఒకనాడు అతనిని ఒక రాక్షసుడు ఆవహించాడు. ఆ రాక్షసుడు దేశదేశాలు తిరుగుతూ వేంకటాచలంపైకి వెళ్లి జాబాలి తీర్థంలో స్నానం చేయగానే అతని రాక్షసత్వం నుండి ముక్తిని

పొంది వైకుంఠానికి వెళ్లెను. దురాచారి జాబాలి ముని వద్దకు వెళ్లి "నేను కావేరి నది తీరంలో నివసించే పతిత బ్రాహ్మణుడను. నేను ఇక్కడికి ఎలా వచ్చాను?" అని అడిగెను. జాబాలి ముని "నిన్ను ఒక రాక్షసుడు ఆవహించి దేశదేశాలు త్రిప్పుతూ ఈ వేంకటాచల పర్వతంపైకి తీసుకువచ్చాడు. ఆ రాక్షసుడు నేను నివసిస్తున్న స్థలంలోని ఈ తీర్థంలో స్నానం చేసెను. అందువలన అతనికి రాక్షసత్వం పోయి వైకుంఠానికి వెళ్లెను. నీవు కూడ ఈ తీర్థంలో స్నానం చేశావుగనుక నీ పాపాలన్నీ నశించాయి" అని తెలిపెను. దురాచారి జీవితాంతం అక్కడే ఉండి జాబాలి తీర్థంలో స్నానం చేస్తూ వేంకటేశ్వర స్వామి యొక్క భక్తియుత సేవ చేసి వైకుంఠానికి వెళ్లెను.

స్కందపురాణం నుండి వివిధ తీర్థాల మహాత్మ్యం

పాపనాశన తీర్థ మహాత్మ్యం

భద్రమతి

భద్రమతి అనే బ్రాహ్మణునికి ఆరుగురు భార్యలు, రెండు వందల మంది సంతానం ఉన్నారు. ధనం లేకపోవడం వలన వారందరూ ఉపవాసాలు చేస్తుండిరి. భద్రమతి తన దీనస్థితికి దుఃఖిస్తుండగా, భద్రమతితో తన చిన్నభార్య "స్వామీ! సువర్ణముఖారీ నదీతీరంలో వేంకటాచలం అనే పర్వతం మీద పాపనాశనం అనే తీర్థం ఉన్నది. అందులో స్నానం చేస్తే పూర్వజన్మ పాపాలు నశిస్తాయని నారద ముని నా తండ్రికి తెలిపారు. మనమందరం పాపనాశన తీర్థంలో స్నానాలు చేద్దామని" తెలిపింది. భద్రమతి తన భార్య తెలిపినట్లే తన పరివారంతో పాపనాశన తీర్థంలో స్నానం చేసి తన పేదరికం నుండి ముక్తుడయ్యెను.

సుమతి

దృఢమతి అనే శూద్రుడు బ్రాహ్మణుల వద్దకు వెళ్లి తనకు వేదాలను బోధించమన్నాడు. బ్రాహ్మణులు "శూద్రునికి వేదాలను

బోధించకూడదని వేదాలు చెబుతున్నాయి. అందువలన నీవు ఇక్కడే ఉండి ఇక్కడి బ్రాహ్మణులకు సేవ చేయుము. నీకు శుభం కలుగుతుంది" అని తెలిపిరి. శూద్రుడు బ్రాహ్మణుల ఉపదేశాలను వినకుండా అడవిలో ఆశ్రమాన్ని ఏర్పాటు చేసుకొని బ్రాహ్మణునిలా నిత్యకర్మలను, జపహోమాలను, తపస్సును చేస్తూ ఉండెను.

ఒకసారి సుమతి అనే బ్రాహ్మణుడు తీర్థయాత్రలు చేస్తూ దృఢమతి ఆశ్రమానికి వచ్చెను. దృఢమతి ఆ బ్రాహ్మణునికి అతిథి సేవలు చేసి తనకు వేదాలను బోధించమని ప్రార్థించగా సుమతి బోధించాడు. శూద్రునికి వేదాలను బోధించినందువలన సుమతి మరణించాక నరకాన్ని అనుభవించి, వివిధ జంతువుల జన్మలను పొంది శూద్ర, వైశ్య, క్షత్రియ జన్మలను పొందిన తరువాత బ్రాహ్మణ కులంలో జన్మించాడు.

బ్రాహ్మణ కులంలో జన్మించినప్పుడు సుమతిని బ్రహ్మరాక్షసి ఆవహించింది. సుమతి తన తండ్రి వద్దకు వెళ్లి తన బాధను తెలిపాడు. సుమతి తండ్రి అతడిని అగస్త్య ముని వద్దకు తీసుకువెళ్లి "తన కుమారుడు ఎలాంటి పాపం చేయకపోయినా ఎందుకు బ్రహ్మరాక్షసి ఆవహించిందని" అడిగాడు. సుమతి పూర్వజన్మల గురించి తెలుసుకొన్న అగస్త్య ముని "శూద్రునికి వేదాలను బోధించడం వలన ఇన్ని జన్మలను పొందవలసి వచ్చింది. ఈ బ్రహ్మరాక్షసిని యముడు పంపాడు. నీ కుమారుని వేంకటాచలంలోని పాపనాశన తీర్థంలో స్నానం చేయిస్తే శూద్రునికి వేదాలను బోధించిన పాపం మరియు బ్రహ్మరాక్షసి నుండి ముక్తుడు అవుతాడు" అని తెలిపాడు. సుమతి తండ్రి ఆ విధంగా చేసి తన కుమారుడు చేసిన అపరాధం నుండి మరియు బ్రహ్మరాక్షసి నుండి ముక్తిని కలిగించెను.

హాథీరాం బాబాజీ సమాధి, జాబాలి తీర్థం, ఆకాశగంగ తీర్థం, పాపనాశన తీర్థం తిరుమల నుండి ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి.

చక్ర తీర్థ మహోత్మ్యం

పద్మనాభుడు అనే బ్రాహ్మణుడు వేంకటాచలంపై విష్ణువు కొరకు తపస్సు చేసెను. తన తపస్సుకు మెచ్చి విష్ణువు దర్శనమిచ్చినప్పుడు పద్మనాభుడు తనకు ముక్తిని ప్రసాదించమని కోరగా విష్ణువు “నీవు ఇక్కడే ఈ తీర్థంలో స్నానం చేస్తూ నా భక్తిని సాధన చేయుము. నీకు ముక్తి లభించును” అని వరం ఇచ్చి అంతర్ధానమయ్యెను. పద్మనాభుడు విష్ణువు ఆజ్ఞ మేరకు అక్కడే ఉండి తపస్సు చేస్తుండెను.

ఒకరోజు ఒక రాక్షసుడు పద్మనాభుని సంహరించడానికి రాగా, పద్మనాభుడు రక్షణ కొరకై విష్ణువును ప్రార్థించెను. తన భక్తుడిని రక్షించడానికి విష్ణువు తన సుదర్శన చక్రాన్ని పంపెను. సుదర్శన చక్రం ఆ రాక్షసుడిని సంహరించి పద్మనాభుడిని కాపాడింది. పద్మనాభుడు సుదర్శనుని స్తుతించాడు. సుదర్శనుడు సంతోషించి “నేను ఈనాటి నుండి ఈ తీర్థంలోనే ఉండి నిన్ను రాక్షసుల బారినుండి కాపాడుతుంటాను. నేను ఈ తీర్థంలో ఉన్నందువలన ఈ తీర్థానికి చక్ర తీర్థం అని పేరు వస్తుంది. ఇందులో స్నానం చేసిన వారు పాపవిముక్తులు అవుతారు” అని తెలిపి సుదర్శనుడు కోనేరులోనికి ప్రవేశించాడు.

పద్మనాభుని భక్షించడానికి వచ్చిన రాక్షసుని కథ: పూర్వం కొంత మంది మునులు శ్రీరంగంలో నివసిస్తూ రంగనాథుని సేవిస్తూ ఉన్నారు. ఒకరోజు వశిష్ఠ మునితో కలిసి మునులందరూ మధ్యాహ్నం కావేరి నది స్నానానికి వెళ్లారు. ఆ సమయానికి సుందరుడు అనే గంధర్వుడు తన భార్యలతో కావేరి నదిలో నగ్నంగా స్నానం చేస్తున్నాడు. మునులను చూడగానే సుందరుడి భార్యలు వెంటనే బట్టలను ధరించిరి, సుందరుడు మాత్రం ధరించలేదు. వశిష్ఠ ముని సుందరునితో “మమ్మల్ని చూసి కూడా దుస్తులను ధరించలేదు గనుక నీవు రాక్షసుడవు కమ్మని” శపించెను.

సుందరుని భార్యలు తన భర్తకు శాప విమోచనం తెలుపమని వశిష్ఠ మునిని ప్రార్థించగా వశిష్ఠ ముని “ఈ సుందరుడు వేంకటాచలంపై సాధన చేస్తున్న పద్మనాభుడిని భక్షించడానికి వెళ్ళినప్పుడు, పద్మనాభుడు నారాయణుని రక్షించమని ప్రార్థిస్తాడు. అప్పుడు నారాయణుడు పంపిన సుదర్శనచక్రంతో ఈ సుందరుడు మరణించి శాపవిమోచనం పొందుతాడు” అని తెలిపెను. సుందరుడు పద్మనాభునికి మరియు సుదర్శనునికి తన శాపం గురించి తెలిపి వారికి ప్రణామాలు చేసి తన లోకానికి వెళ్లాడు.

తిరుమలలోని శ్రీవారి పాదాలు

భృగు మహర్షి నారాయణుని పరీక్షించిన తరువాత లక్ష్మీ దేవి వైకుంఠమును వదిలి వెళ్లింది. లక్ష్మీ దేవి లేని వైకుంఠంలో నారాయణుడు ఉండలేక వేంకటాచలం వచ్చెను. వేంకటాచలంలో నారాయణుడు దిగిన స్థలంలో నారాయణుని పాదముద్రలు పడెను. ఆ పాదాలను శ్రీవారి పాదాలు అని అంటారు. వేంకటాచల క్షేత్రానికి బ్రహ్మాది దేవతలు వేంకటేశ్వర స్వామిని దర్శించడానికి వచ్చినపుడు ముందుగా ఈ శ్రీవారి పాదాల వద్దకు చేరుకుని ఆ పాదాలకు శిరస్సు వంచి ప్రణామాలు చేస్తారు. చక్రతీర్థం శ్రీవారి పాదాలు తిరుమల నుండి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి.

హాథీరాం బాబాజీ సమాధికి, జాబాలి తీర్థానికి, ఆకాశగంగ తీర్థానికి, పాపనాశన తీర్థానికి, చక్ర తీర్థానికి, తిరుమలలోని శ్రీవారి పాదాలకు తిరుమల దేవస్థానం వారు బస్సును ఏర్పాటు చేశారు.

రామకృష్ణ తీర్థ మహాత్మ్యం

రామకృష్ణ అనే ముని వేంకటాచలంపై తపస్సు చేస్తున్న సమయంలో, తాను స్నానం చేయడానికి ఒక సరోవరాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. తరువాత విష్ణువు గురించి తపస్సు చేస్తుండగా రామకృష్ణ ముని శరీరంపై ఒక పుట్ట ఏర్పడింది. ఆ తపస్సుకు

భయపడిన ఇంద్రుడు రామకృష్ణ ముని తపస్సును భంగం చేయడానికి వర్షాన్ని కురిపించినా అతని తపస్సును భంగం చేయలేక వెళ్లిపోయాడు. తరువాత విష్ణువు ఆ మునికి దర్శనమిచ్చి "నీవు త్రవ్విన ఈ కోనేరు నీ పేరుతోనే ప్రసిద్ధి చెందుతుంది. ఇందులో స్నానం చేసినవారి పాపాలు నశిస్తాయి. నీవు శరీరం వదిలిన వెంటనే నీకు ముక్తి లభిస్తుంది" అని దీవించి అంతర్ధానమయ్యెను.

ఈ రామకృష్ణ తీర్థం పాపనాశనం నుండి ఐదు కిలోమీటర్లు నడిచి వెళ్ళవలసి ఉంటుంది. అడవిలో ఉన్నందువల్ల జనవరి ఫిబ్రవరి నెలలో వచ్చే మాఘ మాసంలోని పౌర్ణమి రోజు మాత్రమే ఇక్కడకు వెళ్లడానికి అనుమతి ఉంటుంది.

కుమారధార తీర్థ మహాత్మ్యం

వృద్ధ బ్రాహ్మణుడు

ఒకసారి వేంకటేశ్వర స్వామి బాలుని రూపాన్ని ధరించి వేంకటాచల పర్వతంపై తిరుగుతూ ఉండెను. ఆ సమయంలో నూరు సంవత్సరాల వయసున్న ఒక ముసలి బ్రాహ్మణుడు దారితప్పిపోయిన తన కుమారుడిని "కౌండిన్యా! ఎక్కడ ఉన్నావు?" అని పిలవసాగెను. అప్పుడు బాలుని రూపంలో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆ ముసలి బ్రాహ్మణునితో "ఇక్కడ ఎవరూ లేరు. మీరు ఎవరిని పిలుస్తున్నారు?" అని అడిగెను. అప్పుడు వృద్ధ బ్రాహ్మణుడు "అయ్యో కుమారా! ఎక్కడికి వెళ్లితివి? ఇప్పుడు నేను ఆశ్రమానికి ఎలా వెళ్లేది? నిత్య కర్మలను ఎలా చేసేది?" అని బాధపడసాగెను.

అప్పుడు వేంకటేశ్వర స్వామి "ఓ బ్రాహ్మణా! నీ శరీరం శిథిలమైనది, వెంట్రుకలు తెల్లబడినవి, చర్మం ముడతలు పడింది, చూపు మందగించినది. అయినా నీకు బ్రతకాలని ఉందా?" అని అడిగెను. అప్పుడు ఆ బ్రాహ్మణుడు "నేను ఇంకా దేవ ఋణమును తీర్చుకోలేదుగనుక నాకు జీవించాలని ఉన్నది" అనెను. ఆ మాటలకు

వేంకటేశ్వర స్వామి సంతోషించి, ఆ వృద్ధుని చేతిని పట్టుకొని తీర్థం (కోనేరు) వద్దకు తీసుకువెళ్లి ఇందులో స్నానం చేయమన్నాడు. ఆ వృద్ధ బ్రాహ్మణుడు స్నానం చేయగానే యువకునిగా మారిపోయెను. బాలుని రూపంలో ఉన్న వేంకటేశ్వర స్వామి తన విష్ణు రూపాన్ని ఆ ముసలి బ్రాహ్మణునికి దర్శనమిచ్చి "నీవు ఇక ఇంటికి వెళ్లి నిత్య కర్మలను చేయుము" అని తెలిపెను. ముసలి బ్రాహ్మణుడు కుమారునిగా (యువకునిగా) మారినందువలన ఈ తీర్థానికి కుమారధార తీర్థం అని పేరు వచ్చింది.

కుమార స్వామి

దేవతలకు రాక్షసులకు మధ్య జరిగిన యుద్ధంలో తారకాసురుని సంహరించినందువలన కుమార స్వామికి బ్రహ్మహత్య పాపం వచ్చింది. కుమార స్వామి ఆ పాపాన్ని పోగొట్టుకునేందుకు తన తండ్రి శివుని వద్దకు వెళ్లి తనకు సంక్రమించిన బ్రహ్మహత్య పాపం పోయే మార్గం తెలుపమని అడగగా శివుడు కుమార స్వామితో "నారాయణుని నామం జపించడం వలన సమస్త పాపాలు నశిస్తాయి. కావున నీవు సువర్ణముఖారీ నది తీరంలోని వేంకటాచలం పర్వతంపైకి వెళ్ళుము. ఆ వేంకటాచలంపై అనేక తీర్థాలు ఉన్నాయి. నీవు ఆ తీర్థాలలో స్నానం చేసి, కుమారధార తీర్థంలో "ఓం నమో వేంకటేశాయ" అనే మంత్రాన్ని జపిస్తూ తపస్సు చేయుము" అని తెలిపెను. దేవతల సేనాధిపతియగు కుమార స్వామి శివుడు తెలిపినట్లు వేంకటాచలం వచ్చి వివిధ తీర్థాలలో స్నానం చేసి, కుమారధార తీర్థంలో రోజుకు మూడుసార్లు స్నానం చేస్తూ "ఓం నమో వేంకటేశాయ" అనే మంత్రాన్ని జపిస్తూ పన్నెండు సంవత్సరాలు తపస్సు చేసెను.

ఆ తపస్సుకు నారాయణుడు దర్శనమిచ్చి "నీ తండ్రి మాటల యందు విశ్వాసముంచి నా కొరకు నీవు తపస్సు చేసితివి. నీవిప్పుడు నా నుండి వరం కోరుకోమని" అన్నాడు. కుమార స్వామి

నారాయణునికి ప్రదక్షిణ నమస్కారములు చేసి "ఓ వేంకటాచలపతీ! ఓ నారాయణా! సకల లోకములయందు వ్యాపించి ఉండువాడా! భక్తుల బాధలను తొలగించువాడా!" అని పరి పరి విధముల స్తుతించి "నేను తారకాసురుని సంహరించినందువలన బ్రహ్మహత్య పాపంతో బాధపడుతున్నాను. ఆ పాపాన్ని నిర్మూలించమని" ప్రార్థించెను. నారాయణుడు "ఈ వేంకటాచల పర్వతాన్ని దర్శించిన వారి పాపాలు నశించిపోవును. నీవు నా కొరకు తపస్సు చేశావుగనుక నీవు సర్వ పాపాల నుండి ముక్తుడవు అయ్యావు. నీవు కల్పాంతం వరకు ఇక్కడే ఉండి నా సేవ చేయుము" అని తెలిపి అంతర్ధానమయ్యెను.

ఈ కుమారధార తీర్థం వెళ్ళడానికి పాపనాశనం నుండి ఆరు కిలోమీటర్లు నడిచి వెళ్ళవలసి ఉంటుంది. అడవిలో ఉన్నందువల్ల జనవరి ఫిబ్రవరి నెలలో వచ్చే మాఘ మాసంలోని పౌర్ణమి రోజు మాత్రమే వెళ్లడానికి అనుమతి ఉంటుంది.

తుంబురు (గోన) తీర్థ మహాత్మ్యం

ఒకసారి నారద ముని మరియు తుంబురుడు తమ వీణలతో నారాయణుని స్తుతిస్తూ ఆకాశమార్గంలో ప్రయాణిస్తుండిరి. అప్పుడు నారద ముని రత్నాలతో చేసిన తుంబురుని వీణను చూసి "ఈ వీణ ఎక్కడిది?" అని అడగగా తుంబురుడు "నేను ప్రాచీనబర్హి అనే రాజును స్తుతించినందువలన ఆ రాజు నాకు ఈ వీణను కానుకగా బహూకరించాడు" అని తెలిపెను. అప్పుడు నారద ముని "నరుని స్తుతించడాన్ని సత్పురుషులు నిందిస్తారు. అందువలన నీవంటి వానితో నేను స్నేహం చేయను. నీవు నరుని స్తుతించినందువలన భూలోకంలో పడిపోదువుగాక" అని శపించాడు.

నారద ముని శాపం వలన తుంబురుడు వేంకటాచలంలోని గోన తీర్థం వద్ద పడిపోయాడు. తుంబురుడు తన లోకానికి

వెళ్ళలేకపోవడం వలన గోన తీర్థంలో స్నానం చేస్తూ నారాయణుని కొరకు తపస్సు చేశాడు. నారాయణుడు తుంబురునికి దర్శనమిచ్చి వరం కోరుకోమన్నాడు. తుంబురుడు "నారద ముని శాపం నుండి విమోచనం కలగాలని మరియు ఈ గోన తీర్థం నా పేరుతో కొనసాగాలి" అని కోరాడు. నారాయణుడు నీ కోరికలు తీరగలవని వరం ఇచ్చి అంతర్ధానమయ్యెను. ఆనాటి నుండి గోన తీర్థానికి 'తుంబురు తీర్థం' అనీ పేరు వచ్చింది. తుంబురు తీర్థం వెళ్ళడానికి పాపనాశనం నుండి 6 కిలోమీటర్లు నడిచి వెళ్లవలసి ఉంటుంది. అడవిలో ఉన్నందువల్ల జనవరి ఫిబ్రవరి నెలలో వచ్చే మాఘ మాసంలోని పౌర్ణమి రోజు మాత్రమే వెళ్లడానికి అనుమతి ఉంటుంది.

పాండవ తీర్థ మహాత్మ్యం

పాండవులు వనవాసం చేసే సమయంలో శ్రీకృష్ణుని కోరిక మేరకు వేంకటాచలంలో ఒక సంవత్సరం రోజులు నివసించిరి. పాండవులు స్నానం చేసిన కోనేరుకు 'పాండవ తీర్థం' అని పేరు వచ్చింది. పాండవ తీర్థం వేంకటేశ్వర స్వామి మందిరం నుండి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్నది మరియు రోడ్డు సౌకర్యం కలదు.

తిరుమలలో పైన తెలుపబడిన తీర్థాలే కాకుండా ఇష్టసిద్ధి, కర్మసిద్ధి, వాట, ఔదుంబర, గరుడ, గంధర్వ, కుబ్జ, దశప్రాచేతస, గరుడ, శేష, వాసుకి, దేవ, విష్ణువర్ధన, కర్మకాండ, కృష్ణ, ఋణవిమోచన, పర్జన్య, మేఘ, సంకర్షణ, వాసుదేవ, నారాయణ, యక్ష, కాల, గోముఖ, ప్రద్యుమ్న, అనిరుద్ధ, పితృ, ఆర్షేయ, వైశ్వదేవ, అస్థి, ఆంజనేయ, శుద్ధోదక, అష్టభైరవ, బిల్వ, విష్ణు, సర్వ, శారభ, మేహ, బ్రహ్మ, ఇంద్ర, ఫాల్గుణీ, భరద్వాజ, ఆకాశగంగ, వరుణ, సారస్వత, కుమారికా, శక్ర, అంగ, ఋష్యశృంగ, అష్టాదశ, దశావతార, హలాయుధ, సప్తర్షి, గజకోణ, విష్వక్సేన, వాయు, శిలాతోరణ, వజ్ర, పంచాయుధ, హలాయుధ, నరసింహ, కాశ్యప, మన్మధ, బ్రహ్మ, అగ్ని, గౌతమ, అష్టావక్ర మరియు క్షేత్రపాలశిల వంటి అనేక తీర్థములు కలవు.

7

తిరుపతిలో దర్శనీయ స్థలాలు

గోవిందరాజ స్వామి మందిరం

పూర్వం కావేరి నది తీరంలో కణ్వ మహర్షి నారాయణుని కొరకై తపస్సు చేయగా నారాయణుడు దర్శనమిచ్చి వరమును కోరుకొమ్మనెను. నారాయణుని ఇచ్చటే ఉండి జనులకు దర్శనం ఇవ్వవలసినదిగా కణ్వ మహర్షి వరాన్ని కోరగా అతని కోరిక మేరకు నారాయణుడు గోవిందరాజ స్వామిగా వెలసెను.

తమిళనాడులోని చిదంబరంలో నటరాజ స్వామి పేరుతో పూజించబడే శివుని యొక్క మందిరం కలదు. ఈ మందిరమునందే గోవిందరాజ స్వామి యొక్క విగ్రహ ప్రతిష్ఠ జరిగెను. కొంతకాలానికి చిదంబరమును కుళోత్తుంగ అనే రాజు పరిపాలిస్తుండెను. కుళోత్తుంగ శివ భక్తుడు. "విష్ణువు సముద్రంలో నిద్రించునుగనుక నటరాజ మందిరంలో ఉన్న గోవిందరాజ విగ్రహమును సముద్రంలో పడవేయమని" రాజు తన మంత్రితో తెలిపెను. మంత్రికి ఏమీ దిక్కుతోచని స్థితిలో ఈ విషయమును సైనికులకు తెలియజేసెను. సైనికులు గోవిందరాజ స్వామి విగ్రహమును సముద్రం దగ్గరికి తీసుకొని వెళుతుండగా గోవిందరాజ స్వామి యొక్క భక్తులు సైనికులకు పాప పుణ్యాల గురించి ఉపదేశం చేసి విగ్రహమును తిరుపతికి తరలించి జరిగిన విషయాలను రామానుజాచార్యకు తెలిపిరి.

రామానుజాచార్య తిరుపతిలో ఉన్న పార్థసారథి మందిరం ప్రక్కనే మరొక మందిరాన్ని నిర్మించి గోవిందరాజ స్వామిని 1130 సంవత్సరంలో ప్రతిష్ఠించి వేంకటేశ్వర స్వామికి పూజలు, నైవేద్యాలు మరియు ఉత్సవాలు జరిగినట్లుగానే గోవిందరాజ స్వామికి కూడ

జరిగేవిధంగా ఏర్పాటు చేశారు. శ్రీ వైష్ణవులు పరిగణించే 108 దివ్యదేశాలలో గోవిందరాజ స్వామి మందిరము కూడా ఒకటి. తిరుపతికి పూర్వం ఉన్నపేరు శ్రీపదపురం. రామానుజాచార్య గోవిందరాజ స్వామిని ప్రతిష్ఠించిన తరువాత శ్రీపదపురమునకు తిరుపతి అని నామకరణం జరిగినది. 'తిరు' అనగా శ్రీ, 'పతి' అనగా భర్త, 'తిరుపతి' అనగా లక్ష్మీదేవి భర్త అని అర్థం.

అన్నమాచార్య దిగువ తిరుపతిలో వెలసిన గోవిందరాజ స్వామిని ఎన్నో కీర్తనలతో కీర్తించాడు. వాటిలోని కొన్ని కీర్తనల భావం:

"తిరుపతి క్షేత్రంలోని ఈ గోవిందరాజ స్వామి మనకు వటపత్రశాయి రూపంలో దర్శనమిస్తున్నాడు. గోవిందరాజస్వామి పాదాలవద్ద శ్రీదేవి మరియు భూదేవి ఉన్నారు. నాభికమలం వద్ద కొడుకు బ్రహ్మ దేవుడున్నాడు. ఆదిశేషునిపై పవళించి దాసులను కృపతో చూస్తున్నాడు. రెండు చేతులలో శంఖచక్రాలు, మూడవ చేతిలో కమలాన్ని ధరించి, నాలుగవ చేతిని శిరస్సు క్రింద ఉంచి నిద్రిస్తున్నాడు."

"ఆనాడు వ్రేపల్లెలో బాలుడవై ఇలాగే పవళించి పాలుత్రాగావా! గోపికలు నిన్ను ఊయలలో పరుండబెట్టి జోల పాటలు పాడగా ఇలానే పరుండి ఆలకించావా! మథురలో కుబ్జ ఇంటిలో ఇలానే నిద్రించావా! ద్వారకలో సత్యభామతో ఇలానే ముచ్చటలాడావా! పదహారువేల భార్యల హృదయాలను తలగడలుగా భోగించిన నీవు, తిరుపతిలో శ్రీదేవి భూదేవిలతో భోగిస్తున్నావా!"

"గోపికలతో సరసాలాడి అలసిపోయాడో! బృందావనంలో ఆవులను మేపి అలసిపోయాడో! గోప బాలురతో గచ్చకాయలాడి అలసిపోయాడో! గోవర్ధన పర్వతాన్ని ధరించి అలసిపోయాడో! ఈ గోవిందరాజ స్వామి ఇక్కడ నిద్రించడానికి కారణం తెలియడంలేదు. తిరుమలలో నిలుచున్న వేంకటేశ్వర స్వామి తిరుపతిలో నిద్రించి దర్శనమిస్తున్నాడు."

గోవిందరాజ స్వామిని శరణు వేడితే రక్షించే గోవిందుడు. భూదేవికి మరియు లక్ష్మీదేవికి భర్త అయిన గోవిందుని సేవించండి.

"గోవిందరాజ స్వామి నందవ్రజమున గోవులను, గోపాలురను ఇంద్రుని యొక్క రాళ్ళ వర్షం నుండి రక్షించుటకు తన చిటికెన వ్రేలిపై గోవర్ధన పర్వతము నెత్తి దాని క్రింద వారిని చేర్చి రక్షించాడు. అనేకమంది గోపికలు కోరుకొన్న గోవిందుడితడే. గోవులను కాచి గోవిందుడని ప్రసిద్ధి చెందినాడు. ఆ గోవిందుడే తరువాత మథురానగరమునకు వెళ్లి దుష్ట కంసుని సంహరించి, తన తల్లిదండ్రులైన దేవకీ వసుదేవులను చెరసాల నుండి విముక్తులను చేశాడు."

"క్రూరమైన కాళీయ అనే సర్పము యమునానదిని విషపూరితం చేసి ప్రాణహాని చేస్తుండగా గోవిందుడు దానిని మర్దించి అక్కడ నుండి వెడలగొట్టి అందరినీ రక్షించాడు. వీరత్వమునకు ప్రతీకయైన తన సుదర్శన చక్రముతో శిశుపాలుని వంటి ఎందరో రాక్షసులను సంహరించెను. తన గురువైన సాందీపుని కోరిక మేరకు మరియు తన తల్లి దేవకీదేవి కోరిక మేరకు సముద్రములను దాటిపోయి ఎన్నడో చనిపోయిన వారి పుత్రులను తిరిగి సజీవులుగా తెచ్చి వారి కోరికలను తీర్చిన గోవిందుడితడే."

ఈ పార్థసారథి మందిరంలో మొదటి గోపురం దాటగానే వేదాంత దేశికులు, మణవాళ మహాముని, వరవరముని, ఆళ్వారులు, రంగనాథ స్వామి, సీతారామలక్ష్మణులు, లక్ష్మీదేవి, రామానుజాచార్య, అనంతాచార్య, తిరుమలనంబి, గోదాదేవి, కల్యాణ వేంకటేశ్వర స్వామి మరియు నరసింహ స్వామి మందిరాలు కూడా ఉన్నాయి. గోదాదేవి, తిరుమలనంబి మందిరాలను రామానుజాచార్య ప్రతిష్ఠించారు. రామానుజాచార్య మందిరాన్ని రామానుజాచార్య శిష్యులు ప్రతిష్ఠించారు.

ఈ గోవిందరాజస్వామి మందిరం తిరుపతి రైల్వే స్టేషన్ నుండి అర కిలోమీటర్ దూరంలో ఉన్నది.

కోదండరామ స్వామి మందిరం

కోదండరామస్వామి గురించి స్థల పురాణంలో ఇలా ఉన్నది:

శ్రీరాముడు రావణాసురుని సంహరించిన తరువాత అయోధ్యకు వెళ్లే దారిలో తిరుపతిలో కొద్ది సమయం గడిపి, తిరుమలలోని స్వామి పుష్కరిణిలో స్నానానికి వెళ్లాడు. ఈ సమయంలో జాంబవంతుడు తిరుపతిలో శ్రీరాముడు విశ్రాంతి తీసుకున్నచోట సీతారామలక్ష్మణుల అర్చామూర్తులను ప్రతిష్ఠించి పూజలు చేశాడు. జాంబవంతుడు సీతాదేవిని రాముని కుడి వైపు ప్రతిష్ఠించినందున ఇప్పటికీ శ్రీరాముని కుడి వైపు సీతాదేవి, ఎడమ వైపు లక్ష్మణుడు ఉంటారు. ఆలయం ఎదురుగా గరుడుని ప్రతిష్ఠించారు. ద్వాపరయుగంలో జనమేజయ మహారాజు ఈ ఆలయాన్ని పునరుద్ధరించి శ్రీరామునికి పూజలు చేశాడు.

ఈ కోదండరామస్వామిని కీర్తిస్తూ అన్నమాచార్య ఎన్నో కీర్తనలను వ్రాసిరి. అందులోని ఒక కీర్తన భావం:

"శ్రీరాముడు దశరథ మహారాజు కుమారుడే అయినా మోక్షాన్నిచ్చే నారాయణుడు. శ్రీరాముడు సామాన్య మానవుడిలా వేషం వేసుకున్న శ్రీహరి. ధనుస్సును విరిచిన పరాక్రమశాలి. రాజుగా ఉన్నా తన పాద ధూళితో రాయిగా ఉన్న అహల్యను స్త్రీగా మార్చిన మహానుభావుడు. మానవునిలా ఉన్నా మరొక ప్రక్క ఎవరూ చేయలేని మహిమలను చేసిన ఈ రాముడిని దర్శించండి.

"శ్రీరాముడు ఈ జగత్తులో సామాన్య మానవునిలా వశిష్ఠ మునిని గురువుగా చేసుకున్నాడు. అయినా జటాయువుకు మోక్షాన్ని ఇచ్చినవాడు. సీతాదేవి కొరకు వానరులతో సముద్రం మీద వారధిని

కట్టి రావణాసురుని సంహరించాడు. నారాయణుడు రాక్షసులను సంహరించడానికి దేవతలను వానరులుగా జన్మించమని ఆజ్ఞాపించాడు. కానీ ఆ నారాయణుడే (శ్రీరాముడు) రాక్షసుడైన విభీషణుని లంకకు రాజుగా చేశాడు. ఆ శ్రీరాముడే ఇప్పుడు వేంకటాచలాన్ని తన నివాసంగా చేసుకున్నాడు. ఆ శ్రీరాముని దర్శించండి.”

హాథీరాం బాబాజీ శిష్య పరంపరలో వస్తున్న మహంత్ ధర్మదాసు, సీతారామలక్ష్మణులకు వెండి కిరీటాలను చేయించి శ్రీరామునికి వెండి విల్లును కూడా సమర్పించాడు, ధ్వజస్తంభానికి బంగారు తాపడం చేయించాడు. మహంత్ భగవన్ దాసు సీతారామ లక్ష్మణులకు అనేక బంగారు ఆభరణాలను చేయించెను. మహంత్ ప్రయాగ దాసు ఆలయ ప్రాంగణమును ఎంతో సుందరంగా తీర్చిదిద్దెను.

జాంబవంతుడు హనుమంతుని ప్రతిష్ఠించనందున ఇక్కడి గర్భగుడిలో హనుమంతుని అర్చావిగ్రహం ఉండదు. కొంతకాలం తరువాత భక్తులు మొదటి గోపురం బయట హనుమంతుని కోసం మందిరాన్ని కట్టి హనుమంతుని విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. హనుమంతుని జన్మదినోత్సవం రోజు సీతారామలక్ష్మణులు హనుమంతుని మందిరానికి వెళ్లి హనుమంతున్ని దీవిస్తారు. అక్కడ సీతారామలక్ష్మణులు పూజలను, నైవేద్యాలను స్వీకరించి తిరిగి వస్తారు. ఈ హనుమంతుని అన్నమాచార్య ఈ విధముగా కీర్తించిరి.

మహా పరాక్రమం కలిగిన ఓ హనుమంతా! తోక చాచి అడుగు ముందుకు వేయుచున్న నీ ఆకారం ఆశ్చర్యకరము. రాక్షసులను చంపి సీతాదేవికి రాముని ఉంగరాన్ని ఇచ్చి సీతను ఓదార్చినవాడవు. భక్తులకు అభయాన్ని ఇచ్చేవాడివి. తిరుమల క్రింద ఉన్న తిరుపతిలో దర్శనం ఇస్తూ, శ్రీ వేంకటేశ్వరుని సేవించుటకు వచ్చే భక్తులను నీవు కృపా దృష్టితో చూస్తావు.

కోదండరామస్వామి మందిరం గోవిందరాజ స్వామి మందిరానికి అర కిలోమీటర్ దూరంలో, రైల్వే స్టేషన్ నుండి ఒక కిలోమీటర్ దూరంలో ఉన్నది.

కపిల తీర్థం

వరాహపురాణం నుండి

(ఒకసారి శివుడు వేంకటేశ్వర స్వామిని దర్శించి, పూజించి, స్తుతించి "స్వామీ! ఈ వేంకటాచలంలో నేను నివసించేందుకు అనుమతిని ఇవ్వండి" అని ప్రార్థించగా స్వామి శివునితో "ఆగ్నేయంలో వేంకటాచల పర్వతం క్రింద నివసించమని" తెలిపెను.) వేంకటాచల పర్వతం క్రింద పాతాళంలో కపిల మహర్షి శివ లింగాన్ని పూజించేవారు. ఆ శివ లింగం దగ్గర కపిల తీర్థంకూడా ఉన్నది. (శివుని కోరిక మేరకు కపిల మహర్షి పూజించే శివ లింగం మరియు కపిల తీర్థం భూమి మీదకు వచ్చాయి.) ఆ కపిల తీర్థంలో దేవతలు స్నానాలు చేసి శివుని పూజించి స్తుతించారు. ఈ కపిలేశ్వరుడు తిరుమల ధామానికి క్షేత్రపాలకుడు.

ఈ కపిలతీర్థంలోనే నమ్మాళ్వారుల, వేణుగోపాలస్వామి, నరసింహస్వామి మరియు లక్ష్మీనారాయణ మందిరాలు ఉన్నాయి. నమ్మాళ్వారుల మందిరంలో రామానుజాచార్య సంవత్సర కాలం పాటు నివసించారు. అదే సమయంలో తిరుమలనంబి నుండి 18 సార్లురామాయణాన్ని విన్నారు. గోవిందరాజ స్వామి యొక్క బ్రహ్మోత్సవాల్లో చివరి రోజున సుదర్శనునితోపాటు శ్రీదేవి భూదేవి సమేతంగా గోవిందరాజ స్వామిని కపిల తీర్థంలోని వేణుగోపాల స్వామి మందిరానికి తీసుకువచ్చి అభిషేకం చేసి వస్త్రాభరణాలతో అలంకరించి నైవేద్యాలను సమర్పించి పూజిస్తారు. చివరిగా సుదర్శన చక్రాన్ని కపిల తీర్థంలో స్నానం చేయిస్తారు. దీనినే 'చక్రస్నానం' అంటారు. అదేవిధంగా కోదండ రామ స్వామి బ్రహ్మోత్సవాల్లో చివరి

రోజున సుదర్శనునితోపాటు సీతా లక్ష్మణ సమేతంగా కోదండరామ స్వామిని కపిల తీర్థంలోని వేణుగోపాల స్వామి మందిరానికి తీసుకువచ్చి అభిషేకం చేసి వస్త్రాభరణాలతో అలంకరించి నైవేద్యాలను సమర్పించి పూజిస్తారు. చివరిగా సుదర్శన చక్రాన్ని కపిల తీర్థంలో స్నానం చేయిస్తారు.

ఈ కపిల తీర్థం, రైల్వే స్టేషన్ నుండి తిరుమలకు వెళ్లేదారిలో మూడు కిలోమీటర్ల దూరంలో అలిపిరిలో ఉన్నది.

ఇస్కాన్ రాధాగోవింద మందిరం

అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘమును (ఇస్కాన్) స్థాపించిన శ్రీల భక్తి వేదాంత స్వామి ప్రభుపాద 1974లో తిరుమల వేంకటేశ్వర స్వామిని దర్శించిరి. ఆయన తిరుమలలోని వసతి ఏర్పాట్లను చూసి, అద్భుతమైన వసతులను కలిగిస్తూ బంగారు గోపురాలతో ప్రకాశిస్తున్నటువంటి బాలాజీ (వేంకటేశ్వర స్వామి) మందిరం వంటి మందిరాలను మనం కూడా నిర్మించాలని తన శిష్యులకు తెలిపిరి.

శ్రీల ప్రభుపాదులవారి ఆదేశానుసారం వారి శిష్యులు అలిపిరిలో ఇస్కాన్ రాధాగోవింద మందిరం నిర్మించిరి. ఈ మందిరంలో రాధ గోవిందులతో పాటు అష్ట సఖులు కూడా ఉంటారు. ప్రభుపాద స్థాపించిన ఇస్కాన్ మందిరంలో భగవద్గీత, భాగవతం, రామాయణం మరియు మహాభారతం వంటి గ్రంథాలు కూడా లభించును.

ఈ ఇస్కాన్ మందిరారలలో శ్రీకృష్ణ జన్మాష్టమి, రాధాష్టమి, బలరామ పూర్ణిమ, శ్రీరామనవమి, నరసింహ చతుర్దశి, గోవర్ధన పూజ, గౌరపూర్ణిమ, నిత్యానంద త్రయోదశి వంటి ఎన్నోఉత్సవాలు నిర్వహిస్తారు. ఉదయం 8:30 – భాగవత ప్రవచనం, సాయంత్రం 8:00 – భగవద్గీత ప్రవచనం ఉంటుంది.

పూజా వేళలు: ఉదయం 4:30 – మంగళ హారతి, 7:30 – దర్శన

హారతి, మధ్యాహ్నం 12:30 – రాజభోగ హారతి, సాయంత్రం 4:00 – ధూప హారతి, 7:00 – సంధ్య హారతి, రాత్రి 8:30 – శయన హారతి జరుగుతాయి.

భోగ వేళలు: ఉదయం 4:15 – పరమాన్నమును మరియు పాలతో చేసిన క్షీరాన్నమును సమర్పిస్తారు. 7:15 – పండ్లు మరియు పండ్ల రసాలను సమర్పిస్తారు. 8:15 – చపాతీలు, అన్నం, పప్పు, కూరలు, పెరుగు మరియు రసమును సమర్పిస్తారు. మధ్యాహ్నం 12:00 – కారం, ఉప్పు, చేదు, తీపి, వగరు మరియు పులుపు ఇలా ఆరురకాల రుచులతో చేసిన 26 రకాల వంటకాలను సమర్పిస్తారు. దీనిని రాజభోగ నైవేద్యం అని అంటారు. 3:30 – చపాతీలు, అన్నం, పప్పు, 2 రకాల కూరలు, పెరుగు మరియు రసమును సమర్పిస్తారు. సాయంత్రం 6:30 – పండ్లు మరియు పండ్ల రసాలను, రాత్రి 8:20 – 2 రకాల అల్పాహారాలు, 9:30 – పాలను సమర్పిస్తారు.

కీర్తన (భజన) సమయం: ఉదయం 4:30 – మంగళహారతిలో, 7:15 – దర్శన హారతిలో, సాయంత్రం 7:00 – సంధ్య హారతిలో భక్తులందరూ కలిసి కలియుగ ధర్మమైన హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే హరే రామ హరే రామ రామ రామ హరే హరే అనే మహా మంత్రాన్ని కీర్తన (భజన) చేస్తారు. మంగళహారతి పూర్తి కాగానే ఈ హరేకృష్ణ మహా మంత్రాన్ని తులసి జపమాల మీద రెండు గంటల సమయం జపం చేస్తారు.

ఇస్కాన్ మందిరాలలోని భక్తులు రాధాకృష్ణుల భక్తి సాధన చేయడమే కాకుండా ఇతర నగరాలలో, గ్రామాలలో మరియు గృహాలలో హరే కృష్ణ సంకీర్తన చేసి ప్రవచనం కూడా ఇస్తారు. భక్తుల ప్రవచనాలలోని అంశం ఈ క్రింది విధముగా ఉంటుంది:

ఐశ్వర్యస్య సమగ్రస్య వీర్యస్య యశసః శ్రియః ।
జ్ఞాన వైరాగ్యయోశ్చైవ శణ్ణాం భగ ఇతింగణా ॥

ఐశ్వర్యం, బలం, కీర్తి, సౌందర్యం, జ్ఞానం, వైరాగ్యం అనే ఆరు గుణాలు సంపూర్ణంగా కలిగినవాడు భగవంతుడు. (విష్ణుపురాణం 6.5.47)

ఈ శ్లోకమును వ్యాసదేవుని తండ్రి పరాశర మహర్షి విష్ణుపురాణంలో తెలిపెను. భగవంతుడు ఈ భౌతిక జగత్తులో ప్రతి యుగంలో అవతరిస్తుంటాడు. భగవంతుడిని అవతరించమని ఎవ్వరూ ఆదేశించనప్పటికీ ఈ భౌతిక ప్రపంచంలో దుఃఖిస్తున్న జీవులపై దయ చూపుటకు భగవంతుడు అవతరిస్తుంటాడు. భగవంతుడు ఈ భూమిపై ఎలా అవతరిస్తాడని పండితులు కూడా సందేహపడుతుంటారు. శ్రీకృష్ణ భగవానుడు భగవద్గీతలో (4.7–8) "ధర్మ రక్షణకు, దుర్మార్గులను సంహరించుటకు మరియు సాధువులను రక్షించుటకు నేను ప్రతి యుగంలో అవతరిస్తాను" అని తెలిపెను. భగవంతుని అవతారాల గురించి శాస్త్రాలలో వర్ణించబడినది మరియు వాటిని ప్రామాణిక ఆచార్యులందరూ అంగీకరించారు.

భగవంతుడు ఎంతటి శక్తివంతుడో, భగవంతుని నామం కూడా అంతే శక్తివంతమైంది. కాబట్టి, పిల్లలకు అర్థం లేని పేర్లు పెట్టకుండా, భగవంతుని పేర్లు పెట్టాలి. ఉదాహరణకు, శ్రీనివాస, వెంకట, బాలాజీ, వెంకటేశ్వర, శ్రీరామ, కృష్ణ, లక్ష్మీ, పద్మావతి మొదలైవి. అయితే, అలాంటి భగవంతుని శక్తివంతమైన నామాన్ని లక్ష్మీ వైన్స్, వెంకటేశ్వర వైన్స్, వెంకటేశ్వర మటన్ షాప్, బాలాజీ చికెన్ షాప్ వంటి పేర్లకు ఉపయోగించడం ద్వారా భగవంతుని పట్ల అపరాధము అవుతుంది. కాబట్టి, భగవంతుని దివ్య నామాన్ని ఈ రకమైన పనులకు ఉపయోగించవద్దు మరియు మీ పిల్లలకు అర్థం లేని పేర్లు పెట్టకుండా భగవంతుని పేర్లు పెట్టండి. మరియు ఈ విధంగా ఎల్లప్పుడూ భగవంతుని నామజపం చేయడం అలవాటు చేసుకోండి, ప్రత్యేకించి హరే కృష్ణ హరే కృష్ణ, కృష్ణ

కృష్ణ హరే హరే, హరే రామ హరే రామ, రామ రామ హరే హరే' మహామంత్రాన్ని ప్రతిరోజు 16 మాలాలు జపం చేయండి.

ఒక పాపకార్యం చేస్తే ఆ పాపం చేసిన వారికే కాకుండా, సహాయం చేసినవారికి కూడా పాపఫలం వస్తుంది. ఉదాహరణకు, మద్యం త్రాగేవారికి మాత్రమే కాకుండా, దానిని తయారుచేసినవారికి, అమ్మేవారికి, అనుమతి ఇచ్చిన వారికి పాపఫలం వస్తుంది. పిల్లలను సక్రమంగా పెంచనందుకు తల్లిదండ్రులు కూడా ఆ పాపంలో పాలుపంచుకోవలసి వస్తుందని శాస్త్రం చెబుతోంది. కాబట్టి, శాస్త్రవర్ణిత నాలుగు రకాల పాపకార్యాలను నివారించండి మరియు పాపకార్యాలు చేసే వారికి సాయం చేయవద్దు. ఈ పాపకర్మలు ఈ విధంగా ఉన్నాయి: మద్యం సేవించడం, జూదం ఆడడం, మాంసం తినడం, మరియు వ్యభిచారం చేయడం.

దురదృష్టవశాత్తూ ప్రస్తుత కలియుగంలో జనులను మోసం చేయడానికి అనేకులు తమకు తామే భగవంతుని అవతారాలుగా ప్రకటించుకొంటున్నారు. శాస్త్రజ్ఞానం లేనివారు అట్టివారి మాటలను గ్రుడ్డిగా నమ్మి మోసపోతున్నారు. భగవంతుడనని చెప్పుకుంటున్నవాడికి పరాశర మహర్షి తెలిపిన ఆరు గుణాలు ఉన్నాయో లేవో గమనించాలి. ఆరు గుణాలు సంపూర్ణంగా లేనివాడిని మోసగాడిగా నిర్ధారణ చేసుకోవాలి. ఈ విధంగా శాస్త్రాల ఆధారంగా భగవంతుని గురించి తెలుసుకోలేకపోతే ఆ మోసగాడితోపాటు మనం కూడా నరకానికి వెళ్ళక తప్పదు.

శాస్త్రాలను విశ్వసించకుండా మనం పాపకార్యాలను చేసినట్లయితే మనం బ్రతికి ఉండగానే జనులు మనలను నిందిస్తారు. మరణానంతరం నరకాన్ని అనుభవించి అనేకమార్లు జంతువులుగా, పక్షులుగా, క్రిమికీటకాలుగా జన్మించవలసి ఉంటుంది. శ్రీకృష్ణ భగవానుడు భగవద్గీతలో 16వ అధ్యాయం 23వ శ్లోకంలో శాస్త్రాలను అనుసరించకుండా ఇచ్ఛానుసారం జీవించేవాడు,

జీవితంలో విజయాన్నిగాని, సుఖాన్నిగానీ, ఉన్నత జన్మలనుగానీ (స్వర్గ, మోక్షాలను) పొందలేడని తెలిపెను. భగవద్గీతలో 4వ అధ్యాయం 40వ శ్లోకంలో కూడా శ్రీకృష్ణ భగవానుడు "శాస్త్రాలను నమ్మనివారు, అజ్ఞానులు, శాస్త్రాల పట్ల శ్రద్ధ లేని వారు భగవంతునికి సంబంధించిన జ్ఞానాన్ని పొందకలేక పతనం చెందుతారు వారు ఈ లోకంలోగానీ పరలోకంలోగానీ సుఖాన్ని పొందలేరు" అని తెలిపెను. అందువలన జీవించి ఉండగానే శాస్త్రాలలో తెలుపబడిన నియమాలను పాటించి ఉన్నత జన్మలను పొందడానికి ప్రయత్నించాలి.

భాగవతంలో (1.5.17) నారద ముని వ్యాసదేవునితో "భగవంతుని భక్తిని సాధన చేసేవారు కాలక్రమమున మోక్షాన్ని పొందలేకపోయినా ఎలాంటి నష్టం లేదుగానీ, కుటుంబ బాధ్యతలను చక్కగా నెరవేర్చేవారి కార్యాలు మృత్యువుతో సమాప్తం అవుతాయి. కనుక అటువంటి కార్యాల వలన లాభం ఏమీ లేదు" అని తెలిపెను. ఈ లోకంలో ఎవ్వరూ శాశ్వతంగా కలిసి జీవించలేరు. మనము శాశ్వతంగా మన శరీరాలలో నివసించలేము, మనమందరమూ ఒకనాటికి మరణించవలసిందే. మనం మరణించిన తరువాత భార్య, పిల్లలు మరియు ఇతర బంధువులతో ఉన్న సంబంధం కూడా నశిస్తుంది. అందరూ ఒంటరిగానే జన్మించి ఒంటరిగానే మరణిస్తారు. మరణించిన తరువాత చేసిన పాపపుణ్యాల ఫలితాన్ని ఒంటరిగానే అనుభవించవలసి ఉంటుంది.

మహాభారతంలోని వనపర్వంలో, ధర్మరాజు (యుధిష్ఠిరుడు) ద్రౌపదితొ మరియు భీమసేనుతొ "ప్రేమతో ఏకమైన సోదరులు, భార్యభర్తలు, తల్లిదండ్రులు, బంధువులు మొదలగువారు ధనం కొరకు ప్రేమబంధాలను తెంచుకొని శత్రువులాగా మారి ఒకరినొకరు వధించుకుంటారు" అని తెలిపెను. ధనం సంపాదించినకొలది సంపాదించాలనే కోరిక పెరుగుతుంది. ధనం సంపాదించినంత కాలమే ఎవరికైనా గౌరవం లభిస్తుందిగాని సంపాదన లేనప్పుడు

ఎవ్వరూ పలకరించరు. ధనవంతులకు తన కుమారుల వలన కూడా భయమే, ఇతరుల గురించి చెప్పేదేముంది? ధనం వలన హింస, అసత్యం, కపటత్వం, కామం, క్రోధం, చింత, గర్వం, కలహం, శత్రుత్వం, ఎవరినీ నమ్మకపోవడం, అసూయ, వ్యభిచారం, జూదం, మద్యపానం వంటి ఎన్నో చెడు గుణాలు సంక్రమిస్తాయి.

అనేక దుర్గుణాలు సంక్రమింపజేసే ధనాన్ని భగవంతుడిని నుండి కోరడం న్యాయమా? భాగవతంలో (10.60.53) శ్రీకృష్ణ భగవానుడు "వ్రతం, తపస్సు మరియు పూజల ద్వారా నన్ను పొందిన తరువాత కూడా భగవద్ధామాన్ని ఆశించకుండా కుటుంబ జీవితానికి సంబంధించిన లౌకిక లాభాల కోరికలు (స్వర్గంలోని సుఖాలను) కోరేవారు దురదృష్టవంతులు. ఈ లౌకిక లాభాలు నరకంలో కూడా లభిస్తాయి. ఇంద్రియాల తృప్తిలో మునిగిన అటువంటి వారికి నరకమే సరైన స్థలం." అని తెలుపుచున్నాడు. ఇదే విషయాన్ని కపిల భగవానుడు భాగవతంలో (3.30.3–5) తన తల్లితో "తన శరీరం, కుటుంబ సభ్యులు, ధనం మరియు ఇల్లు అనేవి శాశ్వతమని అజ్ఞాని అనుకుంటాడు. ప్రతి జీవి ఇంద్రియ సుఖాలను అనుభవిస్తున్నందువలన తన శరీరాన్ని వదలడానికి ఇష్టపడదు. ఈ భూమి మీద ఉన్న జీవులే కాదు, నరకంలో యాతన అనుభవించే జీవులు కూడా తమ తమ శరీరాలను వదలడానికి ఇష్టపడవు" అని తెలిపెను.

భాగవతంలో (10.51.20) దేవతలు ముచుకుంద మహారాజుతో "మోక్షం తప్ప మరేదైనా వరాన్ని మా నుండి నీవు కోరుకోచ్చు, మోక్షాన్ని కేవలం నారాయణుడు మాత్రమే ఇవ్వగలడు" అని అన్నారు. అంబరీష మహారాజు, ప్రహ్లాద మహారాజు, ధృవ మహారాజు, పృథు మహారాజు మరియు భరత మహారాజు మొదలగు శుద్ధ భక్తులు –రామానుజాచార్య, మధ్వాచార్య, అనంతాచార్య, చైతన్య మహాప్రభు, నిత్యానంద ప్రభు మరియు మాధవేంద్రపురి వంటి ఆచార్యులు భక్తిని మరియు ముక్తిని కోరుకున్నారేగానీ ధనమును మరియు భౌతిక

కోరికలను కోరుకోలేదు. వారందరూ మనకు ఆదర్శప్రాయులు కనుక వారు కోరిన కోరికలను భగవంతుని నుండి కోరాలి మనం.

మహాభారతంలో యక్షుడు ధర్మరాజును అనేక ప్రశ్నలు అడిగాడు. ఆ ప్రశ్నలలో ఒకటి "సంపద అనగా ఏది?" అనే ప్రశ్న. ధర్మరాజు "శాస్త్ర జ్ఞానమే నిజమైన సంపద" అని తెలిపెను. భగవద్గీతలో (4.36) శ్రీకృష్ణ భగవానుడు "ఓ అర్జునా! నీవు అత్యంత పాపిష్ఠుడివైనా, దివ్య జ్ఞాన నౌకలో నేలకొనినప్పుడు, ఈ దుఃఖ సముద్రాన్ని దాటగలవు." భగవద్గీత (4.37) "మండుచున్న అగ్ని కట్టెలను బూడిద చేసిన విధంగా జ్ఞానాగ్ని అన్ని కర్మల ఫలితాలను నశింపచెస్తుంది." భగవద్గీత (4.38) "ఈ లోకంలో జ్ఞానాన్ని మించినది ఏదీ లేదు. భగవంతునికి సంబంధించిన జ్ఞానం కంటే పవిత్రమైన మరియు ఉన్నతమైనది మరేదీ లేదు."

"వినయం, గర్వం లేకుండుట, సహనం, సరళంగా ఉండుట, గురువును ఆశ్రయించుట, ఇంద్రియాలను నిగ్రహించుట, అహంకారం లేకుండుట, జన్మ–రోగాలు–ముసలితనం–మరణించుట గురించి సక్రమమైన అవగాహన కలిగి ఉండుట, సుఖదుఃఖాలను సమానంగా చూచుట, నాయందు అనన్యమైన భక్తి, భక్తుల సాంగత్యంలో జీవించుట, సృష్టి గురించి తెలుసుకోవడమే జ్ఞానం అని నేను తెలుపుచున్నాను వీటికి అన్యమైనది ఏదైనా అజ్ఞానమే" అని తెలిపెను. భగవద్గీత (13.8–12)

ఆహారం తినడం, నిద్రించడం, సంతానాన్ని పొందడం, రక్షించుకోవడం అనేవి జంతువులు మరియు మానవులు సాధారణంగా చేసే పనులు. నేనెవరిని? నేను జన్మించక ముందు ఎక్కడ ఉన్నాను? నేను చనిపోయిన తరువాత ఎక్కడికి వెళ్తాను? ఈ సృష్టి ఎలా వచ్చింది? సృష్టి కర్తకు మరియు నాకు ఏదైనా సంబంధం ఉందా? అని తెలుసుకోగలిగే బుద్ధి కేవలం మానవులకేగాని జంతువులకు ఉండదు. ఇటువంటి జిజ్ఞాస కలవారే మానవులు.

అటువంటి జిజ్ఞాస ఏమాత్రం లేని మానవులు రెండు కాళ్ల జంతువులతో సమానం అని హితోపదేశంలో(25) చెప్పబడింది. అందువలన విలువైన మానవ జన్మను వృధా చేసుకోవద్దు.

“గడిచిపోయిన ఒక్క క్షణాన్ని కూడా కోట్ల రూపాయలతోనైనా కొనలేము” అని చాణక్య పండితుడు తెలిపాడు. అందువలన సమయం ఎంత విలువైనదో ఆలోచించండి. మనం జీవించేది 80 సంవత్సరాలు అనుకుంటే బాల్యంలో 5 సంవత్సరాలు, చదువుకోవడానికి 15 సంవత్సరాలు, ముసలితనంలో 5 సంవత్సరాలు గడిచిపోతాయి. మిగిలిన జీవితంలో రోజుకు 8 గంటలు నిద్రకు, 8 గంటలు పనిచేయడానికి, 2 గంటలు పనికి వెళ్లి రావడానికి, 2 గంటలు తినడానికి, 1 గంట స్నానానికి, ఇలా 21 గంటలు గడిచిపోతే మిగిలేది 3 గంటలు మాత్రమే. ఈ మూడు గంటలు రోగాలకు, సరుకులు తేవడానికి, వివాహాల వంటి ఉత్సవాలతో గడచిపోతే 24 గంటలలో సమయమే మిగలదు. ఈ విధంగా 80 సంవత్సరాలు వృధాగా గడిచిపోతున్నాయి. వృధా అయిపోతున్న 80 సంవత్సరాలను ఎలా ఉపయోగించుకోవాలో తెలుసుకుందాం.

భగవద్గీతలో (3.9) శ్రీకృష్ణ భగవానుడు అర్జునునితో “ఓ కుంతీపుత్రా! విష్ణువు కొరకు కర్మ చేయుము. ఆ విధంగా నీవు కర్మ బంధాల నుండి ముక్తుడవు కాగలవు” అని తెలిపెను. ఈ శ్లోకంలో శ్రీకృష్ణ భగవానుడు తన కొరకు కర్మ చేయమని తెలుపుచున్నాడు. శ్రీకృష్ణుని పూజ చేయడం మాత్రమే భక్తి కాదు. శ్రీకృష్ణుని ఆనందం కొరకు ఏ పని చేసినా అది భక్తి అవుతుంది. అందువలన మనం స్నానం చేసి శ్రీకృష్ణునికి ప్రణామం చేసి అగరుబత్తీలు, దీపం, పువ్వులు మరియు తులసి దళాలు సమర్పిస్తే మనం స్నానం చేసిన సమయం కూడ భక్తి చేసినట్లే. అదేవిధంగా స్నానం చేసి శుచిగా వంట చేసి భగవంతునికి సమర్పిస్తే వంట చేసిన సమయం, పాత్రలు కడిగిన సమయం, వంట సరుకులు తెచ్చిన సమయం, శ్రీకృష్ణునికి

సమర్పించిన ఆహార పదార్థాలను ప్రసాద రూపంలో తీసుకున్న సమయం, వంటకు కావలసిన సరుకులు కొనడానికి వెళ్లిన సమయం, ధనం కోసం కష్టపడిన సమయం, ధనం సంపాదించడం కోసం వెళ్లి వచ్చిన సమయం అన్నీ భక్తియుత సేవగా పరిణమిస్తాయి. గృహస్థులు, తాము సంపాదించిన ధనాన్ని మొదట కుటుంబ ఖర్చులకు వినియోగించుకొని మిగిలిన ధనాన్ని శ్రీకృష్ణుని సేవలో వినియోగించాలి.

అందువలన దయచేసి మేల్కొనండి, ప్రస్తుత మానవ జన్మ ఎంత విలువైనదో అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి. జీవులలో మానవ జన్మ ఉత్తమమైనది. అందునా ఎన్నో కోట్ల జన్మల పుణ్యం ఉంటేనే భారత దేశంలో జన్మిస్తారని విష్ణుపురాణంలో (రెండవ అంశ ముడవ అధ్యాయం 23వ శ్లోకం) ఉన్నది. అన్ని జీవుల వలె మానవ జన్మ తాత్కాలికమే అయినప్పటికీ మోక్షాన్ని పొందుటకు అవకాశం కలదు. కనుక కృష్ణ భక్తిని సాధన చేసి మరణించే లోపుగా జంతువులు సాధించలేని ముక్తిని సాధించాలి.

ఒకవేళ ఈ జన్మలో సాధించలేక పోతే వచ్చే జన్మలో భక్తుల కుటుంబాలలో జన్మించి మరలా భక్తి చేసే అవకాశం లభిస్తుంది. (భగవద్గీత 6.41–42) అందువలన తాత్కాలికమైన ఈ మానవజన్మను శ్రీకృష్ణ భక్తిలో వినియోగించండి.

సత్యయుగంలో విష్ణువును ధ్యానించడం ద్వారా, త్రేతాయుగంలో యజ్ఞాలు చేయడం ద్వారా మరియు ద్వాపరయుగంలో భగవంతుని పాద పద్మాలను సేవించడం ద్వారా ఏ ఫలితాన్ని పొందుతామో కలియుగంలో కేవలం హరే కృష్ణ మహా మంత్రాన్ని జపించడం ద్వారా అదే ఫలితాన్ని పొందవచ్చు. (భాగవతం 12.3.52)

హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే।
హరే రామ హరే రామ రామ రామ హరే హరే॥

16 నామాలు కలిగిన ఈ హరే కృష్ణ మహా మంత్రం ప్రస్తుత కలియుగంలోని అన్ని దోషాలను తొలగిస్తుంది. నాలుగు వేదాలను ఎంత వెతికినా ఇంతకు మించిన సులభమైన మార్గం వేరొకటి లేదు అని ఈ విధంగా భగవద్గీత, భాగవతం గురించి ఉపదేశం చేస్తారు.

భక్తులు ఈ విధంగా ఉపదేశాలు చేయడం ద్వారా అనేక కుటుంబాలు మద్యం, మాంసం, వ్యభిచారం, జూదం వంటి పాపకార్యాలను వదిలి మందిరంలోని భక్తుల వలె వారు కూడా రాధాకృష్ణుల భక్తిని సాధన చేస్తున్నారు.

ఇస్కాన్ రాధాగోవింద మందిరం వంటి ఇస్కాన్ మందిరాలు ప్రపంచంలో వెయ్యి ఉన్నాయి, వేలాది ప్రచార కేంద్రాలు ఉన్నాయి. కావున మీరు మీ మీదగ్గరలో ఉన్న ఇస్కాన్ మందిరానికి వెళ్లి భక్తుల సాంగత్యంలో భక్తిని సాధన చేస్తారని ఆశిస్తున్నాను.

ఇస్కాన్ రాధా గోవింద మందిరం రైల్వే స్టేషన్ నుండి నాలుగు కిలోమీటర్లు, కపిల తీర్థం నుండి ఒక కిలోమీటర్ దూరంలో ఉన్నది.

అలిపిరిలోని శ్రీవారి పాదాలు

రామానుజాచార్య ఒకసారి ఒక సంవత్సర కాలం పాటు తిరుపతిలోని కపిలతీర్థంలో ఉండిరి. ఆ సమయంలో తిరుమలనంబి ఉదయం వేంకటేశ్వర స్వామిని సేవించి, తిరుమల నుండి తిరుపతికి వచ్చి రామానుజాచార్యకు రామాయణాన్ని తెలిపి సాయంత్రానికి తిరుమల వెళ్లేవారు. అయితే మధ్యాహ్నం వేంకటేశ్వర స్వామిని దర్శించలేకపోతున్నందుకు తిరుమలనంబి బాధపడసాగిరి. ఈ విషయాన్ని గ్రహించిన వేంకటేశ్వర స్వామి అలిపిరిలోని కొండను ఎక్కే మెట్ల దగ్గర తన పాదాల గుర్తులను ఉంచి “ఆ పాదాలను దర్శిస్తే నన్ను దర్శించినట్లే” అని తిరుమలనంబితో తెలిపిరి. తిరుమలనంబి ఎంతో సంతోషించి ప్రతిరోజూ మధ్యాహ్నం ఆ పాదాలను దర్శించి పూజించేవారు.

ఈ అలిపిరి లోని శ్రీవారి పాదాలు ఇస్కాన్ మందిరం నుండి ఒక కిలోమీటర్ దూరంలో ఉన్నాయి.

పద్మావతి దేవి మందిరం – పద్మ సరోవరం

తిరుచానూరులోని అలమేలుమంగ ఆలయంలో ఉన్న అమ్మవారిని స్థల పురాణాల ప్రకారం, శాస్త్రాల ప్రకారం, అర్చనాది ఆచారాలనుబట్టి లక్ష్మీదేవి అని నిర్ధారించారు. అన్నమాచార్య కూడ తన సంకీర్తనలలో అలమేలు మంగను శ్రీమహాలక్ష్మిగా పదే పదే వర్ణించాడు. ఈ లక్ష్మీదేవి పద్మ సరోవరం నుండి పద్మంలో అవతరించినందువల్ల పద్మావతి దేవి అని అంటారు. లక్ష్మీదేవి చతుర్భుజాలతో ఉంటుంది. రెండు చేతులు పద్మాలు ధరించి ఉండును, రెండు చేతులు వరద అభయ ముద్రలలో ఉండును. తమిళంలో 'అలర్' అనగా పువ్వు, 'మేల్' అనగా పైన, 'మంగై' అనగా అందమైన స్త్రీ. అలమేలు మంగ అంటే "పద్మంలో ప్రకాశిస్తున్న సుందరి" అని అర్థం.

పద్మ సరోవరం : పద్మావతి దేవి మందిరం వెనుకే పద్మ సరోవరం ఉన్నది. భృగు మహర్షి నారాయణుని వక్షస్థలంలో తన్నినందుకు లక్ష్మీ దేవి పాతాళంలోని కపిల మహర్షి ఆశ్రమానికి వెళ్ళిపోయినది. అక్కడ కపిల మహర్షి లక్ష్మీ దేవిని పూజిస్తూ ఉండెను. నారాయణుడు లక్ష్మీ దేవిని వెతుకుతూ భూలోకంలోని కొల్హాపురంలో అగస్త్య ముని స్థాపించిన లక్ష్మీ దేవి మందిరానికి వెళ్ళెను. అక్కడ మునులతోపాటు నారాయణుడు కూడా లక్ష్మీ దేవిని పూజిస్తూ ఉండెను. ఇలా పది సంవత్సరాలు గడిచెను.

ఒకనాడు ఆకాశవాణి రూపంలో లక్ష్మీ దేవి నారాయణునితో ఇలా అనెను: దక్షిణ దిక్కున ఉన్న కృష్ణా నదికి దగ్గరలో గల సువర్ణముఖారీ నదీ తీరంలో ఒక సరోవరాన్ని త్రవ్వి స్వర్గంలోని బంగారు పద్మాలను ఆ సరస్సులో వేస్తూ లక్ష్మీ దేవిని పూజింపుము.

అక్కడ లక్ష్మీ దేవి దర్శనం కలుగునని తెలిపెను.

ఆకాశవాణి తెలిపినట్లు కృష్ణా నది మరియు సువర్ణముఖారీ నదులలో నారాయణుడు స్నానం చేసి శుకదేవుని ఆశ్రమం దగ్గర ఒక సరస్సును త్రవ్వెను. తరువాత నారాయణుడు వాయు దేవుని పిలిచి స్వర్గంలోని బంగారు కమలాలను తీసుకురమ్మని తెలిపెను. నారాయణుని ఆజ్ఞ మేరకు వాయు దేవుడు స్వర్గంలోని బంగారు కమలాలను తీసుకువచ్చెను.

ఆ కమలాలు వాడిపోకుండా నారాయణుడు అక్కడ సూర్య దేవుని ప్రతిష్టించెను. (ఈనాటికీ ఈ సూర్య దేవాలయం పద్మావతి దేవి మందిరం ప్రక్కన ఉన్నది.) తరువాత నారాయణుడు ఆ బంగారు పద్మాలను సరస్సులో వేస్తూ 12 సంవత్సరాలు లక్ష్మీ దేవిని పూజించెను. కార్తీక మాసంలో శుక్రవారం నాడు లక్ష్మీ దేవి ఆ పద్మ సరోవరం నుండి ఉద్భవించినది. దేవతలు తమ తమ వాయిద్యాలను మ్రోగిస్తూ లక్ష్మీ దేవిని స్తుతించిరి.

లక్ష్మీ దేవి తన మెడలోని పూలమాలను నారాయణుని మెడలోవేసి కౌగిలించుకున్నది. నారాయణుడు లక్ష్మీ దేవితో పాటు వేంకటాచలానికి వెళుతూ పద్మ సరోవరంతో ఇలా అనెను: "సరోవరమా! నేను నీ తీరాన లక్ష్మీ దేవిని పొందితిని. నీవు ఈనాటి నుండి పద్మ సరోవరంగా వెలుగొందెదవు. నీవు లక్ష్మీ దేవికి ప్రియమైన దానవు కాగలవు. నీలో స్నానం చేసినవారి పాపాలు నశించి పోగలవు" అని దీవించి వేంకటాచలం వెళ్లెను.

లక్ష్మీదేవి మరియు వేంకటేశ్వర స్వామి వేంకటాచలం వెళ్లేటప్పుడు దేవతలు లక్ష్మీదేవితో "అమ్మా! నీవు ఇక్కడ అవతరించినందువల్ల ఈ స్థలంలో అర్చా మూర్తిగా మారి భక్తుల కోరికలను తీర్చమని" ప్రార్థించినారు. లక్ష్మీదేవి వారి కోరిక మేరకు అర్చా మూర్తిగా మారినది.

పద్మావతి దేవికి ప్రతిరోజు సుప్రభాత సేవ, సహస్ర నామార్చన, కల్యాణోత్సవము, ఊంజల్ సేవ, ఏకాంత సేవ జరుగును. సోమవారం అష్టదళ పాదపద్మారాధన, శుక్రవారం అభిషేకం, గురువారం తిరుప్పావడ సేవ అనే ఉత్సవాలు జరుగును. ఇంకా పద్మావతి దేవికి బ్రహ్మోత్సవాలు, నవరాత్రి ఉత్సవాలు కూడా జరుగును. పద్మావతి దేవి అవతరించిన రోజైన కార్తీక శుద్ధ పంచమి నాడు తిరుమలనుండి గజవాహనంపై వచ్చే చక్రతాళ్వారుతో పాటు పద్మావతి దేవిని పద్మసరోవరంలో స్నానమాచరించడం ఇక్కడి సంప్రదాయం.

కార్తీక మాసంలో పద్మావతి దేవికి బ్రహ్మోత్సవాలు జరిగుతాయి. బ్రహ్మోత్సవాలలో ఒకరోజు శ్రీ వేంకటేశ్వర స్వామికి సమర్పించిన పూల మాలతో పాటుగా కుంకుమ, పసుపు, సుగంధ ద్రవ్యాలు, చీర, రవిక, లడ్డూలు, వడలు మొదలగు ప్రసాదాలు పద్మావతి దేవికి అందుతాయి.

అన్నమాచార్య పద్మావతి దేవిని కీర్తిస్తూ అనేకమైన కీర్తనలను పాడిరి అందులోని ఒక కీర్తన భావం : "పద్మావతి దేవి మహారాష్ట్రలోని కొల్హాపురంలో శ్రీ మహాలక్ష్మిగాను, నారాయణపురంలో శ్రీ పద్మావతిగానూ, తిరుచానూరులో అలమేలు మంగగాను, తిరుమల క్షేత్రంలోని శ్రీనివాసుని వక్షస్థలంపై వ్యూహ లక్ష్మిగాను ఉంటూ తనను దర్శించినవారి కోరికలను తీరుస్తూ ఉన్నది. ఆ జగన్మాత ఎన్నోచోట్ల ఎన్నో పేర్లతో ఉన్నప్పటికీ ఆమె శ్రీనివాసుని పట్టమహిషి (భార్య). అలమేలు మంగ హృదయంలో నారాయణుడు ఉండును. నారాయణుని హృదయంలో అలమేలు మంగ ఉండును. ఆ ఇద్దరూ నా హృదయంలో ఉందురుగాక!"

కృష్ణ బలరామ ఉప మందిరం : పద్మావతి దేవి మందిరంలో కృష్ణ బలరాముల ఉప మందిరం ఉన్నది. బలరాముడు మహాభారత యుద్ధంలో పాల్గొనకుండా తీర్థయాత్రలు చేయుచుండెను. యుద్ధం

ముగిసిన తరువాత కృష్ణుడు బలరాముని వెతుకుచూ శుకదేవుని ఆశ్రమానికి వచ్చెను. శుకదేవుడు కృష్ణునికి అతిథి సేవలను చేసి, వచ్చిన విషయం తెలుసుకొని, బలరాముడు తీర్థయాత్రలు చేస్తూ ఇక్కడికి రాగలడుగనుక మీరు ఇక్కడే బలరాముడు వచ్చేవరకు వేచి ఉండమని ప్రార్థించెను. శుకదేవుని ప్రార్థనను మన్నించి కృష్ణుడు అక్కడనే ఉండెను. బలరాముడు తీర్థయాత్రలను చేస్తూ శుకదేవుని ఆశ్రమానికి వచ్చెను. అప్పుడు కృష్ణ బలరాములు కలుసుకొనిరి. కృష్ణ బలరాములు ద్వారక వెళ్ళిన తరువాత శుకదేవుడు కృష్ణ బలరాముల మందిరాన్ని నిర్మించెను.

సుందరరాజ స్వామి (శ్రీ వేంకటేశ్వర స్వామి) ఉప మందిరం : ఈ మందిరం కృష్ణ బలరాముల మందిరం ప్రక్కనే ఉన్నది. సుందరరాజ స్వామి ఎనిమిది అడుగుల ఎత్తు కలిగి శ్రీదేవి మరియు భూదేవి సమేతంగా ఉన్నాడు. ఇచ్చట సుందర రాజ స్వామి, శ్రీదేవి మరియు భూదేవి యొక్క ఉత్సవ మూర్తులు కూడా ఉన్నాయి.

ఈ పద్మావతి దేవి మందిరం తిరుపతి రైల్వే స్టేషన్ నుండి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్నది.

శ్రీనివాస మంగాపురం

వేంకటేశ్వర స్వామి పద్మావతి దేవిని వివాహం చేసుకున్న తరువాత అగస్త్య ముని ఆశ్రమంలో ఆరు నెలలు నివసించిన ఆ స్థలంలో ఇప్పుడు వేంకటేశ్వర స్వామి మందిరం ఉన్నది. ఈ వేంకటేశ్వర స్వామిని కల్యాణ వేంకటేశ్వర స్వామి అని అంటారు. ఇక్కడి నుండి రెండు కిలోమీటర్ల దూరంలో అగస్త్య ముని ఆశ్రమం ఉన్నది. శ్రీనివాస మంగాపురం నుండి తిరుమలకు 2400 మెట్లు ఉన్నాయి. ఈ మెట్లను తొండమానుడనే చక్రవర్తి నిర్మించెను. వేంకటేశ్వర స్వామి పద్మావతి దేవితో కలిసి ఈ మెట్ల మార్గం ద్వారానే వేంకటాచలం పైకి వెళ్లెను.

ఈ శ్రీనివాస మంగాపురం తిరుపతి రైల్వే స్టేషన్ నుండి 12 కిలోమీటర్ల దూరంలో ఉన్నది.

సువర్ణ ముఖారీ (స్వర్ణ ముఖి) నది మరియు అగస్త్యేశ్వరాలయం

(స్కందపురాణంలోని రెండవ వైష్ణవఖండలోని శ్రీవేంకటాచల మాహాత్మ్యమున 29వ అధ్యాయం.)

పాండవులు ద్రౌపదిని వివాహం చేసుకొని ఇంద్రప్రస్థపురాన్ని పరిపాలిస్తుండిరి. ఆ సమయంలో ఒకసారి నారద ముని వచ్చి పాండవులతో సుంద–ఉపసుంద అనే సోదరుల కథను వివరించి ఈ విధంగా తెలిపెను: "మీ యొక్క భార్య ద్రౌపది, ఒక్కొక్కరి వద్ద ఒక సంవత్సరం ఉంటుంది. ద్రౌపది తన భర్తతో ఒంటరిగా గదిలో ఉన్నప్పుడు మిగిలిన పాండవులు వారి వద్దకు వెళ్లకూడదు. అలా వెళితే, ఒక సంవత్సరం పాటు తీర్థయాత్రలు చేయాలనే నియమాన్ని పెట్టుకోండి" అని తెలుపగా పాండవులు అంగీకరించారు.

ఒకసారి ఒక బ్రాహ్మణుని గోవులను దొంగలు అపహరించారు. ఆ బ్రాహ్మణుడు అర్జునుని వద్దకు వచ్చి దొంగల బారి నుండి తన గోవులను రక్షించమని ప్రార్థించెను. అర్జునుడు ఆయుధాల కోసం ఆయుధాల గదిలోనికి వెళ్లెను. అదే సమయంలో ధర్మరాజు ద్రౌపదితో ఆ గదిలో ఉన్నాడు. అర్జునునికి నారద ముని తెలిపిన నియమం గుర్తుకు వచ్చింది. అయినా బ్రాహ్మణుని గోవులను రక్షించాలని ఆయుధాలను తీసుకొని దొంగలను సంహరించి గోవులను బ్రాహ్మణునికి అప్పగించాడు. తరువాత ధర్మరాజుతో "నారదముని తెలిపిన నియమం ప్రకారం నేను సంవత్సరం పాటు తీర్థయాత్రలు చేస్తాను" అన్నాడు. ధర్మరాజు అర్జునునితో "నీవు బ్రాహ్మణుని గోవులను రక్షించడానికి గదిలోనికి వచ్చావు. బ్రాహ్మణుల కోసం అబద్ధమాడినా అది సత్యమే అవుతుంది, పాపం చేసినా పుణ్యమే

అవుతుంది. అందువలన నీవు తీర్థయాత్రలు చేయనవసరం లేదు" అన్నాడు. అప్పుడు అర్జునుడు ధర్మరాజుతో "ధర్మాన్ని ఎట్టి పరిస్థితులలో వదలవద్దు అని మీరే తెలిపారు. కావున మీరు నాకు తీర్థయాత్రలకు అనుమతి ఇవ్వండి" అని ప్రార్థించగా ధర్మరాజు అంగీకరించాడు.

అర్జునుడు తీర్థయాత్రలు చేస్తూ సువర్ణముఖారీ నదిని దర్శించి ప్రణామాలు చేసి పూజించి స్నానం చేసి దానధర్మాలు చేసెను. తరువాత భరద్వాజ ముని ఆశ్రమానికి వెళ్లి మునికి ప్రణామాలు చేసెను. భరద్వాజ ముని అర్జునునికి మరియు అర్జునుని పరివారానికి కామధేనువు అనే గోవుతో అతిథి సేవలు చేసెను. అర్జునుడు భరద్వాజ మునితో "ఈ సువర్ణముఖారీ నది ఎలా ఆవిర్భవించింది? సువర్ణముఖారీ నది గొప్పతనాన్ని తెలుపండి" అని అడగగా భరద్వాజ ముని ఈ విధముగా తెలిపెను:

ఒక రోజు అగస్త్య ముని ఉదయం తన దైనందిన కార్యక్రమాలు పూర్తి చేసుకొని శివుని ఆరాధించడానికి వెళ్ళుచుండెను. అప్పుడు ఆకాశవాణి "ఓ మునివర్యా! ఈ ప్రదేశంలో ఎలాంటి నది లేదు. ఈ ప్రాంతంలోని జనుల కోసం ఇక్కడకు ఒక నదిని తీసుకురండి" అని తెలిపినది. ఆకాశవాణి మాటలను విన్న అగస్త్య ముని బ్రహ్మ దేవుని కొరకు ఘోరంగా తపస్సు చేయగా బ్రహ్మ దేవుడు ప్రత్యక్షమై అగస్త్య మునిని వరం కొరుకోమన్నాడు. అగస్త్య ముని "ఈ ప్రాంతంలో ఎలాంటి నది లేదు. అందువలన జనులను ఉద్ధరించే ఒక నదిని ప్రసాదించమని" వరం కోరాడు. బ్రహ్మ దేవుడు గంగను స్మరించగానే గంగా దేవి ప్రత్యక్షమైంది. బ్రహ్మ దేవుడు గంగా దేవితో అగస్త్య ముని కోరికను తెలిపి, అగస్త్య ముని వెంబడి వెళ్ళమన్నాడు. గంగా దేవి బ్రహ్మ దేవుని ఆజ్ఞ మేరకు అగస్త్య ముని వెంట ప్రయాణించింది. గంగా దేవి వెళుతూ ఉండగా ప్రజలు ప్రణామాలు చేసి గంగా దేవిని పూజించిరి. ఇది చూసిన వాయు దేవుడు "ప్రజలకు

సువర్ణం (బంగారం) లభించినట్లు, ఇక్కడి జనులకు గంగా దేవి లభించినందువలన ఈ గంగకు సువర్ణముఖారీ అని పేరు వస్తుంది" అని అన్నాడు గనుక ఈ గంగకు సువర్ణముఖారీ అని పేరు వచ్చిందని భరద్వాజ ముని అర్జునునికి తెలిపెను. సువర్ణముఖారీ నదిలో కలిసే ఇతర నదులు: మహానది, ఆగ్రాపధ, కాల్వ. కాల్వనది వేంకటాచల పర్వతం నుండి వచ్చును. (సువర్ణముఖారీ నది శ్రీనివాస మంగాపురం దగ్గరలో ఉన్నది. ఈ నదీతీరంలోనే అగస్త్య ముని ఆశ్రమం, అగస్త్యేశ్వర స్వామి శివాలయం కూడ ఉన్నవి).

ఈ సువర్ణ ముఖారీ నది శ్రీనివాస మంగాపురం నుండి రెండు కిలోమీటర్ల దూరంలోని అగస్త్యేశ్వర శివాలయం ప్రక్కన ఉన్నది.

8

ఆళ్వారులు రచించిన వేంకటేశ్వర స్వామి స్తోత్రాలు

ఆళ్వారులు అనగా "భగవంతుని దివ్య గుణాలలో మునిగిన శుద్ధ భక్తులైన ఆచార్యులు" అని అర్థం. ఆళ్వారులు రచించిన దివ్య ప్రబంధంలోని వేంకటేశ్వర స్వామి పాశురాల సారాంశం క్రింద ఇవ్వబడ్డాయి.

శ్రీ పోయిగై ఆళ్వారు

పోయిగై ఆళ్వారు కాంచీపురం వద్ద ఒక కోనేరులో అవతరించారు. ఆయన మహావిష్ణువు ధరించే పాంచజన్యం అనే శంఖం యొక్క అవతారం. పోయిగై ఆళ్వారు వేంకటేశ్వర స్వామిని ఈ విధంగా స్తుతించెను.

సంపదను కోరుకునే వారి పాపాలను మరియు మహావిష్ణువును పూజించే భక్తుల యొక్క పాపాలను తిరుమల క్షేత్రం క్షణంలో నశింపజేస్తుంది. ఇల్లు, ఇల్లాలు, పిల్లలు, సిరిసంపదలు, పదవులు వంటి అశాశ్వతమైన సంపదలను ఇచ్చే దేవతలు మరియు వేదజ్ఞానం కలిగిన బ్రాహ్మణులు ప్రతిరోజూ ధూపదీపాలను, సుగంధభరిత పుష్పాలను, పవిత్రమైన నీటిని, నైవేద్యాలను వేంకటాచలంలో నెలకొన్న వేంకటేశ్వర స్వామిని సేవించడానికి తీసుకువస్తున్నారు. పగడం వంటి ఎర్రని పెదవులతో శంఖాన్ని ఊదిన వేంకటేశ్వర స్వామికి తిరుమల క్షేత్రం అంటే చాలా ఇష్టం. సముద్రం యొక్క నీటి రంగులో ఉన్న మహావిష్ణువు వరాహ అవతారాన్ని ధరించి భూమిని ఉద్ధరించాడు. కృష్ణునిగా అవతరించి గోవర్ధనపర్వతాన్ని ఎత్తి గోకులవాసులను రక్షించాడు, కంసుని సంహరించెను. ఆ మహావిష్ణువే నేడు తిరుమలలో భక్తులకు దర్శనాన్ని ఇచ్చి

అనుగ్రహిస్తున్నాడు. క్షీరసాగరంలో శయనించిన విష్ణువు, నరసింహ అవతారాన్ని ధరించి హిరణ్యకశిపుని సంహరించాడు. ఇప్పుడు ఆయనే తిరుమలలో వేంకటేశ్వర స్వామిగా నెలకొని ఉన్నాడు.

వైకుంఠవాసుడైన నారాయణుని మహిమలను గురించి వేల యుగాలు ఆలోచించినప్పటికీ ఎవరూ అర్థం చేసుకోలేరు. భూలోకంలో ఎన్నో అవతారాలను ధరించిన ఆ నారాయణుడు ఇప్పుడు వేంకటాచలంలో నెలకొని ఉన్నాడు. విశ్వమంతటిని కొలచిన పుణ్య శ్లోకుడైన మహావిష్ణువు కొలువై ఉన్న తిరుమల క్షేత్రం మోక్షాన్ని ఇస్తున్నప్పుడు భక్తితో ఆయనను సేవించినవారు తప్పకుండా మోక్షాన్ని పొందుతారనడంలో ఎలాంటి సందేహం లేదు. తిరుమలలో నిలబడి దర్శనమిస్తున్న శ్రీనివాసుని ధ్యానిస్తే మన పాపాలన్నీ నశిస్తాయి. అందమైన స్త్రీలు ద్వాదశినాడు పూలమాలలను ధరించి అగరుధూపాలతో, హారతులతో స్వామిని పూజిస్తున్నారు. వారి అగరుబత్తుల నుండి వచ్చే పొగలు ఆకాశంలోని నక్షత్రాలను కనిపించకుండా చేశాయి. పూర్వం మాయాలేడి వేషంలో వచ్చిన మారీచుని సంహరించిన రాముడు నివసించిన పర్వతం తిరుమల.

ఓ మనసా! పురుషోత్తముడైన మహావిష్ణువు మనలను అన్ని కాలాలలో రక్షించడానికి సిద్ధంగా ఉన్నాడు. నారాయణుడు భక్తుల హృదయాలలో నివసిస్తున్నాడు. క్షీరసాగరంలో శయనించిన స్వామి తిరుమలలో వేంకటేశ్వర స్వామిగా కొలువై ఉన్నాడు. ఆ వేంకటేశ్వర స్వామి నా హృదయంలో నిత్యం నివసిస్తున్నాడు అని నీవు తెలుసుకో!

శ్రీ పూదత్త ఆళ్వారు

పూదత్త ఆళ్వారు తమిళనాడులోని మహా బలిపురానికి సమీపంలో మాధవి అనే పువ్వులో అవతరించారు. ఆయన మహావిష్ణువు యొక్క ఆయుధాలలో కౌమోదకి అనే గద యొక్క అవతారం. పూదత్త ఆళ్వారు వేంకటేశ్వర స్వామిని ఈ విధంగా స్తుతించెను:

దేవతలందరితో మరియు వైకుంఠ లోకాలలోని భక్తులతో కీర్తింపబడే మంచి గుణాలు గల నారాయణుడు ధర్మాన్ని రక్షించడానికి ఎన్నో అవతారాలను ధరించాడు. ఆయా సమయాలలో తనను దర్శించలేని వారికోసం తిరుమలలో వేంకటేశ్వర స్వామిగా వెలసి తన భక్తుల కష్టాలను దూరం చేసి దీవిస్తున్నాడు. ఏపుగా పెరిగిన దట్టమైన వెదురు పొదలచే మరియు ఇతర చెట్లచే చల్లగా ఉన్న పర్వత ప్రాంతం తిరుమల క్షేత్రం. మహర్షులతో, దేవతలతో దేవదేవునిగా కీర్తింపబడుతున్న స్వామి, క్షీరసాగరంలో నిద్రించిన స్వామి, గుర్రం రూపంలో తనను సంహరించడానికి వచ్చిన కేశి అనే రాక్షసుని సంహరించిన కృష్ణుడు ఇప్పుడు తిరుమలలో తన భక్తులకు నిలబడి దర్శనమిస్తున్నాడు. వెదురు పొదలతో నిండిన తిరుమలలోని వేంకటేశ్వర స్వామికి నేను సాష్టాంగ నమస్కారాలు చేస్తున్నాను. ఆ స్వామి లీలలను నా నాలుక సదా కీర్తిస్తుంది.

తిరుమలలో నిత్యనివాసం చేస్తున్నవాడు, దేవతల పూజలను అందుకుంటున్నవాడును అయిన మహావిష్ణువు పాదాలను నిత్యం సేవిస్తున్నవారు సంపదలు పొందినప్పుడు సంతోషించడంగానీ వాటిని కోల్పోయినప్పుడు దుఃఖించడంగానీ చేయరు. నీలమణిని పోలిన దేహకాంతి కలిగినవాడు, తనను దర్శించిన వారి దుఃఖాలను తొలగించే పురుషోత్తముడు, కరుణ అనే అమృతాన్ని పంచిపెట్టే పెద్ద చేతులు కలవాడు, భక్తవత్సలుడు అయిన మహావిష్ణువు తిరుమలలో నెలకొని ఉన్నాడు. అనేక తీర్థాలు కలిగి ఉన్న తిరుమలలోని వేంకటేశ్వర స్వామిని భక్తులు ధ్యానిస్తూ తమను తాము మైమరచిపోతారు. వేంకటేశ్వర స్వామి వెలసిన తిరుమల భక్తులకు ఎంతో ప్రియమైనది.

తిరుమలలో జీవించే కోతులు తెల్లవారుఝామున్నే లేచి తామర పుష్పాలతో నిండిన చెరువులలో స్నానం చేసి అప్పుడే విచ్చుకుంటున్న సుగంధభరిత పుష్పాలను తీసుకొని వేంకటేశ్వర

స్వామికి సమర్పించి నమస్కరిస్తున్నాయి. ఓ హృదయమా! నీవు కూడా ఆ విధంగా బయలుదేరి ఈ భూలోకానికే ఆభరణంగా విరాజిల్లుతున్న తిరుమలలో వెలిసిన వేంకటేశ్వర స్వామి నామాలను జపిస్తూ ఆ స్వామి పాదాలను చేరుకోవాలనే కోరికతో వేంకటేశ్వర స్వామికి పుష్పాలను సమర్పించు. తిరుమల కొండలలో ఒక ఏనుగు లేత వెదురును కోసి దానిని తేనెతుట్టెలో ముంచి తనకు ప్రియమైన ఆడ ఏనుగులకు అందిస్తుంది. అటువంటి తిరుమలలో వేంకటేశ్వర స్వామి వెలిశాడు.

శ్రీ పేయ ఆళ్వారు

పేయ ఆళ్వారు చెన్నైలోని మైలాపూరులో అవతరించారు. ఆయన మహావిష్ణువు యొక్క ఆయుధాలలో నందకం అనే ఖడ్గం యొక్క అవతారం. పేయ ఆళ్వారు వేంకటేశ్వర స్వామిని ఈ విధంగా స్తుతించెను:

నాలుగు వేదాలకే కాకుండా సామాన్య భక్తునికి కూడా దర్శనమిచ్చే తిరుమలలోని వేంకటేశ్వర స్వామి పాదాలకు దేవలోకవాసులు తమ కిరీటాలతో సహా సాష్టాంగ ప్రణామాలు చేస్తారు. పురుషోత్తముడైన వేంకటేశ్వర స్వామి పాదాలను ఎవరు హృదయంలో నిలుపుకుంటారో వారికి యువతులను ఆలింగనం చేసుకోవాలనే కామవాంఛ తొలగిపోయి, శేషాద్రిపై ఉన్న వేంకటేశ్వర స్వామిని పొందడం సులభం అవుతుంది.

తులసి మాలలను ధరించిన వేంకటేశ్వర స్వామి ఉండే దివ్య స్థలాలు: స్వామినే సదా ధ్యానిస్తున్న నా హృదయం మరియు పవిత్ర దివ్యదేశమైన తిరుమల క్షేత్రం. పూర్వం ఒకసారి మహావిష్ణువు వరాహ రూపాన్ని ధరించి ఈ సమస్త భూమిని తన కోరలచే ఉద్ధరించాడు. ఆ మహావిష్ణువే ఇప్పుడు ఈ తిరుమల కొండ మీద వెలిశాడు. ఒక స్వచ్ఛమైన రాయి మీద కూర్చొని ఉన్న ఆడకోతి, ఆకాశంలోని

చంద్రుని చూసి మగకోతితో "ఆ చంద్రుని తెచ్చిపెట్టవా!" అని అడుగుతుంది. ఇలాంటి ప్రదేశం తిరుమల క్షేత్రం.

పూర్వం వామనునిగా అవతరించి బలిచక్రవర్తి వద్దకు వెళ్లి తన తెలివితో ఈ భూమండలాన్ని దానంగా తీసుకున్న మహావిష్ణువే ఇప్పుడు తిరుమలలో వెలిశాడు. తిరుమలలోని స్వచ్ఛమైన సరోవరం వద్దకు ఒక మగకోతి వచ్చి, ఆ నీటిలో తన ప్రతిబింబాన్ని చూసి అక్కడ వేరొక కోతి ఉందనుకొని భయపడి, వెలగచెట్టుపైకి ఎక్కి వెలగపండ్లను కోయడానికి చేతులు చాపుతుంది. ఇవన్నీ ప్రతిరోజు తిరుమలలో జరిగే సన్నివేశాలు. పూర్వం వెలగపండ్లను రాల్చడానికి చేతి కర్రగా వత్సాసురుని విసిరి సంహరించిన కృష్ణుడు వెలసిన పుణ్యక్షేత్రం తిరుమల.

ఏదైనా ఒక పర్వతం గురించి చర్చ వచ్చినప్పుడు నా కూతురు వెంటనే తిరుమల కొండను కీర్తిస్తుంది. సురభి అనే పువ్వులను ఒక ఏనుగు దేవాదిదేవుడైన తిరుమలవాసునికి సమర్పిస్తుంది. తిరుమల తప్ప వేరొక ప్రదేశం తెలియని కురవ జాతి యువతులు చేతులకు గాజులను ధరించి వేంకటేశ్వర స్వామి కోసం నాట్యమాడుతున్నారు. మహావిష్ణువు కృష్ణునిగా అవతరించి ఒక కుండను తలమీద పెట్టుకొని నాట్యమాడాడు. ఆ మహావిష్ణువే ఇప్పుడు తిరుమలను నివాసముగా చేసుకున్నాడు. వేంకటేశ్వర స్వామి పాదాలను ఆశ్రయించి స్తుతించడమే మన నాలుకలకు ప్రయోజనం. తిరుమల దివ్యదేశం విశాలమైనది. ఎన్నో శిఖరాలతో ప్రసిద్ధి చెందినది.

శ్రీ తిరుమళిశై ఆళ్వారు

తిరుమళిశై ఆళ్వారు చెన్నైకి దగ్గరలో ఉన్న తిరుమళిశై అనే గ్రామంలో అవతరించారు. ఆయన మహావిష్ణువు ఆయుధాలలోని సుదర్శన చక్రం యొక్క అవతారం. ఒకసారి తిరుమళిశై ఆళ్వారు తిరునామం ధరించడానికి అవసరమైన తిలకం లభించలేదు.

చుట్టు ప్రక్కల వెతికినా లభించలేదు. వేంకటేశ్వర స్వామి స్వప్నంలో తిరుమళిశై ఆళ్వారుకు ఒక స్థలాన్ని గురించి తెలిపి, నీవు అక్కడికి వెళితే తిలకం లభిస్తుందని తెలిపాడు. తిరుమళిశై ఆళ్వారు వేంకటేశ్వర స్వామి తెలిపినట్లు ఉదయం అక్కడికి వెళ్ళగా తిలకం లభించింది. తిరుమళిశై ఆళ్వారు వేంకటేశ్వర స్వామిని ఈ విధంగా స్తుతించెను:

తిరుగోష్ఠిలో వెలసిన శ్రీమన్నారాయణుని ఎల్లప్పుడూ పూజించాలని మరియు దాని వలన శుభాలు కలగాలని కోరుకోవడం నా లక్ష్యం. శ్రీమన్నారాయణుడే పరమలక్ష్యంగా ఉన్న నాకోసమే వైకుంఠాన్ని వదిలి తిరుమలలో వెలసిన వేంకటేశ్వర స్వామిని పూజించడంలో నేను నిర్లక్ష్యం వహిస్తానా! (అలా చెయ్యను!) వ్యాధులు నా చెంతకు రాకుండా ఆ స్వామి నన్ను రక్షించి సకల శుభాలను ఇచ్చి నన్ను అనుగ్రహించాడు. తిరుమలవాసి అయిన వేంకటేశ్వర స్వామిని కనులవిందుగా చూద్దామనే కోరికతో దర్శనం కలిగించమని ఆ వేంకటేశ్వర స్వామిని నోరారా ప్రార్థిస్తున్నాను.

వర్షాకాలంలో తిరుమలలోని జలపాతాలలో నీటి ప్రవాహం అధికంగా ఉన్నప్పుడు అమూల్యమైన వివిధ రత్నాలు ఆ నీటిలో కొట్టుకుని వస్తుంటాయి. ఆ రత్నాలను నిప్పులు అనుకొని ఏనుగుల గుంపులు భయంతో నిలబడి పోతాయి. రత్నాల నుండి వచ్చే వెలుతురును మెరుపులు అనుకొని పాములు పుట్టలలోనికి వెళ్లి దాక్కుంటాయి. ఇలాంటి తిరుమలలో వెలసిన వేంకటేశ్వర స్వామిని దర్శించాలనుకుంటున్నాను. నేను తిరుమలను కీర్తించినప్పుడు నాకు వైకుంఠపదవి అనుగ్రహించబడిందని గ్రహించాను. ఈ రహస్యం తెలిసిన నేను సదా పవిత్రక్షేత్రమైన తిరుమలను ధ్యానిస్తున్నాను. వేదాలలో కీర్తించబడిన వేంకటేశ్వర స్వామి పాదాలలో నేను శాశ్వతంగా బంధించబడ్డాను.

శ్రవణ నక్షత్రమున భక్తులు చేస్తున్న స్తోత్రాల నుండి వచ్చే ధ్వని తిరుమల అంతటా వినిపిస్తుంది. ఇటువంటి తిరుమలలో

నివాసమున్న ఓ పరంధామా! నీవు నా హృదయంలో ఉన్నప్పటికీ నేను తిరుమలకు వచ్చి నిన్ను పూజించాలని కోరుకుంటున్నాను. ఓ మానవులారా! మీ పాపాలు పోవాలంటే ఆకాశాన్నంటే శిఖరాలతో, పదునాలుగు లోకాలలో కీర్తింపబడుతున్న తిరుమలకు వెళ్లి ఆ తిరుమల క్షేత్రాన్ని ప్రార్థించండి. తిరుమల క్షేత్రం మన శత్రువులైన పాపాలను తొలగించగలదు. పద్మంలో జన్మించిన బ్రహ్మ, మూడు కన్నుల శివుడు తిరుమలలో వెలిసిన వేంకటేశ్వర స్వామి పాదాలను పద్మాలతో ప్రతిరోజు పూజిస్తూ ఉంటారు. ఎల్లప్పుడూ యవ్వనములో ఉండే నారాయణుడు తిరుమలలో నిలబడి అందరిని అనుగ్రహిస్తున్నాడు. నరికి వేయబడిన చెట్లు ఎలా కదలకుండా ఉంటాయో అలాగే భక్తులు వేంకటేశ్వర స్వామి పాదాలకు చేతులు ఎత్తి దండం పెట్టి కదలకుండా నిలబడతారు. చల్లని నీటి ప్రవాహాలతో ఉన్న తిరుమల అటు దేవతలకు, ఇటు భూలోకవాసులకు గొప్ప సంపదగా ఉన్నది.

యాలి అనే జంతువులతో, సింహాలతో, బంగారు గనులతో, మాణిక్యాలతో, ముత్యాలతో, సువాసనలను వెదజల్లే అందమైన పువ్వులతో, కోనేరులతో, కోతులతో, వేటగాళ్లతో మరియు ఆకాశాన్ని అంటే శిఖరాలతో 'తిరుమల క్షేత్రం' నెలకొని ఉన్నది. శ్రేష్ఠమైన ఇంద్రనీలమణిలా మెరిసే వేంకటేశ్వర స్వామి ఈ తిరుమలలో నివాసముంటున్నాడు. భక్తులు ఎలాంటి కోరికలు లేకుండా తిరుమలకు వచ్చి భక్తితో వేంకటేశ్వర స్వామిని పూజిస్తుంటారు. పవిత్ర తిరుమల క్షేత్రం తన దర్శనమాత్రం చేతనే శరీరాన్ని బాధపెడుతున్న తీరని కష్టాలను, ఘోరమైన పాపాలను నశింపచేస్తుంది. దేవతలను రక్షించడానికి శ్రీమన్నారాయణుడు చక్రాయుధాన్ని ధరించి తిరుమలలో నెలకొని ఉన్నాడు. మరణించిన తరువాత మోక్షాన్ని పొందాలనే కోరికతో కొందరు తిరుమలకు వచ్చి వేంకటేశ్వర స్వామిని భక్తితో వివిధ సుగంధభరిత పుష్పాలతో పూజిస్తుంటారు. వీరి కంటే భగవంతుని కోరికలను తెలుసుకొని

భక్తితో వేంకటేశ్వర స్వామిని ధ్యానిస్తూ, భక్తులకు సేవచేస్తూ, భక్తుల ఆశీర్వాదాలు పొందేవారు మాత్రమే ఆనందంగా ఉండగలరు.

శ్రీ నమ్మ ఆళ్వారు

నమ్మ ఆళ్వారు తమిళనాడు రాష్ట్రంలో తిరునెల్వేలి జిల్లాలోని ఆళ్వార్ తిరునగరిలో అవతరించారు. వైకుంఠంలోని విష్వక్సేన అనే విష్ణుభక్తుడు నమ్మ ఆళ్వారుగా అవతరించిరి. నమ్మ ఆళ్వారు వేంకటేశ్వర స్వామిని ఈ విధముగా స్తుతించెను:

సారథీ! మన రథాన్ని వేగంగా నడిపించు. మనం ఎక్కడికి వెళ్లాలని అడుగుతున్నావా! సరే చెబుతాను వినుము. పవిత్రమైన తిరుమల క్షేత్రానికి మనం వెళ్లాలి. తిరుమలలో వైకుంఠనాథుడు వేంకటేశ్వర స్వామిగా దర్శనమిస్తున్నాడు. తెల్లని ముత్యాలహారాన్ని పోలిన సెలయేళ్లు ఎన్నో ఉన్నటువంటి దివ్యదేశమైన తిరుమలకు మన రథాన్ని వేగంగా తీసుకు వెళ్ళు. నా కూతురు తలలోని శిరోజాలు ఇంకా పొట్టిగానే ఉన్నాయి. వస్త్రాలను సరిగ్గా కట్టుకోవడం కూడా తెలియదు. పసిపిల్లలు మాట్లాడినట్టుగానే మాట్లాడుతుంది. చూపులు ఒక చోట స్థిరంగా పెట్టక భూమిపై అటూ ఇటూ తిరుగుతుంటాయి. ఈ విధంగా చిన్నపిల్లగా ఉన్న ఈమె వేంకటేశ్వర స్వామి కొలువై ఉన్న 'తిరువేంగడం' (తిరుమల) అనే నామాన్ని మాత్రం స్పష్టంగా గంభీరంగా ఉచ్ఛరిస్తుంది. భక్తులకు నివాసమైన తిరుమలలో కొలువైన వేంకటేశ్వర స్వామి భూమి మీద ఉన్న మనందరికీ జీవనాధారమైనవాడు. తిరుమలలో వెలిసిన ఆ వేంకటేశ్వర స్వామికి పువ్వులు అంటే చాలా ఇష్టం.

"ఓ తండ్రీ! చల్లని తిరుమలలో నెలకొన్న నా స్వామీ! లంకా రాజ్యాన్ని జయించిన పరాక్రమశాలీ! ఏడు మహావృక్షాలను చీల్చుకుంటూ పోయేలా బాణాన్ని వేసిన కోదండపాణీ! తిరుమలలో తులసిమాలలను ధరించిన నా ప్రియమైన స్వామీ! భూత, భవిష్యత్తు, వర్తమానములలో (జరిగిన, జరగబోయే, ప్రస్తుత కాలములలో)

రక్షించే ఆపద్బాంధవా! తిరుమలలో నెలకొన్న పరమాత్మా! నీకు నమస్కారం" అని ప్రార్థించడం మా కర్తవ్యం. ఈ విధంగా ఎవరైతే ప్రార్థిస్తారో, వారి పాపాలు మరియు పాపాలు చేయడానికి కారణమవుతున్న కర్మబంధాలన్నీ అగ్నిలో పడిన దూది వలె కాలిపోతాయి.

సువాసనలు వెదజల్లే పుష్పాలతో, పుణ్యజలాలతో, ప్రకాశించే దీపాలను తమ చేతులలో ధరించి దేవతలు మరియు దేవతలకు నాయకుడైన విష్వక్సేనుడు తిరుమలేశునికి నమః అంటూ తలలు వంచి నమస్కరిస్తున్నారు. అటువంటి తిరుమలేశుడు వెలసిన తిరుమల క్షేత్రం మనకు మోక్షాన్ని అనుగ్రహించగలదు. గోవర్ధన పర్వతాన్ని ఎత్తి కుంభవృష్టి నుండి గోవులను మరియు బృందావనవాసులను రక్షించినవాడు, బలి చక్రవర్తి నుండి ఈ భూమిని తన మూడు పాదాలతో కొలిచి దానంగా తీసుకున్న నారాయణుడు తానే ఇష్టపడి తిరుమలలో నెలకొని ఉన్నాడు. తిరుమల శిఖరాలకు నమస్కారం చేసేవారి పాపాలు నశిస్తాయి. తిరుమలలోని వేంకటేశ్వర స్వామి పాదపద్మాలను హృదయంలో నిలుపుకొని నోరారా స్తుతించినవారిని ఆ స్వామి జననమరణచక్రం నుండి రక్షిస్తాడు.

ఆదిశేషుని పాన్పుగా చేసుకొన్న జగద్రక్షకుడు అయిన వైకుంఠపతి తిరుమలలో నివాసం ఏర్పరచుకున్నాడు. ఆయువు గడిచిపోకముందే, శరీరంలోని శక్తి నశించకముందే తిరుమలకు వెళ్లి పద్మనాభుడైన తిరుమలేశునికి ప్రణామాలు చేయండి. తమిళనాడు దేశానికి ఉత్తర దిక్కున వెలసిన తిరుమల అనే పవిత్ర క్షేత్రంలో మహావిష్ణువు వెలిశాడు. భగవద్భక్తి అంటే తెలియని మూర్ఖులు నన్ను పిచ్చివాడు అని నిందించినా నేను లెక్కచేయక సర్వాంతర్యామి అయిన వేంకటేశ్వర స్వామి యొక్క 108 నామాలను జపిస్తూ సంచరిస్తాను. వేంకటేశ్వర స్వామి నామాలను ఆడుతూ పాడుతూ – జపిస్తూ కీర్తిస్తూ ఉండే భక్తులను దేవతలే వచ్చి సేవిస్తుంటారు. మీకు నాపై విరోధభావం కలిగినప్పటికీ నా మాటలు అప్రియమైనప్పటికీ నేను

చెప్పేది వినండి. తిరుమలలో వెలిసిన నా తండ్రి దేవదేవుడు ఉండగా నేను వేరొకరికిని ఎలా కీర్తించేది! వైకుంఠంలోని నారాయణుడు తిరుమలలో వేంకటేశ్వర స్వామిగా వెలసి మన పాపపుణ్యాలను సమూలంగా నాశనం చేసి మనకు వేరొక జన్మ లేకుండా చేస్తున్నాడు. భూలోకంలో తిరుమల ఉండగా నేను వేరే ప్రాంతానికి ఎందుకు వెళతాను? దేవతలు కూడా భూలోకంలోని తిరుమలకు వచ్చి తమ కోరికలను నెరవేర్చుకుంటున్నారు.

శ్రీ కుల శేఖర ఆళ్వారు

కుల శేఖర ఆళ్వారు కేరళలోని శ్రీ తిరువంజీక్కులం అనే దివ్యదేశంలో అవతరించారు. ఆయన మహావిష్ణువు మెడలోని 'కౌస్తుభమణి' అనే హారం యొక్క అవతారం. కుల శేఖర ఆళ్వారు వేంకటేశ్వర స్వామిని ఈ విధంగా స్తుతించెను:

భూదేవిని వివాహం చేసుకోవడానికి ఏడు కోడెలను (ఎద్దులను) ఓడించిన కృష్ణునికి ఎల్లప్పుడూ సేవ చేస్తూ జీవించాలనేది నా కోరిక. శరీరంలోని కండలు పెంచుకోవడానికి పనికివచ్చే సిరిసంపదలను నేను కోరుకోవడం లేదు. ఎడమచేతిలో శంఖాన్ని ధరించిన వేంకటేశ్వర స్వామి కొలువై ఉన్న తిరుమల పుష్కరిణి తీరంలో జీవించే ఒక కొంగగా జన్మించాలని కోరుకుంటున్నాను. నిత్యయవ్వనంతో ఉన్న రంభాది దేవతాకన్యలు నా చుట్టూ నాట్యమాడుతూ ఇంద్రలోకంలో సుఖభోగాలను అనుభవించే అవకాశం ఉన్నప్పటికీ నేను అటువంటి సుఖభోగాలను కోరుకోవడం లేదు. భూలోకంలో చక్రవర్తిగా పరిపాలించే అవకాశం కలిగినప్పటికీ నాకు అది ఇష్టం లేదు. సుగంధభరిత పుష్పాలతో, తేనెలూరే వనాలతో ఉన్న తిరుమలలోని కోనేరులలో చేపగా జన్మించాలని నేను కోరుకుంటున్నాను.

వైకుంఠాన్ని పోలిన తిరుమలలో భక్తులతో కలిసి శివుడు, బ్రహ్మ మరియు ఇంద్రాది దేవతలు స్వామి దర్శనార్థమై లోపలికి వెళ్లడానికి

ప్రయత్నం చేస్తున్నారు. అటువంటి తిరుమలలోని వేంకటేశ్వర స్వామి తాంబూలాన్ని ఉమ్మివేసే బంగారుపాత్రను పట్టుకునే సేవకునిగా ఉండాలని నేను కోరుకుంటున్నాను. క్షీరసాగరంలో శయనించే అనంతపద్మనాభుని దేవతలు కీర్తించినట్లుగా, తిరుమలలోని తేనెటీగల గుంపుల నుండి వచ్చే శబ్దం వేంకటేశ్వర స్వామిని స్తుతించినట్లుగా ఉన్నది. అటువంటి తిరుమలలో చంపక వృక్షంగా ఉండే భాగ్యం కావాలని నేను కోరుకుంటున్నాను.

చూసేవారికి భయం కలిగించే ఏనుగు మీద అందరూ కీర్తిస్తుండగా ఊరేగాలనిగానీ, రత్నాభరణాలనుగానీ, ఈ భూలోకాన్ని శాసించే చక్రవర్తిగా ఉండాలనిగానీ నేను కోరుకోవడం లేదు. నా స్వామి అయిన వేంకటేశ్వర స్వామి నివసించిన తిరుమలలో ప్రాముఖ్యత లేని ఒక చెట్టుగా ఉండాలని కోరుకుంటున్నాను. మెరుపుతీగల వంటి నడుములు కలిగిన రంభ ఊర్వశి వంటి అప్సరసల నాట్యాలను చూడాలనిగానీ, వారి సాంగత్యాన్ని పొందాలనిగానీ నేను కోరుకోవడం లేదు. తిరుమలలో ఒక శిఖరంగా ఉండాలని కోరుకుంటున్నాను.

చంద్రుని వంటి తెల్లని గొడుగు క్రింద ప్రజలందరిచే కీర్తింపబడే చక్రవర్తిగా ఉండాలని నేను కోరుకోవడం లేదు. సువాసనలు వెదజల్లే అందమైన పుష్పాలు గల తిరుమలలో ఒక కోనేరుగా ఉండాలని నేను కోరుకుంటున్నాను. శిరమున చంద్రుని ధరించిన శివుడు, బ్రహ్మ దేవుడు మరియు ఇంద్రుడు తమ పదవులకు తగినట్లు యజ్ఞాలు చేసినప్పుడు, వేదాలచే కీర్తింపబడుతున్న తిరుమలలోని శ్రీవేంకటేశ్వర స్వామి, వారి యొక్క కోరికలను తీర్చును. భక్తుల పాదధూళి నిత్యము పడేలా తిరుమల క్షేత్రానికి వెళ్లే ఒక దారిగా ఉండాలని నేను కోరుకుంటున్నాను. ఘోరమైన పాపాలను సమూలంగా నశింపజేసే పరంధామా! అనంతా! మహాపురుషా! తిరుమల వేంకటేశ్వరా! మునులు, దేవతలు మరియు భక్తులు నిన్ను నిత్యం దర్శిస్తారు. నీవు వెలసిన గర్భగుడికి నేను గడపగా ఉంటే

నిన్ను నేను ఎల్లప్పుడూ దర్శించగలను. పదునాలుగు లోకాలను పరిపాలించే అవకాశం కలిగినప్పటికీ, ఊర్వశి ఆలింగనం లభించినప్పటికీ నాకు అవి ఇష్టం లేదు. తిరుమలలో వేంకటేశ్వర స్వామి అనే అందమైన నామంతో ఎర్రని పగడం వంటి పెదవులు కలిగిన నారాయణుడు నెలకొని ఉన్న తిరుమలలో ఒక వస్తువుగా జన్మించాలని నేను కోరుకుంటున్నాను.

శ్రీ పెరియ ఆళ్వారు

పెరియ ఆళ్వారు శ్రీ విల్లిపుత్తూరులో అవతరించారు. ఆయన గరుత్మంతుని అంశ. పెరియ ఆళ్వారు వేంకటేశ్వర స్వామిని ఈ విధంగా కీర్తించెను:

అందమైన చల్లని కిరణాలతో ఉన్న చంద్రుడా! నీ కిరణాల ప్రకాశం పది దిక్కులకు వ్యాపించి ఉన్నది. శ్రీకృష్ణుని శరీరకాంతి వలన నీ కాంతి క్షీణించింది. పర్వతాలతో శోభిలుతున్న తిరుమలలోని శ్రీనివాసుడు తన రెండు చేతులను పైకెత్తి నిన్ను ఆహ్వానిస్తున్నాడు. చిన్నారి బాలుడైన శ్రీకృష్ణుని చేతులు నొప్పి పెట్టకముందే ఆలస్యం చేయకుండా పరిగెత్తుకుంటూ రా!

సువాసనలు వెదజల్లే పూలతో ఉన్న తిరుమలలో నెలకొన్న శ్రీనివాసా! నీకు ఇష్టమైన గొడుగు, చెప్పులు సిద్ధం చేశాను. నీవు వాటిని తీసుకోకుండానే దూడలను మేపడానికి అడవికి వెళ్ళిపోయావు. భయంకరమైన అడవిలో దూడల వెంట తిరగడం వల్ల మృదువైన నీ పాదాలు కూడా ఎర్రగా అయ్యాయి. నీవు బక్కచిక్కిపోయావు నా చిట్టితండ్రీ!

ఆకాశాన్నంటే ఎత్తైన శిఖరాలతో ఉన్న తిరుమలలో నెలకొన్న శ్రీవేంకటేశ్వరా! లోకంలోని సమస్త జీవులను ఉద్ధరించడానికి అవతరించిన పరమపురుషా! యశోదమాతచే బంధించబడిన దామోదరా! భక్తుల దోషాలను క్షమించి వాళ్లను రక్షించే భద్రాత్మకా!

నా ఆత్మలోనూ నా దేహంలోనూ నీచక్రంతో ముద్ర వేసుకున్నాను. ఇక నీ కృప కొరకు వేచి ఉన్నాను.

శ్రీ తిరుప్పాణ ఆళ్వారు

తిరుప్పాణ ఆళ్వారు శ్రీరంగక్షేత్రానికి దగ్గరలో అవతరించారు. ఆయన నారాయణుని శ్రీవత్స అంశతో అవతరించారు. తిరుప్పాణ ఆళ్వారు వేంకటేశ్వర స్వామిని ఈ విధముగా స్తుతించెను:

అత్యంత పవిత్రుడు, విశ్వానికి ఆదిదేవుడు సువాసనలు వెదజల్లే తిరుమల క్షేత్రంలో వేంకటేశ్వరుడై ప్రతిఫలాన్ని చూడకుండా కరుణ అనే వర్షాన్ని కురిపిస్తున్నాడు. ఆ వేంకటేశ్వర స్వామి నన్ను తన దాసులకు దాసునిగా చేయడానికి ఇక్కడ కొలువై ఉన్నాడు. తిరుమలలో కోతులు ఎల్లప్పుడూ ఒక చెట్టుకొమ్మ నుండి మరొక చెట్టు కొమ్మ పైకి దూకుతూ ఉండును. తిరుమలకు దేవతలు వచ్చి సువాసన వెదజల్లే పూలతో వేంకటేశ్వర స్వామిని పూజిస్తుంటారు. ఆ స్వామియే శ్రీరంగంలో ఆదిశేషునిపై శయనించాడు.

శ్రీ తిరుమంగై ఆళ్వారు

తిరుమంగై ఆళ్వారు తమిళనాడులోని తిరుక్కురై సమీపంలోని ఆలినాదర్ అనే గ్రామంలో అవతరించారు. ఆయన నారాయణుని యొక్క శార్ఙ్గ అనే ధనుస్సు యొక్క అవతారం. తిరుమంగై ఆళ్వారు వేంకటేశ్వర స్వామిని ఈ విధముగా స్తుతించెను:

విశాలమైన క్షీరసాగరంలో శయనించిన మహావిష్ణువు కృష్ణునిగా అవతరించి కురుందా అనే వృక్షరూపంలో వచ్చిన రాక్షసుని మరియు కొంగ రూపంలో వచ్చిన బకాసురుని సంహరించి, ఇప్పుడు ఎర్రని చేపలు గల సరోవరాలతో నిండి ఉన్న తిరుమలలో వేంకటేశ్వర స్వామిగా కొలువై ఉన్నాడు. తన నామాలను ఉచ్ఛరించే వారికి మోక్షాన్ని అనుగ్రహిస్తానన్న శ్రీమన్నారాయణుడు నివసించిన

పవిత్రక్షేత్రం తిరుమల. అందువలన ఓ మనసా! నీవు తిరుమల చేరుకొని హరి నామాన్ని జపించుము. నన్ను పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులే నాకు గతి అని, అందమైన భార్యనే సర్వస్వమనీ, బిడ్డలే నాకు దిక్కు అని భవభంధాలలో పడి దుఃఖాలను అనుభవించాను. కుక్క వంటి నీచజన్మలు ఎత్తిన నేను ఇప్పుడు నీవే శాశ్వతమని తెలుసుకొని నిన్ను దర్శించడానికి ఎదురుచూస్తున్నాను. సువాసనలు వెదజల్లే పుష్పాలతో, వెదురు పొదలతో ఉన్న తిరుమలలో కొలువైన వేంకటేశ్వర స్వామీ! నన్ను నీ దాసునిగా స్వీకరించి అనుగ్రహించుము.

తిరుమలలో వెలసిన ఓ వేంకటేశ్వర స్వామీ! జింక కళ్లను పోలిన కన్నులు గల స్త్రీల సౌందర్యానికి బానిసనై నరకానికి వెళ్లదగిన అనేక ఘోరమైన పాపాలను చేశాను. నేను చేసిన పాపాలను తెలుసుకొని ప్రాయశ్చిత్తంతో నిన్ను శరణు వేడుచున్నాను. నన్ను నీ దాసుడిగా భావించి నీ సేవను అనుగ్రహించుము. గర్జిస్తున్న మేఘాల గుంపుల వలన చల్లగా ఉండే తిరుమల కొండలలో అవతరించిన వేంకటేశ్వర స్వామీ! నేను పాపకర్మలను చేస్తూ ఏ లక్ష్యము లేకుండా ఎందరినో హత్య చేశాను. భిక్షమడుగ వచ్చిన వారిపై కనికరం చూపకుండా క్రూరంగా ప్రవర్తించి అవమానించాను. ఓ స్వామీ! నీ నామాన్ని విన్న వెంటనే నీకు శరణాగతి పొందాను. ఓ వేంకటేశ్వర స్వామీ! నన్ను నీ దాసునిగా స్వీకరించుము. ఈ లోకంలో ఉన్న అన్ని కులాలలో నేను జన్మించాను. ఎన్నో రకాలైన రూపాలతో ఆకారాలతో వివిధ జన్మలు ఎత్తాను. ఏ జన్మలోను నేను పుణ్యకార్యాలు చేయలేదు. ఈ విధంగా జీవిత ప్రయోజనం తెలుసుకొనలేక జన్మిస్తూ మరణిస్తూ విసిగిపోయాను.

భూమి మీద ఉన్న తిరుమలలో వెలసిన తిరుమలేశుడా! ఈ జన్మలో నీ పాదాలను ఆశ్రయించాను. నన్ను నీ దాసునిగా స్వీకరించుము. ఎన్నో పాపకర్మలను చేసిన నేను ఈ ముసలితనంలో దిక్కు తెలియక అల్లాడుతూ నీ పాదపద్మాలను ఆశ్రయించడానికి

వచ్చాను. నాకు నిన్ను ఏ విధంగా స్తుతించాలో కూడా తెలియదు. ఎత్తైన శిఖరాలతో ఉన్న తిరుమలలో నివాసమున్న శ్రీవేంకటేశ్వరా! నాకు తండ్రివై నా పాపాలను తొలగించి, నన్ను రక్షించి నీ దాసునిగా చేసుకో! భూమి, నీరు, అగ్ని, వాయువు మరియు ఆకాశం అనే పంచభూతాలతో తయారైన ఈ శరీరం రోగాలతో బాధపడుతూ నీ దరిచేరే మార్గం తెలియడం లేదు. ఓ వేంకటేశ్వర స్వామీ! నాతో అన్నిరకాల సంబంధాలు ఉన్న ఓ పరంధామా! నీ చరణాలను చేరుకున్నాను. దయచేసి నన్ను నీ దాసునిగా చేసుకో!

నేను బాల్యంలో తెలిసి తెలియక ఎన్నో పాప కర్మలను చేశాను. యవ్వనంలో స్త్రీలకు దాసుడనై వారిని సంతృప్తిపరచడానికి చేయరాని పనులు చేశాను. ఇప్పుడు రోగాలతో మరియు పేదరికంతో నానా కష్టాలను పడుతున్నాను. నేను పూర్వం ఎన్నో జన్మలు ఎత్తి సుఖాలను అనుభవించాను. కానీ ఆ జన్మలలో నేను చేసిన పాపకర్మల ఫలితంగా మళ్లీమళ్లీ జన్మించవలసి వచ్చింది. తిరుమలలో కొలువై ఉన్న వేంకటేశ్వర స్వామీ! ఈ జన్మలోనైనా నీ కరుణాకటాక్షాలను పొందాలని ఆశతో వ్రతాన్ని ప్రారంభించాను. అయితే ఇందులో నా మనసును స్థిరంగా ఉంచలేకపోతున్నాను. ఓ పరంధామా! నన్ను ఈ జన్మమృత్యువుల నుండి రక్షించి నీ దాసునిగా చేసుకో! ఎంత తపస్సు చేసినప్పటికీ ఈ మానవజన్మ నుండి ముక్తులము కాలేముగానీ సముద్రమంతటి కరుణగల వేంకటేశ్వర స్వామి తనను ఆశ్రయించిన వారిని తన ధామానికి తీసుకువెళ్లి ఈ భవభంధాల నుండి ముక్తిని కలిగించును.

శ్రీ గోదా దేవి (ఆండాళ్)

గోదా దేవి శ్రీవిల్లిపుత్తూరులో విష్ణుచిత్తులకు తులసితోటలో లభించింది. ఆమె భూదేవి యొక్క అంశ. గోదా దేవి వేంకటేశ్వర స్వామిని ఈ విధంగా స్తుతించెను:

ఓ మన్మథుడా! నేను నిన్ను సుగంధభరిత పుష్పాలతో మూడు వేళలలో పూజించాను. మన్మథుడా! నేను నిన్ను కోపంతో నిందించక ముందే పువ్వులను అలంకరించుకున్న వాడు, గోవిందనామాన్ని ధరించిన వాడు, ఆశ్చర్యకరమైన పనులు చేసేవాడు, వైకుంఠాన్ని వదలి తిరుమలలో చక్రాన్ని ధరించి సమస్త జీవులకు దర్శనమిచ్చే వేంకటేశ్వర స్వామి పరిగెత్తుకుంటూ వచ్చి నన్ను వివాహం చేసుకొని కౌగిలించుకునేటట్లు చేయాలి.

చంపక పువ్వులలోని మకరందాన్ని (తేనెను) త్రాగి మత్తులో మృదుమధురంగా పాడుతున్న ఓ కోకిలా! పాంచజన్యమనే తెల్లని శంఖాన్ని తన చేతిలో ధరించిన వైకుంఠవాసుడు తన అందమైన రూపంతో దర్శనమిస్తూ తిరుమలలో నిలబడ్డాడు. నా హృదయంలో ప్రవేశించి నన్ను వేదనకు (బాధకు) గురిచేసి నేను పడుతున్న వేదనను వేడుకగా చూస్తూ నిలబడ్డాడు. ఓ కోకిలా! నీవు తిరుమలవాసి అయిన వేంకటేశ్వర స్వామిని నా వద్దకు వచ్చేటట్లు నీ మధురమైన కంఠంతో ఆహ్వానించు.

విశాలమైన ఆకాశమంతటా నల్లని కుంభాలను పరచినట్లు కమ్మిన కారుమేఘాల్లారా! స్వచ్ఛమైన జలపాతాలు ఎడతెగకుండా ప్రవహిస్తున్న తిరుమలలో లక్ష్మీనాథుడైన మహావిష్ణువు మీతో పాటే అక్కడ ఉన్నాడా? వేంకటేశ్వర స్వామి విరహంలో నా కన్నుల నుండి కన్నీళ్లు వర్షధారలా నన్ను తడిపివేస్తున్నాయి. నన్ను ఈ విధంగా బాధించడం ఆ లక్ష్మీపతికి న్యాయమా?

వర్షాకాలంలో తిరుమలకు వచ్చి చల్లని వర్షాన్ని కురిపించే నల్లని మేఘాల్లారా! యుద్ధంలో విజయలక్ష్మిని పొందిన నారాయణుని పాదాలను ఎల్లప్పుడూ స్మరిస్తున్నాను. వర్షాకాలంలో జిల్లేడు ఆకులు పండి ఎలా రాలిపోతాయో అలానే నేను వేంకటేశ్వర స్వామి విరహంతో కృశించిపోతున్నాను. అంతులేకుండా సాగుతున్న ఈ సుదీర్ఘమైన జీవనయాత్రలో నాకు ఒక్కరోజైనా వేంకటేశ్వరుడు

వచ్చి ఒక మంచి మాట చెప్పాడా ఏమి (చెప్పలేదుగదా)? ఎత్తైన శిఖరాలతో ఉన్న తిరుమలను నివాసంగా చేసుకున్న ఏనుగులు ఎలా గర్జిస్తున్నాయో (అరుస్తున్నాయో) అలా గర్జిస్తున్న మేఘాల్లారా! వేయి శిరస్సులుగల ఆదిశేషునిపై నిద్రపోకుండా శయనించిన మహావిష్ణువు నాకు ఒక మంచి మాట చెప్పవచ్చుగదా! ఆ స్వామినే స్మరిస్తూ కృశించిపోతున్న ఒక అమాయకురాలిని కాపాడవచ్చుగదా!

9

తిరుమలలో శుద్ధ భక్తుల లీలలు

శ్రీ యామునాచార్య

యామునాచార్య తమిళనాడులోని మదురైలో 916లో శ్రీవైష్ణవ సాంప్రదాయంలోని నాథముని కుమారుడైన ఈశ్వరమునికి జన్మించిరి. నాథముని తన కుమారుడైన ఈశ్వరమునితో మరియు కోడలితో కొన్ని సంవత్సరాలు బృందావనంలోని యమునా తీరంలో నివసించెను. యమునా తీరం నుండి ఇంటికి తిరిగి వచ్చిన తరువాత ఈశ్వరమునికి ఒక కుమారుడు జన్మించెను. నాథముని యమునా తీరంలో నివసించిన గుర్తుగా తన మనుమడికి యామునా అని నామకరణం చేసెను.

యామునాచార్య ఒక ప్రవచనంలో తన శిష్యులతో "తిరుమలలోని శ్రీనివాస భగవానుని వివిధ రకాల పుష్పాలతో అలంకరణ చేస్తే నమ్మాళ్వారులు చాలా సంతోషించును. 'పరాంకుశ దివ్యశూర' అని పిలువబడే నమ్మాళ్వారుల ప్రకారం ఇది శ్రీనివాస భగవానునికి ఒక భక్తుడు అందించే అత్యున్నత సేవ. గతంలో నేను తిరుమలకు వెళ్లి శ్రీనివాస భగవానునికి కొద్ది రోజులు పుష్ప సేవ చేశాను. చల్లటి వాతావరణంతోపాటు క్రిముల దాడిని తట్టుకోలేకపోయినందున నేను తిరుమల నుండి తిరిగి వచ్చాను. ఆ విధంగా నాకు శ్రీనివాస భగవానుని సేవించే అవకాశం తక్కువ కాలం మాత్రమే కలిగింది. అందువలన ఎవరైనా తిరుమలకు వెళ్లి శ్రీనివాస భగవానుని సేవిస్తూ పుష్ప సేవ చేస్తే మనం నమ్మాళ్వారుల ఉపదేశాలను గౌరవించినట్లు అవుతుంది" అని తెలిపెను.

కొంతసేపటికి తిరుమల నంబి అనే శిష్యుడు లేచి నిలబడి యామునాచార్యతో "గురుదేవా! మీరు తెలిపిన విధంగా శ్రీనివాస

భగవానుని సేవించడానికి నేను వెళతాను" అని అన్నాడు. యామునాచార్య ఎంతగానో ఆనందించి తిరుమలనంబిని కౌగిలించుకొని "శ్రీనివాస భగవానుని సేవించి ఆ భగవంతుని కృపను పొందుము" అని ఆశీర్వదించెను.

శ్రీ తిరుమలనంబి

వేంకటేశ్వర స్వామి యొక్క శుద్ధభక్తులలో తిరుమలనంబి ఒకరు. తిరుమల నంబి 973లో జన్మించిరి. ఈ తిరుమలనంబిని శ్రీశైలపూర్ణులు అని కూడా అంటారు. తిరుమలనంబి యొక్క గురువు యామునాచార్య. వేంకటేశ్వర స్వామి యొక్క సేవ కొరకు తిరుమలనంబిని యామునాచార్య వేంకటాచలం పంపించారు. తిరుమలనంబి సోదరి కాంతిమతి దేవి. రామానుజాచార్య ఈ కాంతిమతి దేవికే జన్మించారు. తిరుమలనంబి రామానుజాచార్య జాతకాన్ని పరిశీలించి 'ఇళై ఆళ్వార్' అని నామకరణం చేశారు.

తిరుమలనంబి ప్రతిరోజు పాపనాశనం నుండి నీళ్లను తీసుకువచ్చి వేంకటేశ్వర స్వామికి అభిషేకం చేసి పుష్పాలతో అలంకరించేవారు. ఒకరోజు తిరుమలనంబి పాపనాశనం నుండి నీళ్లను తీసుకువస్తుంటే వేంకటేశ్వర స్వామి బాలుని రూపంలో తిరుమలనంబికి ఎదురువచ్చి "తాతా! తాతా! దాహంగా ఉన్నది. నీళ్లు కావాలి" అని అడిగాడు. తిరుమలనంబి "ఈ నీళ్లు పాపనాశనం నుండి వేంకటేశ్వర స్వామి కోసం తీసుకు వెళుతున్నాను. నీకు ఈ నీళ్లను ఇస్తే అపవిత్రం అవుతాయి, నేను రెండవసారి పాపనాశనానికి వెళ్లి నీళ్లను తీసుకువచ్చేసరికి స్వామి అభిషేకానికి ఆలస్యం అవుతుంది. కావున నీవు పాపనాశనానికి వెళ్లి నీళ్లను త్రాగు" అని తెలిపి వెళ్ళసాగెను. బాలుని రూపంలో ఉన్న స్వామి వెనుక నుండి బాణంతో కుండకు రంధ్రం చేసి నీళ్లను త్రాగాడు. జరిగిన సంఘటనకు తిరుమలనంబి దుఃఖిస్తుండగా బాలుడు కొండకు బాణం వేసి కొండ నుండి నీళ్లు రప్పించాడు. బాలుడు తిరుమలనంబితో "తాతా! ఇకనుండి పాప

నాశనం నుండి నీళ్లను తీసుకురావలసిన అవసరం లేదు. ఈ కొండ నుండి వచ్చే నీళ్లను వేంకటేశ్వర స్వామి కొరకు తీసుకువెళ్లు" అని తెలిపి తిరుమలనంబి చూస్తుండగానే అదృశ్యం అయ్యాడు. బాలుని రూపంలో వచ్చింది వేంకటేశ్వర స్వామి అని నిర్ధారణ చేసుకొని ఆనాటి నుండి ఆ నీళ్లనే తీసుకువెళ్లాడు తిరుమలనంబి. కొండ నుండి నీరు వచ్చినందువలన ఆ నీటికి 'ఆకాశగంగ' అని పేరు వచ్చింది. ఇప్పటికీ తిరుమలనంబి వంశస్థులే ఆకాశగంగ నుండి ఆ నీళ్లను వెండిబిందెలతో ఏనుగు మీద తీసుకువస్తారు. ఆకాశగంగ ఆవిర్భవించిన రోజున, వేంకటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఆకాశగంగకు తీసుకువెళ్లి అక్కడ స్వామికి ఉత్సవాన్ని జరుపుతారు.

రామానుజాచార్య ఒకసారి ఒక సంవత్సర కాలం పాటు తిరుపతిలోని కపిలతీర్థంలో ఉండిరి. ఆ సమయంలో తిరుమలనంబి ఉదయం వేంకటేశ్వర స్వామిని సేవించి, తిరుమల నుండి తిరుపతికి వచ్చి రామానుజాచార్యకు రామాయణాన్ని తెలిపి సాయంత్రానికి తిరుమల వెళ్లేవారు. అయితే మధ్యాహ్నం వేంకటేశ్వర స్వామిని దర్శించలేకపోతున్నందుకు తిరుమలనంబి బాధపడసాగిరి. ఈ విషయం గ్రహించిన వేంకటేశ్వర స్వామి అలిపిరిలోని కొండను ఎక్కే మెట్ల దగ్గర తన పాదాల గుర్తులను ఉంచి "ఆ పాదాలను దర్శిస్తే నన్ను దర్శించినట్లే" అని తిరుమలనంబితో తెలిపిరి. తిరుమలనంబి ఎంతో సంతోషించి ప్రతిరోజూ మధ్యాహ్నం ఆ పాదాలను దర్శించి పూజించేవారు.

ఒకసారి తిరుమలనంబి శిష్యుడు వేంకటేశ్వర స్వామికి సమర్పించే పూలమాలను ధరించాడు. వేంకటేశ్వర స్వామి తిరుమలనంబి కలలో కనిపించి జరిగింది ఆయనకు తెలిపాడు. తిరుమలనంబి తన శిష్యుని మందలించి "ఈనాటి నుండి ఎవరూ ఈ కొండమీద వేంకటేశ్వర స్వామికి సమర్పించిన మాలలను కూడా వాడరాదు" అని తెలిపి వేంకటేశ్వర స్వామికి సమర్పించిన పూలమాలలను దేవతల కోసం బావిలో వేసే ఏర్పాటు చేశారు.

తిరుమలనంబి శరీరాన్ని వదిలేటప్పుడు వేంకటేశ్వర స్వామితో "ఓ స్వామీ! నేను మా గురువు యామునాచార్య ఆదేశానుసారం మీకు సేవ చేశాను. ఇక నేను శరీరాన్ని వదులుతున్నాను. నేను మీ సేవలో ఏమైనా తప్పులు చేసి ఉంటే నన్ను క్షమించండి" అని ప్రార్థించారు. అక్కడి భక్తులందరితో "నేను మీ పట్ల ఏమైనా అపరాధాలు చేసి ఉంటే నన్ను క్షమించండి" అని ప్రార్థించి తన శరీరాన్ని వదిలారు.

భక్తులు ఆయన నివసించిన ఇంటిలోనే తిరుమలనంబి విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఇప్పుడు ఆ ఇంటినే 'తిరుమలనంబి మందిరం' అని అంటారు. తిరుమలనంబి ఆవిర్భవించిన రోజు వేంకటేశ్వర స్వామి శ్రీదేవి–భూదేవి సమేతంగా తిరుమలనంబి మందిరానికి వెళ్లి ఆయనను దీవించి, అక్కడ పూజలను స్వీకరించి తిరిగి వచ్చును. ఉత్సవాల సమయాలలో వేంకటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహం తిరుమలనంబి మందిరం దగ్గరకు వెళ్ళినప్పుడు వేంకటేశ్వర స్వామి అక్కడ ఆగి తిరుమలనంబిని చూసి బయలుదేరును.

శ్రీ కాంచీపూర్ణ (తిరుక్కచ్చి నంబి)

కాంచీపూర్ణులు 1015లో కాంచీపురం సమీపంలోని పూ ఇరుంత వల్లిలో జన్మించిరి. కాంచీపురంలోని వరదరాజ స్వామి యొక్క భక్తుడు కాంచీపూర్ణ. కాంచీపూర్ణకు వరద అనే సేవకుడు ఉండేవాడు. ఒకసారి వరద కాంచీపూర్ణతో "స్వామీ! నేను వైకుంఠం వెళతానా?" అని అడిగాడు. కాంచీపూర్ణులు "వరదరాజ స్వామిని అడిగి చెబుతాను" అన్నారు. కాంచీపూర్ణ ప్రతిరోజూ వరదరాజ స్వామికి చామరసేవ చేస్తూ మాట్లాడుతూ ఉంటారు. ఆరోజు రాత్రి కాంచీపూర్ణులు వరదరాజ స్వామితో "నా సేవకుడు వైకుంఠం వెళతాడా?" అని అడగగా వరదరాజ స్వామి "వెళ్ళును" అని సమాధానమిచ్చెను. కాంచీపూర్ణులు ఇదే విషయం వరదకు తెలిపారు. వరద చాలా ఆనందించాడు.

మళ్లీ కొద్ది రోజులకు వరద కాంచీపూర్ణులతో "స్వామీ! వైకుంఠానికి ముందుగా మీరు వెళతారా లేక నేను వెళతానా?" అని అడిగాడు. కాంచీపూర్ణులు "వరదరాజ స్వామిని అడిగి చెబుతాను" అన్నారు. రాత్రి ఏకాంతసేవ చేస్తున్నప్పుడు కాంచీపూర్ణులు వరదరాజ స్వామిని వరద అడిగిన ప్రశ్నను అడిగారు. వరదరాజ స్వామి కాంచీపూర్ణతో "నీ సేవకుడు వైకుంఠం వెళతాడు. కానీ నీవు వైకుంఠానికి పోలేవు" అని తెలిపెను. ఆశ్చర్యపోయిన కాంచీపూర్ణులు వరదరాజ స్వామితో "స్వామీ! నేను మీసేవ చేస్తూ మీతో మాట్లాడుతూ ఉన్నాను. అలాంటిది నేను ఎందుకు వైకుంఠం వెళ్ళను?" అని అడిగారు. వరదరాజ స్వామి ఇలా తెలిపెను: "వైకుంఠంలో నా దాసులకు అనుమతి లేదు. నా భక్తుల దాసులకు మాత్రమే అనుమతి ఉన్నది. నా భక్తులకు ఎవరైతే సేవ చేస్తారో వారికి మాత్రమే వైకుంఠంలో అనుమతి ఉన్నది. నీవు నా భక్తులకు సేవ చేయడం లేదు మరియు నీకు గురువు కూడా లేడు. అందువలన నీవు వైకుంఠం వెళ్ళవు" అని తెలిపెను.

కాంచీపూర్ణులు తన ఇంటికి వెళ్లి, వైకుంఠం వెళ్లాలనే కోరికతో తన సన్యాసరూపాన్ని తీసివేసి ఒక సేవకుని రూపాన్ని ధరించి శ్రీరంగం వెళ్లి యామునాచార్య శిష్యులైన మహాపూర్ణ అనే రంగనాథుని భక్తుని దగ్గరకు వెళ్లి "స్వామీ! నాకు ఎవరూ లేరు. మీ దగ్గర పని చేయాలని వచ్చాను. మీరు తినగా మిగిలింది పెడితే చాలు" అన్నాడు. మహాపూర్ణ ఒప్పుకొని గోవుల సేవకు నియమించాడు. కాంచీపూర్ణులు గోసేవ చేస్తూ, మహాపూర్ణులను ఎద్దుల బండిలో ప్రతిరోజు మూడు పూటలా కావేరినది స్నానానికి తీసుకువెళ్లేవారు. మహాపూర్ణుల బట్టలను కూడా ఉతికేవారు. ఒక రోజు మహాపూర్ణులను సాయంత్రం కావేరినది స్నానానికి తీసుకువెళ్లి తిరిగి వచ్చేటప్పుడు వర్షం పడింది. కాంచీపూర్ణులు తడిసిపోయారు. గోశాలకు వెళ్లి తడిసిన బట్టలను తీసివేశారు. కాంచీపూర్ణుల దగ్గర ఒకే జత బట్టలు ఉన్నాయి. రాత్రి వేళలో ఎవరూ రారని తన కాషాయ వస్త్రాలను ధరించి నామాలను

పెట్టుకొని హరి నామాన్ని జపిస్తూ ఉన్నారు. కాంచీపూర్ణుల వద్ద ఒకే జత బట్టలు ఉన్నాయని మహాపూర్ణులకు తెలుసు. అందువలన బట్టలను ఇద్దామని గోశాలకు వెళ్లెను. అక్కడ కాషాయ వస్త్రాలతో నామాలను ధరించి హరినామాన్ని జపిస్తున్న తన సేవకుడిని చూసి, ఆ సేవకుడు వరదరాజ స్వామి యొక్క భక్తుడైన కాంచీపూర్ణులని గుర్తించెను.

మహాపూర్ణులు కాంచీపూర్ణులకు దండప్రణామాలు చేసి "మీరు ఎందుకు నా పనిమనిషిగా వచ్చారు?" అని అడిగితే, కాంచీపూర్ణులు జరిగినది తెలిపి "వైకుంఠం వెళ్లాలంటే భక్తుల సేవ చేయాలని వరదరాజ స్వామి తెలిపెను. అందువలన మీ సేవ చేయడానికి వచ్చాను" అని అన్నారు. మహాపూర్ణులు "మీరు నా సేవలు చేయవద్దు. నేను మీ సేవలను స్వీకరించే అంతటి భక్తుడను కాను" అని తెలిపి రంగనాథునికి చామరసేవ చేయండి అని రంగనాథుని సేవలో నియుక్తులను చేసెను.

కొద్దిరోజులకు రంగనాథ స్వామి కాంచీపూర్ణతో "కాంచీపూర్ణా! నా మందిరం ఎండాకాలం కూడా చల్లగా ఉండే విధంగా నిర్మించారు. కావేరి నది నా మందిరం చుట్టూ ప్రవహిస్తున్నందువలన ఈ ప్రాంతమంతా చల్లగా ఉంటుంది. అందువలన నీ చామరసేవ నాకు అవసరం లేదు. వరదరాజ స్వామి అగ్నిగుండంలో నుండి ఆవిర్భవించాడు. అంతే కాకుండా ఆ ప్రదేశం వేడిగా ఉంటుంది. అందువలన నీవు వరదరాజ స్వామి సేవ చేయడం మంచిది. నాకు నీ సేవ అవసరం లేదు" అని తెలిపెను.

రంగనాథ స్వామి తన సేవను తిరస్కరించడంతో కాంచీపూర్ణులు తిరుమలకు వెళ్లి వేంకటేశ్వర స్వామిని దర్శించి అక్కడే కొద్దిరోజులు ఉన్నారు. వేంకటేశ్వర స్వామి భక్తులు స్వామికి చామరసేవ చేయమని కాంచీపూర్ణులకు చామరను ఇచ్చారు. ఆయన స్వామికి చామరసేవ చేస్తున్నపుడు స్వామి కూడా కాంచీపూర్ణతో "కాంచీపూర్ణా! నా

మందిరం కొండల మధ్య ఉన్నందువలన ఈ ప్రదేశం చల్లగా ఉంటుంది. అందువలన నీ చామరసేవ నాకు అవసరం లేదు. రంగనాథుడు తెలిపినట్లు నీవు వరదరాజ స్వామికి సేవ చేయమని" తెలిపాడు. వేంకటేశ్వర స్వామి కూడా తన సేవను తిరస్కరించడంతో కాంచీపూర్ణులు కాంచీపురం వచ్చి వరదరాజ స్వామికి సేవ చేస్తుండగా వరదరాజ స్వామి సంతోషించి కాంచీపూర్ణతో "ఇప్పుడు నీకు వైకుంఠానికి వెళ్లే అర్హత వచ్చింది" అని తెలిపెను. తరువాత కాంచీపూర్ణులు యామునాచార్య నుండి దీక్ష తీసుకొని ఆయన శిష్యుడు అయ్యాడు.

శ్రీ రామానుజాచార్య

రామానుజాచార్య మద్రాసుకు సమీపంలోని 'పెరంబుదూర్' అనే గ్రామంలో 1017లో జన్మించిరి. శ్రీవేంకటేశ్వర స్వామి శుద్ధభక్తులలో రామానుజాచార్య ఒకరు. రామానుజాచార్య గురువు యామునాచార్య. వీరిది శ్రీ సాంప్రదాయం. శ్రీ సాంప్రదాయానికి ముఖ్య క్షేత్రం శ్రీరంగం. రామానుజాచార్య శ్రీరంగంలో నివసిస్తూ తీర్థ యాత్రలు చేస్తూ శ్రీ సాంప్రదాయాన్ని ప్రచారం చేస్తుండటం వలన వేంకటేశ్వర స్వామికి ప్రత్యక్షంగా సేవలు చేయలేకపోయారు. అందువలన తన శిష్యుడైన అనంతాచార్యను వేంకటాచలం పంపించి వేంకటేశ్వర స్వామికి సేవలు చేయించారు. ఇప్పటికీ రామానుజాచార్య పరంపరలోని ఆచార్యులే వేంకటేశ్వర స్వామిని పూజిస్తున్నారు. రామానుజాచార్య వేంకటాచలానికి మూడుసార్లు వచ్చి వేంకటేశ్వర స్వామిని సేవించారు.

ఒకరోజు రామానుజాచార్య తిరుమలలోని వేంకటేశ్వర స్వామిని దర్శించాలని తన శిష్యులతో బయలుదేరారు. రామానుజాచార్య అష్టసహస్ర గ్రామం మీదుగా తిరుమలకు వెళ్తున్నారు. ఆ గ్రామంలో యజ్ఞేషులు అనే ధనవంతుడు మరియు పేద బ్రాహ్మణుడైన వరదాచార్య అనే ఇద్దరు శిష్యులు కలరు. వరదాచార్య ఇంటికి వెళితే తనతో ఉన్న

అనేకమంది శిష్యులకు ప్రసాదాన్ని ఏర్పాటు చేయలేకపోవచ్చునని వారు భావించారు. యజ్ఞేషుల దగ్గరికి వెళ్లాలనుకొని ఇద్దరి శిష్యులను పంపి, వారు అష్టసహస్ర గ్రామం చేరుకునే రోజును యజ్ఞేషులకు తెలియచేయమని రామానుజాచార్య కబురు పంపారు.

యజ్ఞేషులు ఈ సమాచారం తెలియచేసిన వారికి అతిథి సత్కారం చేయకుండా వెళ్లిపోయారు. శిష్యులు రామానుజుల వారి వద్దకు వెళ్లి "యజ్ఞేషులు తమకు మంచినీరు ఇవ్వడంకానీ ప్రసాదాన్ని పెట్టడంకాని చేయలేదని" తెలిపారు. రామానుజాచార్య తన శిష్యులకు అతిథి సేవలు చేయనందుకు యజ్ఞేషుల దగ్గరికి వెళ్లకుండా వరదాచార్యుల ఇంటికి వెళ్లారు. వరదాచార్యులు భిక్ష చేసి జీవిస్తారు కనుక ఆ సమయానికి భిక్ష కోసం గ్రామంలోనికి వెళ్లారు. వరదాచార్యుల భార్య కార్వార లక్ష్మీదేవి ఇంటిలోనే ఉన్నది. రామానుజాచార్య ఆ ఇంటి తలుపులను కొట్టగా, కార్వార లక్ష్మీదేవి లోపల నుండి "నాకు సరైన దుస్తులు లేవు" అని తెలిపింది. రామానుజాచార్య ఆమెకు తన ఉత్తరీయమును కిటికీ గుండా విసిరారు. ఆమె దానిని కప్పుకొని తలుపులను తీసి అందరూ కూర్చొనుటకు చాపలు వేసి మంచినీరు ఇచ్చింది.

తరువాత కార్వార లక్ష్మీదేవి ఆ ఊరిలో ఉండే దుకాణదారుడితో "మా గురుదేవులు రామానుజాచార్య తన శిష్యులతో మా ఇంటికి వచ్చారు. వారందరికీ ప్రసాదం కోసం వంటసామాగ్రి కావాలని" అడిగింది. ఆ వ్యక్తి "నా కామ వాంఛను నీవు తీరిస్తే వంటసామాగ్రి ఇస్తాను" అన్నాడు. ఆమెకు ఏమి చేయాలో తోచక అతనితో "ముందుగా నాకు వంటసామాగ్రి ఇచ్చినట్లయితే మా గురువుగారిని మరియు వారి శిష్యులను ప్రసాద వితరణతో సంతృప్తి పరచగలను. ఆ తరువాత నీ కోరికను తీర్చగలను" అన్నది. దుకాణదారుడు ఒప్పుకొని వంట సామాగ్రి ఇచ్చాడు. కార్వార లక్ష్మీదేవి వంట చేసి ఇంటిలోని సాలిగ్రామానికి నైవేద్యం పెట్టి ఆ ప్రసాదాన్ని

రామానుజాచార్యకు మరియు వారి శిష్యులకు వడ్డించింది. వారు ప్రసాదం తీసుకోవడం పూర్తవ్వగానే వరదాచార్యులు ఇంటికి వచ్చారు. భార్య వరదాచార్యులకు జరిగినదంతా తెలిపింది. వరదాచార్యులు ఆమెతో "గురువు కోసం అశాశ్వతమైన శరీరానికి వెలకట్టి శాశ్వతమైన కీర్తిని పొందావు" అని పొగిడాడు.

రామానుజాచార్య తన దివ్యదృష్టితో ఈ విషయం తెలుసుకొని దుకాణదారుడికి తన ఉచ్ఛిష్టమును (తాను ఎంగిలి పడ్డ ప్రసాదము) ఇమ్మని వరదాచార్యులను ఆదేశించెను. వరదాచార్యులు రామానుజాచార్య ఉచ్ఛిష్టమును భార్యకు ఇచ్చి దుకాణదారుడి దగ్గరకు పంపాడు. కార్వార లక్ష్మీదేవి దుకాణదారుడితో "ముందుగా మీరు ఈ మహా ప్రసాదాన్ని తీసుకోండి" అని తెలిపింది. అతను ఆ మహాప్రసాదాన్ని తీసుకోగానే మహాప్రసాదం ప్రభావం వలన దుకాణదారుడి యొక్క పాపాలు నశించి అతని ఇంద్రియాలు మరియు శరీరం పవిత్రం అయ్యాయి. దుకాణదారుడు లక్ష్మీదేవి పాదాల మీద పడి తన తప్పును క్షమించమని కోరాడు. కార్వార లక్ష్మీదేవి దుకాణదారుడిని రామానుజాచార్య వద్దకు తీసుకువచ్చి జరిగినదంతా తెలిపింది. దుకాణదారుడు రామానుజాచార్యకు సాష్టాంగప్రణామం చేసి తన తప్పును క్షమించి, తనను శిష్యునిగా స్వీకరించమని ప్రార్థించాడు. రామానుజాచార్య అతని తప్పును క్షమించి శిష్యునిగా స్వీకరించారు. రామానుజాచార్య దుకాణదారుడితో "వరదాచార్యులు చాలా పేదరికంతో జీవిస్తున్నాడు కనుక అతనికి కొద్దిగా ధనాన్ని ఇవ్వమన్నారు." అప్పుడు వరదాచార్యులు రామానుజాచార్యతో "స్వామీ! భక్తికి జ్ఞానం, ధనం మరియు కులం శత్రువులు కనుక నాకు ధనం వద్దు" అని నిరాకరించెను. రామానుజాచార్య ఎంతో సంతోషించారు.

రామానుజాచార్య తన ఇంటికి రాకుండా వరదాచార్యుల ఇంటికి వెళ్లిన విషయం తెలుసుకున్న యజ్ఞేషులు వారి వద్దకు వెళ్లి దండ

ప్రణామాలు చేసి "గురుదేవా! తమరు నా ఇంటికి ఎందుకు రాలేదు?" అని అడిగాడు. అందుకు రామానుజాచార్య "నేను వస్తున్నాను అనే సందేశాన్ని తెలిపిన నా శిష్యులకు నీవు అతిథి సేవలు చేయక నిరాదరించావు, అందుకే నీ ఇంటికి రాలేదు" అని తెలిపారు. యజ్ఞేషులు రామానుజాచార్యతో "స్వామీ! మీరు చెప్పినది నిజమే. మీరు వస్తున్నారనే ఆనందంతో వారి గురించి మరిచిపోయాను. అంతేకానీ అహంకారంతో కాదు, నేను చేసిన తప్పును క్షమించి, మా ఇంటికి వచ్చి నా సేవలను స్వీకరించండి" అని ప్రార్థించాడు. రామానుజాచార్య "నేను తిరుమలలోని వేంకటేశ్వర స్వామిని దర్శించి, తిరిగి శ్రీరంగం వెళ్లే సమయంలో నీ సేవలను స్వీకరిస్తాను" అని యజ్ఞేషులతో తెలిపి తిరుమలకు బయలుదేరారు.

రామానుజాచార్య తిరుమల వస్తున్న విషయం తిరుమలనంబికి తెలిసింది. ఆయన వేంకటేశ్వర స్వామి తీర్థప్రసాదాలను తీసుకొని రామానుజాచార్యకు ఎదురు వెళ్లెను. రామానుజాచార్య తిరుమలనంబితో "స్వామీ! మీరే ఎందుకు వచ్చారు? ఎవరినైనా చిన్న భక్తుని పంపించవచ్చుగదా!" అని అన్నారు. అప్పుడు తిరుమలనంబి "ఈ కొండమీద నాకంటే చిన్న భక్తుడు ఎవరూ నాకు కనబడలేదు. అందువలన నేనే స్వామి తీర్థప్రసాదాలను తీసుకువచ్చాను" అన్నాడు.

రామానుజాచార్య తిరుపతికి వచ్చి కపిలతీర్థంలోని నమ్మ ఆళ్వారుల మందిరంలో ఉన్నారు. తిరుమల కొండ సాక్షాత్తూ ఆది శేషుడనే పురాణవ్యాఖ్యానం ప్రకారం ఆది శేషుని మీద తన పాదాన్ని మోపకూడదని భావించి ఆయన కొండ ఎక్కలేదు. ఈ విషయం తెలిసిన అనంతాచార్య కొండ నుండి దిగివచ్చి రామానుజాచార్యకు సాష్టాంగ ప్రణామాలు చేసి "గురుదేవా! తిరుమల కొండ మీద ఉన్న వేంకటేశ్వర స్వామిని శైవులు శివుడని, శాక్తేయులు దుర్గ అని పూజిస్తున్నారు. ఆళ్వారులు వేంకటేశ్వర స్వామిని విష్ణువు అని ఎన్నో కీర్తనలు వ్రాశారు మరియు ప్రార్థించారు. ఆళ్వారుల ప్రార్థన

అరణ్య రోదనయే అవుతున్నది. అందువలన మీరు కొండమీదికి వచ్చి, శాస్త్రప్రమాణాలతో వేంకటేశ్వర స్వామిని మహావిష్ణువు అని నిరూపించి ఆళ్వారుల ప్రార్థనలను, కీర్తనలను నిజం చేయండి. ఓ గురుదేవా! తిరుమలకొండ ఆది శేషుడని, ఆది శేషుని మీద పాదాన్ని మోపడం వలన పాపం వస్తుందని మీరు కొండను ఎక్కడం లేదు. మీకే కొండపైకి ఎక్కే అర్హత లేనప్పుడు నాకెలా ఉంటుంది? నన్నెందుకు తిరుమల వెళ్లి వేంకటేశ్వర స్వామికి పూలతో, తులసితో సేవ చేయమని పంపించారు?" అని అడిగెను.

అనంతాచార్య కోరికను తీర్చడానికి రామానుజాచార్య మోకాళ్ళకు బట్టలు కట్టుకొని మోకాళ్ళతో నడుస్తూ తిరుమల కొండపైకి వెళ్లారు. స్వామి పుష్కరిణిలో స్నానం చేసి ప్రక్కనే ఉన్న భూదేవి సమేత వరాహ స్వామిని దర్శించారు. వేంకటేశ్వర స్వామి మందిరానికి ప్రదక్షిణ నమస్కారాలు చేసి స్వామిని దర్శించారు. తరువాత శైవులను, శాక్తేయులను పిలిపించి శాస్త్ర ప్రమాణాలను ఉదహరించారు. "వేంకటేశ్వర స్వామి దుర్గా దేవిగానీ, శివుడుగానీ కానేకాదు. అనేక పురాణాలలో ఆయన మహావిష్ణువే అని స్పష్టంగా ఉన్నది. అందువలన ఇక్కడ విష్ణు ఆరాధన మాత్రమే జరగాలి" అని తెలిపారు. అయినా వారు "విష్ణువు అయితే శంఖచక్రాలు ఎందుకు లేవు?" అని రామానుజాచార్యను ప్రశ్నించారు.

రామానుజాచార్య వారితో "తొండమానునికి వసుదాసునికి జరిగిన యుద్ధంలో వేంకటేశ్వర స్వామి తన శంఖచక్రాలను తొండమానునికి ఇచ్చి తాను స్వయంగా వసుదాసునికి సహాయం చేసెను. అందువలన వేంకటేశ్వర స్వామికి శంఖచక్రాలు లేవు." అని తెలిపినా వారు దానికి అంగీకరించలేదు. ఆ రాత్రి రామానుజాచార్య వేంకటేశ్వర స్వామి ముందు దుర్గా దేవి ఆయుధమైన ఖడ్గమును, శివుని ఆయుధాలైన ఢమరుకత్రిశూలాలను, విష్ణు ఆయుధాలైన శంఖచక్రాలను ఉంచి తలుపులకు తాళం వేసి "అందరం ఇక్కడే

ఉందాం. గర్భగుడిలోని విగ్రహం ఖడ్గాన్ని స్వీకరిస్తే దుర్గా దేవి అని, ఢమరుకత్రిశూలాలని స్వీకరిస్తే శివుడని, శంఖచక్రాలను స్వీకరిస్తే విష్ణువు అని నిర్ధారణ చేద్దాం" అన్నారు. ఈ ఒప్పందానికి అందరూ అంగీకరించారు. అన్ని ఆయుధాలు మందిరంలో పెట్టి తాళం వేశారు. ఆ రాత్రి రామానుజాచార్య ఆది శేషుని రూపాన్ని ధరించి మందిరంలోనికి వెళ్లి వేంకటేశ్వర స్వామి రెండు చేతులకు శంఖచక్రాలను ధరింపజేశారు.

మరునాడు ఉదయాన్నే మందిరం తలుపులు తెరిచి చూడగా వేంకటేశ్వర స్వామి శంఖచక్రాలు స్వీకరించి ఉండడం అందరికీ కనబడింది. ఇక చేసేదేమీ లేక శైవులు, శాక్తేయులు తిరుమల కొండను వదిలి వెళ్లారు. రామానుజాచార్య వేంకటేశ్వర స్వామికి శంఖచక్రాలను ధరింపచేసినందువలన వేంకటేశ్వర స్వామి రామానుజాచార్యను తన గురువుగా భావించారు. అందువలన రామానుజాచార్య సహస్రనామాలలో వేంకటేశ్వర స్వామి యొక్క గురువు అని ఒక నామం ఉన్నది.

ఒకరాజు రామేశ్వరం వెళుతూ వేంకటేశ్వర స్వామిని దర్శించి స్వామివారి మందిరం చుట్టూ కొన్ని మండపాలు కట్టించాలని తన సేవకులకు తెలిపి తన ప్రయాణాన్ని కొనసాగించాడు. తిరుగు ప్రయాణంలో తాను కట్టిస్తున్న మండపాలు ఎంతవరకు పూర్తయ్యాయో చూద్దామని రాజు తిరుమల వచ్చారు. ఆ రోజు రాత్రి మహారాజుకు కలలో ఒక పాము కనబడింది. రాజు మరునాడు స్వామి దర్శనానికి వెళ్లినప్పుడు ఆ పాము వేంకటేశ్వర స్వామి భుజానికి చుట్టుకొని ఉన్నది. అది చూసిన రాజు, బంగారంతో ఒక నాగాభరణాన్ని చేయించి వేంకటేశ్వర స్వామి భుజానికి అలంకరించమని పూజారికి ఇచ్చాడు. పూజారి "నాగాభరణాలు శివునికి ఉండునుగనుక నేను వేంకటేశ్వర స్వామికి అలంకరించను" అన్నాడు. వేంకటేశ్వర స్వామి పూజారికి కలలో దర్శనమిచ్చి "నేను

ఆది శేషుని మీద నివసిస్తాను. ఆది శేషుడు నాకు అత్యంత ఆప్తుడు. కనుక రాజు చేయించిన నాగాభరణాన్ని నాకు అలంకరించు" అన్నాడు. పూజారి వేంకటేశ్వర స్వామి కోరిక మేరకు ఆ నాగాభరణాన్ని స్వామికి అలంకరించాడు.

రామానుజాచార్య వేంకటేశ్వర స్వామిని దర్శించినప్పుడు ఒక భుజమునకే నాగాభరణం ఉండడం చూసి, ఎందుకు నాగాభరణాన్ని అలంకరించారని పూజారులను అడగగా, వారు జరిగినదంతా వివరించారు. రామానుజాచార్య ఒక భుజమునకే అలంకరణ బాగుండదని భావించి స్వామివారి రెండవ భుజమునకు కూడా నాగాభరణాన్ని చేయించి అలంకరించారు. అందువలన ఈనాటికీ వేంకటేశ్వర స్వామికి నాగాభరణాలను అలంకరిస్తారు.

రామానుజాచార్య తిరుచానూరులో ఉన్న పద్మావతీ దేవికి (లక్ష్మీ దేవికి) సంవత్సరంలో ఒకరోజు వేంకటేశ్వర స్వామికి సమర్పించిన పూలమాలను, పసుపుకుంకుమను పంపించే ఏర్పాటు చేశారు. సంక్రాంతి పండుగ మరునాడు గోదా దేవి ధరించిన పూలమాలను వేంకటేశ్వర స్వామికి సమర్పించి గోదా దేవి వేంకటేశ్వర స్వామి కల్యాణమును జరిపించే ఏర్పాటు చేశారు. ధనుర్మాసంలో (డిసెంబర్, జనవరి నెలల్లో ధనుర్మాసం వస్తుంది) సుప్రభాతానికి బదులు గోదా దేవి రచించిన తిరుప్పావై చదివే ఏర్పాటు చేశారు. వేంకటేశ్వర స్వామికి పూల అలంకరణ సమయంలో దివ్యప్రబంధమును (పన్నెండు మంది ఆళ్వారులు రచించిన నాలుగువేల కీర్తనలు) పాడే ఏర్పాటు చేశారు.

రామానుజాచార్య తిరుమలకు రాకముందు, పదిరోజులు జరిగే బ్రహ్మోత్సవాలలో మొదటి రోజు మాత్రమే తిరుమలలో జరిగేది. మిగిలిన తొమ్మిది రోజులు తిరుచానూరులో జరిగేవి. ఈ విషయం తెలుసుకొన్న రామానుజాచార్య పదిరోజుల ఉత్సవాలు తిరుమలలోనే జరిగే ఏర్పాటు చేశారు.

తిరుమల అడవులలో యోగ నరసింహ స్వామి విగ్రహం ఉండేది. రామానుజాచార్య ఈ నరసింహ స్వామిని వేంకటేశ్వర స్వామి మందిరంలో ప్రతిష్ఠించి ప్రతిరోజూ పూజలు నైవేద్యాలు జరిగే ఏర్పాటు చేశారు. యోగముద్రలో ఉన్నందువలన స్వామికి యోగ నరసింహ స్వామి అని పేరు వచ్చింది.

శ్రీ అనంతాచార్య

రామానుజాచార్య ప్రధాన గృహస్థ శిష్యులలో అనంతాచార్య ఒకరు. అనంతాచార్య 1053వ సంవత్సరంలో జన్మించిరి. అనంతాచార్య రామానుజాచార్య కంటే 36 సంవత్సరాలు చిన్నవారు. అనంతాచార్య తిరుమలలో నివసించిన ఇల్లు మరియు ఆ ఇంటి వెనుక వేంకటేశ్వర స్వామి వారి సేవకై ఆయన స్వయంగా త్రవ్విన బావి మరియు పూల తోట, ఆయన విగ్రహం, సమాధి కూడా అక్కడే ఉన్నాయి. అనంతాచార్య సంస్కృతంలో 'వేంకటాచల ఇతిహాస మాల' అనే గ్రంథంతో పాటు 'రామానుజ చతుశ్లోకి' మరియు 'గోదా చతుశ్లోకి' అనే కీర్తనలను రచించారు.

ఒకనాడు రామానుజాచార్య వేంకటేశ్వర స్వామి గురించి వివరిస్తూ తన శిష్యులతో "వేంకటేశ్వర స్వామికి పుష్పాలు చాలా ఇష్టమని నమ్మ ఆళ్వారు ఒక కీర్తనలో వ్రాశారు. అందువలన మీలో ఎవరు తిరుమలకు వెళ్లి వేంకటేశ్వర స్వామికి పుష్ప సేవ చేస్తారు?" అని అడిగారు. అప్పుడు అనంతాచార్య లేచి రామానుజాచార్యతో "గురుదేవా! నేను వెళ్లి వేంకటేశ్వర స్వామికి పుష్ప సేవ చేస్తాను" అన్నారు. రామానుజాచార్య ఎంతో ఆనందించి వెళ్ళమన్నారు.

రామానుజాచార్య అనుమతితో అనంతాచార్య వేంకటేశ్వర స్వామిని సేవించుటకై తిరుమలకు వచ్చెను. అక్కడ స్వామిని దర్శించిన తరువాత తిరుమలలో ఒక కుటీరమును ఏర్పాటు చేసుకొనెను. వేంకటేశ్వర స్వామి సేవకు అవసరమైన పుష్పాలు

మరియు తులసి మొక్కల తోటలు పెంచుట కొరకై అనంతాచార్య తన భార్య సహాయంతో ఒక బావిని త్రవ్వుచుండగా వేంకటేశ్వర స్వామి వారికి సహాయం చేయదలచెను. స్వామి వారు ఒక బాలుని రూపంలో అనంతాచార్య దగ్గరకు వచ్చి "నేను ఈ కొండమీద నివసించే కోయ జాతికి చెందిన బాలుడను. నేను మీ గురించి తెలుసుకున్నాను. మీకు సహాయం చేస్తాను" అన్నారు. అనంతాచార్య బాలునితో "ఈ పని నీవు చేయలేవు. మా గురువుగారు ఇచ్చిన ఈ సేవను నేను చేసుకుంటాను. నీవు వెళ్ళిపో" అన్నారు. బాలుని రూపంలో ఉన్న వేంకటేశ్వర స్వామి అక్కడ నుంచి వెళ్ళిపోయారు.

అనంతాచార్య బావిని త్రవ్వసాగెను. త్రవ్విన మట్టిని గంపలో నింపి తన భార్యకు ఇచ్చుచుండెను. మట్టితో నిండిన గంపను తీసుకుని ఆమె దూరంగా వేసి వస్తుండేది. ఇది గమనించిన వేంకటేశ్వర స్వామి అనంతాచార్య భార్య వద్దకు వెళ్లి "మీరు గర్భవతిగా ఉన్నారు. గర్భవతులు ఇంత కష్టమైన పనులు చేయరాదు. మీరు ఈ గంపను నాకు ఇవ్వండి. గంపలోని మట్టిని నేను దూరంగా వేసి వస్తాను" అని అన్నారు. ఆమె బాలునితో "ఇంతకు ముందే నా భర్త నీ సహాయాన్ని తిరస్కరించారు. నేను నీ సహాయం స్వీకరిస్తే మన ఇద్దరినీ మందలిస్తారు. అందువలన నీవు వెళ్ళిపో" అని పలికెను. బాలుని రూపంలో ఉన్న వేంకటేశ్వర స్వామి "నీ భర్త బావి లోపల ఉన్నాడు. నేను మీకు చేసే సహాయం ఆయనకు కనబడదు. అందువలన మీరు భయపడవలసిన అవసరం లేదు" అన్నారు. అప్పుడు ఆమె వేంకటేశ్వర స్వామి మాయకు లోనై సహాయం తీసుకొనుటకు అంగీకరించెను.

బాలుని రూపంలో ఉన్న స్వామివారు సహాయం చేస్తున్నందువలన ఆమె సేవ త్వరగా పూర్తయ్యేది. అనంతాచార్య తాను త్రవ్విన మట్టిని ఇంకొక గంపలో నింపకముందే తన భార్య ఖాళీ గంపతో తిరిగి రావడం గమనించారు. అనంతాచార్య తన భార్యతో

“ఇంతకుముందు ఆలస్యంగా వచ్చేదానివి, ఇప్పుడు గంపలో మట్టి నింపకముందే వస్తున్నావు. కారణం ఏమిటి?” అని అడిగారు. ఆమె పతివ్రత స్త్రీ కావున అనంతాచార్యతో అబద్ధం చెప్పకుండా జరిగినదంతా తెలిపింది. అనంతాచార్య కోపంతో బావిలో నుండి బయటకు వచ్చారు. కోపంతో ఉన్న అనంతాచార్యను చూడగానే తనను దండిస్తారని బాలుని రూపంలో ఉన్న వేంకటేశ్వర స్వామికి అర్థం అయ్యింది. అందువలన స్వామి వారు పారిపోసాగారు. అనంతాచార్య బాలుని పట్టుకోవాలని వెంబడించారు. వేంకటేశ్వర స్వామి పారిపోతూ ఒక సారి వెనుకకు తిరిగి చూడగా, అనంతాచార్య తన చేతిలోని గునపముతో వేంకటేశ్వర స్వామిని గాయపరచెను. ఆ గునపము బాలుని రూపంలో ఉన్న వేంకటేశ్వర స్వామి వారి పెదవి క్రింది భాగమునకు తగిలి రక్తం కారసాగెను. అలా రక్తం కారుతుండగానే ఆ బాలుడు ఆలయంలోకి వెళ్లి అదృశ్యం అయ్యాడు. అనంతాచార్య పరిగెత్తలేక తిరిగి వెళ్ళిపోయారు.

ఆలయంలో వేంకటేశ్వర స్వామి వారి విగ్రహంలోని పెదవి క్రింది భాగం నుండి రక్తం కారసాగింది. అది గమనించిన ఆలయ పూజారి భయపడి వేంకటేశ్వర స్వామితో “స్వామీ! ఎందుకు ఇలా రక్తం కారుచున్నది?” అని అడిగారు. వేంకటేశ్వర స్వామి జరిగిన వృత్తాంతం తెలిపి “రక్తం ఆగడానికి పచ్చ కర్పూరం పెట్టండి. అనంతాచార్య చేసిన ఈ లీలకు గుర్తుగా ప్రతిరోజు ఇలాగే పచ్చ కర్పూరం పెట్టండి” అని తెలిపెను. ఆలయ పూజారి వేంకటేశ్వర స్వామి తెలిపిన విధంగా సేవించెను. ఆలయ పూజారి ద్వారా జరిగింది తెలుసుకున్న అనంతాచార్య వేంకటేశ్వర స్వామికి సాష్టాంగ ప్రణామాలు అర్పించి తన తప్పును క్షమించమని ప్రార్థించారు.

ఒకసారి అనంతాచార్య వేంకటేశ్వర స్వామి కోసం పూలమాలను తయారు చేస్తుండగా, అనంతాచార్య తనని కలవాలని వేంకటేశ్వర స్వామి ఆలయ పూజారి ద్వారా కబురు చేశారు. వేంకటేశ్వర స్వామి

తనను రమ్మంటున్నారని ఆలయ పూజారి ద్వారా తెలుసుకున్న అనంతాచార్య "నేను వస్తాను మీరు వెళ్ళండి" అని తెలిపెను. అనంతాచార్య పూలమాలను మరియు తులసిమాలను సిద్ధం చేసి తీసుకువెళ్లడంలో ఆలస్యం అయ్యింది.

వేంకటేశ్వర స్వామి అనంతాచార్యని "ఎందుకు ఇంత ఆలస్యం అయ్యింది?" అని అడిగారు. అనంతాచార్య "స్వామీ! పూలమాలను మరియు తులసిమాలను సిద్ధం చేసి తీసుకురావడంలో ఆలస్యం అయ్యింది" అని తెలిపారు. వేంకటేశ్వర స్వామి అనంతాచార్యతో "నాకంటే నీకు పూలమాలలే ముఖ్యమా?" అని అడిగారు. అనంతాచార్య "స్వామీ! పువ్వులు పూర్తిగా విచ్చుకుంటే వాటి సువాసన త్వరగా పోతుంది. అందువలన పువ్వులు విచ్చుకోక ముందే పూల మాలను తయారు చేసి సమర్పించాలని మా గురువు రామానుజులవారు సెలవిచ్చారు. మీరు నన్ను పిలిచినప్పుడు నేను పూలమాలను తయారు చేస్తున్నాను. అది మధ్యలో వదిలి నేను మీ దగ్గరికి వస్తే పువ్వులు విచ్చుకొని సువాసన కోల్పోతాయి. అందువలన పూలమాలను పూర్తిగా తయారు చేసి తీసుకువచ్చాను" అని తెలిపెను.

ఒకనాడు అనంతాచార్య తోటలో పువ్వులు కోస్తుండగా ఆయనను పాము కాటువేసింది. అయినా వేంకటేశ్వర స్వామి పుష్పసేవకు ఆలస్యం కాకూడదని పువ్వులను కోసి, మాలను తయారు చేసుకొని ఆలయానికి తీసుకువచ్చారు. వేంకటేశ్వర స్వామి "నిన్ను పాము కరిచింది కదా! వెంటనే ఔషధాన్ని తీసుకో" అని పలికెను. అనంతాచార్య "స్వామీ! నన్ను కామ, క్రోధ, లోభ, మద, మత్సర్యాలు అనే పాములు ప్రతిక్షణం కరుస్తున్నాయి. వాటి ముందు ఈ పాము విషం ఎంత? పాము విషం వలన నేను మరణిస్తే వైకుంఠం వెళ్లి అక్కడ మీకు సేవ చేస్తాను. బ్రతికి ఉంటే ఇక్కడే సేవ చేస్తాను" అని సమాధానం ఇచ్చారు.

ఒకసారి అనంతాచార్య శ్రీరంగం వెళ్లి తన గురువును మరియు శ్రీరంగనాథ స్వామిని దర్శించాలని వేంకటేశ్వర స్వామికి సమర్పించిన ప్రసాదాన్ని తీసుకొని తిరుమల నుండి బయలుదేరారు. మార్గమధ్యంలో ప్రసాదం ఉన్న మూటను విప్పగా ప్రసాదం నిండా చీమలు కనబడెను. కుల శేఖర మహారాజు వేంకటేశ్వర స్వామిని "స్వామి నేను ఈ కొండమీద ఎందుకు పనికిరాని జీవిగా జన్మించాలని కోరుకుంటున్నాను" అని ప్రార్థించినది గుర్తుచేసుకొని, ఎవరో మహా భక్తులు చీమల్లాగా జన్మించి ఉంటారని భావించి, ఆ చీమలతో ఉన్న ప్రసాదాన్ని తిరుమల కొండ మీదికి తీసుకువెళ్లి ఆ ప్రసాదాన్ని కొండ మీద వదిలి శ్రీ రంగానికి వెళ్లిరి.

ఒకసారి కొందరు భక్తులు తిరుమల కొండలను ఎక్కుతూ అలసిపోయారు. అప్పుడు వేంకటేశ్వర స్వామి భక్తుని వేషాన్ని ధరించి, వారి దగ్గరకు వెళ్లి "నేను అనంతాచార్య శిష్యుడను. మీరు కొండ ఎక్కుతూ అలిసిపోవడం చూసిన ఒక భక్తుడు అనంతాచార్యకు మీ గురించి తెలిపాడు. వేంకటేశ్వర స్వామికి నైవేద్యం పెట్టిన పులిహోర ప్రసాదాన్ని మీకు ఇవ్వమని అనంతాచార్య పంపారు" అని వారికి ప్రసాదాన్ని ఇచ్చి వెళ్లి పోయారు. భక్తులు ఆ పులిహోర ప్రసాదాన్ని స్వీకరించారు. తిరుమల చేరిన తరువాత అనంతాచార్యను కలుసుకొని "మీరు పంపిన పులిహోర చాలా బాగుంది" అని కృతజ్ఞతలు తెలిపారు. అనంతాచార్య "నేను ఎవరినీ పంపలేదు. స్వయంగా వేంకటేశ్వర స్వామి నా శిష్యునిగా వచ్చి మీకు తన ప్రసాదాన్ని ఇచ్చారు" అని తెలిపెను.

ఒకనాడు పరాశరభట్ట శిష్యుడు ఆయన వద్దకు వచ్చి భక్తుల లక్షణాలను తెలపమని కోరాడు. పరాశరభట్ట "తిరుమలలో అనంతాచార్య ఉన్నారు. నీవు ఆయన వద్దకు వెళ్లి తెలుసుకొమ్మని" తిరుమలకు పంపారు. ఆ శిష్యుడు పరాశరభట్ట తెలిపినట్లు తిరుమలకు వెళ్లి అనంతాచార్యను దర్శించి జరిగినది తెలిపాడు.

అనంతాచార్య అతనిని కొద్దిరోజులు అక్కడే ఉండమన్నారు. ఒకసారి వేంకటేశ్వర స్వామికి ఉత్సవాలు జరిగాయి. ఆ ఉత్సవాలకు ఎంతోమంది భక్తులు మరియు సన్యాసులు వచ్చారు. ఉత్సవాలు అయ్యాక భక్తులు ప్రసాదం తీసుకోవడానికి కూర్చున్నారు. అందులో పరాశరభట్ట పంపిన భక్తుడు కూడా ఉన్నాడు. అనంతాచార్య అతన్ని లేపి ప్రసాదాన్ని వడ్డించమన్నారు. అతను ప్రసాదాన్ని వడ్డించి రెండవసారి ప్రసాదం తీసుకునే వారితో కూర్చున్నాడు. అనంతాచార్య అతనిని మళ్ళీ లేపి ప్రసాదాన్ని వడ్డించమన్నారు. అతను మళ్ళీ ప్రసాదాన్ని వడ్డించి మూడవసారి ప్రసాదం తీసుకునే వారితో కూర్చున్నాడు. అనంతాచార్య మళ్ళీ లేపి ప్రసాదాన్ని వడ్డించమన్నారు. అతను వడ్డించి నాలుగవసారి ప్రసాదం తీసుకునే వారితో కూర్చొని ప్రసాదాన్ని తీసుకున్నాడు. ఉత్సవాలు అయ్యాక అనంతాచార్య అతనిని పిలిచి "నీవు భక్తుల లక్షణాలు ఎలా ఉండాలి అని అడిగావుగదా! చెబుతాను" అని ఈ విధంగా తెలిపారు: "భక్తులు ఉప్పులాగా, కొంగలాగా, కోడిలాగా మరియు నీలాగా ఉండాలి" అని తెలిపారు.

ఆ భక్తుడు అనంతాచార్య నుండి అనుమతి తీసుకొని పరాశరభట్ట వద్దకు వచ్చి జరిగినది వివరంగా తెలిపి, నాకు ఆ సమాధానాలు అర్థం కాలేదు అని తెలిపాడు. అప్పుడు పరాశరభట్ట తన శిష్యునికి "ఆరు రకాల రుచులలో ఉప్పు ఒకటి. ఈ ఆరు రుచులు ఎప్పుడూ తమ గుణాలను కోల్పోవు. ఉప్పులేని కూరను ఎవరూ తినలేరు. అందరూ వండిన కూరలను పొగుడుతారుగానీ ఉప్పును మాత్రం పొగడరు. ఉప్పు కూరలకు రుచిని ఇస్తుందిగానీ ఆ గొప్పతనాన్ని తీసుకోదు. అలాగే భక్తుడు భగవంతుని నవవిధభక్తి బాగా సాధన చేయాలిగానీ పేరును కోరుకోకూడదు.

"కొంగ చేపల కోసం నీటిలో నిలబడుతుంది. చిన్నచిన్న చేపలను తింటే పెద్ద చేపలు చూసి దగ్గరకు రావు అని చిన్నచిన్న చేపలను

తినకుండా పెద్ద చేపలు తన దగ్గరికి వచ్చినప్పుడు పట్టుకొని తింటుంది. అలాగే భక్తుడు సాధన చేసేటప్పుడు, పూజ–లాభ–ప్రతిష్ఠలు, అష్టాంగ యోగసిద్ధి, స్వర్గప్రాప్తి, ఇంద్ర మరియు బ్రహ్మ వంటి పదవులు ఎదురవుతాయి. కానీ సాధకుడు వీటిని పట్టించుకోకుండా వైకుంఠప్రాప్తిని మాత్రమే కోరుకోవాలి.

"కోడి ధూళిలో నుండి తనకు కావలసిన ఆహారాన్ని తీసుకుంటుంది. అదే విధంగా భక్తుడు సమస్త శాస్త్రాల యొక్క వాస్తవమైన అర్థాలను తెలుసుకొని ఆచరించాలి. ఇక నీవలె అనగా పెద్దలు అవమానించినా గౌరవించినా వాటికి లోనుకాకూడదు" అని తెలిపిరి.

ఒకనాటి రాత్రివేళలో వేంకటేశ్వర స్వామి లక్ష్మీదేవితో కలిసి విహరించుటకు అనంతాచార్య పూలతోటలోకి వచ్చి అక్కడ ఉన్న చక్కటి గులాబీ పువ్వులను కోసి లక్ష్మీ దేవికి ఇచ్చెను. అలాగే లక్ష్మీ దేవి కూడా చక్కటి గులాబీ పువ్వులను కోసి వేంకటేశ్వర స్వామికి ఇచ్చెను. ఇలా తోటలోని పువ్వులతో రాత్రి అంతా ఆడుకొని వారు ఉదయాన్నే బ్రహ్మ ముహూర్తంలో వెళ్లిపోయారు. అనంతాచార్య ఉదయం పువ్వులు కోయడానికి వచ్చేసరికి చక్కటి పువ్వులు అన్నీ కోసి ఉండడం చూసి దుఃఖించెను. తోటలో మిగిలి ఉన్న పువ్వులతో పూలమాలను తయారు చేసి వేంకటేశ్వర స్వామికి సమర్పించెను. మరుసటిరోజు రాత్రి కూడా వేంకటేశ్వర స్వామి లక్ష్మీ దేవితో కలిసి అనంతాచార్య పూల తోటలోని పుష్పాలతో ఆడుకొని ఉదయాన్నే బ్రహ్మ ముహూర్తంలో వెళ్లిపోయారు. అనంతాచార్య చాలా దుఃఖించెను. ఆ మరుసటి రాత్రి తోటలోకి వచ్చే వారిని ఎలాగైనా పట్టుకోవాలని రాత్రివేళలో తోటకు కాపలాగా ఉండెను. వేంకటేశ్వర స్వామి తిరిగి లక్ష్మీ దేవితో కలిసివచ్చి పూలతోటలోని చక్కటి పువ్వులన్నీ తీసుకుని వెళ్లిపోయారు. కానీ అనంతాచార్యకు లక్ష్మీ దేవిగానీ వేంకటేశ్వర స్వామిగానీ కనిపించలేదు.

ఇలా ఎనిమిది రోజులు జరిగింది. తొమ్మిదవ రోజున తన పూలతోటలోకి వచ్చేవారు తనకు కనబడేటట్లు చేయమని అనంతాచార్య వేంకటేశ్వర స్వామిని ప్రార్థించెను. ఆ రోజు వేంకటేశ్వర స్వామి మరియు లక్ష్మీ దేవి అనంతాచార్యకు కనబడడం కోసం ఒక రాజు మరియు రాణిగా మారు వేషంలో గుర్రం మీద వచ్చి పూలతోటలో తిరుగుచున్నారు. అది చూసిన అనంతాచార్య రాజు రూపంలో ఉన్న వేంకటేశ్వర స్వామితో "నిన్ను చూస్తే రాజులా ఉన్నావు. భగవంతుని కోసం పెంచే పువ్వులను పాడుచేస్తావా?" అని మందలించి ఆయనను బంధించబోయాడు. వేంకటేశ్వర స్వామి తనను తాను విడిపించుకొని గుర్రం మీద పారిపోయారు. వేంకటేశ్వర స్వామి పారిపోగానే రాణి రూపంలో ఉన్న లక్ష్మీ దేవిని పట్టుకొని చెట్ల తీగలతో బంధించెను. అనంతాచార్య లక్ష్మీ దేవితో "నీ కోసం నీ భర్త వస్తాడు కదా! అప్పుడు అతనికి గుణపాఠం చెప్తాను" అని పలికెను. లక్ష్మీ దేవి అనంతాచార్యతో "నా భర్తకు నాలాంటి భార్యలు ఎందరో ఉన్నారు. అందువలన నా కొరకు రాడు. నేను నీ కూతురు వంటి దానను. దయచేసి నన్ను వదిలిపెట్టు" అని ప్రార్థించినా అనంతాచార్య లక్ష్మీ దేవిని వదలలేదు.

మరుసటిరోజు ఉదయం తిరుమల ఆలయం తెరచి లోపలికి వెళ్లిన పూజారులకు వేంకటేశ్వర స్వామి హృదయంపై లక్ష్మీ దేవి కనబడలేదు. పూజారులు వేంకటేశ్వర స్వామిని "స్వామీ! లక్ష్మీదేవి ఎక్కడికి వెళ్ళింది?" అని అడిగారు. అప్పుడు వేంకటేశ్వర స్వామి "రాత్రి నేను లక్ష్మీ దేవితో కలిసి అనంతాచార్య పూలతోటకు వెళ్లి విహరిస్తుండగా అనంతాచార్య నన్ను బంధించబోయారు. నేను తప్పించుకొని వచ్చాను. కానీ లక్ష్మీ దేవి అక్కడే బంధించబడింది" అని తెలిపెను. పూజారులు అనంతాచార్య పూలతోటకు వెళ్లి అనంతాచార్యకు జరిగింది తెలిపారు. అప్పటికే లక్ష్మీ దేవి అక్కడ విగ్రహముగా మారిపోయింది. అనంతాచార్య లక్ష్మీ దేవిని గంపలో పెట్టుకొని మందిరానికి తీసుకువచ్చి వేంకటేశ్వర స్వామి హృదయంపై ఉంచి తనను క్షమించమని ప్రార్థించెను.

ఈ లీలకు గుర్తుగా ఇప్పటికీ వేంకటేశ్వర స్వామిని మరియు లక్ష్మీ దేవిని అనంతాచార్య తోటకు తీసుకువెళ్లి పూజిస్తారు. తిరుమలలోని అనంతాచార్య సమాధికి వేంకటేశ్వర స్వామివారి పూలమాలను సమర్పించి, శఠగోపంతో అనంతాచార్యను దీవిస్తారు. అనంతాచార్య ఆవిర్భవించిన రోజున కూడా ఇదేవిధంగా పూజిస్తారు. అనంతాచార్య సమాధి నుండి ఒక పొగడచెట్టు జన్మించింది. అనంతాచార్య పొగడచెట్టుగా జన్మించారని అంటారు.

శ్రీ వేదాంత దేశికులు

వేదాంత దేశికులు తమిళనాడులోని కాంచీపురం వద్ద ఉన్న 'తూపుల్' అనే గ్రామంలో అనంతసూరి మరియు తోతరాంబ అనే దంపతులకు 1268లో జన్మించిరి. వీరి జన్మనామం 'వేంకటనాథన్.' వీరరాఘవచార్యులు 400 సంవత్సరాల క్రితం గోవిందరాజ స్వామి మందిరంలో వేదాంత దేశికుల మందిరాన్ని స్థాపించారు.

అనంతసూరి మరియు తోతరాంబలకు సంతానం లేనందున తిరుమలలోని వేంకటేశ్వర స్వామిని సంతానాన్ని ప్రసాదించమని ఎల్లప్పుడూ ప్రార్థించేవారు. ఒకనాడు అనంతసూరులకు స్వప్నములో వేంకటాచలపతి బాలునిగా దర్శనమిచ్చి ఆలయములోని ఒక గంటను చేతికిచ్చి ఈ గంటను నీ భార్యచేత మ్రింగించుము నీకు పుత్ర సంతానము కలుగును అని ఆజ్ఞాపించి అంతర్ధానమయ్యెను. అదే స్వప్నములో స్వామి ఆజ్ఞానుసారము శీలవతియగు తన భార్య గంటను మ్రింగినట్లు చూచెను. మరునాటి ఉదయమున స్వప్న వృత్తాంతము భార్యకు చెప్పగా భార్య తనకు కూడా ఇదే స్వప్నము కలిగెనని చెప్పగా విని ఇద్దరూ ఆశ్చర్యపోయిరి.

దేవాలయములోని గంట కనబడకపోవుట గురించి అర్చకులు అధికారికి తెలిపిరి. వేంకటాచలపతి స్వయముగా రామానుజాచార్య పరంపరంలో వస్తున్న అధికారికి గంట ఎలా అదృశ్యమైనదో

తెలిపెను. ప్రధానాధికారి కూడా స్వయముగా ఈ పుణ్యదంపతుల నోటినుండి స్వప్నం గురించి విని ఆశ్చర్యపోయెను. తోతరాంబ గంటను 12 సంవత్సరములు ధరించిన తరువాత వేదాంత దేశికులు జన్మించిరి. వేదాంత దేశికులు తిరుమల వచ్చి వేంకటేశ్వర స్వామికి ఎన్నో సంవత్సరాలు సేవ చేశారు. వేంకటేశ్వర స్వామిని స్తుతిస్తూ దయా శతకం అనే గ్రంథాన్ని 108 శ్లోకాలతో రచించారు. ఆ గ్రంథంలోని కొన్ని శ్లోకాల భావం:

"చెరుకురసం ఎంతో తియ్యగా ఉంటుంది. ఆ రసం మరగబెడితే చక్కెరగా మారుతుంది. అదే విధంగా శ్రీనివాసుని యొక్క దయ కరిగి వేంకటగిరి పర్వతముగా మారినది. ఆ వేంకటగిరికి నేను ప్రణామాలు చేస్తున్నాను. శ్రీనివాసుని యొక్క దయ అనే సరోవరం నుండి వచ్చే నీటిలో ఓర్పు, దయ కలిగిన శఠగోపముని, నాథముని, యామునాచార్య మరియు ఈ పరంపరలో వస్తున్న ఇతర ఆచార్యులు స్నానాలు చేస్తున్నారు. వేదాలు సంస్కృతంలో ఉన్నందువలన కొంతమంది మాత్రమే లాభాన్ని పొందారు. ఆ వేదాల సారాన్ని ఆళ్వారులు దివ్య ప్రబంధం రూపంలో అందించారు. ఆళ్వారులు పరమ పురుషుని యొక్క దయను ఆశ్రయించిరి. అట్టి ఆళ్వారులకు నేను ప్రణామాలు చేస్తున్నాను. భగీరథుడు స్వర్గంలోని గంగా నదిని తీసుకువచ్చి కపిలముని కోపానికి భస్మం అయిన తన పితరులను ఉద్ధరించెను. అలాగే పరాశరముని వంటి మునులు విష్ణుపురాణం, రామాయణం, భాగవతం వంటి గ్రంథాలను రచించి భగవంతుని జ్ఞానం లేని నా వంటి వారిని లక్ష్మీకాంతుడైన శ్రీనివాసుని యొక్క దయ అనే దివ్యమైన గంగలో తడిపి వైకుంఠం వెళ్లడానికి అర్హులను చేసిరి.

"పెద్ద చెరువు నుండి కాలువ ద్వారా నీరు వచ్చి పంటలు ఎండిపోకుండా కాపాడినట్లు, శ్రీనివాసుని దయ అనే చెరువు నుండి విష్వక్సేనుడు వచ్చి అందరి విఘ్నాలను తొలగించి, ఆ దయను పంచి రక్షిస్తున్నాడు. ఆ విష్వక్సేనునికి నేను ప్రణామాలు చేస్తున్నాను. ఒక

తల్లి తన బిడ్డకు తన పాలను ఇచ్చి పోషించినట్లు, సమస్త ప్రాణులకు తల్లి అయిన లక్ష్మీదేవి జ్ఞానం అనే పాలను ఇచ్చి మన అందరిని వైకుంఠానికి పంపుతుంది. శ్రీనివాసుని యొక్క ఓ దయాదేవీ! అంజనాద్రి పర్వతమునకు అధిపతి అయిన శ్రీనివాసుని నీవు ఆనందింపజేస్తున్నావు. నేను చేసిన పాపాల నుండి నన్ను రక్షింపమని నిన్ను ప్రార్థిస్తున్నాను. శ్రీనివాసుని వద్ద ఉండే ఓ దయాదేవీ! బద్ధజీవులు చేసిన పాపాల నుండి వారిని ఉద్ధరించే దానివిగా నిన్ను శాస్త్రాలు తెలిసిన భక్తులు నిశ్చయించారు.

"ఓ దయాదేవీ! శ్రీనివాసునికి దయగలవాడు అని పేరు రావడానికి నీవే కారణం. అందువలన శ్రీనివాసుని వదిలి అందరూ నిన్నే ఆశ్రయిస్తున్నారు. పాపాలు నిన్ను చూసి భయపడి పారిపోతున్నాయి. జీవులు శ్రీనివాసుని ఆజ్ఞలను మరిచినప్పుడు శ్రీనివాసునికి కోపం వస్తుంది. శ్రీనివాసుడు తన కోపాన్ని శాంతింపచేసుకొనుటకు నిన్ను ఆశ్రయిస్తున్నాడు. ఓ దయాదేవీ! నీ యొక్క పెద్ద కడుపు నిండునట్లు నేను పెద్ద పెద్ద పాపాలను చేసితిని. నీవు ఆ పాపాలను తిని కడుపు నింపుకొనకుండా, చిన్నచిన్న పాపాలు చేసిన వారిని వెతుకుతున్నావు. నీవు అలా వెతికితే ఎలా జీవించగలవు? (ఓ దయాదేవీ! నీవు ఎంతో దయ కల దానివి, నేను ఎన్నో పెద్ద పెద్ద పాపాలను చేసిన వాడిని. అందువల్ల నీవు దయతో నా పాపాలను సంహరిస్తే నీకు సంతృప్తి కలుగును) ఓ దయాదేవీ! నేను పాపాత్ములందరికీ చక్రవర్తిని. నీవు సద్గుణాలకు (మంచి గుణాలకు) చక్రవర్తివి. ఇద్దరు చక్రవర్తులు ఒకచోట ఉండడం ప్రమాదకరం. కావున నీవు నన్ను ఓడించి నీ భర్తయగు వేంకటేశ్వరుని పాదాల వద్దకు చేర్చుము.

"ఓ దయాదేవీ! నీ కోరిక మేరకే భగవంతుడు వివిధ అవతారాలలో జీవులు చేసిన పాపముల వలన వారు అనేక జన్మలు పొందకుండా జీవులను రక్షిస్తున్నాడు. వేదాలు అనేక పుణ్య కార్యాల గురించి మరియు భగవంతుని గురించి తెలుపుచున్నవి.

అల్పబుద్ధి గలవారు పుణ్య కార్యాలను ఆచరించి సంసార సాగరంలో పడుతున్నారు. ఓ దయాదేవీ! నీ దయ కలవారే పుణ్య కార్యాలను వదిలి ఈ సంసార బంధనాల నుండి ముక్తి పొంది భగవంతుని సేవ చేయుదురు. మేఘాలు సముద్రం నుండి నీటిని గ్రహించి వర్ష రూపంలో సమస్త జీవులకు ఆనందాన్ని ఇస్తున్నాయి. ఓ దయాదేవీ! అలాగే నీవు శ్రీనివాసుడనే సాగరం నుండి సమస్త సద్గుణాలను స్వీకరించి తిరుమలకు వచ్చిన వారందరికీ శ్రీనివాసుని సద్గుణాలను పంచుతున్నావు. ఓ దయాదేవీ! చాతక పక్షులు చెరువుల, సరస్సుల, నదుల నీరును త్రాగక వర్షం నీటిని మాత్రమే త్రాగి తమ దాహాన్ని తీర్చుకుంటున్నట్లు, వేదాల సారం తెలిసిన భక్తులు దేవతలను ఆశ్రయించక నిన్ను మాత్రమే ఆశ్రయించి శ్రీనివాసుని చేరుతున్నారు.”

శ్రీ ప్రతివాది భయంకర అణ్ణన్

ప్రతివాది భయంకర అణ్ణన్ తమిళనాడులోని కాంచీపురం వద్దఉన్న ‘హస్తిగిరినాథర్ అణ్ణన్’ అనే గ్రామంలో 1361లో జన్మించిరి. శ్రీసాంప్రదాయంలోని ‘మణవాళ మహాముని’ అనే ఆచార్యుని వద్ద వీరు దీక్షను తీసుకున్నారు. ఈ మణవాళ మహాముని ఆదిశేషుల అవతారం.

ఈయన 29 శ్లోకాలున్న వేంకటేశ్వర సుప్రభాతాన్ని, 11 శ్లోకాలున్న వేంకటేశ్వర స్తోత్రాన్ని, 16 శ్లోకాలున్న వేంకటేశ్వర ప్రపత్తిని, 14 శ్లోకాలున్న వేంకటేశ్వర మంగళాశాసనాన్ని రచించారు. వీటిని వేంకటేశ్వర స్వామిని ఉదయం నిద్ర మేల్కొలిపే సమయంలో పఠిస్తారు.

వేంకటేశ్వర స్తోత్రంలోని కొన్ని శ్లోకాల భావం: “ఓ వేంకటేశ్వర స్వామీ! నీవు శ్రీదేవిని ఆలింగనం చేసుకోవడం వలన శ్రీదేవి చనులకు ఉన్న కుంకుమ నీకు అంటుకుని నీ శరీరము ఎర్రగా అయినది. ఈ జగత్తుకు నాయకుడవు అయిన నీకు జయము జయము. బ్రహ్మ,

శివుడు, కుమారస్వామి మొదలగు సమస్త దేవతలకు నీవు స్వామివి. శరణువేడిన వారిని నీవు దయతో రక్షిస్తావు. ఓ వేంకటేశ్వర స్వామీ! నన్ను రక్షించుము. ఓ శ్రీహరీ! చేయరాని పాపములను నేను ఎన్నోసార్లు చేసితిని. ఆ తప్పులను క్షమించి ఈ మూర్ఖుడిని త్వరగా కాపాడుము. ఓ స్వామీ! నీవు మేము కోరిన వరాలకంటే ఎక్కువ వరాలను ఇచ్చే వాడవు. శివుడు, బ్రహ్మాది దేవతలకంటే ఉన్నతుడవని నిన్ను వేదాలు కీర్తిస్తున్నాయి.

"ఓ గోపాలస్వామీ! మనోహరమగు నీ వేణు గానానికి గోపికలు నీ చుట్టూ చేరిరి. కోటి మన్మథుల సౌందర్యాన్ని కలిగిన నీవు సమస్త గోపికలకు ఆనందాన్ని కలిగించితివి. ఓ వాసుదేవా! నీవు తప్ప నాకు వేరేవరూ లేరు. మంచి గుణములు కలిగిన ఓ దాశరథీ! (శ్రీరామా!) భూదేవి పుత్రికయగు సీతాదేవికి నీవు ఎంతో ఇష్టమైన మనోహరుడవు. రావణాసురునివంటి అంధకారానికి నీవు సూర్యుని వంటి వాడవు. ఓ రఘురామా! మహానుభావా! నేను నిన్ను శరణు వేడుతున్నాను. నన్ను రక్షింపుము. ఓ వేంటేశ్వర స్వామీ! నేను ఎంతో దూరం నుండి వచ్చి నీ పాదాలను భక్తితో సేవిస్తున్నాను. నేను నిన్ను ఒకసారి సేవించినా ఆ సేవకు నిత్యం సేవించిన ఫలితాన్నిమ్ము."

శ్రీ వేంకటేశ్వర ప్రపత్తిలోని కొన్ని శ్లోకాల భావం: "ఈ లోకానికి యజమానురాలు, వేంకటేశ్వర స్వామికి ప్రియురాలు, స్వామి ఓర్పును పెంచినది, చేతిలో పద్మమును ధరించి పద్మాసనంలో ఆసీనురాలైన లక్ష్మీదేవికి నేను నమస్కరించుచున్నాను. లక్ష్మీదేవి తన చిగురుటాకుల వంటి చేతులతో ప్రేమ మరియు గౌరవంతో మెల్లగా వత్తినను కమిలిపోయేటటువంటి వేంకటేశ్వర స్వామి యొక్క సుకుమారమైన పాదాలకు నేను శరణాగతి పొందుచున్నాను. ఓ వేంకటేశ్వర స్వామీ! నీవు ధరించిన సువాసన వెదజల్లే పూలమాల, నీ పాదాలకు తగిలినందువలన ఆ సువాసన వచ్చే మాలకు మరింత సుగంధం వచ్చింది. చూడడానికి ఎంతో అందంగా ఉన్న ఆ పాదాలకు నేను శరణాగతి పొందుచున్నాను.

ధ్వజము, గొడుగు, అమృత కలశము, వజ్రము, అంకుశము, పద్మము, కల్పవృక్షము, శంఖము, చక్రము మొదలగు గుర్తులు ఉన్న వేంకటేశ్వర స్వామి పాదాలకు నేను శరణాగతి పొందుతున్నాను. ప్రతిదినము బ్రహ్మ, శివుడు, ఇంద్రాది దేవతలు తమ కిరీటాలచే నమస్కరించినప్పుడు ఆ కిరీటాలకు ఉండే రత్నాల కాంతిచే మంగళహారతిని పొందుతున్నట్లు ఉన్న స్వామివారి పాదాలకు నేను శరణాగతి పొందుచున్నాను. ఓ వేంకటేశ్వర స్వామీ! నీవు అర్జునునికి రథసారథిగా ఉండి ఉపదేశం చేసి "నాకు శరణాగతి పొందుము" అని చెప్పావు. ఇప్పుడు నాకోసం మళ్లీ ఇక్కడ నిలబడి "నా పాదాలకు శరణాగతి పొందుము" అని నీ చేతితో చూపిస్తున్న ఆ పాదాలకు నేను శరణాగతి పొందుచున్నాను.

శ్రీ వేంకటేశ్వర మంగళాశాసనంలోని కొన్ని శ్లోకాల భావం: "లక్ష్మీదేవికి భర్త, సమస్త శుభాలకు సంపద వంటి వాడు, కోర్కెలు గలవారి పెన్నిధి అయిన శ్రీ వేంకటాచలమున నివసించు శ్రీనివాసునికి మంగళమగుగాక! (శుభం కలుగుగాక!). లక్ష్మీదేవిని ఆశ్చర్యంతో చూసే సుందరమగు నేత్రాలు కలవాడు, తన సౌందర్యంతో సమస్త జనులను మోహింపజేసే వేంకటేశ్వర స్వామికి శుభం కలుగుగాక! నాశనం లేనివాడు, దోషము లేనివాడు, సచ్చిదానంద స్వరూపుడు, మంచి గుణాలు కలవాడు, అన్నీ తెలిసినవాడు, ఏదైనా చేయగలవాడు అగు వేంకటేశ్వర స్వామికి శుభం కలుగుగాక!

మానవులందరికీ తన పాదాలే శరణం అని తన పాదాలను కుడి చేతితో చూపిస్తున్నవాడు, తాను ధరించిన పూలమాలలు, ఆభరణాలు, పీతాంబరం, ఆయుధాల వంటి వాటన్నిటికీ అందాన్ని కలిగించిన వేంకటేశ్వర స్వామికి శుభం కలుగుగాక! వైకుంఠంలో నివసించడం ఇష్టం లేక స్వామి పుష్కరిణి తీరంలో లక్ష్మీదేవితో క్రీడించే వేంకటేశ్వర స్వామికి శుభం కలుగుగాక! మణవాళ మహాముని మనసులో మరియు సమస్త లోకాలలో నివసించు శ్రీనివాసునకు శుభం కలుగుగాక! మా పూర్వాచార్యులు కీర్తించి పూజించిన వేంకటేశ్వర స్వామికి

శుభం కలుగుగాక!" సుప్రభాతం కొరకు 48వ పేజీలోని దర్శనంలో చూడగలరు

శ్రీ అన్నమాచార్య

తాళ్లపాక అనే గ్రామంలో జనమేజయ మహారాజు నిర్మించిన చెన్నకేశవ స్వామి మందిరం ఉన్నది. చెన్నకేశవ మందిరం యొక్క పూజారి అయిన విఠలయ్య వ్యవసాయం కూడా చేసేవాడు. విఠలయ్య తన ఏకైక కుమారుడైన నారాయణయ్యను చదువు కోసం సమీపంలో ఉన్న వుటకూరు పంపించెను.

నారాయణయ్య యొక్క గురువు దుర్వాస ముని వలె కోపం కలవాడు. నారాయణయ్యకు జ్ఞాపకశక్తి తక్కువ. గురువు పెట్టే బాధలకు నారాయణయ్య చనిపోవాలనుకున్నాడు. ఊరి పొలిమేరలో చింతలమ్మ గుడి వద్ద ఉన్న పుట్టలో పాము ఉన్నదని చూసినవాళ్లు చెప్పుకొనుచుండగా నారాయణయ్య విన్నాడు. నారాయణయ్య పాముకాటుతో మరణించాలని తలచి ఒకరోజు రాత్రి వెళ్లి పుట్టలో చెయ్యి పెట్టాడు. చింతలమ్మ ప్రత్యక్షమై "నీవు ఎందుకు చనిపోవాలని అనుకుంటున్నావు?" అని అడిగింది. తన గురించి, తన గురువు గురించి నారాయణయ్య తెలిపాడు. చింతలమ్మ "నీవు గొప్ప పండితుడవు అవుతావు, అంతేకాక నీ మనుమడు వేంకటేశ్వర స్వామి యొక్క భక్తుడు అవుతాడు" అని అతడిని దీవించింది. కాలక్రమేణా నారాయణయ్య పండితుడు అయ్యాడు. నారాయణయ్యకు వివాహం అయ్యాక ఒక కుమారుడు జన్మించాడు. ఆ కుమారునికి నారాయణసూరి అని పేరు పెట్టాడు.

నారాయణసూరికి లక్కమాంబతో వివాహం జరిగింది. వీరికి సంతానం లేనందువలన వేంకటాచలం వెళ్లి వేంకటేశ్వర స్వామిని "నీ భక్తుడయ్యే పుత్రుడిని ప్రసాదించమని" ప్రార్థించిరి. వేంకటేశ్వర స్వామి దయవలన వీరికి 1408 మే 9న విష్ణు ఖడ్గమైన నంద కటారి

కుమారునిగా జన్మించెను. నారాయణసూరి, తనకు జన్మించిన కుమారునికి అన్నమయ్య అని పేరు పెట్టిరి.

అన్నమయ్య యొక్క తల్లి లక్కమాంబ మరియు ఇంటిలోని పెద్దలు అన్నమయ్యకు భారతం, రామాయణం, భాగవతం, వేంకటేశ్వర స్వామి మహాత్మ్యం వంటి కథలను తెలిపేవారు. అన్నమయ్య ఆటలు ఆడుతూ స్నేహితులతో తిరుగుతూ ఉండేవాడు. ఆయనకు ఎనిమిది సంవత్సరాల వయసులో ఒకరోజు అన్నమయ్యను గడ్డిని కోసుకొని రమ్మని తల్లిదండ్రులు కొడవలిని ఇచ్చి పంపించిరి. అన్నమయ్య గడ్డి కోస్తూ ఉండగా వేలు తెగినది. ఆ సందర్భంలో అటువైపుగా కొంతమంది భక్తులు వేంకటాచలం (తిరుమల) వెళ్లుచుండిరి. అన్నమయ్య వారితోపాటు వేంకటాచలం వెళ్లి అక్కడ వివిధ తీర్థాలలో స్నానం చేస్తూ వేంకటేశ్వర స్వామిని దర్శిస్తూ కీర్తిస్తూ ఉండెను.

అన్నమయ్య కనపడకపోవడంతో ఆయన తల్లిదండ్రులు అన్నమయ్యను వెతుకుతూ వేంకటాచలం వెళ్ళిరి. వేంకటాచలంలో అన్నమయ్యను చూసి, అతడిని ఇంటికి రమ్మనగా ఆయన రాననెను. నారాయణసూరి "తన కుమారుడు ఇంటికి వచ్చేటట్లు చేయమని" వేంకటేశ్వర స్వామిని ప్రార్థించగా ఆ రోజు రాత్రి వేంకటేశ్వర స్వామి అన్నమయ్య కలలో కనిపించి "నీవు ఇంటికి వెళ్లి వివాహం చేసుకొని నా గురించి అంతటా తిరుగుతూ ప్రచారం చేయమని" తెలిపెను. అన్నమయ్య వేంకటేశ్వర స్వామి తెలిపినట్లు ఇంటికి వెళ్లి కొన్ని సంవత్సరాల తరువాత అక్కలమ్మ, తిరుమలమ్మ అనే ఇద్దరిని వివాహం చేసుకున్నాడు. అన్నమాచార్య ఆంధ్ర, తమిళనాడు పరిసర ప్రాంతాలలో తిరుగుతూ వేంకటేశ్వర స్వామి గురించి ప్రచారం చేసెను.

అన్నమాచార్య అహోబిలంలోని శ్రీ శఠగోపముని అనే శ్రీ వైష్ణవ ఆచార్యుల వద్ద వైష్ణవ సిద్ధాంతాన్ని నేర్చుకొని దీక్ష స్వీకరించారు. అన్నమాచార్య తన గురువగు శఠగోపమునిని కీర్తిస్తూ ఒక కీర్తనను

ఈ విధముగా వ్రాసెను: "మోక్షానికి దారిని చూపించేవారు, భక్తులందరికీ సులభమైనవారు, హరికి ప్రియమైనవారు అగు శఠగోపమునిని దర్శించండి. శ్రీరంగనాథునికి, వరదరాజ స్వామికి, వేంకటేశ్వర స్వామికి, అహోబిలంలోని నరసింహ స్వామికి సేవ చేయడంలో శ్రద్ధగల శఠగోపమునిని అందరూ దర్శించండి, ప్రణామాలు చేయండి."

వేంకటేశ్వర స్వామి కీర్తనలు : అన్నమాచార్య వేంకటేశ్వర స్వామి మీద అనేకమైన కీర్తనలను రచించారు. అందులోని కొన్ని కీర్తనల భావం:

"పద్మముల వంటి నేత్రాలతో, చిరునవ్వుతో ప్రకాశించే ఎంతో అందమైన శరీరం కలవాడు ఆ పరంధాముడు. పట్టు ధోవతిపై నిగనిగలడే నందక ఖడ్గం, నాభియందు కమలం, శంఖ చక్రాలతో ఉన్న చేతులు, వక్షస్థలంలో ఉన్న కౌస్తుభమణి, మెడలో ప్రకాశిస్తున్న రత్నాల హారాలు, బంగారు హారాలు, మేలైన భుజకీర్తులు, తెల్లని ముత్యాలహారం, శిరస్సున వజ్రాల కిరీటంతో వేంకటేశ్వర స్వామి ఎంతో సౌందర్యంగా వెలుగొందుతున్నాడు."

"వేంకటేశ్వరా! నా కోరికలను తీర్చుకొనుటకు నీ నామమే చాలును. నన్ను పవిత్రుని చేయుటకు నీ తీర్థమే (చరణామృతం) చాలును. నాలోని పాపాలు పోవుటకు నీ ప్రసాదమే చాలును. నన్ను గొప్పవాడిని చేయుటకు నీ సేవ చాలును. నన్ను రక్షించుటకు నా శరీరం మీద ఉన్న నీ తిలకాల గుర్తులు చాలును. చక్కటి సుఖానికి నిన్ను స్మరించుటయే చాలును. నన్ను అన్ని రకములుగా రక్షించుటకు నీవుండగా నేను వేరొకరిని వెదకుట అనవసరము."

"ఓ వేంకటేశ్వర స్వామీ! తెల్లవారుతున్నది. వింత వింతలైన మా కోరికలను వినడానికి మేల్కొనుము. నిన్ను సేవించడానికి దేవతలు, మునులు వచ్చారు. (వారి సేవలను స్వీకరించడానికి) పద్మముల వంటి నీ కనులను తెరిచి మేల్కొనుము. గంధర్వులు, కిన్నెరులు, యక్షులు

నిన్ను కీర్తిస్తున్నారు. (ఆ కీర్తనలను వినడానికి మేల్కొనుము) ఆది శేషుడు, తుంబురుడు, నారదుడు మరియు బ్రహ్మ మొదలగు వారు మీ పాదాలకు మ్రొక్కుటకు వేచి ఉన్నారు. (వారి నమస్కారాలను స్వీకరించడానికి) జగన్మాత అయిన అలమేలుమంగను కన్నులారా చూసి మేల్కొనుము."

"వేంకటేశ్వర స్వామి చెయ్యి ఎందరికో అభయం ఇచ్చినది. మత్స్యావతారంలో బ్రహ్మ దేవునికి వేదాలను వెతికి తెచ్చి ఇచ్చిన చెయ్యి. కూర్మావతారంలో మందర పర్వతాన్ని పైకెత్తి కూర్మ భగవంతుని వీపు మీద ఉంచిన చెయ్యి. వరాహావతారంలో భూదేవిని కౌగిలించుకున్న చెయ్యి. నరసింహావతారంలో పదునైన గోళ్లు గల చెయ్యి. వామనావతారంలో బలి చక్రవర్తి నుండి దానం తీసుకున్న చెయ్యి. పరశురామావతారంలో ఎందరికో దానం చేసిన చెయ్యి. రామావతారంలో సముద్రాన్ని బాణం దగ్గరకు తీసుకువచ్చిన చెయ్యి. బలరామావతారంలో నాగలిని ధరించిన చెయ్యి. కృష్ణావతారంలో పురసతులను స్పర్శించిన చెయ్యి. కల్కి అవతారంలో ఖడ్గాన్ని ధరించే చెయ్యి."

"వేంకటేశ్వర స్వామి కొండలంత వరాలను ఇచ్చేవాడు. కుండలు చేసి జీవించే కుమ్మరి భక్తునికి (భీమునికి) కోరిన మోక్షాన్ని ఇచ్చినవాడు. తొండమానుడు రమ్మనిన చోటుకు వెళ్లినవాడు. అనంతాచార్య త్రవ్విన మట్టిని మోసినవాడు. తిరుమలనంబి కోరిన విధంగా మాట్లాడిన వాడు. కంచి వరదరాజ స్వామి భక్తుడు, తిరుక్కచ్చి నంబిని తన దగ్గరకు రప్పించినవాడు. తనను స్మరించిన వారిని దయతో రక్షించేవాడు."

"నారాయణా! నీకు నమస్కారము. నారద మునిచే, శివునిచే స్తుతింపబడిన వాడవైన నీకు నమస్కారము. మురుడనే రాక్షసుని సంహరించినవాడా! ముకుందమను మణిని ధరించినవాడా! శ్రీదేవికి భర్త అయినవాడా! గరుత్మంతుని వాహనముగా

కలిగినవాడా! పద్మము వంటి నాభి కమలం గలవాడా! పురుషులలో ఉత్తముడా! బద్ధజీవుల సంసార బంధనాలను విడిపించువాడా! నీకు నమస్కారము. సూర్యచంద్రులు నేత్రములుగా కలవాడా! బ్రహ్మ దేవునిచే స్తుతింపబడినవాడా! క్షీర సముద్రంలో శయనించువాడా! బలి చక్రవర్తిని బంధించినవాడా! గోపికలకు ప్రియమైనవాడా! దేవతలందరికంటే ప్రధానమైన దేవుడా! నాలుగు వేదాలచే స్తుతింపబడినవాడా! నాయందు దయ గలవాడా ఓ వేంకటేశ్వరా! నీకు నా నమస్కారము."

"వేంకటేశ్వరుని పాదాలను బ్రహ్మ కడిగెను (అభిషేకం చేసెను). వామనావతారంలో భూమిని కొలిచినది ఆ పాదం. బలి చక్రవర్తి తలపై ఉంచినది ఆ పాదం. ఆకాశమును ఆక్రమించినది ఆ పాదం. ఇంద్రుడిని రక్షించిన పాదాలు. ఆహల్య పాపమును పోగొట్టిన పాదాలు, కాళీయ నాగుని శిరములపై నాట్యమాడిన పాదాలు. లక్ష్మీ దేవి సేవ చేసే పాదాలు. యోగులను రక్షించిన పాదాలు. శ్రేష్ఠమైన వేంకటగిరిలో స్థిరమైన ఆ పాదాలు మోక్షాన్ని ఇచ్చును."

శ్రీకృష్ణుని కీర్తనలు : అన్నమాచార్య కృష్ణుని మీద అనేకమైన కీర్తనలను రచించారు. అందులోని కొన్ని కీర్తనల భావం:

"యశోద మాతకు అర్ధరాత్రి వేళలో ఒక కుమారుడు జన్మించెను. అతను పూతన చనుబాలను త్రాగాడు, ఆవులను కాసెను, బండిని తన్నాడు, మద్ది చెట్లను పడవేసెను, చిటికెన వ్రేలుతో కొండను ఎత్తాడు, గోపికలతో రాసలీలలు చేసెను. అతడు మురళిని ధరించినవాడు, కాళీయ నాగు యొక్క అహంకారాన్ని అణచినవాడు, కంసుని సంహరించినవాడు, దేవతలను పరిపాలించి తన అధికారాన్ని చూపినవాడు, 16,000 మంది రాణులను పోషించినవాడు."

"ఓ యశోదమ్మా! కృష్ణుని శరీరాన్ని ఊపవద్దు, అలా ఊపితే కడుపులోని లోకాలు కదిలిపోతాయి. మరిగే పాలు పొంగుతున్నాయి. ఆ పాల దగ్గర ఉన్న కృష్ణుడిని దూరంగా తీసుకువెళ్లండి. మా

బాలకృష్ణుని యొక్క సన్ననైన నడుము దగ్గర పట్టుకొని పైకి లేపితే పొట్టలోని లోకాలు అణిగిపోతాయి, అందువలన అలా లేపవద్దు. ఓ అమ్మా! ఈ విధంగా కృష్ణుడిని బాధపెట్టక ఉయ్యాలలో పరుండబెట్టుము. వేంకటాచలంలో ఉన్న వేంకటేశ్వరున్ని (కృష్ణుడిని) మీ కఠినమైన మాటలతో దండించవద్దు."

"ఓ కృష్ణా! బృందావనంలోని గోవర్ధన పర్వతమును నీవు చిటికెన వ్రేలుతో ఎత్తినా, నీ శక్తిని గోపికలు గ్రహించలేక నీ మీద చాడీలు చెప్పేవారు. ఈ చిన్ని కృష్ణుడు దేవకికి జన్మించి, యశోద దగ్గరకు శిశువుగా పెరుగుటకు వచ్చెను. పదునాలుగు లోకాలను సృష్టించిన బ్రహ్మకు ఈ బాల కృష్ణుడు తండ్రి. అనేకసార్లు కృష్ణుడు ఎగిరి ఎగిరి వుట్ల మీది వెన్నకుండలను పగులగొట్టేవాడు. ఒక గోపిక కృష్ణుని కొట్టడానికి వెళితే, ఇంకొక గోపిక 'ఓ అమ్మా! కృష్ణుని కొట్టవద్దు. అంత అందమైన ఆ కృష్ణుని రూపాన్ని చూస్తుంటే నీకు ఎలా కొట్టాలనిపిస్తుంది'? అని మందలించెను. రేపల్లెలోని అందరి ఇండ్లలోని వెన్నలను తిని కృష్ణుడు సాయంత్రానికి ఇంటికి వచ్చేవాడు. గోపికలు కృష్ణుని మీద ఫిర్యాదులు చేసేవారు. గోపికల ఫిర్యాదులను విన్న యశోదమ్మ సాయంత్రానికి ఇంటికి వచ్చిన కృష్ణుని కోపంతో కొట్టడానికి వెళితే, కృష్ణుడు 'అమ్మా! అమ్మా! నన్ను కొట్టవద్దు. నేను ఎలాంటి తప్పు పని చేయలేదు' అంటూ యశోదమ్మ కాళ్లకు మొక్కుతాడు. కొన్నిమార్లు అనేకమంది గోపిక స్త్రీలు నల్లనయ్య మీద ఫిర్యాదు చేయడానికి రాగా ఏమీ తెలియని అమాయకునివలె యశోదమ్మ వద్ద పాలు త్రాగుచుండేవాడు. సర్వమునకు మూలకారణుడైనట్టి ముద్దులు కురిపించు కృష్ణుడు ఇప్పుడు వేంకటాచలంలో వేంకటేశ్వర స్వామిగా వెలిశాడు."

"ఉయ్యాలలో ఉన్న చిన్నికృష్ణుని గొల్లభామలు చూసి ఆ ఉయ్యాల దగ్గరకు వచ్చి ఆ ఉయ్యాలను ముందుకు వెనుకకు ఊపసాగిరి. అప్పుడే యవ్వనంలోనికి వచ్చిన గోపికలు బంగారు

ఉయ్యాల దగ్గరకు వచ్చి పసిపిల్లలు నిద్రించేటప్పుడు పాడే పాటలను పాడుతూ 'లాలి లాలి లాలమ్మ' అని పాటలు పాడిరి. తామరపువ్వుల రేకుల వంటి కనులు గల గోపికలు కాలిగజ్జలు ధిమి ధిమి ధిమి అని చప్పుడు చేస్తుండగా వేంకటేశ్వరున్ని (బాల కృష్ణున్ని) చేరి ఆడుచుండిరి."

శ్రీరాముని కీర్తనలు : అన్నమాచార్య శ్రీరాముని గురించి అనేకమైన కీర్తనలను రచించారు అందులోని ఒక కీర్తన భావం:

"నీటికి ఆధారమైన సముద్రుడిని భయపెట్టి లక్ష్మణునికి ఆనందాన్ని కలిగించిన ఓ రామా! శివుని ధనుస్సు విరిచి సీతాదేవిని వివాహం చేసుకున్న ఓ రామా! సుగ్రీవుని రక్షించి కోసల దేశమును (అయోధ్యను) పరిపాలించిన రామా! విశ్వామిత్ర ముని యజ్ఞాన్ని రక్షించిన ఓ కౌసల్య కుమారుడా! రామా! నీకు జయము జయము. నీ శత్రువు అయిన రావణాసురుని సంహరించిన రామా! సూర్యవంశంలో జన్మించిన ఓ రామా! ధనుస్సును ధరించి మునులను రక్షించిన రామా! అహల్యను ఉద్ధరించిన రామా! శివుని భార్య పార్వతి దేవిచే స్తుతింపబడిన రామా! నీ ప్రతాపముతో మాయలేడిని సంహరించిన రామా! లవకుశులకు ప్రియమైన రామా! మంచి గుణాలు కలిగిన రామా! నా మనసులో శాశ్వతంగా నిలచిన రామా! మన్మథునికంటే అందమైన రామా! ఎల్లప్పుడూ భక్తుల మనస్సులలో ఉండే రామా! అందమైన అయోధ్యలో నివసించే రాముడు ఇప్పుడు వేంకటేశ్వర స్వామిగా మన ఎదుట ఉన్నాడు. ఆ వేంకటేశ్వర స్వామికి నమస్కరించి సేవించండి."

హరి నామం గురించి : అన్నమాచార్య హరి నామం మీద ఎన్నో కీర్తనలను వ్రాశారు. అందులోని కొన్ని కీర్తనల భావం:

"వేంకటేశ్వరా! నీ నామమే మాకు ఆధారం. అదే పాతిపెట్టబడిన సొమ్ము. నీ నామమే జీవునికి నీకు తేడా తెలుపును. వేంకటేశ్వర,

గోవింద, శ్రీధర, పద్మనాభ, దామోదర, కృష్ణ వంటి నీ నామాలకు నా నమస్కారములు."

"అన్ని మంత్రములు వేంకటేశ్వర మంత్రములోనే ఉన్నవి. నారాయణ మంత్రమును నారదముని ఎల్లప్పుడూ కీర్తించును. హిరణ్యకశిపుని కుమారుడు ప్రహ్లాదునికి నరసింహ మంత్రము లభించెను. విభీషణునికి శ్రీరామ మంత్రము లభించెను. ధ్రువునికి వాసుదేవ మంత్రము లభించెను. శ్రీకృష్ణ మంత్రము అర్జునునికి లభించెను. నారాయణుడే తన ఎదుట ఉన్నట్లు భావించి వ్యాసుని కుమారుడైన శుకుడు 'ఓం నమో నారాయణాయ' అను మంత్రమును జపించెను. నా గురువైన శఠగోపముని ద్వారా నాకు వెన్నెల వంటి వేంకటేశ్వర మంత్రము లభించెను."

"భక్తులారా! ఆకలైన వేళ, అలసిపోయిన వేళ, ఇతరులు బంధించిన వేళ, అందమైన ప్రకాశవంతమైన శ్రీహరి నామమే గతి. వేరొక గతి లేదు. ఆపదలలో ఉన్నప్పుడు, ఇతరులు అవమానించినప్పుడు, పాపములు చేసినప్పుడు, భయము కలిగినప్పుడు, హరి నామమే గతి. శ్రీహరి నామాన్ని వదిలి ఇతర మార్గాలను వెతికినప్పటికీ వేరే గమ్యమేమీ లభించదు. సంకెళ్ళతో బంధించిన వేళ, ఇతరులు చంపుటకు వచ్చిన వేళ, అప్పుల వారు హింసించిన వేళ వేంకటేశ్వర నామమే నిన్ను అన్ని కష్టముల నుండి విడిపించును. మూర్ఖ బుద్ధితో నీవు వేరొక మంత్రమును వెతికినా (జపించినా) నీకు వేరే దారి లేదు."

"భక్తులారా! బాధ, కోపము, కష్టాలను నశింపజేసే వేంకటేశ్వరుని యొక్క నామం అందరికి సంతోషాన్ని కలిగించును. హరినామం సమస్త ప్రాణులను రక్షించును. అందువలన వేదాల కంటే గొప్పదైన హరినామాన్ని ఎల్లప్పుడూ జపించండి. హరినామం అందరికీ అందుబాటులో ఉంటుంది. ఇది మోక్షాన్ని ఇస్తుంది. బ్రహ్మ ఎల్లప్పుడూ హరినామాన్ని జపిస్తుంటాడు. హిమవంతుని కూతురు పార్వతీదేవి

ఈ హరినామాన్ని మనసులో తలచుచుండును. హరినామం అనే అమృతం మీకు చాలదా? అంతకంటే రుచిని ఇచ్చేది ఏది ఉన్నది? జన్మ మృత్యువులను తొలగించుటకు, పదివేల నరక కూపములను పోగొట్టుకొనుటకు, దరిద్రము, దోషములు తొలగించుకొనుటకు, పాపాల చీకటిని పారద్రోలుటకు కల్పవృక్షం (కోరిన కోరికలను తీర్చే చెట్టు) వంటి హరినామము సరిపోవును."

కలియుగ చదువులు : కలియుగ చదువుల గురించి అన్నమాచార్య ఒక కీర్తన వ్రాసిరి ఆ కీర్తన భావం.

"ఈ కలియుగంలో ఏ రోజు చదువు ఆ రోజుకే పరిమితం. (ఈ జన్మలో చదివినది ఈ జన్మకే, వచ్చే జన్మలో చదివినది వచ్చే జన్మకే). భగవంతుని తెలుసుకొనుటకే వెనుకటి తరంవారు చదువుకున్నారు. వేంకటేశ్వరుని మరిచిపోవడానికే కలియుగంలో చదువుతున్నారు. పుట్టించినవాడిని (భగవంతుడిని) ధిక్కరించుటకే కలియుగంలోని చదువు పనిచేస్తుంది. వేంకటేశ్వరుని దర్శించుటకే బ్రాహ్మణులు చదువుకున్నారు. సంపదలను మరియు భౌతిక సుఖాలను ఇచ్చే చదువులు వేంకటేశ్వరుని మరచుటకే ఉన్నాయి. విష్ణువును మనసులో నెలకొనునట్లు చెయ్యలేని చదువు పనికిమాలిన చదువే."

ఆధ్యాత్మిక కీర్తనలు : అన్నమాచార్య ఆధ్యాత్మిక జ్ఞానాన్ని బోధిస్తూ ఎన్నో కీర్తనలను వ్రాశారు. వాటిలోని కొన్ని కీర్తనల భావం:

"ప్రాణం ఉన్న మానవుడు ఎవరికి సంబంధించిన వాడు? ఎవరికి ఏమవుతాడు? ఈ జీవుడు (ఆత్మ) వెనుకటి జన్మలలో ఎందరికో జన్మించి కుమారుడు అయినాడు. ఎందరికో తోబుట్టువైనాడు. ఎందరికో చుట్టమయ్యాడు. ఈ జన్మలో ఎందరికో దుఃఖాన్ని కలిగిస్తున్నాడు. వచ్చే జన్మలో ఎందరికో దుఃఖాన్ని కలిగిస్తాడు. ఈ ఆత్మ ఎక్కడెక్కడ తిరుగుతుంది? ఎన్ని చోట్ల పుట్టి ఎంతమందిని బంధువులుగా చేసుకున్నాడు? రాబోవు జన్మలో ఈ ఆత్మ ఎక్కడికి

వెళ్లును? ఆలోచించి చూస్తే ఆత్మకు స్థిరమైన స్థలం లేదు. ఆత్మ ధరించిన శరీరాలు నశిస్తున్నాయి. కానీ జీవాత్మ (ఆత్మ) నశించడం లేదు. వేంకటేశ్వరుని మాయకులోనైన ఈ జీవాత్మ ఎన్నెన్నో జన్మలను పొంది కుమారుడు, సోదరుడు, తండ్రి, తాత, ఇలాంటి పదవులను పొందుతున్నాడు."

"పుట్టుట నిజము, మరణించుట నిజము, నట్టనడుమ బ్రతికేది నాటకము. తినునది అన్నము, చుట్టుకొన్నది బట్ట. ఆ రెండింటి కొరకు చేయు పోరాటము నాటకము. ఈ ఆత్మ ఎవరెవరికి సంబంధించినది? ఎవరికి ఏమవుతుంది? అందువలన ఆత్మ మరియు ఈ ప్రపంచం గురించి తెలుసుకొని మోక్షాన్ని పొందుము."

"స్వప్నంలోని కలలవలె సంపదలు అశాశ్వతమైనవి. కుటుంబ ప్రేమలు ఆకాశంలోని మెరుపుల వంటివి. ఓ మనసా! తాత్కాలికమైన ఆనందాలకు బానిసవు కావద్దు. ఈ ప్రపంచం నశించేది. ఈ ప్రపంచం అందరినీ మోహింపజేయుచున్నది. శరీరం ముసలిది అవుతుంది గాని మనసు మాత్రం యవ్వనంలోనే ఉండి కోరికలను కలుగజేస్తుంది. ఓ మనసా! (జీవుడా) సాయంకాలములే మరణములు, ఉదయాలే జన్మములు. ఓ జీవుడా! నీకు తృప్తి ఉంటే కొద్దిగా లభించినా తృప్తి కలుగుతుంది. తృప్తి లేకుంటే లోకమంతా లభించినా నీకు సరిపోదు. ఓ జీవుడా! యవ్వనంలోని కోరికలను తీర్చుకొనుట నీ తరం కాదు. చెరువులోని నీరు ఎంత ఉన్నా తామర మొక్క అంతకంటె పైకి వచ్చును. అలాగే నీ శక్తి ఎంత ఉంటే అంతకంటే ఎక్కువ కోరికలు నీకు కలుగును. కోరికలను తీర్చుకొనుటకు జీవితమంతా పనిచేసినా అవి మిగిలే ఉండును. కనుక భౌతికమైన కోరికలను వదిలి లక్ష్మీపతిని (వేంకటేశ్వర స్వామిని) శరణు వేడుము."

"వేంకటేశ్వరా! జీవితమనే ప్రయాణం చేసి చేసి (ఇన్ని దినాలు బ్రతికి) బాగా అలసిపోయితిని. ఇక ప్రయాణించే (జీవించాలని) ఓపిక లేదు. ఇక ఇప్పుడు నీవే రక్షింపుము. నేను కోరుకున్న

కోరికలు నీ అనుగ్రహం లేకపోతే తీరవు. పాపపుణ్యాలనే త్రాళ్లు ఈ జీవుని బంధించును. నీవు ఆ పాపపుణ్యాలను త్రెంపి మోక్షమును ప్రసాదించుము.

పెనుగొండను పరిపాలించే సాళ్వ నరసింహ రాయలు అన్నమాచార్యను తన ఆస్థానంలో గురువుగా నియమించుకున్నాడు. అన్నమాచార్య వేంకటేశ్వర స్వామి మరియు పద్మావతి దేవి గురించి కీర్తనలు పాడేవారు. ఈ కీర్తనలను విన్న నరసింహ రాయలు అన్నమాచార్యతో తన మీద కూడా ఒక కీర్తన పాడమన్నాడు. అన్నమాచార్య "హరి! హరి!" అంటూ చెవులు మూసుకొని "నాలుక ఉన్నది నారాయణుని స్తుతించుటకు, నరుని స్తుతించుటకు కాదు" అన్నాడు. ఈ తిరస్కార మాటలను విన్న నరసింహ రాయలు అన్నమాచార్యను సంకెళ్లతో బంధించి చెరసాలలో వేయించాడు."

చెరసాలలో అన్నమాచార్య వేంకటేశ్వర స్వామిని ప్రార్థిస్తూ కీర్తనలను పాడగానే సంకెళ్లు తెగిపోయాయి. ఈ విషయం సైనికులు రాజుకు తెలిపారు. రాజు నమ్మక, తానే స్వయంగా వచ్చి చూడగా సంకెళ్లు క్రింద పడి ఉండెను. తరువాత రాజు తానే స్వయంగా అన్నమాచార్యను సంకెళ్లతో బంధించెను. రాజు చూస్తుండగానే సంకెళ్లు ఊడిపోయాయి. అప్పుడు రాజు అన్నమాచార్య పాదాల మీద పడి తన తప్పును క్షమించమని ప్రార్థించెను. అన్నమాచార్య రాజును క్షమించి, భక్తులకు ఇలాంటి అవమానాలు చేయవద్దని ఉపదేశం చేసి, రాజుల వద్ద ఉండడం మంచిది కాదు అనుకొని తిరుమల వెళ్లి అక్కడ భక్తుల సాంగత్యం చేస్తూ వేంకటేశ్వర స్వామిని సేవించెను.

రాజులు మరియు ధనవంతుల అవసరం భక్తులకు లేదంటూ అన్నమాచార్య యొక్క కీర్తన:

"మేము (విష్ణు భక్తులము) విష్ణుమూర్తి యొక్క దాసులముగనుక పుట్టుకతోనే ఐశ్వర్యవంతులము. జన్మించిన తరువాత పదవులను పొంది ప్రభువులైన వారి ధనము మాకు అవసరంలేదు. మేము

లక్ష్మీ దేవి యొక్క భర్తను శరణు పొందినందున ఇతరుల ఐశ్వర్యాలతో మాకు పనిలేదు. వారు మాకు ధనం ఇవ్వనవసరం లేదు. ఈ భూమి మీద లభించే సమస్త సంపదలు భూదేవి నుండి లభించును. భూదేవి నారాయణుని భార్య. మేము నారాయణుని దాసులము. కావున నారాయణుడు మమ్మల్ని రక్షించి సమస్త సంపదలను ఇచ్చును. అందువలన ఇతరుల సంపదలు మాకు అవసరం లేదు. ఈ లోకంలోని పదవులను బ్రహ్మ ఇస్తాడు. బ్రహ్మ యొక్క తండ్రి నారాయణుడు. నారాయణుడే మాకు ప్రభువు. బ్రహ్మ నియమించిన ప్రభువులతో మాకు ఏమి పని? ఓ భక్తులారా! మీరు ఎన్ని పురాణాలైనా, ఏ శాస్త్రమైనా చదవండి. అందులో ఎక్కడ కూడా విష్ణుభక్తుడు నశించిన సందర్భం లేదు."

అన్నమాచార్య రచించిన 32 వేల కీర్తనలను ఆయన యొక్క పుత్రులు రాగిరేకులపై వ్రాయించి వేంకటేశ్వర స్వామి మందిరంలో భద్రపరిచారు. సంకీర్తనలు భద్రపరిచిన ఆ గదిని 'సంకీర్తన అర' అని అంటారు.

పూర్వం వేంకటేశ్వర స్వామికి ఉత్సవాల సమయంలో మాత్రమే కల్యాణం జరుగుతుండేది. అన్నమాచార్య నిత్యం కల్యాణం జరిగేటట్లు ఏర్పాటు చేశారు. ఇలా నిత్యకల్యాణం ప్రారంభించినందుకు వేంకటేశ్వర స్వామి అన్నమాచార్యను 'మామ' అని పిలిచాడు. అన్నమాచార్య 95 సంవత్సరాలు జీవించి 1503వ సంవత్సరంలో శరీరాన్ని వదిలి వైకుంఠానికి వెళ్లెను.

శ్రీపాదరాజ తీర్థులు (శ్రీపాదరాయులు)

మధ్వ సాంప్రదాయంలోని శ్రీపాదరాజ తీర్థులు 1412వ సంవత్సరంలో గిరిఅమ్మ మరియు శేషగిరిఅప్ప అనే దంపతులకు బెంగుళూరులోని 'అబ్బూరు' అనే గ్రామంలో జన్మించిరి. వీరి జన్మనామం 'లక్ష్మీనారాయణ' సన్యాసనామం 'శ్రీపాదరాజ తీర్థులు.'

చంద్రగిరిని పరిపాలించే సాళువ నరసింహులు శ్రీపాదరాజ తీర్థుల వారిని తిరుమలలోని వేంకటేశ్వర స్వామి సేవా బాధ్యతలను స్వీకరించమని ప్రార్థించగా శ్రీపాదరాజ తీర్థులు అంగీకరించి తన నుండి శిక్షణ పొందిన వ్యాసతీర్థులను తిరుమలలోని వేంకటేశ్వర స్వామి సేవా బాధ్యతలను స్వీకరించమని పంపించిరి.

శ్రీపాదరాజ తీర్థులు చాలాసార్లు వేంకటేశ్వర స్వామిని దర్శించి సేవించి ఎన్నో కీర్తనలను వ్రాసిరి. అందులోని కొన్ని కీర్తనల భావం:

"శేషాచలంలో నివసిస్తూ దర్శనమిచ్చే ఓ వేంకటేశ్వరా! నా నాలుకకు నీ హరి నామమే అలంకరణ, నా కాళ్లకు నీ ధామానికి నడిచి రావడమే అలంకరణ, నా చెవులకు నీ కథా శ్రవణమే అలంకరణ, నా చేతులకు నీకు సేవ చేయడమే అలంకరణ, మానవులకు గౌరవమే అలంకరణ, మునులకు జ్ఞానమే అలంకరణ, నీ మందిరానికి తులసి వనమే అలంకరణ, పతివ్రతకు భర్త సేవ చేయడమే అలంకరణ."

"దోషాలను తొలగించే ఓ వేంకటేశ్వరా! నీకు జయము జయము. మహిమలను చూపే ఓ వేంకటేశ్వరా! నీకు జయము జయము. లక్ష్మీదేవితో నివసించే ఓ వేంకటేశ్వరా! నీకు జయము జయము. బ్రహ్మ దేవుని తండ్రివైన ఓ వేంకటేశ్వరా! నీకు జయము జయము. గజేంద్రుని రక్షించిన ఓ వేంకటేశ్వరా! నీకు జయము జయము. అందరిని మోహింపజేసే సుందరమైన రూపంకల వేంకటేశ్వరా! నీకు జయము జయము."

"శ్రీనివాసా! నీవు జ్ఞానవంతులకు (భక్తులకు) దర్శనం ఇచ్చేవాడవు. అజ్ఞానులకు (భక్తి లేని వారికి) నీవు దర్శనం ఇవ్వవు. నీవు నీ భక్తుల హృదయంలో ప్రకాశిస్తావు, దీనులను ఉద్ధరిస్తావు, బద్ధ జీవుల కొరకు ఎన్నో అవతారాలను ధరించిన వాడవు, నిన్ను స్మరించిన వారి పాపాలను పారద్రోలి జన్మ మృత్యువుల నుండి కాపాడే వాడివి."

శ్రీ వ్యాసతీర్థులు

వ్యాస తీర్థులు కర్ణాటకలోని బన్నూరు అనే గ్రామంలో 1447వ సంవత్సరంలో మల్లన్న మరియు అక్కమ్మ అనే బ్రాహ్మణ దంపతులకు జన్మించిరి. మధ్వ సాంప్రదాయంలోని బ్రహ్మణ్య తీర్థుల వద్ద సన్యాసాన్ని స్వీకరించిరి. వీరి సన్యాసనామం 'వ్యాస తీర్థులు.'

చంద్రగిరిని పరిపాలించే సాళువ నరసింహులు మధ్వ సాంప్రదాయంలోని శ్రీపాదరాజ తీర్థుల వారిని తిరుమలలో వేంకటేశ్వర స్వామి సేవా బాధ్యతలను స్వీకరించమని ప్రార్థించగా శ్రీపాదరాజ తీర్థులు అంగీకరించి తన నుండి శిక్షణ పొందిన వ్యాస తీర్థులను తిరుమలలోని వేంకటేశ్వర స్వామి సేవా బాధ్యతలను స్వీకరించమని పంపించిరి. వ్యాస తీర్థులు శ్రీపాదరాజ తీర్థుల కోరిక మేరకు వేంకటేశ్వర స్వామి మందిర బాధ్యతలను స్వీకరించి, వేంకటేశ్వర స్వామిని 12 సంవత్సరాలు సేవించిరి.

వ్యాస తీర్థులు వేంకటేశ్వర స్వామిని ఈ విధముగా స్తుతించిరి: "వేంకటేశ్వర స్వామి పాదాలు ఆనందానికి నిలయం. ఆ పాదాలు బంగారు పట్టగొలుసులతో అలంకరించబడి ఉన్నాయి. ఆ పాదాలను అందరూ దర్శించి పూజించాలి.

"రెండు చేతులలో శంఖచక్రాలను ధరించి మూడవ చేతితో తన పాదాలను ఆశ్రయించమని చూపిస్తున్నాడు. నాలుగవ చేతితో మీకు ఎలాంటి భయం లేదని దీవిస్తున్నాడు.

"మాణిక్యకాంతిలా వెలుగుతున్న వేంకటేశ్వర స్వామి శిరమున కిరీటం, నుదుటన తిలకం, చెవులకు కుండలాలు, మెడలో శ్రీవత్సకౌస్తుభము, బంగారు ఆభరణాలతో, పట్టు పీతాంబరాలతో కోటి మన్మథులను కూడా ఆకర్షించే సుందరమైన రూపం గల ఆ స్వామిని నేను భజిస్తున్నాను."

శ్రీకృష్ణ చైతన్య మహాప్రభు

భగవంతుడు ఈ భౌతిక జగత్తులో ప్రతి యుగంలో అవతరిస్తుంటాడు. భగవంతుడిని అవతరించమని ఎవరూ ఆదేశించరు. ఈ భౌతిక ప్రపంచంలో బాధపడుతున్న జీవుల మీద దయ చూపడం కోసం భగవంతుడు అవతరిస్తుంటాడు. పండితులు కూడా భగవంతుడు ఈ భూమి మీద ఎలా అవతరించగలడని సందేహపడుతుంటారు. కానీ శ్రీకృష్ణభగవానుడు భగవద్గీతలో "ధర్మాన్ని రక్షించుటకు, సాధువులను రక్షించుటకు మరియు దుర్మార్గులను సంహరించుటకు నేను ప్రతి యుగంలో అవతరిస్తాను" అని తెలిపెను. భగవంతుని అవతారాల గురించి శాస్త్రాలలో వర్ణించబడిన వివరణలను ఆచార్యులు అందరూ అంగీకరించారు.

దురదృష్టవశాత్తూ ఈ కలియుగంలో జనులను మోసం చేయడానికి "నేనే భగవంతుణ్ణి" అని కొందరు చెప్పుకుంటున్నారు. శాస్త్ర జ్ఞానం లేనివారు వారి మాటలను నమ్మి మోసపోతున్నారు. విష్ణుపురాణంలో "భగవంతుని కంటే శక్తి గలవాడు, సంపద గలవాడు, కీర్తి గలవాడు, అందం గలవాడు, జ్ఞానం కలవాడు మరియు వైరాగ్యం కలవాడు ఎవరూ లేరు" అని చెప్పబడింది. నేను భగవంతుణ్ణి అని చెప్పుకుంటున్న వారికి ఈ ఆరు గుణాలు ఉన్నాయో లేవో చూడాలి. ఈ ఆరు గుణాలు లేకపోతే అతన్ని మోసగానిగా నిర్ధారణ చేసుకోవాలి. ఇలా శాస్త్రాల ఆధారంగా భగవంతుని గురించి తెలుసుకోలేకపోతే అతనితోపాటు మనం కూడా నరకానికి వెళ్ళక తప్పదు.

స్వయంగా శ్రీకృష్ణ భగవానుని అవతారమైన శ్రీకృష్ణ చైతన్య మహాప్రభు, నేను భగవంతుడను అని చెప్పుకున్నటువంటి భగవంతుడు కాదు. ఆయన స్వయం భగవానుడు అయినా తన భక్తిలో ఉన్న ఆనందాన్ని అనుభవించడానికి మరియు తన భక్తిని ఇతరులకు నేర్పడానికి భక్తుని రూపంలో అవతరించాడు. అందుకే

ఈ అవతారాన్ని రహస్య అవతారం లేదా ఎవరికీ తెలియని అవతారం అని అంటారు.

సత్యయుగంలో విష్ణువును ధ్యానించడం ద్వారా, త్రేతాయుగంలో యజ్ఞాలు చేయడం ద్వారా మరియు ద్వాపరయుగంలో భగవంతుని పాద పద్మాలను సేవించడం ద్వారా ఏ ఫలితాన్ని పొందుతామో, కలియుగంలో కేవలం హరి నామ సంకీర్తన (భజన) ద్వారా ద్వారా అదే ఫలితాన్ని పొందవచ్చు అని భాగవతంలో చెప్పబడింది. భాగవతంలో చెప్పబడిన యుగధర్మమైన "హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే హరే రామ హరే రామ రామ రామ హరే హరే" అనే సంకీర్తన ఉద్యమాన్ని శ్రీకృష్ణ చైతన్య మహాప్రభు ప్రారంభించారు.

చైతన్య మహాప్రభు పరంపరలో వస్తున్న భక్తులందరూ ఈ సంకీర్తన ఉద్యమాన్ని భారతదేశం అంతటా ప్రచారం చేశారు. అదేవిధంగా ఈ పరంపరంలోని భక్తి వేదాంత స్వామి 1966వ సంవత్సరంలో అమెరికాలోని న్యూయార్క్ మహానగరంలో 'అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘమును (ఇస్కాన్)' స్థాపించి ఈ సంకీర్తన ఉద్యమాన్ని ప్రపంచమంతటా ప్రచారం చేశారు.

శ్రీకృష్ణ చైతన్య మహాప్రభు గురించి పురాణాలలో ఈ విధంగా ఉన్నది:

> గర్గముని శ్రీకృష్ణునికి నామకరణం చేసే సమయంలో నందమహారాజుకు ఈ విధముగా తెలిపెను: "నీ పుత్రుడు ప్రతి యుగంలో అవతరిస్తుంటాడు (జన్మిస్తాడు). పూర్వకాలంలో తెల్లగా, ఎర్రగా, పసుపు, మరియు రామచిలుక రంగులో అవతరించాడు." *(శ్రీమద్భాగవతము 10.8.13)*

> ప్రహ్లాద మహారాజు భాగవతంలో నరసింహ స్వామిని స్తుతించినప్పుడు చైతన్య మహాప్రభు గురించి ఈ విధముగా తెలిపెను: "దేవా! ఈ ప్రకారముగా నీవు నరుడు, పశువు,

ఋషి, దేవత, మత్స్యము, కూర్మము మున్నగు రూపములలో అవతరించి సమస్త లోకములను పోషించుచు దానవులను వధింతువు. స్వామీ! యుగము ననుసరించి నీవు ధర్మమును పరిరక్షింతువు. కాని కలియుగమున నీవు భగవంతుడనని చెప్పుకొనవు కనుక త్రియుగ" (మూడు యుగములలో ప్రకటమగువాడు) అని తెలియబడుదువు. *(శ్రీమద్భాగవతము 7.9.38)*

"కలియుగంలో బుద్ధిమంతులు సంకీర్తన (భజన) ద్వారా కృష్ణుని కీర్తించే భగవంతుని అవతారాన్ని పూజిస్తారు. కృష్ణుని సంకీర్తన చేసే ఈ భగవంతుని రంగు నల్లనిది కాదు. ఆయన స్వయంగా కృష్ణ భగవానుడే. ఈ భగవంతుని వెంట అనుయాయులు కూడా ఉంటారు." *(శ్రీమద్భాగవతము 11.5.32)*

శ్రీ చైతన్య మహాప్రభు నామాలకు అర్థాలు (మహాభారతం – అనుశాసన పర్వం – విష్ణు సహస్రనామము):

"**సువర్ణ వర్ణ**– బంగారం వలె పచ్చని శరీరం కలవాడు

"**హేమాంగ**– బంగారం వలె అందంగా ప్రకాశించే శరీరం గలవాడు

"**వరాంగ**– ఉత్తమమైన శరీర అవయవాలు కలవాడు

"**సన్యాస కృశ్చమ**– సన్యాస ధర్మాన్ని స్వీకరించినవాడు

"**నిష్టా శాంతి పరాయణ**– అన్ని ప్రాణులను సమభావంతో చూసి భగవంతుని భక్తి నేర్పును."

దేవతలు నారాయణుని ఈ విధంగా స్తుతించిరి. "ఓ నారాయణా! నీవు బద్ధజీవుల మీది కరుణతో కలియుగంలో

బంగారు రంగులో శచీ దేవికి పుత్రునిగా అవతరించి నీ భక్తిని
సాధన చేస్తూ అందరికీ ఆ భక్తిని పంచుతావు (నేర్పుతావు)."
(భవిష్యోత్తరపురాణం – ప్రతి సర్గం 4.9.32)

ఈ విధంగా వివిధ పురాణాలలో తెలుపబడిన కృష్ణ భగవానుని యొక్క అవతారమైన శ్రీకృష్ణ చైతన్య మహాప్రభు ప్రస్తుత బెంగాల్ రాష్ట్రంలో ఉన్న నవద్వీపంలోని మాయాపూరులో జగన్నాథమిశ్రా మరియు శచిదేవి అనే బ్రాహ్మణ దంపతులకు 1486లో అవతరించిరి. శ్రీకృష్ణ చైతన్య మహాప్రభు జన్మ నామం 'విశ్వంభరుడు.' శ్రీకృష్ణ చైతన్య మహాప్రభు ముందుగా లక్ష్మిప్రియను వివాహం చేసుకున్నారు. లక్ష్మీప్రియ శరీరాన్ని వదిలిన తరువాత విష్ణుప్రియను వివాహం చేసుకున్నారు.

శ్రీకృష్ణుడు భగవంతుడే అయినా లోక శిక్షణార్థం సాందీపమునిని గురువుగా స్వీకరించినట్లు, శ్రీకృష్ణ చైతన్య మహాప్రభువు కూడా భగవంతుడే అయినా లోక శిక్షణార్థం మధ్వ సంప్రదాయంలోని మాధవేంద్రపురి శిష్యులైన ఈశ్వరపురి నుండి హరినామ మంత్ర దీక్షను స్వీకరించిరి. ఇరవైనాలుగు సంవత్సరాల వయసులో కేశవభారతి నుండి సన్యాసాన్ని స్వీకరించిరి. వీరి సన్యాస నామం 'శ్రీకృష్ణ చైతన్య'.

చైతన్య మహాప్రభు హరినామ సంకీర్తన చేస్తూ ఎంతోమంది మాయావాదులను కృష్ణ భక్తులుగా మార్చెను. చైతన్య మహాప్రభు పూరీలో 24 సంవత్సరాలు గడిపిరి. చైతన్య మహాప్రభు లీలలు చైతన్య భాగవతం, చైతన్య చరితామృతం, చైతన్య మంగళం అనే గ్రంథాలలో విస్తారంగా వర్ణించబడ్డాయి.

శ్రీకృష్ణ చైతన్య మహాప్రభు జగన్నాథపురిని తన నివాస కేంద్రంగా చేసుకొని, తీర్థయాత్రలకు బయలుదేరి వివిధ తీర్థ క్షేత్రాలలోని కోనేరులలో స్నానాలు చేస్తూ అక్కడి అర్చామూర్తులను దర్శిస్తూ

తిరుపతిలోని కోదండరామ స్వామిని దర్శించి తిరుమలకు వెళ్లి వేంకటేశ్వర స్వామిని దర్శించెను.

శ్రీకృష్ణ చైతన్య మహాప్రభు వేంకటేశ్వర స్వామిని దర్శించిన తరువాత శ్రీకాళహస్తికి వెళ్లి అక్కడి కాళహస్తీశ్వరుని దర్శించిరి.

శ్రీ నిత్యానంద ప్రభు

ఐదు వేల సంవత్సరాల క్రితం ఆదిశేషుడు బలరామునిగా అవతరించెను. ఆ బలరాముడే ప్రస్తుత బెంగాల్ రాష్ట్రంలోని బీర్భూమ్ జిల్లాలో ఏకచక్రపురం అనే గ్రామంలో హడాయి పండితుడు మరియు పద్మావతి దేవి అనే బ్రాహ్మణ దంపతులకు 1473లో శ్రీ నిత్యానంద ప్రభుగా అవతరించిరి. పాండవులు ఈ ఏకచక్రపురంలో కొద్ది రోజులు నివసించిరి. ఆ సమయంలోనే భీముడు బకాసురుని సంహరించెను.

నిత్యానంద ప్రభు యొక్క జన్మ నామం 'కుబేర పండిత్.' నిత్యానంద ప్రభు తన తోటి మిత్రులతో ఎల్లప్పుడూ రామాయణం, భాగవతం, శ్రీకృష్ణలీలలను ఆటలుగా ఆడేవారు. ఈ లీలలను నిత్యం (ఎల్లప్పుడూ) స్మరిస్తూ, ఆడుతూ ఆనందంగా ఉండడం వలన 'నిత్యానంద' అని పేరు వచ్చింది.

ఒక సన్యాసి తీర్థయాత్రలు చేస్తూ ఏకచక్రపురంలోని హడాయి పండితుని ఇంటికి అతిథిగా వచ్చెను. హడాయి పండితుడు ఆ సన్యాసికి అతిథి సేవలు చేసెను. ఆ సన్యాసి తిరిగి వెళ్లేటప్పుడు హడాయి పండితునితో "నాకు తోడుగా నీ కుమారుని పంపించగలవా!" అని అడిగెను. హడాయి పండితుడు సన్యాసి మాటను కాదనలేక తన కుమారుడైన నిత్యానందను పంపించెను.

పన్నెండు సంవత్సరాల వయసులో ఆ సన్యాసి వెంబడి బయలుదేరిన నిత్యానంద ప్రభు, వివిధ తీర్థ క్షేత్రాలను దర్శిస్తూ

పండరీపురానికి వెళ్ళిరి. అదే సమయానికి మాధవేంద్రపురి కూడ తీర్థయాత్రలు చేస్తూ అక్కడికి వచ్చిరి. అప్పుడు మాదవేంద్రపురి నుండి నిత్యానంద ప్రభు దీక్షను స్వీకరించిరి. నిత్యానంద ప్రభు అక్కడి నుండి బయలుదేరి వివిధ తీర్థ క్షేత్రాలను దర్శిస్తూ వేంకటాచలంలోని వేంకటేశ్వర స్వామిని దర్శించెను.

తరువాత శ్రీకృష్ణ భగవానుని అవతారమైన శ్రీకృష్ణ చైతన్య మహాప్రభు ఆధ్వర్యంలో గృహస్థ ఆశ్రమాన్ని స్వీకరించి కృష్ణ భక్తిని సాధన చేస్తూ కృష్ణుని గురించి ప్రచారం చేసెను. నిత్యానంద ప్రభు యొక్క లీలలు చైతన్య చరితామృతం, చైతన్య భాగవతం, చైతన్య మంగళంలో వివరంగా వర్ణించబడ్డాయి.

శ్రీ వల్లభాచార్య

వల్లభాచార్య మధ్యప్రదేశ్‌లోని రాయపూర్ జిల్లాలోని చంపారన్య అనే గ్రామంలో 1473వ సంవత్సరంలో లక్ష్మణ దీక్షితులు మరియు ఎల్లమ్మ అనే బ్రాహ్మణ దంపతులకు జన్మించిరి.

లక్ష్మణ దీక్షితులు వల్లభాచార్య జన్మించిన తరువాత తన స్వగ్రామమైన కృష్ణానది తీరంలోని 'కాంకరవాడ' అనే గ్రామానికి వచ్చారు. లక్ష్మణ దీక్షితులు వల్లభాచార్యకు 11 సంవత్సరాల వయసు ఉన్నప్పుడు, తన భార్య ఎల్లమ్మతో మరియు వల్లభాచార్యతో తిరుమలలోని వేంకటేశ్వర స్వామి దర్శనానికి వెళ్లెను. లక్ష్మణ దీక్షితులు వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న తరువాత తిరుమల నుండి భగవద్ధామము వెళ్లెను. వల్లభాచార్య తిరుమల నుండి తన తల్లితోపాటు తన స్వగ్రామానికి తిరిగి వచ్చారు. వల్లభాచార్య తరువాత తన శిష్యులతో తీర్థయాత్రలు చేస్తూ తిరుమలకు వచ్చి, స్వామి పుష్కరిణిలో స్నానం చేసి శ్రీ వరాహ స్వామిని మరియు శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించిరి.

శ్రీ వాదిరాజ తీర్థులు

మధ్వ సాంప్రదాయంలోని వాదిరాజ తీర్థులు 1480లో గౌరి మరియు రామాచార్య అనే దంపతులకు కర్ణాటకలోని ఉడుపికి సమీపంలో ఉన్న 'హూవినకెరె' అనే గ్రామంలో జన్మించిరి. వాదిరాజ తీర్థులు వాగీశ తీర్థుల నుండి సన్యాసాన్ని స్వీకరించిరి. తిరుమలను దర్శించినప్పుడు ఆయనకు తిరుమల కొండ సాలిగ్రామంగా కనిపించడంతో మోకాళ్లపై కొండ ఎక్కి శ్రీనివాసునికి సాలిగ్రామ మాలను సమర్పించారు. శ్రీనివాసుని మీద ఎన్నో కీర్తనలను రచించారు. అందులోని రెండు కీర్తనల భావం:

"ప్రకాశవంతమైన వేంకట పర్వతము నందుండే శ్రీనివాసుడు నన్ను ఎల్లప్పుడూ కాపాడుగాక! సమస్త దేవతలు శ్రీనివాసునికి దాసులై ఉన్నారు. శ్రీనివాసుడు ఎత్తైన పర్వతం మీద నిలబడి తన భక్తులను చూస్తూ కాపాడుతున్నాడు. రెండు చేతులలో శంఖచక్రాలను ధరించి, మూడవ చేతితో తన పాదాలను చూపిస్తున్నాడు. నాలుగవ చేతితో 'ఎవరైతే నా పాదాలను స్మరిస్తారో వారిని ఈ భవసాగరం నుండి దాటిస్తానని' అభయాన్నిస్తున్నాడు."

"శేషుని మీద నిద్రించే నారాయణుడు ఇప్పుడు తన భక్తులను కాపాడుటకు శేషాచలంపై నిలబడ్డాడు, శేషుని అవతారమైన లక్ష్మణుని సేవలను రామావతారంలో స్వీకరించాడు, శేషుని అవతారమైన బలరాముని కృష్ణావతారంలో గౌరవించాడు. నారాయణుని భక్తులలో శేషుడు ఉన్నతమైన వాడు. బ్రహ్మ మరియు శివాది దేవతలు శ్రీనివాసుని దాసులు. వేంకటగిరినాథుడు (శ్రీనివాసుడు) సమస్తానికి మూలకారణుడు. సమస్త జనుల దుఃఖాలను దూరం చేసే శ్రీనివాసునికి సరి సమానమైనవారు ఎవరూ లేరు. శ్రీనివాసా! ఆనాడు నిండు సభలో ద్రౌపది ప్రార్థనను విని కాపాడినట్లుగా నా ప్రార్థనను విని నన్ను కూడా కాపాడుము స్వామీ!"

శ్రీ పురందర దాసు

పురందర దాసు 1484లో వరదప్ప మరియు రుక్మిణి అనే దంపతులకు కర్నాటకలో జన్మించిరి. వరదప్ప–రుక్మిణి దంపతులకు సంతానం లేనందువలన తిరుమల వచ్చి వేంకటేశ్వర స్వామిని దర్శించి, ఒక పుత్రుని ప్రసాదించమని ప్రార్థించిరి. వేంకటేశ్వర స్వామి దయవలన వీరికి ఒక బాలుడు జన్మించెను. స్వామి దయవలన జన్మించినందున ఆ బాలునికి 'శ్రీనివాస' అని వేంకటేశ్వర స్వామి నామాన్ని పెట్టారు.

పురందరదాసు 4లక్షల 75వేల కీర్తనలు రచించిరి. వాటిలో ఇప్పుడు వెయ్యి కీర్తనలు మాత్రమే లభిస్తున్నాయి. అందులో వేంకటేశ్వర స్వామి గురించి కొన్ని కీర్తనలు లభిస్తున్నాయి, అందులోని రెండు కీర్తనల భావం:

"బాధలో ఉన్న భక్తులను రక్షించడానికి గరుడునిపై వేగముగా వచ్చే భగవంతుడా! హరీ! భక్తవత్సలా! దయచేసి సంసార జీవితానికి సంబంధించిన నా భయాలను, బాధలను తొలగించు స్వామీ! నేను మీ దయ మరియు కరుణపై ఆధారపడుతున్నాను. ఓ భగవంతుడా! విశ్వంలోని జీవుల సృష్టి, రక్షణ, ప్రళయానికి బాధ్యత వహించేవాడా! ఈ విశ్వం యొక్క పనితీరుకు మూల కారణం మీరే అనే ఈ సత్యాన్ని అర్థం చేసుకోవడం మరియు మీ అపరిమితమైన, పవిత్రమైన గుణాలను గూర్చి పాడటం ఎంతో ఆనందంగా ఉన్నది! మీ సహస్రనామాల సంకీర్తనం ద్వారా వచ్చే ఆనందం యొక్క అమృతంలో మునిగిపోయిన దాసులు అన్నీ మరచిపోతారు మరియు వారి మనస్సును వ్యర్థమైన పనులలోకి వెళ్లనివ్వరు."

"ఓ భగవంతుడా! వైనతేయుడిని వాహనముగా కలిగినవాడా! (పక్షి వాహనా!) అసురులను నాశనం చేసే భగవంతుడా! ఓ కమలము వంటి కనులు కలవాడా! దుర్యోధనుడి ఆస్థానానికి

సందేశాన్ని తీసుకువెళ్లి పాండవుల గూర్చి వాదించిన ఓ కరుణామూర్తీ! దయచేసి మీ దయతో నిండిన చూపులు నాపై చూపి నన్ను రక్షించు! ఓ శేషాద్రి శేఖర విభో! నీవు భక్తులను రక్షించడంలో ఎప్పుడూ విఫలం చెందవు. జగదీశా! దయచేసి నాకు సన్మార్గం చూపండి మరియు ఈ భయానక స్థితి నుండి అధిగమింపజేయండి. దయచేసి సంసార సముద్రం నుండి నన్ను రక్షించండి. వేంకటాచలంలోని శ్రీనివాసుడు నారద మహర్షి, తుంబురుని యొక్క దివ్య సంగీతాన్ని మరియు కమలంలో జన్మించిన తన కుమారుడైన బ్రహ్మ యొక్క ప్రశంసలను ఆస్వాదిస్తూ, పద్మముల వంటి కళ్ళతో మరియు శంఖచక్రాలతో ఉన్న తన చిన్మయానంద రూపంలో మనకు దర్శనమిస్తున్నాడు."

శ్రీ హాథీరాం బాబాజీ

'హాథీరాం బాబాజీ' ఉత్తర భారతదేశం నుంచి తిరుమలకు వచ్చిన గొప్ప భక్తుడు. క్రీడల అనే గ్రామంలో (ఇది ఢిల్లీ నగరానికి ముప్పది ఆరు కిలోమీటర్ల దూరంలో కలదు) రామానంద మఠమునకు చెందిన తన గురువుగారి అనుమతితో తీర్థయాత్రలు చేస్తూ సుమారుగా 1500 సంవత్సరంలో తిరుమలకు వచ్చెను. హాథీరాం బాబాజీ వేంకటేశ్వర స్వామితో మాట్లాడేవారు మరియు పాచికలు ఆడేవారు. పాచికలలో తన ఆటను కూడా వేంకటేశ్వర స్వామి హాథీరాం బాబాజీతో ఆడించేవారు. హాథీరాం బాబాజీని వేంకటేశ్వర స్వామి వారి గొప్ప భక్తుడుగా అందరూ గౌరవించేవారు. హాథీరాం బాబాజీతో జరిపే సంభాషణలో వేంకటేశ్వర స్వామి పలికే మాటలు వేరెవరికీ వినబడేవి కావు.

కొందరు మాత్రం "హాథీరాం బాబాజీ అందరి గౌరవం పొందడం కోసం వేంకటేశ్వర స్వామితో మాట్లాడుతునట్లు నటిస్తున్నాడు. ఇరువురి పాచికలు తానే ఆడుతూ వేంకటేశ్వర స్వామితో ఆడుతున్నట్లు చెప్తున్నాడు" అని చిత్తూరును పరిపాలించే గిరిధర రాజుకు ఫిర్యాదు చేశారు.

గిరిధర రాజు హాథీరాం బాబాజీని పిలిపించి, ఆయన మీద వచ్చిన ఫిర్యాదును తెలిపి "నీవు నిజంగానే వేంకటేశ్వర స్వామి వారి భక్తుడవు అయితే, దానిని నిరూపించుకోవాలి. ఇక్కడ గది నిండా ఉన్న చెరుకును మరుసటి రోజు ఉదయంలోగా స్వామివారి సహాయంతో నీవు తినాలి, లేకుంటే నీకు శిక్ష తప్పదు" అని చెప్పెను. చెరుకు ఉన్న గదిలో హాథీరాం బాబాజీని ఉంచి తాళం వేశారు. ఆ రాత్రి హాథీరాం బాబాజీ "స్వామీ! నేను ఈ బండెడు చెరుకులను తినలేను. నేను ఈ చెరుకులను తినకుంటే రాజు నన్ను శిక్షిస్తాడు. రాజు నన్ను శిక్షించినందుకు రాజుకు పాపం వస్తుంది. అలా జరుగరాదు. జనులు నా మీద మోపిన నిందను అబద్ధం అని నీవే నిరూపించాలి" అని వేంకటేశ్వర స్వామిని ప్రార్థించి నిద్రించెను. ఆ రాత్రి వేంకటేశ్వర స్వామి ఒక ఏనుగు రూపంలో వచ్చి గదిలో ఉన్న చెరుకును మొత్తం తిని ఘీంకరించెను. అది విని నిద్ర లేచిన హాథీరాం బాబాజీ ఏనుగు రూపంలో ఉన్న వేంకటేశ్వర స్వామిని స్తుతించెను.

గదికి కాపలా ఉన్న సేవకులు రాజు వద్దకు వెళ్లి "హాథీరాం బాబాజీని బంధించిన గదిలో ఏనుగు ఘీంకరిస్తుంది" అని తెలిపారు. గిరిధర రాజు వచ్చి గది తలుపులు తీయగానే ఆ ఏనుగు అందరూ చూస్తుండగా పారిపోయింది. హాథీరాం బాబాజీ ఇంకా వేంకటేశ్వర స్వామిని స్తుతిస్తూనే ఉన్నాడు. వేంకటేశ్వర స్వామి స్వయంగా ఏనుగు రూపంలో వచ్చి చెరుకును తిన్నాడని రాజుకు అర్థమయ్యింది. గిరిధర రాజు హాథీరాం బాబాజీని శుద్ధ భక్తుడు అని గుర్తించి వేంకటేశ్వర స్వామి మందిరానికి అధికారిగా నియమించి హాథీరాం బాబాజీని తన గురువుగా స్వీకరించి వేంకటేశ్వర స్వామికి ఎన్నో సేవలు చేసెను.

హాథీరాం బాబాజీ వేంకటేశ్వర స్వామికి సుప్రభాత సేవలో అప్పుడే పిండిన ఆవు పాలను మరియు వెన్నను నైవేద్యం సమర్పించి హారతిని ఇచ్చేవారు. ఇప్పటికీ హాథీరాం బాబాజీ శిష్యులు తిరుమలలోని హాథీరాం బాబాజీ మఠం నుండి పాలను, వెన్నను బంగారు పళ్లెంలో

తీసుకొని స్వామివారి సుప్రభాత సేవకు తీసుకువెళతారు. ఆలయ పూజారులు వాటిని వేంకటేశ్వర స్వామికి సమర్పిస్తారు.

హాథీరాం బాబాజీని వేంకటేశ్వర స్వామి స్వయంగా ఏనుగురూపంలో వచ్చి రక్షించెనని మరియు గిరిధర రాజు హాథీరాం బాబాజీ వారి శిష్యుడు అయ్యారని తెలుసుకున్న ప్రజలు, హాథీరాం బాబాజీని దర్శించడానికి వేలసంఖ్యలో వస్తుండేవారు. తిరుమలలో ఉన్న తన మఠానికి భక్తుల తాకిడి ఎక్కువ కావడం వలన హాథీరాం బాబాజీ పాపనాశనానికి వెళ్లే దారిలో గోగర్భ తీర్థం మరియు ఆకాశగంగకు మధ్యలో వేణుగోపాల స్వామి మందిరాన్ని స్థాపించి, అక్కడే వేణుగోపాల స్వామిని సేవించసాగెను. ఇక్కడ హాథీరాం బాబాజీ 'రాయ' అనే చెట్టు ఆకులను మాత్రమే తినేవారు. ఇప్పటికీ అక్కడ ఆ చెట్టు ఉంది. ఆ చెట్టు ఆకులను మనం కూడా తినవచ్చు. హాథీరాం బాబాజీ ఒకానొక దీపావళి ముందు రోజున వేణుగోపాల స్వామి మందిర ప్రాంగణంలో జీవ సమాధి చెందారు.

ప్రతి సంవత్సరం హాథీరాం బాబాజీ జీవ సమాధి చెందిన రోజున తిరుమలలోని హాథీరాం బాబాజీ మఠం నుండి లడ్డుగోపాల విగ్రహాన్ని హాథీరాం బాబాజీ సమాధి వద్దకు తీసుకువచ్చి ఉత్సవం జరిపి పూజిస్తారు. పూర్వం హాథీరాం బాబాజీని కేవలం 'బాబాజీ' అని పిలిచేవారు. అయితే వేంకటేశ్వర స్వామి ఏనుగు రూపంలో వచ్చి రక్షించినందున హాథీరాం బాబాజీగా ప్రసిద్ధి చెందారు. 'హాథీ' అంటే ఏనుగు మరియు 'రాం' అంటే ఆనందాన్ని ఇచ్చేవాడు అని అర్థం. హాథీరాం అంటే ఏనుగు రూపంలో వచ్చి బాబాజీకి ఆనందాన్ని కలిగించినవాడు అని అర్థం.

శ్రీ కనక దాసు

కనకదాసు కర్ణాటకలోని 'కాగినెలె' అనే గ్రామంలో 1509లో జన్మించారు. కనక దాసు భూమిని దున్నుతున్నప్పుడు బంగారం లభించింది. ఆ బంగారంతో తన గ్రామంలోనే మందిరాన్ని కట్టించి ఆది

కేశవమూర్తిని ప్రతిష్ఠించెను. ఆయన ఈ దేవాలయంలో తిరుమలలో వేంకటేశ్వర స్వామికి జరిగే పూజా పద్ధతిని ప్రారంభించాడు. కనక దాసు వ్యాసరాయుల వారి శిష్యుడు. కనక దాసు తిరుమలకు వెళ్లి వేంకటేశ్వర స్వామిని దర్శించాలని బయలుదేరెను. తనను పూజించే పూజారి కలలో వేంకటేశ్వర స్వామి కనిపించి "నా భక్తుడు కనక దాసు వస్తున్నాడు. నీవు కొండ క్రిందికి వెళ్లి నా తీర్థ ప్రసాదాలను ఇచ్చి ఆహ్వానించు" అని తెలిపాడు. పూజారులు కొండ దిగి మెట్ల దగ్గర నిలబడి వచ్చే వారందరితో "కనక దాసు మీరేనా?" అని అడుగుతున్నారు. అదేవిధంగా కనక దాసును కూడా అడిగారు. కనక దాసు "ఎందుకు అలా అడుగుతున్నారని" అడుగగా "రాత్రి వేంకటేశ్వర స్వామి కలలో కనిపించి నా భక్తుడు కనక దాసు వస్తున్నాడు. నా తీర్థప్రసాదాలను ఇచ్చి ఆహ్వానించమన్నాడు. అందువలన అందరినీ అడుగుతున్నాం" అని పూజారులు సమాధానం తెలిపారు. కనక దాసు తనను అందరూ గౌరవిస్తారని మనసులో అనుకొని "ముందు వెళ్లే వారి వెనుక, వెనుక నుండి వచ్చేవారి ముందు వెళుతున్నాడు" అని తెలిపి వెళ్ళిపోయాడు.

కనక దాసు వేంకటాచలం వెళ్లి అక్కడి వివిధ తీర్థాలలో స్నానాలు చేసి వరాహ స్వామిని, వేంకటేశ్వర స్వామిని దర్శించి "ఓ శ్రీహరీ! నీవు ముక్తిని ఇచ్చేవాడవు మరియు పరమాత్ముడవు. నేను నరజన్మను ఎత్తిన పురుగును, పాపాత్ముడను. ఈ మాయాజాలంలో చిక్కుకున్న ఈ శరీరం నీదే. ఓ వేంకటేశ్వర స్వామీ! నీవు స్వతంత్రుడవు. నన్ను నీ దాసానుదాసుల సేవకునిగా చేసి ఈ జన్మ మృత్యువుల నుండి ఉద్ధరింపుము" అని వేంకటేశ్వర స్వామిని ప్రార్థించెను.

శ్రీ రాఘవేంద్ర స్వామి

రాఘవేంద్ర స్వామి 1595వ సంవత్సరంలో తిమ్మణ్ణభట్టు మరియు గోపికాంబ అనే దంపతులకు తమిళనాడులోని భువనగిరి పట్టణంలో జన్మించిరి. తిమ్మణ్ణభట్టు గోపికాంబలకు సంతానం

లేనందువల్ల తిరుమల వెళ్లి వేంకటేశ్వర స్వామిని సంతానాన్ని ప్రసాదించమని ప్రార్థించిరి. వేంకటేశ్వర స్వామి దయవలన వారికి 'రాఘవేంద్ర స్వామి' జన్మించెను. వేంకటేశ్వర స్వామి దయవలన జన్మించినందువల్ల ఆ దంపతులు తమకు జన్మించిన కుమారునికి 'వేంకటనాథుడు' అని వేంకటేశ్వర స్వామి నామాన్ని పెట్టిరి.

ఈ వేంకటనాథుడు మధ్వ సాంప్రదాయంలోని సుధీంద్రతీర్థుల వద్ద సన్యాసాన్ని తీసుకున్నారు. సన్యాస నామం 'రాఘవేంద్ర తీర్థులు.' ఈ రాఘవేంద్ర తీర్థులకే రాఘవేంద్ర స్వామి అని పేరు వచ్చింది. సన్యాసం స్వీకరించిన తరువాత తన శిష్యులతో తీర్థయాత్రలను చేస్తూ అక్కడి తీర్థాలలో స్నానాలు చేస్తూ అక్కడి మూర్తులను దర్శిస్తూ తిరుమలలోని వేంకటేశ్వర స్వామిని దర్శించిరి.

శ్రీకృష్ణ దేవరాయలు

శ్రీకృష్ణదేవరాయలు 1509లో కర్ణాటకలోని హంపిలో జన్మించిరి. శ్రీకృష్ణ దేవరాయలు తిరుమలకు వచ్చి వేంకటేశ్వర స్వామిని దర్శించెను. శ్రీకృష్ణ దేవరాయలు రత్నాల కిరీటాన్ని, రెండు బంగారు పళ్లాలను, 25 వెండి పళ్లాలను, బంగారు ఆభరణాలను, గోవులను మరియు గ్రామాలను స్వామికి కానుకలుగా సమర్పించాడు.

భక్త శిరోమణి తరిగొండ వెంగమాంబ

తిరుపతికి ఎనభై కిలోమీటర్ల దూరంలో ఉన్న వాయల్పాడు మండలంలోని తరిగొండ గ్రామంలో నివసించే మంగమ్మ మరియు కానాల కృష్ణయ్య దంపతులకు 1730వ సంవత్సరంలో వెంగమాంబ జన్మించింది. ఐదుగురు కుమారులు జన్మించిన పిదప, కృష్ణయ్య తిరుమల వేంకటేశ్వర స్వామిని దర్శించి తనకు ఒక కుమార్తెను ప్రసాదించమని ప్రార్థించెను. వేంకటేశ్వర స్వామి కృప వలన జన్మించినందున కుమార్తెకు వెంకమ్మ అని నామకరణం చేశారు.

ఇంటి వద్దనే పెద్దల నుండి భాగవతం, రామాయణం మరియు వేంకటేశ్వర స్వామి లీలలు వినిన వెంకమ్మ, చిన్న వయసు నుండే వేంకటేశ్వర స్వామిని ధ్యానిస్తూ ఉండేది. తాను ఎవరితోనూ అంతగా మాట్లాడేది కాదు. అందువలన వెంకమ్మకు దెయ్యం పట్టిందని భావించేవారు. పన్నెండు సంవత్సరాల వయసు ఉన్నప్పుడు వెంకమ్మకు వేంకటాచలపతి అనే యువకునితో వివాహం చేశారు. వివాహం అయిన కొద్ది రోజులకే వేంకటాచలపతి మరణించినందువలన వెంకమ్మ స్వంత గ్రామానికి తిరిగి వచ్చింది.

వెంకమ్మ ఇంటి వద్దనే ఉంటూ వేంకటేశ్వర స్వామిని ధ్యానం చేస్తూ ఉండేది. వేంకటేశ్వర స్వామి గురించి కీర్తనలు రచించేది మరియు వాటిని చక్కగా పాడుకునేది. వెంకమ్మ భక్తిని చూసి, అందరూ ఆమెను భక్తితో 'వెంగమాంబ' అని పిలిచేవారు. అలా వెంకమ్మ వెంగమాంబగా ప్రసిద్ధి చెందింది.

వెంగమాంబ ప్రతిరోజూ తరిగొండ గ్రామంలోని ఆంజనేయ స్వామి మందిరంలో ఉన్న నరసింహ స్వామిని పూజిస్తూ ఉండేది, నరసింహ స్వామికి తులసి మరియు పూలమాలలు అర్పించేది, నరసింహ స్వామిని ధ్యానించేది. అక్కడ ఉన్న ఆంజనేయ స్వామి మందిర పూజారి ఇది సహించలేకపోయేవారు. ఒకరోజు ఆ పూజారి వెంగమాంబ ధ్యానం చేస్తున్నప్పుడు కోపంతో "ఏ పుణ్యక్షేత్రానికో వెళ్ళవచ్చు కదా! ఎప్పుడూ ఇక్కడే ఉండి ఎందుకు మా ప్రాణాలు తీస్తావు?" అని ఆగ్రహించి వెంగమాంబను జుట్టు పట్టుకొని బయటకులాగి మందిరం నుంచి గెంటివేశారు. వెంగమాంబ క్రోధంతో పూజారిని చూడగానే అతను భయపడి వెంగమాంబ కాళ్ళ మీద పడి క్షమించమని కోరుకున్నాడు. ఆమె శాంతించింది. ఆమె పూజారి పలుకులను దైవ ప్రేరణగా భావించి తిరుమలకు వెళ్లి అక్కడే నివసించాలని నిశ్చయించుకొని తిరుమలకు వచ్చింది. అప్పటికి ఆమె వయసు 21 సంవత్సరాలు.

తిరుమలకు చేరిన వెంగమాంబ, వేంకటేశ్వర స్వామిని దర్శిస్తూ, ధ్యానిస్తూ, కీర్తనలు పాడుతూ కాలం గడుపసాగెను. వెంగమాంబ తిరుమలలో నివసించుటకై, వేంకటేశ్వర స్వామి తనను పూజించే ఆత్మ రామదాసు ద్వారా ఒక గుడిసెను కట్టించెను. వేంకటేశ్వర స్వామివారి వంటశాల నుండి కావాల్సిన వంట సరుకులు వెంగమాంబకు అందేలా రామదాసు ఏర్పాటు చేసెను.

వెంగమాంబ వేంకటేశ్వర స్వామి మీద కీర్తనలు పాడేది. వెంగమాంబ భక్తిని చూసిన అన్నమాచార్య వంశస్థులు తిరుమల కొండపై ఉన్న తమ ఇంటిలో ఒక గదిని వెంగమాంబ కొరకు ఇచ్చి ఉండమన్నారు. వెంగమాంబ అందుకు ఒప్పుకున్నది. ఇక్కడ వెంగమాంబ ఇంటి వెనుక ఉన్న ఖాళీ స్థలంలో వేంకటేశ్వర స్వామి సేవ కొరకై తులసితోటను పెంచేది.

ఈ సమయంలోనే బ్రిటిష్ ప్రభుత్వం అక్కారాం దీక్షితులను వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రధాన పూజారిగా నియమించారు. అక్కారాం దీక్షితుల ఇల్లు వెంగమాంబ పెంచే తులసి తోట ప్రక్కనే ఉండేది. వెంగమాంబను గౌరవించినంతగా భక్తులు తనను గౌరవించడం లేదని, అక్కారాం దీక్షితులు వెంగమాంబ పట్ల అసూయ కలిగి ఉండేవారు. వెంగమాంబ పెంచుతున్న తులసి తోటలో తరచూ ఎంగిలి విస్తరాకులను వేసేవాడు. వెంగమాంబ ఎన్ని సార్లు తెలిపిన అలాగే చేసేవాడు. ఒక రోజు వెంగమాంబ తులసితోటలో ధ్యానం చేస్తున్నప్పుడు అక్కారాం దీక్షితులు వెంగమాంబ మీద కావాలని ఎంగిలి విస్తరాకులను పడవేశాడు. వెంగమాంబ క్రోధంతో "నీవు మరియు నీ వంశంలోని వారందరూ ఈ క్షణమే రక్తం కక్కుకుని మరణింతురు గాక" అని పలకగానే అక్కారాం దీక్షితులతో పాటుగా కుటుంబంలోని వారందరూ అక్కడికక్కడే మరణించారు.

ఆ తరువాత బ్రిటిష్ ప్రభుత్వం మరొక పూజారిని నియమించారు. క్రొత్తగా వచ్చిన పూజారి కూడా వెంగమాంబ యందు అసూయ

కలిగి ఉండెను. ఒకసారి బ్రహ్మోత్సవాలు జరిగే సమయంలో, ఆలయ పూజారి వెంగమాంబను నిందించడంతో వెంగమాంబ వేంకటేశ్వర స్వామి ఆలయానికి వెళ్లడం ఆపివేసింది. బ్రహ్మోత్సవాలలో తొమ్మిదవ రోజున వేంకటేశ్వర స్వామి రథం వెంగమాంబ ఇంటి ముందు నిలిచిపోయెను. ఎన్ని ప్రయత్నాలు చేసినా రథం కదలలేదు. కొబ్బరికాయలు కొట్టినా, గుమ్మడికాయలు కొట్టినా, నిమ్మకాయలు కోసి పెట్టినా రథం మాత్రం కదలలేదు. వెంగమాంబకు ఎవరో అపచారం చేసినందువలననే రథం వెంగమాంబ ఇంటి ముందు నిలిచిపోయెనని భావించి, భక్తులందరూ వెంగమాంబను తమ తప్పులు క్షమించి రథం కదిలేలా చేయమని ప్రార్థించారు. వెంగమాంబ రథం వద్దకు వచ్చి వేంకటేశ్వర స్వామికి ప్రణామాలు చేసి హారతి ఇచ్చిన తరువాత రథం కదిలింది.

వెంగమాంబను దర్శించడానికి నిత్యం అనేక మంది భక్తులు వస్తుండడం వలన, వెంగమాంబ ధ్యానానికి ఇబ్బంది కలిగేది. వెంగమాంబ వేంకటేశ్వర స్వామితో "నన్ను నీ లోకానికి తీసుకువెళ్ళు స్వామీ!" అని ప్రార్థించింది. వేంకటేశ్వర స్వామి వెంగమాంబతో "తిరుమలపై ఉన్న తుంబురు తీర్థం వద్ద ఒక గుహ ఉన్నది. అక్కడ ఎవరికీ తెలియకుండా నివసించు. ప్రతిరోజు రాత్రి వేళలో సొరంగ మార్గమున నా ఆలయానికి వచ్చి నన్ను పూజింపుము" అని తెలిపెను. వెంగమాంబ వేంకటేశ్వర స్వామి చెప్పిన విధంగా తుంబురు తీర్థంలోని గుహలో ఉంటూ, ప్రతిరాత్రి ఆలయానికి చేరి వేంకటేశ్వర స్వామిని పూజించేది. ఇలా జరుగుచుండగా ఆలయంలో తాము రాత్రి ఉంచిన పూజాసామగ్రి మరుసటి రోజు ఉదయానికి పెట్టిన చోట లేకపోవడం గమనించిన ఆలయ పూజారులు, ఈ విషయం ఆలయ అధికారులకు తెలిపారు. ఆలయ అధికారులు "కొంత కాలంగా వెంగమాంబ కనబడడం లేదు. ఆమె తిరుమలలోనే ఎక్కడో ఉండి, రహస్యంగా రాత్రి వేళలో ఆలయంలోనికి ప్రవేశించి పూజలు చేస్తుండవచ్చు. అందువలన మీరు ఆశ్చర్యపడరాదు" అని తెలిపారు.

ఒక రాత్రి ఆలయ పూజారి ఒకరు వేంకటేశ్వర స్వామి మందిరంలో రహస్యంగా దాగి ఉండెను. ఆ రాత్రి వేంకటేశ్వర స్వామి సేవకై వచ్చిన వెంగమాంబను చూచి అతను భయంతో మూర్ఛపోయాడు, ఉదయం ఇతర పూజారులు వచ్చి అతనిని లేపిన తరువాత జరిగింది తెలిపాడు.

ఒకనాడు కుష్ఠు వ్యాధితో బాధ పడుతున్న ఒక వ్యక్తి, తన బాధను భరించలేక వేంకటేశ్వర స్వామిని దర్శించి చనిపోవాలని తిరుమలకు వచ్చెను. వేంకటేశ్వర స్వామి దర్శనానికి కూడా అతనికి అనుమతించలేదు. ఇక అతను ఆత్మహత్య చేసుకొనుటకు తుంబురు తీర్థానికి వెళ్లెను. ఆత్మహత్య చేసుకునే ముందు "గోవిందా! వేంకటేశా! శ్రీనివాసా! బాలాజీ! నన్ను జన్మ మృత్యువుల నుండి కాపాడు స్వామీ" అని గట్టిగా ప్రార్థించాడు. అది విన్న వెంగమాంబ తాను ఉంటున్న గుహ నుండి బయటకు వచ్చి అతని దీన స్థితిని చూసి "నీ కుష్ఠు రోగం తగ్గుతుంది. నన్ను ఇక్కడ చూసినట్లు ఎవరికీ చెప్పకు. ఎవరికైనా చెబితే తల పగిలి మరణిస్తావు" అని తెలిపి కళ్లు మూసుకోమంది. అతను కళ్ళు మూసుకోగానే తిరుమలలోని స్వామి పుష్కరిణి నుండి అతను బయటకు వచ్చాడు. అతని రోగం పూర్తిగా నయమైనది. ఎందరు అడిగినా తన కుష్ఠు వ్యాధి ఎలా తగ్గెనో అతను చెప్పలేదు. జరిగిన అద్భుతం వలన అందరూ అతనిని గౌరవిస్తూ ఉండేవారు. కొద్ది రోజుల తరువాత అతను వెంగమాంబను 'తుంబురుతీర్థం' వద్ద కలిసిన విషయం తెలిపెను. అలా తెలిపిన వెంటనే తల పగిలి మరణించాడు.

వెంగమాంబ తుంబురు తీర్థం వద్ద ఉందని తెలియడం వలన భక్తులు పెద్దసంఖ్యలో వెంగమాంబను దర్శించసాగారు. తుంబురు తీర్థం వద్ద భక్తుల తాకిడి భరించలేక వెంగమాంబ మళ్ళీ తిరుమల ఆలయం దగ్గరకు వచ్చేసింది. కొద్దిరోజుల తరువాత వేంకటేశ్వర స్వామితో "స్వామీ! భక్తుల తాకిడిని భరించలేకున్నాను. నన్ను మీ లోకానికి తీసుకువెళ్లండి" అని ప్రార్థించింది. వేంకటేశ్వర స్వామి

"నీవు జీవ సమాధిలోనికి వెళ్ళుము" అని తెలిపెను. తిరుమలలోని వరాహ స్వామి మందిరం ప్రక్కన ఉన్న అన్నమాచార్య వంశస్తుల ఇంటి వెనుక తులసి తోటలో సమాధిని కట్టించుకుని వెంగమాంబ ఆ సమాధిలోనికి వెళ్ళిపోయింది. ఇప్పటికీ అక్కడ వెంగమాంబ సమాధిని మనం దర్శించవచ్చు. (ఇంకా తరిగొండ వెంగమాంబ గురించి 91వ పేజీలో చూడగలరు.)

శ్రీ త్యాగరాజు

శ్రీరాముని భక్తుడు అయిన 'త్యాగరాజు' 1767లో రామబ్రహ్మం మరియు సీతమ్మ అనే దంపతులకు ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణాజిల్లాలో జన్మించారు.

ఒకసారి త్యాగరాజు తన శిష్యులతో తీర్థయాత్రలు చేస్తూ తిరుమలకు వచ్చిరి. వేంకటేశ్వర స్వామి దర్శనానికి వెళ్లేసరికి పూజారులు మందిరానికి తెర వేశారు. త్యాగరాజు యొక్క శిష్యులు పూజారులతో తెరతీసి దర్శనాన్ని కలిగించమని ప్రార్థించారు. పూజారులు "శాస్త్ర నియమానుసారం తెరవేసిన తరువాత తీయరాదు అందువలన మేము తెరను మరల తీయము అని." తెలిపిరి.

అప్పుడు త్యాగరాజు "ఓ తిరుమల వేంకటరమణా! నాలోని అజ్ఞానం అనే తెరను తొలగించుము స్వామీ! ఓ పరమపురుషా! ధర్మానికి మోక్షానికి దూరంగా తీసుకు వెళుతున్న ఈ అజ్ఞానం అనే తెరను నాలో నుండి తొలగించుము.

"ఈ అజ్ఞానం ఏ రీతిగా ఉన్నదంటే ఆకలిగొన్న చేప ఎర వేసిన ఆహారం కోసం వెళ్లి మరణించునట్లుగా, భుజించు వేళ ఈగ ఇబ్బంది కలిగించినట్లు, హరి ధ్యానము చేసెడి వేళ మనస్సు అత్యల్పుల వద్దకు పోయినట్లుగా ఉన్నది. వేటగాని వలను గుర్తించలేక జంతువులు వలలో ఇరుక్కుపోయినట్లు నేను అహంకారం మరియు అజ్ఞానం అనే వలలో ఇరుక్కుపోయాను. వేంకటరమణా! దయతో

నన్ను అనుగ్రహించి అహంకారం మరియు అజ్ఞానం అనే తెరను తొలగించుము స్వామీ!" అని కీర్తన పాడగానే తెర తెరుచుకుంది. అక్కడి భక్తులందరూ ఆనందంతో త్యాగరాజుతోపాటు వేంకటేశ్వర స్వామిని దర్శించిరి.

కృష్ణకృపామూర్తి శ్రీ శ్రీమద్ ఏ.సి. భక్తి వేదాంత స్వామి శ్రీల ప్రభుపాద

కృష్ణకృపామూర్తి శ్రీ శ్రీమద్ ఏ.సి. భక్తి వేదాంత స్వామి శ్రీల ప్రభుపాద రజని మరియు గౌర మోహన్ డే అనే దంపతులకు కలకత్తాలో 1896లో జన్మించారు. శ్రీల భక్తి సిద్ధాంత సరస్వతి గోస్వామి ప్రభుపాద నుండి హరినామ దీక్షను, శ్రీల భక్తి ప్రజ్ఞ కేశవ స్వామి మహారాజు నుండి సన్యాసాన్ని స్వీకరించారు. 1966వ సంవత్సరంలో అమెరికాలోని న్యూయార్క్ మహానగరంలో అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘమును (ఇస్కాన్) స్థాపించారు.

కృతేయద్ధ్యాయతో విష్ణుం త్రేతాయాంయజతో మఖైః।
ద్వాపరే పరిచర్యాయాం కలౌ తద్ధరికీర్తనాత్॥

సత్యయుగంలో విష్ణువును ధ్యానించడం ద్వారా, త్రేతాయుగంలో యజ్ఞాలు చేయడం ద్వారా ద్వాపరయుగంలో భగవంతుని పాద పద్మాలను సేవించడం ద్వారా ఏ ఫలితాన్ని పొందుతామో, కలియుగంలో కేవలం హరే కృష్ణ మహా మంత్రాన్ని జపించడం ద్వారా అదే ఫలితమును పొందవచ్చు. *(శ్రీమద్భాగవతము 12.3.52)*

హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే।
హరే రామ హరే రామ రామ రామ హరే హరే॥

ఇతి షోడశకం నామ్నాం కలికల్మష నాశనం।
నాతః పరతరోపాయః సర్వవేదేషు దృశ్యతే॥

16 నామాలు కలిగిన ఈ హరే కృష్ణ మహా మంత్రం, ఈ కలియుగంలోని అన్ని దోషాలను తొలగిస్తుంది. నాలుగు వేదాలలో వెతికిన ఇంతకంటే సులభమైన మార్గం వేరొకటి లేదు. *(కలిసంతరణ ఉపనిషత్)*

శ్రీల ప్రభుపాద ఈ విధంగా శాస్త్రాల ఆధారంగా "మానవజన్మ భగవంతుడిని అర్థం చేసుకునేందుకు ఉద్దేశించబడింది, విచ్చలవిడిగా జంతువులాగా గడిపేందుకు కాదు. భక్తి ద్వారానే భగవంతుని అర్థం చేసుకోగలం" అని ప్రపంచమంతటా తిరుగుతూ ప్రచారం చేశారు.

శ్రీల ప్రభుపాద అలా ప్రచారం చేస్తూ 25 ఏప్రిల్ 1974లో హైదరాబాదు నుండి విమానంలో తిరుమలకు వెళ్లారు. 'తిరుమల తిరుపతి దేవస్థానం' నిర్వాహకులు శ్రీల ప్రభుపాదను మరియు వారి భక్త బృందమును గౌరవంగా స్వాగతించి వారి వసతికై రెండు గదులను ఏర్పాటు చేశారు.

ఆ సమయంలో తిరుమల వేంకటేశ్వర స్వామిని దర్శించడానికి రోజుకు 15,000 మంది వచ్చేవారు. అందువలన దర్శనానికి చాలా సమయం వేచి ఉండవలసి వచ్చేది. కానీ దేవస్థానం వారు శ్రీల ప్రభుపాదను మరియు వారి భక్త బృందాన్ని నేరుగా వేంకటేశ్వర స్వామి దర్శనానికి తీసుకువెళ్లారు. దర్శనానికి వేచి ఉన్న భక్తులు "గోవిందా గోవిందా" అని పలుకుచున్నారు. కానీ శ్రీల ప్రభుపాద వేంకటేశ్వర స్వామిని దర్శించినప్పుడు "గోవిందం ఆదిపురుషం తమహం భజామి" అనే కీర్తనను పాడారు.

తరువాత గదిలో ఉన్నప్పుడు శ్రీల ప్రభుపాద తన శిష్యులతో "ప్రభుత్వం వ్యతిరేక ప్రచారం చేస్తున్నప్పటికీ, కోట్లాది జనులు బాలాజీ దర్శనానికి వెళ్లడమనేది భగవంతుడి పట్ల జనసామాన్యానికి ఉన్న విశ్వాసానికి ఒక రుజువు వంటిది. నిజానికి జనులు తమ భౌతిక బాధల నుండి ఉపశమనం లేదా ధనం కొరకు భగవంతుడిని

దర్శించడానికి వస్తున్నప్పటికీ వారందరూ 'గోవిందా' అనే భగవంతుని దివ్యమైన నామాన్ని కీర్తిస్తున్నారు" అని అన్నారు. తిరుమలలోని వసతి ఏర్పాట్లను చూసిన శ్రీల ప్రభుపాద తన శిష్యులతో "అద్భుతమైన వసతి సౌకర్యాలను కలిగిస్తూ బంగారు గోపురాలతో ప్రకాశిస్తున్నటువంటి బాలాజీ (వేంకటేశ్వర స్వామి) మందిరం వంటి మందిరాలను మనం కూడా నిర్మించాలి" అని తెలిపారు. శిష్యులు శ్రీల ప్రభుపాదని "వేంకటేశ్వర స్వామిని బాలాజీ అని ఎందుకు అంటారు?" అని అడగగా "బాలాజీ అంటే చిన్న పిల్లవాడు అని అర్థం. ఇక్కడున్న వేంకటేశ్వర స్వామిని కృష్ణుని భావనలో 'బాలాజీ' అనీ అంటారు" అని శ్రీల ప్రభుపాద తెలిపారు.

ఒక రోజు తిరుపతి ఆలయ అధికారి ఒకరు శ్రీల ప్రభుపాదని సందర్శించిన సమయంలో "ప్రతి నెల హుండీలో నలభై లక్షల రూపాయలు వస్తున్నాయి" అని తెలిపారు. శ్రీల ప్రభుపాద "ఏ విధంగా ఆ ధనాన్ని ఖర్చుచేస్తారు?" అని అడగగా, అతను "ఎక్కువ భాగం భవనాల పునర్నిర్మాణానికి వినియోగించబడుతుంది" అని చెప్పగా, శ్రీల ప్రభుపాద "ఆలయ పునర్నిర్మాణం మంచిదే కానీ కృష్ణుడి సందేశం ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం చేయడం ఉత్తమమైనది. బాలాజీ అంటే కృష్ణుడు. కృష్ణుని సందేశం వ్యాపించాలి. ఆ కృష్ణుడే చైతన్య మహాప్రభువుగా అవతరించి మనకు ఎలా భక్తిని సాధన చేయాలో తెలిపిరి. లండన్ దేశంలో ప్రచారం లేకపోవడం వలన అనేక చర్చిలు పాడుబడ్డాయి. మందిరాలను ప్రచారం కోసమే నిర్మించాలి" అని తెలిపిరి. ప్రక్కనే ఉన్న పూజారి ప్రగల్భాలు పలుకుతూ "మేము మరొక మందిరాన్ని నిర్మిస్తునాము, దానిలో 'పంచోపాసన' (మాయావాద పద్ధతిలో శంకరాచార్య సూచించిన ఐదు విగ్రహాల పూజ విధానం) ప్రారంభిస్తున్నాం" అని తెలిపెను. శ్రీల ప్రభుపాద ఆశ్చర్యంతో "మీ సాంప్రదాయ ఆచార్యుడైన రామానుజాచార్య ఎన్నడూ పంచోపాసన సూచించలేదు కదా!" అని అన్నారు.

శ్రీల ప్రభుపాద అక్కడ ఉన్న రెండు రోజుల వ్యవధిలో రోజుకు మూడు నాలుగు సార్లు బాలాజీ దర్శనానికి వెళ్లారు. వెళ్లిన ప్రతిసారి అక్కడి పూజారులు శ్రీల ప్రభుపాదను నేరుగా గర్భగుడి దగ్గరకు తీసుకువెళ్లి వేంకటేశ్వర స్వామి దర్శనం ఎంతసేపైనా చేసుకునే అవకాశం కల్పించారు.

శ్రీల ప్రభుపాద తిరుమల నుండి వెళ్లిన నెల రోజులకు తిరుమల తిరుపతి దేవస్థానం అధికారికి ఈ విధంగా ఉత్తరాన్ని వ్రాశారు:

"ఇటీవల రెండు రోజుల పాటు తిరుమలకి వచ్చిన సందర్భంలో నా పట్ల మరియు మా శిష్యులు, హరేకృష్ణ ఉద్యమ సభ్యుల పట్ల మీరు చూపిన ఆదరాభిమానాలకు నా హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. మీరు బాలాజీని దర్శించడానికి కల్పించిన అవకాశాన్ని మేము ఎన్నటికి మరచిపోలేము. మా అమెరికా మరియు ఐరోపా దేశస్థుల అనుయాయులకు అతి తక్కువ సందర్భాల్లో మాత్రమే లభించే ఇటువంటి అవకాశం పట్ల వారు పూర్తి సంతృప్తులై ఉన్నారు. అవకాశం ఉంటే మళ్లీ మేము తిరుమల వచ్చి బాలాజీని దర్శించాలని అనుకుంటున్నాము. తిరుపతి యాత్రికులుగా వచ్చే మా సంఘ సభ్యుల కొరకు మేము ప్రత్యేక కుటీరం నిర్మించాలనుకుంటున్నాము. అందుకొరకు అమ్మకానికిగాని లేదా దానంగా ఎవరైనా స్థలం ఇవ్వడానికిగాని సిద్ధంగా ఉంటే మాకు తెలియజేయగలరు. ఈ విషయంలో ఏదైనా సలహాను ఇవ్వగలరు. మీ అద్భుతమైన ఆతిథ్యానికి మరొకసారి మా కృతజ్ఞతలు.

మీ శ్రేయోభిలాషులు,

ఏ. సి. భక్తివేదాంత స్వామి."

స్థలం విషయంలో తిరుమల అధికారిని శ్రీల ప్రభుపాదుల శిష్యులు కలిసినప్పుడు, దేవస్థానం వారు అలిపిరిలో స్థలాన్ని దానం చేశారు. 'శ్రీల ప్రభుపాద' యొక్క శిష్యులు అక్కడ శ్రీ శ్రీ రాధా గోవింద మందిరాన్ని నిర్మించారు.

ఒకసారి శ్రీల ప్రభుపాద హైదరాబాదులో ఏడుగురు మంత్రులను కలుసుకున్నప్పుడు వారితో "మానవ జన్మ యజ్ఞం కోసం (భగవంతుని అర్థం చేసుకోవడానికి) ఉద్దేశించబడింది. మీకు దగ్గరలో ఉన్న తిరుమలలో బాలాజీ మందిరం ఉన్నది. బాలాజీకి ఎంతో ఆదాయం వస్తుంది. ఆ ఆదాయం బాలాజీ సంతృప్తికే వినియోగించాలిగాని ఇతర కార్యాలకు వాడకూడదు. భగవంతుని జ్ఞానం లోపించి ఎందరో బాధపడుతున్నారు గనుక భగవంతుని జ్ఞానాన్ని ప్రచారం చేయడానికి ఆ ఆదాయాన్ని ఖర్చు చేయాలి. ప్రజలు బాలాజీకి ఎంతో ధనాన్ని సమర్పిస్తున్నారు. ఆ ధనాన్ని భగవద్గీతలో తెలుపబడిన రహస్యమైన జ్ఞానాన్ని ప్రపంచమంతటా ప్రచారం చేయడానికే వాడాలి. ఇదే 'శ్రీ చైతన్య మహాప్రభు' ఉద్దేశ్యం. చైతన్య మహాప్రభు ఇలా తెలిపెను 'నా ఆజ్ఞతో మీరందరూ గురువులై ఇతరులకు శ్రీకృష్ణుని ఉపదేశాలను ప్రచారం చేయండి. అందువలన భగవద్గీత మరియు భాగవతంలో తెలిపిన విధంగా శ్రీకృష్ణుని ఆజ్ఞలను ప్రతి ఒక్కరూ పాటించేలా చెయ్యండి. ఈ విధంగా గురువుగా మారి ప్రతి ఒక్కరికీ విముక్తిని కలిగించడానికి ప్రయత్నించండి. శ్రీకృష్ణుని సందేశం అయిన భగవద్గీతను బోధిస్తే భారతదేశానికి కీర్తి లభిస్తుంది.' 'బాలాజీ' ధనాన్ని కృష్ణ భక్తిని ప్రచారం చేయడానికి వినియోగించాలేగాని ఇతర ప్రయోజనాల కోసం వినియోగించరాదు. మీరు బాలాజీకి చాలా గొప్ప భక్తులు అందువలన ప్రభుత్వం బాలాజీ, శ్రీకృష్ణుని బోధనాల ప్రకారం మరియు వారి మార్గదర్శకత్వంలో నడపబడాలని నా కోరిక అదే నా విన్నపం" అని తెలిపిరి.

శ్రీల ప్రభుపాద భగవద్గీత 13వ అధ్యాయం 15వ శ్లోక ప్రవచనంలో "భగవంతునికి రూపమే లేదని మాయావాదులు అనుకుంటారు. భగవంతునికి ఇంద్రియాలు లేకుంటే నిరాకారుడు (రూపం లేనివాడు) అవుతాడు. కృష్ణుడు నేను ప్రతిదీ వినగలను-చూడగలను అని తెలిపాడు. కావున కృష్ణునికి కళ్లు, చెవులు, కాళ్లు, చేతులు, ఇలా అన్ని ఇంద్రియాలు ఉన్నాయనే కదా అర్థం! భగవంతుని అవయవాలు భౌతికమైనవి కావు. మనం భౌతిక వస్తువులను చూడడం వలన మనం తనను చూడగలిగేలా భగవంతుడు అర్చారూపంలో దర్శనమిస్తున్నాడు. అర్చామూర్తిని రాయి అని, గురువును సామాన్య వ్యక్తి అని అనుకునేవాడు గాడిదతో సమానం అని శాస్త్రంలో చెప్పబడింది. రామానుజాచార్య, మధ్వాచార్యుల వంటి గొప్ప ఆచార్యులు వేల సంఖ్యలో మందిరాలను స్థాపించారు. ఇప్పటికీ తిరుమలలోని వేంకటేశ్వర స్వామిని వేల మంది దర్శిస్తున్నారు. వారందరూ మూర్ఖులని అర్థమా! వారు రాయిని చూడడానికి వెళుతున్నారా! అర్చారూపంలో ఉన్న భగవంతుని చూడడానికి మనం ముందుగా భక్తునిగా మారాలి. అప్పుడే ఆ రాయిలో మనం భగవంతుని చూడగలం" అని తెలిపిరి.

రచయిత పరిచయము

శ్రీనివాస సేవానంద దాసు 2004 నుండి 2009 వరకు తిరుపతి ఇస్కాన్ మందిరంలోనూ 2010 నుండి 2012 వరకు భీమవరంలోని ఇస్కాన్ మందిరంలోనూ అనేక సేవలు చేశారు. 2010వ సంవత్సరంలో పరమ పూజ్య శ్రీ భక్తి వికాస స్వామి మహారాజు నుండి దీక్షను స్వీకరించి ఆయన యొక్క ఆదేశం మేరకు తెలంగాణ రాష్ట్రంలో 'ప్రతి ఊరిలోనూ హరినామ సంకీర్తన' అనే పాదయాత్రలో 2013 నుండి 2020 వరకు పాల్గొన్నారు. ఆ పాదయాత్ర 2021లో తెలంగాణ నుండి గుజరాత్‌లోని భరూచ్ ఇస్కాన్ మందిరానికి రావడం జరిగింది. ఆయన కూడా పాదయాత్రతో పాటు భరూచ్‌కు వచ్చి ఈనాటికి పాదయాత్రలో సేవలు కొనసాగిస్తున్నారు.

శ్రీనివాస సేవానంద దాసు

చరవాణి సంఖ్య 9542209593

తిరుపతిలోని దర్శనీయస్థలాల మార్గదర్శిని చిత్రం



రైల్వే స్టేషన్ నుండి

1. గోవిందరాజ స్వామి మందిరం (¼ కి.మీ)
2. కోదండరామ స్వామి మందిరం (1 కి.మీ)
3. కపిల తీర్థం(3 కి.మీ)
4. ఇస్కాన్ రాధా గోవింద మందిరం(4 కి.మీ)
5. అలిపిరిలోని శ్రీవారి పాదాలు(4 కి.మీ)
6. పద్మావతి దేవి మందిరం – పద్మ సరోవరం (6 కి.మీ)
7. శ్రీనివాస మంగాపురం(12 కి.మీ)
8. సువర్ణ ముఖారీ (స్వర్ణ ముఖి) నది మరియు అగస్త్యేశ్వరాలయం(14 కి.మీ)

తిరుమలలోని దర్శనీయస్థలాల మార్గదర్శిని చిత్రం



వేంకటేశ్వర స్వామి మందిరం నుండి

1. గొల్లమండపం
2. స్వామి పుష్కరిణి
3. వరాహ స్వామి మందిరం (100 మీటర్లు)
4. తరిగొండ వెంగమాంబ బృందావనం (సమాధి) (250 మీటర్లు)
5. తిరుమలనంబి మందిరం (ఇల్లు) (100 మీటర్లు)
6. అనంతాచార్యుల బృందావనం (సమాధి) (250 మీటర్లు)
7. తరిగొండ వెంగమాంబ పూలతోట–బావి (1 కి.మీ)
8. హాథీరాం బాబాజీ బృందావనం (సమాధి) (4 కి.మీ)
9. జాబాలి తీర్థం(5 కి.మీ)
10. ఆకాశగంగ తీర్థం (6 కి.మీ)
11. పాపనాశన తీర్థం (7 కి.మీ)
12. చక్ర తీర్థం(4 కి.మీ)
13 శ్రీవారి పాదాలు(6 కి.మీ)

శ్రీ వేంకటేశ్వర స్వామి మందిరంలోని దర్శనీయ స్థలాల మార్గదర్శిని చిత్రం



శ్రీ వేంకటేశ్వర స్వామి మందిరంలోని దర్శనీయ స్థలాల మార్గదర్శిని సూచిక

1. ప్రధాన గోపురం
2. అనంతాచార్య గునపము (గడ్డపార)
3. శ్రీరంగ మండపం
4. తిరుమల రాయ మండపం
5. అద్దాల మండపం
6. పూలబావి
7. ధ్వజస్తంభం
8. రెండవ గోపురం
9. వరదరాజస్వామి మందిరం
10. వంటశాల
11. పూలగది
12. గరుడ మందిరం
13. వంట బావి
14. ఘంట మండపం
15. జయ విజయులు
16. స్నపన మండపం
17. రాముల వారి మేడ
18. శయన మండపం
19. కులశేఖర పడి(గడప)
20. గర్భగుడి
21. సంకీర్తన అర (అన్నమాచార్య సంకీర్తనలు భద్రపరిచిన గది)
22. భాష్య కారులు(రామానుజాచార్య విగ్రహం)
23. విష్వక్సేన మందిరం
24. హుండి
25 యోగ నరసింహస్వామి
26. కల్యాణ మండపం

కృతజ్ఞతలు

ఈ పుస్తక ప్రచురణకు మరియు వితరణకు ప్రోత్సాహమును మరియు మార్గదర్శకత్వమును అందించిన నా యొక్క గురుదేవులైన పరమ పూజ్య శ్రీ భక్తి వికాస స్వామి మహారాజుల వారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

వరంగల్‌కు చెందిన నారాయణ ఆర్థిక సహాయమును అందించి నన్ను ప్రోత్సహించారు. ఇస్కాన్ భరూచ్ (గుజరాత్) భక్తులు సాంకేతిక పరికరాలు మరియు సాహిత్యాన్ని అందించడం ద్వారా అనేక విధాలుగా సహాయం చేసారు. ముద్రణకు సవ్యసాచి ప్రభు, అచ్యుత ప్రభు, వేణుగోపాల్ కృష్ణ ప్రభు మరియు పూర్ణబ్రహ్మ ప్రభు అనేక విధాలుగా ఏర్పాట్లు చేసారు. నేను పూర్ణబ్రహ్మ ప్రభువుకు ఈ పుస్తకాన్ని చైతన్య పబ్లిషింగ్ హౌస్ ద్వారా ప్రచురించినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. నరహరి నరసింహ ప్రభు, విష్ణు స్వామి ప్రభు, ప్రభు కృష్ణ ప్రభు, ఆది కూర్మ ప్రభు, వేదాంత సూత్ర ప్రభు, సాకారి ప్రభు, గోవింద ఆనంద ప్రభు, ప్రేమానంద ప్రభు, భక్త శివప్రసాద్, భక్త సంతోష్, భక్త గణేష్ మరియు ఇతర భక్తులు సమాచారాన్ని సంకలనం చేయడం, సవరించడం మరియు రుజువు చూడడంలో సహాయం చేశారు. నిస్వార్థంగా మరియు వేగంగా సహకారం అందించినందుకు ఈ భక్తులందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకొనుచున్నాను.